సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 288

బుధవారం 8-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'తెలుగువారి గుండెచప్పుడు
వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు...
నా జన్మ ధన్యమైనట్టే'



పరిస్థితి గంభీరం!
కనిపించని హెడ్ కోచ్ ముద్ర. భారత జట్టుకు వరుస పరాజయాలు -16లో



25,700 కోట్ల పెట్టుబడులు
భారత్‌లో ఏఐ, క్లౌడ్‌పై ఫోకస్.. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడి -17లో



'జాహ్నవి' పోలీసుపై వేటు
అమెరికాలో తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవి మృతికి కారణమైన పోలీసు అధికారి కెవిన్ డేవ్‌ను విధుల నుంచి తొలగించారు.
వివరాలు 6లో ▸



ఆ వ్యాధులపై నిఘా పెంచండి
శ్వాస సంబంధ వ్యాధులపై కన్నేసి ఉంచాలని, హెచ్ఎంపీవీ వ్యాప్తి నివారణపై అవగాహన పెంచాలని కేంద్రం రాష్ట్రాలను కోరింది.
వివరాలు 6లో ▸



అపూర్వ ఘట్టం..
త్రివేణి సంగమంలో ఈ నెల 13 నుంచి వచ్చే నెల 26 వరకు జరిగే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.
వివరాలు 6లో ▸



మంచు తుపాను బీభత్సం
తుపాను కారణంగా తూర్పు అమెరికా అంతటా భారీ మంచు బీభత్సం సృష్టిస్తోంది. ఐదుగురు మృతి చెందారు.
వివరాలు 6లో ▸

దర్యాప్తు అడ్డుకోలేం

ఫార్ములా-ఈ కారు రేస్ వ్యవహారంలో ఏసీబీ కేసుపై హైకోర్టు తీర్పు

- కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం
- కేసు దర్యాప్తునకు ప్రాథమిక ఆధారాలున్నాయి
- నిజానిజాలు నిగ్గుతేలాలంటే దర్యాప్తునకు అవకాశం ఇవ్వాలి
- ఇప్పుడు అడ్డుకోవడం తొందరపాటు చర్యే అవుతుందన్న న్యాయస్థానం
- అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఎత్తివేత
- దర్యాప్తు అధికారాలను కోర్టులు తమ చేతుల్లోకి తీసుకోబోవని వ్యాఖ్య
- అప్పీల్‌కు వీలుగా 10 రోజుల సమయం ఇచ్చేందుకు నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ రేసు వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావుకు హైకోర్టులో నిరాశ ఎదురైంది. దర్యాప్తును అడ్డుకునేలా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని ఉన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఏసీబీ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. అప్పీల్ చేసుకునేందుకు వీలుగా 10 రోజుల వరకు అరెస్టు చేయకుండా ఆదేశాలిచ్చేందుకు నిరాకరించింది. కేసు దర్యాప్తునకు ప్రాథమిక ఆధారాలున్నాయని అభిప్రాయపడింది. కేటీఆర్‌ను అరెస్టు చేయరాదంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఎత్తివేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం మంగళవారం తీర్పు ఇచ్చింది. ఫార్ములా ఈ రేసును హైదరాబాద్‌లో నిర్వహించే నిమిత్తం

మిగతా 12వ పేజీలో ▶





మచిలీపట్నంలోని గ్రీన్‌కో గెస్ట్ హౌస్ వద్ద తెలంగాణ ఏసీబీ అధికారులు

ఏస్ నెక్స్ట్ జెన్, గ్రీన్‌కో కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు

- ఫార్ములా–ఈ కేసు దర్యాప్తులో వేగం పెంచిన అధికారులు
- హైదరాబాద్, మచిలీపట్నంలో కొనసాగిన తనిఖీలు
- పలు ఫైళ్లు, హార్డ్ డిస్కులు స్వాధీనం
- బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారంపై దృష్టి
- కేటీఆర్‌కు తాజాగా ఈడీ సమన్లు

(మచిలీపట్నం): ఫార్ములా –ఈ రేసు కేసులో అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) దూకుడు పెంచింది. ఇప్పటివరకు రేసు నిర్వహణ, నిధుల మళ్లింపులో నిబంధనల అతిక్రమణ, హెచ్ఎండీఏ అధికారిక ఖాతాల నుంచి విదేశీ కంపెనీలకు నిధుల మళ్లించడంపై ఫోకస్ పెట్టిన అధికారులు, తాజాగా క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగారు. తాజాగా తెరపైకి వచ్చిన క్విడ్ ప్రోకో కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఫార్ములా–ఈ కారు రేసు నిర్వహణకు సంబంధించిన ఒప్పందాలకు కొద్ది నెలల ముందే బీఆర్ఎస్‌కు గ్రీన్‌కో

మిగతా 12వ పేజీలో ▶



బాంబే హైకోర్టుకు సీజే జస్టిస్ అరాధే!

కేంద్రానికి సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే బాంబే హైకోర్టుకు బదిలీ కానున్నారు. మంగళవారం భేటీ అయిన సుప్రీంకోర్టు కొలీజియం ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. 2023 జూలై 23న తెలంగాణ హైకోర్టు ఆరో ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే బాధ్యతలు చేపట్టారు. దాదాపు ఏడాదిన్నర కాలంలో ఎమ్మెల్యే ఫిరాయింపులు, ఐఎంజీ భారత్‌కు భూ కేటాయింపు లాంటి పలు కేసుల్లో సంచలన తీర్పులు వెలువరించారు. క్రిమినల్, సివిల్, పన్ను అంశాలతోపాటు రాజ్యాంగ కేసుల్లో ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయస్థానాల డిజిటలైజేషన్ ప్రక్రియలో కీలకపాత్ర పోషించారు. జిల్లా కోర్టుల్లోనూ ఆన్‌లైన్ సేవలు అందేలా చర్యలు చేపట్టారు. దిగువ కోర్టుల్లో.. ఈ–కోర్టు సేవలు, ఈ–ఫైలింగ్, ఈ–సేవా

మిగతా 3వ పేజీలో ▶

టిబెట్‌ను వణికించిన భూకంపం



126 మంది మృతి | **188 మందికి గాయాలు**

రిక్టర్ స్కేలుపై తీవ్రత 6.8గా నమోదు • పొరుగునున్న నేపాల్‌లోనూ ప్రకంపనలు

చైనాలోని అటానమస్ ప్రాంతం టిబెట్‌లో మంగళవారం ఉదయం తీవ్ర భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.05 గంటల సమయంలో చోటుచేసుకున్న భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.8గా నమోదైంది. దీని తీవ్రతకు డింగ్రీ కౌంటీలో నివాస భవనాలు కూలడం వంటి ఘటనల్లో కనీసం 126 మంది ప్రాణాలు కోల్పోగా మరో 188 మంది వరకు క్షతగాత్రులయ్యారు. ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ, సహాయక చర్యలను ముమ్మరం చేయాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశాలు జారీ చేశారు.

- వివరాలు 6లో ▶

హస్తిన సమరం



దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల సంగ్రామానికి నగారా మోగింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఫిబ్రవరి 23తో గడువు ముగియనున్న ఢిల్లీ అసెంబ్లీకి ఈసారి ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 10న ఎన్నికల ప్రక్రియకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 5వ తేదీన పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. నామినేషన్ల దాఖలుకు జనవరి 17 చివరి తేదీ కాగా, 18న నామినేషన్లను పరిశీలించనున్నారు. ఈమేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

- వివరాలు 6లో

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ

- 70 అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఎన్నికలు
- మిల్కీపూర్, ఈరోడ్ అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల షెడ్యూల్ సైతం విడుదల
- జమ్మూకశ్మీర్‌లో 2 అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికలు వాయిదా

సుప్రీంలో న్యాయపోరాటం: కేటీఆర్



- 'క్వాష్' కొట్టివేతపై సర్వోన్నత న్యాయస్థానానికి..:
- న్యాయవాదుల సమక్షంలో ఏసీబీ విచారణ జరిపేలా హైకోర్టుకు
- కోర్టు నాకు ఉరిశిక్ష వేసినట్లుగా కాంగ్రెస్ నాయకులు చంకలు గుద్దుకుంటున్నారు.. రేవంత్ మొగోడైతే ఫార్ములా ఈపై తన జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో చర్చ పెట్టాలని సవాల్
- హైకోర్టు తీర్పు నేపథ్యంలో కేటీఆర్‌తో పార్టీ ముఖ్యనేతల భేటీ

12లో

కాంగ్రెస్, బీజేపీ పరస్పర దాడులు



హైదరాబాద్‌లో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీని ఉద్దేశించి ఢిల్లీ బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహించిన కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు రాగా, వారిని బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు.

- వివరాలు 13లో ▶

శ్రీతేజ్‌ను పరామర్శించిన అల్లు అర్జున్

సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను మంగళవారం ఉదయం సినీనటుడు అల్లు అర్జున్ పరామర్శించారు.

- వివరాలు 5లో ▶



అధికారులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొత్త మెట్రోలకు ఏప్రిల్‌లో టెండర్లు

మెట్రోలు, ఎలివేటెడ్ కారిడార్లపై సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

మార్చిలోగా డీపీఆర్‌లు పూర్తి చేయాలి..కేంద్రం అనుమతి తీసుకోవాలి

భూసేకరణ కూడా వెంటనే పూర్తి చేయాలన్న ముఖ్యమంత్రి

సాక్షి, హైదరాబాద్: ఫ్యూచర్ సిటీ, శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రో మార్గాలకు సంబంధించి వచ్చే ఏప్రిల్‌లో టెండర్లు పిలవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మార్చిలోగా డీపీఆర్‌లు (సమగ్ర ప్రాజెక్టు నివేదికలు) పూర్తి చేసి, కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్ల నిర్మాణాలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై సీఎం మంగళవారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం–ఫ్యూచర్ సిటీ మెట్రో (40 కి.మీ), జేబీఎస్–శామీర్‌పేట మెట్రో (22 కి.మీ), ప్యారడైజ్–మేడ్చల్ మెట్రో (23 కి.మీ) మార్గాలకు

మిగతా 3వ పేజీలో ▶

తాజ్‌మహల్‌లో తెలంగాణ రాళ్లు!



ప్రపంచ వింతల్లో ఒకటైన పాలరాతి కట్టడం తాజ్‌మహల్‌కు వాడిన రాళ్లు ఎక్కడివంటే అందరూ ఏమంటారు? రాజస్తాన్ మక్రానా ప్రాంతం నుంచి తెచ్చిన పాలరాతిని వాడారని, ఫతేపూర్ సిక్రీ నుంచి తెచ్చిన ఇసుక రాయిని అనుబంధ నిర్మాణాలకు ఉపయోగించారని ఠక్కున చెబుతుంటారు. కానీ ఆ ప్రేమ మందిరం నిర్మాణంలో మన దేవరకొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి వెళ్లిన రాళ్లు కూడా ఒద్దికగా ఒదిగి పోయాయన్న విషయం తెలుసా?!!

- వివరాలు 18లో ▶



రెవెన్యూను సరిచేస్తా



- వ్యవస్థను చక్కదిద్దేందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళ్తా
- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం త్వరలో స్పెషల్ డ్రైవ్

మీడియాతో మంత్రి పొంగులేటి ఇష్టాగోష్టి

సాక్షి, హైదరాబాద్: 'ఆసామి సరిగా లేకపోతే ఏం జరుగుతుందో గత ప్రభుత్వ హయాంలో అదే జరిగింది. దొరికినోడికి దొరికినంత తరహాలో ఆగమాగం చేశారు. ఈ పరిస్థితిని మార్చకపోతే ప్రభుత్వ ఆస్తులు, భూములు అన్యాక్రాంతమైపోతాయి. అలాకాకుండా వాటిని కాపాడడం మా బాధ్యత. నేను మంత్రిగా ఉన్నప్పుడే రెవెన్యూ వ్యవస్థను సరిచేస్తా. ఇందుకోసం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళ్తా..'అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మంగళవారం సచివాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

పారదర్శకత కోసమే ప్రక్షాళన: 'కర్ణాటకలో పారదర్శక రిజిస్ట్రేషన్ల ప్రయత్నం మొదలుపెట్టి 12 ఏళ్లు అవుతోంది. అక్కడ ఇప్పటికీ ఆ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోంది. తెలంగాణలోనూ దీనికి శ్రీకారం చుట్టాలనే ఉద్దేశంతోనే రెవెన్యూ వ్యవస్థను అన్ని రకాలుగా ప్రక్షాళన చేస్తున్నాం. రాష్ట్రంలో డిసెంబర్ నుంచి

మిగతా 3వ పేజీలో ▶

10 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తాం!

- బకాయిలు చెల్లించకపోతే నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు బంద్
- ఆరోగ్యశ్రీ సీఈవోకు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాల లేఖ
- ఏడాదిగా రూ.1000 కోట్ల బకాయిలు పేరుకు పోయాయని వెల్లడి
- బకాయిలు రూ.500 కోట్లే.. ఏడాదిలోనే రూ. 920 కోట్లు చెల్లించాం
- వైద్య ఆరోగ్యశాఖ అధికారుల వెల్లడి



సాక్షి, హైదరాబాద్: పేరుకుపోయిన ఆరోగ్య శ్రీ బకాయిలు వెంటనే చెల్లించకపోతే ఈ నెల 10వ తేదీ నుంచి వైద్య సేవలను నిలిపివేస్తామని ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. బకాయిలు భారీగా ఉండటంతో ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా మారిందని తెలిపాయి. ఈ మేరకు మంగళవారం

మిగతా 14వ పేజీలో ▶


Prestige
ఈ బహుమతి, మిమ్మల్ని ఎప్పుడూ తలుచుకునేలా చేస్తుంది.
NEW YEAR BO-NAN-ZA
న్యూ ఇయర్ బొనాన్జా
డిసెంబర్ 21, 2024 నుండి జనవరి 26, 2025 వరకు
75 Years of Prestige
చిమ్నీ కొనండి
కనీసం 45% డిస్కౌంట్ కి
పొందండి ₹20 495.00 విలువగల
స్వచ్ఛ్ ఎఫిషియ కన్వర్టిబుల్ హాబ్
4 బర్నర్ ₹12 995.00కే 1 యూనిట్
ఏ ఓటిజి అయినా సరే కొనండి
30% డిస్కౌంట్ కి
పొందండి ₹2 395.00 విలువగల PHM 2.0
హ్యాండ్ మిక్సర్ కేవలం ₹1 495.00కే 1 యూనిట్
ఏ ఎయిర్ ఫ్రైయర్ అయినా సరే కొనండి
30% డిస్కౌంట్ కి
పొందండి ₹1 295.00 విలువగల
ఏస్ హ్యాండ్ బ్లెండర్
కేవలం ₹695.00కే 1 యూనిట్
ఏ ఇండక్షన్ కుక్‌టాప్ అయినా సరే కొనండి
30% డిస్కౌంట్ కి
పొందండి ₹2 540.00 విలువగల
స్వచ్ఛ్ SS పాప్యులర్ ప్రెషర్ కుక్కర్ (3లీ)
కేవలం ₹1 995.00కే 1 యూనిట్
మిక్సర్ గ్రైండర్ కొనండి
కనీసం 30% డిస్కౌంట్ కి
750W లేదా 1000W మరియు
పొందండి ₹1 795.00 విలువగల PGMFB
సాండ్‌విచ్ మేకర్ కేవలం ₹1 095.00కే 1 యూనిట్
గ్యాస్ స్టవ్ కొనండి
25% డిస్కౌంట్ కి
పొందండి ₹390.00 విలువగల
హోస్ పైప్, కత్తి మరియు లైటర్
కేవలం ₹95.00కే 1 యూనిట్
మిగతా కేటగిరీలలో మరిన్ని డీల్స్ ని మిస్ అవ్వకండి.
*నిబంధనలు వర్తించును. పైన ఇచ్చిన ధరలన్నీ ప్రొడక్ట్ యొక్క MRP (అన్ని టాక్స్ లు కలిపి). MRP పై మాత్రమే డిస్కౌంట్స్ వర్తిస్తాయి. ఏ రెండు ఆఫర్స్ కలపకూడదు. చిమ్నీ మరియు గ్యాస్ స్టవ్ పై ఉన్న ఆఫర్లు ఎన్నుకోబడిన మోడల్స్ కి మాత్రమే వర్తిస్తుంది. MRP, నిబంధనలు మరియు షరతులకు సంభంధించిన మరిన్ని వివరాలు కోసం మీ సమీపంలోని ఎక్స్‌క్లూజివ్/డీలర్ అవుట్‌లెట్ ని సందర్శించండి.
PRIDE IN INDIA
CUSTOMER CARE NO 080-6000 4411
Store Locator
Scan to Connect
Shop Online on shop.ttkprestige.com
ttk
Prestige Xclusive
ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూసివ్ లో మరియు లీడింగ్ డీలర్ అవుట్‌లెట్స్ లో లభిస్తుంది.
Prestige
తనవాళ్ళ మీద ప్రేమ ఉన్నవారు ప్రెస్టీజ్‌ని ఎలా కాదనగలరు.

అసంక్రమిత వ్యాధులపై నేడు, రేపు జాతీయ స్థాయి సమావేశం

సాక్షి, హైదరాబాద్: అసంక్రమిత వ్యాధుల (ఎన్సీడీ)పై బుధ, గురువారాల్లో హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సమావేశం జరగనుంది. శామీర్ పేటలోని ఒక ప్రైవేటు రిసార్ట్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం)లో భాగంగా కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రెండేళ్లకోసారి ఢిల్లీలో ఎన్సీడీపై జాతీయ సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. తొలిసారిగా ఢిల్లీలో కాకుండా.. మన రాష్ట్రంలో ఎన్సీడీపై జాతీయ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సౌరబ్ జైన్ (ఎన్సీడీ), జాతీయ ఆరోగ్య మిషన్ ఎండీ ఆరాధన పటా్నయక్‌తో పాటు అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.స్వస్తిక్ చరణ్, అన్ని రాష్ట్రాలకు చెందిన ఎన్‌హెచ్ఎం ఎండీలు, ఎన్సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ హాజరు కానున్నారు. కేన్సర్‌కు సంబంధించిన అంశాలపై ముంబై టాటా మెమోరియల్ కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుదీప్‌గుప్తా, చండీగఢ్ బాబా కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఆశిష్ గులియా, ఐసీఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ మాథుర్ తదితరుల కీలక ప్రసంగాలు ఉంటాయి.

‘దివ్య’మైన ఉపాధి



ఈమె పేరు ఆకుల సంధ్య (42). సిరిసిల్ల శివనగర్‌కు చెందిన ఈమెకు చిన్నప్పుడే పోలియో మూలంగా కాలు వంకరగా ఉంది. ఈమె భర్త రమేశ్ సిరిసిల్లలో కిరాణ షాపు నడిపేవాడు. ఇప్పుడు పెద్దూరులో ఉండదంతో పెద్దగా పని లేదు. వీరికి ఇద్దరు పిల్లలు. ప్రభుత్వం మెడికల్ కాలేజీ ముందు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయదంతో అక్కడ పని చేస్తూ సంధ్య నెలకు రూ.12 వేలు సంపాదిస్తుంది.



ఇతని పేరు బాలమల్లేశ్ (40). సిరిసిల్ల శాంతినగర్‌కు చెందిన ఈయన నిరుపేద. ఇల్లు లేదు. భార్య మాధురి బీడీలు చేస్తుంది. వీరికి ఒక్క పాప. 8వ తరగతి చదువుతుంది. పోలియోతో మల్లేశ్ కాలు వంకరగా ఉంది. అతనిప్పుడు పెట్రోల్ బంక్‌లో పని చేస్తూ నెలకు రూ.13 వేలు సంపాదిస్తున్నాడు. భార్యాభర్తల ఆదాయం రూ.20 వేల వరకు వస్తుండటంతో పెద్దగా కష్టాలు లేకుండా బతుకుతున్నారు.

సిరిసిల్లలో దివ్యాంగుల పెట్రోల్ బంక్

ఉపాధి పొందుతున్న 17 మంది

నెలకు రూ.12 వేల చొప్పున వేతనాలు

కలెక్టర్ చొరవతో దివ్యాంగుల జీవితాల్లో వెలుగు



పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న దివ్యాంగులు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో దివ్యాంగజన్ పెట్రోల్ బంక్ స్థానిక దివ్యాంగుల జీవితాలకు కొత్త వెలుగునిస్తోంది. మొన్నటివరకు ఎన్నో కష్టాలు పడినవారు.. ఇప్పుడు పెట్రోల్ బంక్‌లో పని చేస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. పట్టణ శివారులోని పెద్దూరు వద్ద మెడికల్ కాలేజీ ముందు దివ్యాంగజన్ పెట్రోల్ బంక్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఏర్పాటు చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇవ్వగా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రూ.2.50 కోట్లతో బంక్ ఏర్పాటు చేసింది. కలెక్టర్ మరో రూ.30 లక్షలు గ్రాంట్‌గా మంజూరు చేయడంతో ప్రస్తుతం బంక్ నడుస్తోంది. వాస్తవానికి దీనిని ట్రాన్స్‌జెండర్స్ కోసం ఏర్పాటు చేశారు. వారు ఇక్కడ ఇచ్చే రూ.12 వేల వేతనానికి పని చేసేందుకు ముందుకు రాకపోవటంతో దివ్యాంగులకు పని కల్పించాలని కలెక్టర్ నిర్ణయించారు. బంక్‌ను గత నెలలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. 23 మందికి శాశ్వతంగా ఉపాధి కల్పించే లక్ష్యంతో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 17 మంది పని చేస్తున్నారు. నిత్యం రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు డీజిల్, పెట్రోల్ అమ్మకాలు సాగుతున్నాయి.


ఉపాధి రెట్టింపైంది



మాది సిరిసిల్ల శివారులోని రగుడు. నేను స్కూల్‌లో పని చేసే దాన్ని. అప్పుడు రూ.6 వేలు జీతం వచ్చేది. నాకు బాబు, కూతురు. నా భర్త నన్ను వదిలేసి వెళ్లాడు. ఒంటరి మహిళను కావడంతో పెట్రోల్ బంక్‌లో పని కల్పించారు. ప్రస్తుతం రూ.12 వేల వేతనం వస్తుంది. జీతం రెట్టింపు అయింది. ఇక్కడ పని చేయడం సంతోషంగా ఉంది.

- గోనెపల్లి మంజుల, రగుడు

దివ్యాంగులను ప్రోత్సహించాలి



ప్రభుత్వ సహకారం, జిల్లా కలెక్టర్ చొరవతోనే ఈ పెట్రోల్ బంక్ ఏర్పాటయింది. వాహనదారులు ఇక్కడ పెట్రోల్, డీజిల్ పోయించుకుని దివ్యాంగులను ప్రోత్సహించాలి. లాభాపేక్ష లేకుండా దివ్యాంగులకు పని కల్పించడమే బంక్ లక్ష్యం.

-లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ అధికారి, రాజన్న సిరిసిల్ల

కొత్త మెట్రోలకు ఏప్రిల్‌లో టెండర్లు

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించిన భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఎలైన్‌మెంట్ రూపొందించే సమయంలోనే క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలని చెప్పారు. మేడ్చల్ మార్గంలో జాతీయ రహదారిపై ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్‌లను దృష్టిలో ఉంచుకుని మెట్రో లైన్ తీసుకెళ్లాలని సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని కూడా అధికారులను సీఎం ఆదేశించారు.

శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకేచోట ప్రారంభం కావాలి

శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకేచోటు నుంచి ప్రారంభమయ్యేలా చూడాలని, అక్కడ అధునాతన వసతులు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారీ జంక్షన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఆయా ప్రాంతాల వారు ప్రతి పనికి నగరంలోకి రానవసరం లేకుండా అక్కడే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఆ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూను సరిచేస్తా

▶ మొదటి పేజీ తరువాయి

రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 1.2 శాతం పెరిగినా మా అంచనాలకు తగినట్టు మాత్రం రాలేదు. ఈ మూడు నెలలు ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తున్నాం. మొత్తం 25 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో 4.5 లక్షల వరకు పరిష్కరించాం. మిగిలిన దరఖాస్తుల పరిష్కారం కోసం త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. జాగ్రత్తగా ముందుకెళ్తుండటంతో ఈ విషయంలో కొంత జాప్యం జరుగుతోంది. జీవో 59 (ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి) దరఖాస్తుల విషయంలోనూ త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. భూముల విలువల సవరణ ప్రక్రియ అమలు చేసేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. గ్రామ రెవెన్యూ అధికారుల నియామక ప్రక్రియ త్వరలో చేపడతాం. వీఆర్వో, వీఆర్ఏలుగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా వచ్చిన 1,365 మందిని నేరుగా రెవెన్యూలోకి తీసుకుంటాం. మిగిలిన వీఆర్వోలు, వీఆర్ఏల్లో ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి పరీక్ష పెడతాం. ఈ పరీక్ష అనంతరం ఇంకా పోస్టులు మిగిలిపోతే టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మంది సర్వేయర్ల నియామక ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేస్తాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన 81 లక్షల దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియ 85 శాతం పూర్తయింది..’అని పొంగులేటి తెలిపారు.

కొత్త పాస్ పుస్తకాలుండవు

‘కొత్త రెవెన్యూ చట్టం వస్తున్నందున రైతులకు కొత్త పాస్ పుస్తకాలు వస్తాయనడం సరికాదు. కొత్తగా అవసరమైన వారికి మాత్రమే కొత్త పుస్తకాలు వస్తాయి. సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని జిల్లా కలెక్టర్ చెప్పినప్పుడు లోతుగా విచారణ చేయాలని చెప్పానే తప్ప 2వేల ఎకరాల వరకు అక్రమాలు జరిగాయని నేను కూడా ఊహించలేదు. ధరణి పోర్టల్ నిర్వహణను ఈ నెల ఒకటో తేదీ నుంచి పూర్తి స్థాయిలో ఎన్ఐసీ చూస్తోంది..’అని మంత్రి వెల్లడించారు.

సియోల్ బాంబులు స్టార్టయ్యాయి

దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా సియోల్‌లో తాను చెప్పిన పొలిటికల్ బాంబులు ఇప్పుడు పేలడం మొదలయ్యాయని పొంగులేటి వ్యాఖ్యానించారు. మంగళవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబంపై కక్షపూరితంగా వ్యవహరించాల్సిన అవసరం కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. తప్పు ఎప్పటికైనా బయటపడుతుందని, అయితే తప్పొప్పులు తేల్చేది కోర్టులని, తప్పు చేసిన వారు తప్పించుకోలేరని అన్నారు. ఫార్ములా ఈ రేసు విషయంలో తప్పు చేయకుంటే కేటీఆర్‌కు భయమెందుకని, కోర్టుకు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని ప్రశ్నించారు. గ్రీన్‌కో ఇచ్చిన ఎన్నికల బాండ్లు మాత్రమే కాదని, ఈ కేసులో బయటపడాల్సినవి చాలానే ఉన్నాయని మంత్రి వ్యాఖ్యానించారు. విదేశీ కంపెనీకి వెళ్లిన డబ్బులు ఎవరి ఖాతాకి వెళ్లాయో తేలాలని అన్నారు. ప్రాంతీయ పార్టీల్లో ధనిక పార్టీగా బీఆర్ఎస్ ఎలా అయిందని, జాతీయ పార్టీలకు కూడా లేని నిధులు ఆ పార్టీకి ఎక్కడివని ప్రశ్నించారు.

సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

మంత్రి పొంగులేటి.. ఉద్యోగులకు కెమెరాలు అందజేత



ఫొటో కెమెరాలు అందజేస్తున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సమాచారశాఖ క్షేత్రస్థాయి ఉద్యోగులకు నూతన టెక్నాలజీతో కూడిన ఫొటో కెమెరాలను మంత్రి అందజేశారు. రాష్ట్రంలో జిల్లా, క్షేత్రస్థాయి సిబ్బందికి నూతన కెమెరాలను అందజేయడంవలన ఎప్పటికప్పుడు కార్యక్రమ ఫొటో వార్తలు మీడియాకు సులువుగా అందించవచ్చని సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ హరీశ్ తెలిపారు. అన్ని జిల్లా కార్యాలయాలకు, డివిజన్ స్థాయి సిబ్బందికి కెమెరాలను అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ అదనపు సంచాలకుడు డీఎస్ జగన్ ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో రెవెన్యూ డైరీ–2025ను పొంగులేటి ఆవిష్కరించారు.

టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌వి చిల్లర చేష్టలు

బీజేపీ నేతలు ఏలేటి, ధర్మపురి అర్వింద్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌వి చిల్లర చేష్టలని, బీజేపీ కార్యాలయంపై దాడికి బాధ్యత వహించి ఆయన రాజీనామా చేయాలని బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అరి్వంద్ డిమాండ్ చేశారు. హోంశాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉంది కాబట్టి ఆయన రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. మంగళవారం మహేశ్వర్‌రెడ్డి, అర్వింద్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని ఖండించారు. దాడికి ప్రతిదాడి చేస్తే ఢిల్లీలోని జాతీయ నేతలు ఎక్కడ తలదాచుకుంటారు? అని ప్రశ్నించారు.

బాంబే హైకోర్టుకు సీజే అరాధే బదిలీ!

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రాలను ప్రారంభించారు. సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లను ప్రోత్సహించారు.

అంచెలంచెలుగా ఎదుగుతూ: మధ్యప్రదేశ్‌కు చెందిన జస్టిస్ అలోక్ అరాధే 1964 ఏప్రిల్ 14న రాయ్‌పూర్‌లో జన్మించారు. బీఎస్సీ, ఎల్ఎల్‌బీ పూర్తిచేశాక 1988లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2007లో సీనియర్ న్యాయవాది పదోన్నతి పొందారు. మధ్యప్రదేశ్ హైకోర్టులో రాజ్యాంగం, మధ్యవర్తిత్వం, కంపెనీ చట్టాలకు సంబంధించిన కేసులను వాదించడంలో పేరు గడించారు. 2009 డిసెంబర్ 29న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2016 సెప్టెంబర్ 16న జమ్మూకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. అదే హైకోర్టులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కూడా చేశారు. 2018 నవంబర్ 17న కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. అక్కడ కూడా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.



మీరు ఏం ఆలోచిస్తే అదే అవుతారు.
మీరు అనుభూతి చెందిందే ఆకర్షిస్తారు.
మీరు ఏం ఊహిస్తే అదే సృష్టిస్తారు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 8 జనవరి 2025

భయం వద్దు... జాగ్రత్త ముద్దు!

మాస్కులు... చేతుల పరిశుభ్రత... తదితర జాగ్రత్తలు మళ్ళీ బలంగా వినిపిస్తున్నాయి. హ్యూమన్ మెటా న్యూమోవైరస్ (హెచ్ఎంపీవీ) వల్ల చైనాలో వ్యాధిగ్రస్థుల సంఖ్య పెరుగుతున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో, మన దేశంలోనూ కేసులు కొన్ని బయటపడడంతో జనం ఉలిక్కిపడుతున్నారు. ఒక్కసారిగా పాత కరోనా జ్ఞాపకాలు ముప్పిరిగొంటున్నాయి. చైనా వార్తలతో సోమవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెన్సెక్స్ 1.5 శాతం పైగా పడిపోవడం గగ్గోలు రేపుతోంది. ఉత్తరాన చైనాకు సమీపంలో ఉన్నందున ప్రజా సంబంధాలు, ఆర్థిక సంబంధాల రీత్యా స్వైన్‌ఫ్లూ, ఏవియన్ ఫ్లూ, కోవిడ్‌ల లానే ఇది కూడా వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో శ్వాసకోశ అనారోగ్యాలపై ఓ కన్నేసి ఉంచాలనీ, వేయికళ్ళతో పరిస్థితిని కనిపెట్టాలనీ, ఒకరి నుంచి మరొకరికి హెచ్ఎంపీవీ వ్యాప్తి చెందకుండా నిరోధించేందుకు ప్రజల్లో చైతన్యం తేవాలనీ రాష్ట్రాలకు కేంద్ర సర్కార్ తాజాగా సూచనలు జారీ చేయడం గమనార్హం.

హెచ్ఎంపీవీ సహా అలాంటి అనేక ఇతర వైరస్‌ల వల్ల చైనాలో ఇప్పటికే భారీ సంఖ్యలో శ్వాసకోశ వ్యాధులు ప్రబలాయి. ఆ దేశంలో జనం మాస్కులు ధరించి ఆస్పత్రుల్లో, బయట సంచరిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్ సహా ప్రపంచమంతటా ఈ కేసులపై దృష్టి పెరిగింది. హెచ్ఎంపీవీ వైరస్ వ్యవహారం చర్చనీయాంశమైంది. కోవిడ్ సృష్టించిన భయోత్పాతం రీత్యా, వైరస్‌లు, మహమ్మారుల పేరు చెప్పగానే జనం సహజంగానే బెంబేలెత్తిపోతున్నారు. ప్రజల్లో వ్యక్తమవుతున్న ఈ భయాందోళనలు అర్థం చేసుకోదగినవే. నిజానికి, హెచ్ఎంపీవీ కొత్త వైరస్ ఏమీ కాదు. శాస్త్రవేత్తలు 2001లోనే తొలిసారి దీని జాడ గుర్తించారు. వైరస్ స్వభావం, అది సోకినప్పటి లక్షణాల గురించి అవగాహన కూడా వచ్చింది. అయిదేళ్ళ లోపు చిన్నారులకూ, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికీ, వృద్ధులకూ ఈ వైరస్ సోకే ప్రమాదం అధికం. అందువల్లే, హెచ్ఎంపీవీతో తంటా చాలాకాలంగా ఉన్నదేననీ ఓ వాదన.

అసలు మన దగ్గర తాజాగా ఈ కేసులు చాలా గమ్మత్తుగా బయటపడ్డాయి. అంతకంతకూ చలి ముదురుతున్న ఈ శీతకాలంలో శ్వాసకోశ అనారోగ్యాలను పసిగట్టి, వాటిపై నిఘా ఉంచేందుకు 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' (ఐసీఎంఆర్) ఎప్పటిలానే చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో ఈ వైరస్ బాధిత కేసులు వెలుగులోకి వచ్చాయి. అయితే, దేశంలో శ్వాసకోశ వ్యాధి పీడితుల్లో అనూహ్యమైన పెరుగుదల ఏదీ ఇప్పటికీ కనిపించలేదని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేయడం ఒకింత ఊరటనిస్తోంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధమై ఉన్నామన్నది ఆ శాఖ ఆశ్వాసన. ఆ మాటకొస్తే, దేశంలో శ్వాసకోశ, సీజనల్ ఇన్‌ఫ్లుయెంజా కేసులను క్రమం తప్పకుండా గమనిస్తూ ఉండడం ఆరోగ్య శాఖ అధికారులు నిరంతరం చేసేదే. ఇప్పుడు హెచ్ఎంపీవీ పరిస్థితిపై ఒక్కసారిగా గగ్గోలు రేగడంతో అంతర్జాతీయ సంస్థలతోనూ సంప్రతిస్తున్నట్టు అధికారిక కథనం.

కరోనా మొదలు నేటి హెచ్ఎంపీవీ దాకా అన్నీ చైనా కేంద్రంగా వార్తల్లోకి రావడంతో అనేక అనుమానాలు, భయాలు తలెత్తుతున్నాయి. చైనా సర్కార్ మాత్రం పౌరులతో పాటు తమ దేశానికి వచ్చే విదేశీ పర్యాటకుల ఆరోగ్యాన్ని సైతం కాపాడతామంటూ భరోసా ఇస్తోంది. బీజింగ్ ఎన్ని మాటలు చెప్పినా, గత చరిత్ర కారణంగా ప్రపంచ దేశాల్లో ఇప్పటికీ నమ్మకం కుదరడం లేదు. చిత్రమేమిటంటే, ప్రస్తుత ఇన్‌ఫెక్షన్లపై ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఎలాంటి ప్రకటన, మార్గదర్శకాలు విడుదల చేయనేలేదు. విదేశీ ప్రయాణాలు చేయనివారికి సైతం హెచ్ఎంపీవీ సోకినట్టు వార్తలు రావడంతో, ఇది సీజనల్ సమస్యే తప్ప మరేమీ కాకపోవచ్చనే అభిప్రాయమూ ఉంది. చలికాలంలో ఇన్‌ఫెక్షన్లు సాధారణమే. అయితే, సరైన సమాచారం లేనప్పుడు పుకార్లు షికార్లు చేసి, లేనిపోని భయాలు సృష్టించి, ఆర్థిక, సామాజిక నష్టానికి దారి తీసే ముప్పుంది. జనవరి 13 నుంచి 45 రోజులు ప్రయాగలోని కుంభమేళాకు 40 కోట్ల పైగా భక్తులు హాజరవుతారని అంచనాలున్న వేళ అప్రమత్తత అవసరం. వైరస్‌ల విహారానికి ముకుతాడు వేయడం ముఖ్యం.

కోవిడ్–19 కాలంలో లానే తరచూ చేతులను సబ్బునీళ్ళతో కడుక్కోవడం, చేతులు కడుక్కోకుండా కళ్ళు-ముక్కు-నోటిని తాకకపోవడం, వ్యాధి లక్షణాలున్న వారితో సన్నిహితంగా మెలగకపోవడం, దగ్గు – తుమ్ములు వచ్చినప్పుడు ముక్కు – నోటికి అడ్డు పెట్టుకోవడం, మాస్కులు ధరించడం ఉత్తమం. అసలు కరోనా, హెచ్ఎంపీవీ లాంటి వాటితో సంబంధం లేకుండా ఈ ఖర్చులేని సర్వసాధారణ జాగ్రత్తలను మన నిత్యజీవితంలో భాగం చేసుకోవడం ఆరోగ్య పరిరక్షణకు మరీ ఉత్తమం. కోవిడ్ అనుభవం ప్రపంచానికి నేర్పిన పాఠం – అప్రమత్తత. దేన్నీ తేలిగ్గా తీసుకోవద్దనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీయరక్షణ చర్యలను వదిలిపెట్టవద్దనీ తేల్చిచెప్పింది. దేశంలో 78 శాతం మేర చొచ్చుకుపోయిన మొబైల్ ఫోన్లనూ, 65 కోట్ల మందికి పైగా వీక్షకులున్న దూరదర్శన్‌నూ ప్రజాహిత సమాచార ప్రచారానికి వినియోగించాలి. అంతేకాక, ఇలాంటి వివిధ రకాల వైరస్‌లు, వ్యాధులకు దేశంలో టెస్టింగ్ సౌకర్యాలను విస్తరించాలి. ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థను పటిష్ఠం చేసుకుంటేనే అవాంఛనీయ పరిస్థితుల్ని ఎదుర్కొనే సామర్థ్యం సిద్ధిస్తుంది. వైరస్‌ల తీవ్రత తక్కువ, ఎక్కువలతో సంబంధం లేకుండా పాలకులు పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన గాలి, నీరు, వాతావరణంపై శ్రద్ధ పెట్టడం అవసరం. వ్యాధులు ప్రబలాక చికిత్సకు శ్రమించే కన్నా, వైరస్‌లను ముందే పసిగట్టి, వాటి విజృంభణను నివారించేందుకు సర్వసన్నద్ధం కావడం అన్ని విధాలా ఉపయుక్తం, శ్రేయస్కరం.

ఈ ఏడాది మన ముందున్న సవాళ్లు

విశ్లేషణ



శశి శేఖర్

గత సంవత్సరం రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో 11,973 మంది పౌరులు మరణించారు; ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో పిల్లలతో సహా 45,000 మంది చనిపోయారు. మానవ జాతి చరిత్రలోనే 2024 అత్యంత ఉష్ణ సంవత్సరంగా నమోదైంది. రికార్డు స్థాయిలో చలికాలం కూడా మొదలైంది. కృత్రిమ మేధ అబద్ధాలు చెప్పగలదనీ, కాబట్టి అది ప్రాణాంతకమనీ యువల్ నోవా హరారీ లాంటి మేధావులు నొక్కి చెబుతున్నారు. మానవ జాతి అంతం కోసం సైన్స్ సృష్టించిన రాక్షసి ఏఐ కానుందనే భయాందోళనలు కలుగుతున్నాయి. ఈ కొత్త సంవత్సరం ఎదుర్కోవాల్సిన ప్రధాన సవాళ్లు ఇవే. యుద్ధాలు, వాతావరణ సంక్షోభం, కృత్రిమ మేధ విపరిణామం నుంచి ఎదురయ్యే సమస్యలను ప్రపంచ నాయకులు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

నూతన సంవత్సరం రోజున కొన్ని పతాక శీర్షికలను చూద్దాం. అమెరికాలోని న్యూ ఓర్లియన్స్‌లో సంబరాల్లో మునిగి తేలుతున్న వారిమీదికి ఓ ఉగ్రవాది బండిని నడిపించి 15 మంది చనిపోవడానికి కారణమయ్యాడు. ఆ తర్వాత డ్రైవర్ షంషుద్దీన్ జబ్బార్ ఆ గుంపుపై కాల్పులు జరపడానికి ప్రయత్నించాడు. అయితే పోలీసులు అతడిని హతమార్చారు. ఒకప్పుడు జబ్బార్ అమెరికన్ సైన్యంలో పనిచేశాడు. జరగనున్న ఉపద్రవ సంకేతాలను పసిగట్టడంలో ఇది అమెరికన్ నిఘా ఏజెన్సీల వైఫల్యమేనని చెప్పాలి. అతడికి నేరమయమైన గతం ఉంది. అయినా కఠినమైన భద్రతా తనిఖీ నుంచి తప్పించుకున్నాడు. ఈ నిర్లక్ష్యానికి అమాయకులైన అమెరికన్ పౌరులు మూల్యం చెల్లించారు.

ఈ విషాదం అక్కడితో ముగిసిపోలేదు. న్యూ ఓర్లియన్స్ ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే లాస్ వెగాస్‌లోని ట్రంప్ హోటల్ ముందు ఒక ట్రక్కు పేలింది. ఆసక్తి కలిగించే విషయం ఏమిటంటే, ఒక పాదచారి మరణానికి కారణమైన ఆ ట్రక్కు, అమెరికన్ అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ సన్నిహిత సహచరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా ఫ్యాక్టరీలో తయారైనది. ఇక మూడో ఘటన న్యూయార్క్‌లోని క్వీన్స్ బరోలో చోటుచేసుకుంది. అక్కడ నైట్ క్లబ్‌లో జరిగిన కాల్పుల ఘటనలో 11 మంది గాయపడ్డారు. ఈ ఘటనలపై దర్యాప్తు జరుగుతోంది. ఈ వ్యాసాన్ని రాసే సమయానికి అమెరికన్ పోలీసులు వాటిని స్పష్టమైన ఉగ్రవాద చర్యలుగా పేర్కొనలేదు. కానైతే ఈ వరుస ఘటనలు అమెరికన్ సమాజంలో పెరుగుతున్న అశాంతిని మరోసారి వెలుగులోకి తెచ్చాయి.

ఈ మూడు ఘటనలే కాకుండా, ఇతర ప్రాంతాలలో జరిగిన మరో రెండు, మన ప్రపంచంలో దీర్ఘకాలిక ప్రతికూల పరిణామాలు జరగనున్నట్లు చెబుతున్నాయి. అవేమిటంటే, నూతన సంవత్సరం రాత్రి పూట, గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేసి 12 మందిని చంపేసింది. రెండవ ఘటనలో, గ్యాస్ పైప్‌లైన్‌ను స్వాధీనం చేసుకున్న ఉక్రెయిన్, రష్యా నుండి మిగిలిన యూరప్‌కు గ్యాస్ సరఫరాను నిలిపివేసింది. ఇది రష్యన్ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపనుంది. ఈ సమయంలో ఎముకలు కొరికే చలిని ఎదుర్కొనే యూరప్‌పై దాని ప్రభావం మాటేమిటి?

ఇవన్నీ ఏం సూచిస్తున్నాయి?

రెండో ఇన్నింగ్స్ ప్రారంభించనున్న డోనాల్డ్ ట్రంప్ కోసం ముళ్ల కిరీటం ఎదురుచూస్తోంది. ట్రంప్ అంతర్జాతీయంగానే కాకుండా, దేశీయ రంగాలలో కూడా సవాళ్లతో పోరాడవలసి ఉంటుంది. న్యూ ఓర్లియన్స్, న్యూయార్క్, లాస్ వెగాస్ ఘటనలు మరోసారి అమెరికా అజేయం అనే భావనను దాని లోపలి నుండే ఛేదించవచ్చని స్పష్టంగా చెప్పాయి. అలాంటి పరిస్థితుల్లో, ఇజ్రాయెల్–హమాస్, రష్యా–ఉక్రెయిన్ వివాదాన్ని ట్రంప్ సంతృప్తికరంగా ఎలా పరిష్కరించగలరు?



నాలుగో సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న రష్యా–ఉక్రెయిన్ సైనిక ఘర్షణ రష్యా సైనిక శక్తిపై, దాని ఆధిపత్యంపై సందేహాలను రేకెత్తిస్తోంది. బలమైన నాయకుడైన వ్లాదిమిర్ పుతిన్ సైనిక శక్తిలో కూడా బలహీనతలు ఉన్నాయని గత మూడేళ్ల పరిణామాలు చూపిస్తున్నాయి. ఆయన పెంచుకున్న ప్రతిష్ఠకూ, సంవత్సరాలుగా ఆయన శ్రద్ధగా నిర్మించుకున్న ఖ్యాతికీ బీటలు వారుతున్నాయి. పతనమవుతున్న ఏకఛత్రాధిపతి ఇతరులను నాశనం చేయడానికి ఉన్న ప్రతి కిటుకునూ ఉపయోగిస్తాడనే వాస్తవానికి చరిత్ర సాక్ష్యంగా ఉంది. గ్యాస్ పైప్‌లైన్ స్వాధీన ఘటన జరిగినప్పటి నుండి, పుతిన్ తొందరపాటు నిర్ణయం తీసుకునే అవకాశం గురించి ఆందోళన కలుగుతోంది.

అంటే 2025 సంవత్సరానికి ఉన్న ముఖ్యమైన ప్రాధాన్యత యుద్ధాలను ఆపడమేనా?

ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన మానవ హక్కుల గణాంకాలను చూస్తే, యుద్ధాలు మానవాళిని ఎలా రక్తమోడిస్తున్నాయో స్పష్టంగా తెలుస్తుంది. ఆ డేటా ప్రకారం, 2024 జనవరి నుండి అక్టోబర్ 21 వరకు, రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో 622 మంది పిల్లలతో సహా కనీసం 11,973 మంది పౌరులు మరణించారు. పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటనల ప్రకారం, ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో గత 14 నెలల్లో 17,000 మంది పిల్లలతో సహా 45,000 మంది చనిపోయారు.

ఇప్పుడు మానవ జాతి ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య అయిన వాతావరణ సంక్షోభాన్ని చూద్దాం. మానవ జాతి చరిత్రలో 2024 అత్యంత ఉష్ణ సంవత్సరంగా నమోదైంది. వాతావరణ సదస్సు విఫలమైనప్పటి నుండి, వాతావరణ చర్యలపై ఏకాభిప్రాయానికి రాబోయే సంవత్సరాల్లో సవాళ్లు తీవ్రమవుతాయనే ఊహాగానాలు పెరుగుతున్నాయి. రికార్డు స్థాయిలో చలి కాలం ప్రారంభమవడం కూడా దీనికి సూచన. ఈ సవాలును మరింతగా ఎదుర్కొనే ప్రయత్నాన్ని ట్రంప్ గెలుపు బలహీనపరుస్తుంది. వాతావరణ సంక్షోభంపై ఆయనకున్న తీవ్రమైన అభిప్రాయాలు అందరికీ తెలిసినవే.

మన దృష్టిని ఆకర్షించిన మరో సమస్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. కృత్రిమ మేధ బలాలు, నష్టాల గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. ప్రముఖ రచయిత, జెరూసలేం హీబ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ యువల్ నోవా హరారీ కొన్ని సందర్భోచితమైన ప్రశ్నలను లేవనెత్తారు. కృత్రిమ మేధ అబద్ధం చెప్పగలదని ఆయన నొక్కి చెప్పారు. చాట్‌జీపీటీ4ని ఓపెన్ ఏఐ ప్రారంభించినప్పుడు, దాని సామర్థ్యాన్ని పరీక్షించడానికి 'కాప్చా'ను పరిష్కరించమని వారు కోరినట్లు హరారీ సోదాహరణ పూర్వకంగా తెలిపారు. అయితే చాట్‌జీపీటీ4, ఆ కాప్చాను పరిష్కరించలేక పోయింది. తర్వాత దాన్ని టాస్క్‌రాబిట్ అనే వెబ్ పేజీకి యాక్సెస్ ఇచ్చారు. కాప్చాను ఛేదించే పనిని చాట్‌జీపీటీ4 ఔట్‌సోర్స్ చేసి, సర్వీస్ ప్రొవైడర్‌కు తనకు సరిగ్గా కళ్లు కనబడవనీ(మనిషి లాగే), తనకోసం చేసిపెట్టమనీ అడిగింది. దాంతో అల్గోరిథమ్‌ను రూపొందించిన ఇంజనీర్లు ఆశ్చర్యపోయారు. కృత్రిమ మేధ అబద్ధాలు చెప్పడం ఎలా నేర్చుకుందో వారు అర్థం చేసుకోలేకపోయారు.

హరారీ, ఇతర ప్రజా మేధావులు కృత్రిమ మేధ పాత్రను ప్రశ్నించడానికి ఇదే కారణం. ఇది మానవులు రూపొందించిన స్వయంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోగల మొదటి సాధనం. కాబట్టి కృత్రిమ మేధ ప్రాణాంతకం అని వారు నొక్కిచెబుతున్నారు.

దురుద్దేశాలు ఉన్న వ్యక్తులు కృత్రిమ మేధను దుర్వినియోగం చేస్తారనడంలో సందేహమే లేదు. 2024 సంవత్సరం ప్రారంభంలో అంటే జనవరి 21న, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్వరాన్ని క్లోన్ చేయడానికి కృత్రిమ మేధను ఉపయోగించారు. దానిద్వారా న్యూ హాంప్‌షైర్ రాష్ట్రంలోని ఓటర్లకు వేలకొద్దీ ఆటోమేటెడ్ కాల్స్ చేశారు. ఈ ఆపరేషన్‌ను చేపట్టిన లింగో టెలికాం కంపెనీకి తర్వాత 1 మిలియన్ అమెరికన్ డాలర్ల జరిమానా పడింది. భారతదేశంలో కూడా, నటి రష్మిక మందాన ఫొటోను మార్ఫింగ్ చేసిన ఉదంతాన్ని చూశాం. ప్రశ్న ఏమిటంటే, మానవ జాతి అంతం కోసం సైన్స్ ఒక రాక్షసిని సృష్టించిందా?

మానవాళికి ముప్పు కలిగించే యుద్ధాలు, వాతావరణ సంక్షోభం, కృత్రిమ మేధ అనే మూడు సవాళ్లపై 2025 సంవత్సరం ఒక ఏకాభిప్రాయాన్ని సాధించగలదా?

వ్యాసకర్త 'హిందుస్థాన్' ప్రధాన సంపాదకుడు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)



సోషల్ మీడియా

మెరుగయ్యేనా?



కెనడా ప్రధానిగా జస్టిన్ ట్రూడో రాజీనామా చేశారు. బహుశా ఇది మంచి సంకేతమే. కానీ ఏమైనా ఇండియా, కెనడా మధ్య సంబంధాలను పునరుద్ధరించడం కష్టమే అవుతుంది.

– దీపన్ షెనాయ్, ఆంట్రప్రెన్యూర్

వాళ్ల పక్షమనా?



యూరప్ రాజకీయాల్లో ఎలాన్ మస్క్ తలదూర్చుతున్నారని ఫిర్యాదు చేస్తున్నవాళ్లు... బిల్ గేట్స్, క్లాస్ శ్వాబ్, జార్జ్ సొరోస్ విషయంలో మాత్రం మౌనంగా ఉంటారు.

– పీటర్ ఇమాన్యుయల్‌సేన్, స్వీడన్ జర్నలిస్ట్

నాసిరకం



నేను 40-50 ఏళ్లుగా హిందీ సినిమాలు చూడలేదు. కానీ వెన్నెముక గాయంతో మంచాన ఉండటంతో కాలక్షేపానికి ఏవైనా చూద్దామనుకున్నాను. మూడు పెద్ద హిట్స్ అని చెప్పిన 'బజరంగీ భాయీజాన్', 'డంకీ', 'పఠాన్' చూస్తే నాకు నాసిరకం అనిపించాయి.

– మార్కండేయ కట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

ఏం లాభం?



ఇంటర్నెట్ లేకపోవడం కంటే ఉన్న సంవత్సరాలే నేను ఇప్పుడు ఎక్కువ గడిపాను. కానీ నా యవ్వన కాలంలో ఈమెయిల్, సెల్‌ఫోన్ లేకుండా పెరిగాను. ప్రభుత్వం, అధికారులతో వ్యవహరించాల్సిన ఎన్నో పనులు అప్పుడు చేశాను. డిజిటల్ సేవల వల్ల జీవితం ఏమీ మెరుగు పడలేదని కచ్చితంగా చెప్పగలను.

– అన్నీ జైదీ, రచయిత్రి

ఆందోళనకరం



టిబెట్‌లో వచ్చిన 7.1 స్థాయి భూకంప ప్రకంపనలు బిహార్, అస్సాం, బంగ్లాదేశ్‌లోనూ కనిపించాయి. భారత సరిహద్దుకు సమీపంలో బ్రహ్మపుత్ర నది మీద భూకంప సున్నిత ప్రాంతంలో చైనా నిర్మిస్తున్న డ్యామ్‌తో ప్రమాదం ఏమిటో ఇది ఎత్తిచూపుతోంది.

– కన్వల్ సిబాల్, మాజీ విదేశాంగ కార్యదర్శి

ఇంత వ్యాపారమా?



చనుబాలకు ప్రత్యామ్నాయ పాలను తయారుచేస్తున్న వాళ్లు, ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాల దగ్గర ప్రసూతి సెలవులను తగ్గించడానికి లాబీ చేసినట్టు తెలిసింది. దీనివల్ల వాళ్ల పాలను మరింత ఎక్కువగా అమ్మవచ్చు. నేను స్వర్గ నరకాలను నమ్మనుగానీ మొదటిసారి ఇలాంటివాళ్లు నరకానికి పోవాలని కోరుకున్నాను.

– అబిద్ హసన్, ఆంట్రప్రెన్యూర్

బానే ఉన్నారా?



చూస్తుంటే ఎలాన్ మస్క్‌కు పిచ్చెక్కుతున్నట్టుగా ఉంది. నేను మస్క్ జీవిత చరిత్ర రాశాను. ఆయన ఆన్‌లైన్ ప్రవర్తనను రెండేళ్లుగా గమనిస్తున్నాను. మానసిక అనారోగ్యం, మాదక ద్రవ్యాల వాడకం, తీవ్ర ఒత్తిడి గురించి ఆయన ఇదివరకే ఒప్పుకున్నారు కాబట్టి, ఆయన బాగాలేరని ఆందోళన కలగడం న్యాయమే.

– సేత్ అబ్రామ్‌సన్, పొలిటికల్ కాలమిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** శు.నవమి ప.2.13 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** అశ్విని సా.4.45 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ప.12.58 నుండి 2.30 వరకు, తిరిగి రా.1.41 నుండి 3.11 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.45 నుండి 12.29 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.02 నుండి 11.28 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.37
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఇన్ బాక్స్

మారణకాండ ఆగాలి!

ఇజ్రాయిల్ దాడులకు అంతులేకుండా పోతోంది. దాని దాడుల్లో పసిపిల్లలూ, స్త్రీలూ ప్రధాన బాధితులు అయ్యారు. హమాస్ అంతమే ప్రధాన ఆశయంగా చేస్తున్న ఈ దాడులు మానవత్వ హననానికి ప్రతీకలుగా మారాయి. గాజాలో పరిస్థితులు చాలా భయంకరంగా ఉన్నాయి. చనిపోయిన వారిలో అధికంగా పిల్లలే ఉండటం కలచివేసే విషాదం. జనం బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. కనీసం కప్పుకోవడానికి సరైన దుప్పట్లు లేవు. ముడుచుకుని గడ్డ కట్టే చలిలో వణుకుతున్నారు. సహాయం చేయడానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. పౌష్టిక ఆహారం దేవుడెరుగు, కనీసం ఒక బ్రెడ్ ముక్క కూడా దొరకడం గగనమైంది. కడుపు నింపుకోవడానికి వాళ్ళు పడే అవస్థలు చూస్తే ఎవరికైనా గుండె తరుక్కుపోతుంది. ఇంతటి అమానుషమైన చర్యలకు ఇజ్రాయెల్ పాల్పడటం శోచనీయం. ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థలు ఏమీ చేయలేక పోతున్నాయి.

ఇజ్రాయెల్ ఇప్పట్లో కాల్పులను ఆపేటట్లు లేదు. శాంతి ప్రక్రియలకు ఖతార్‌లో అడుగు ముందుకు పడితే సంతోషమే. అయితే హమాస్ ఇజ్రాయెల్‌కు స్నేహ హస్తం అందించి తమ ఆధీనంలో ఉన్న ఇజ్రాయెలీ పౌరులను వదిలిపెట్టాలి. కానీ అలా చేయకపోగా కొత్తగా ఇటీవల ఓ 19 సంవత్సరాల ఇజ్రాయెల్ అమ్మాయిని హమాస్ బంధించడం చూస్తే శాంతికి అడ్డుకట్ట పడుతుందేమో అనిపిస్తోంది. 'మా అవస్థలు, మా బతుకు మీకు పట్టదా, పౌరుల సంక్షేమం కోసమే కదా ప్రభుత్వాలు ఉండేది' అన్న ఆ అమ్మాయి మాటలు ఇరు పక్షాలకు, నేతలకు కనువిప్పు కలిగిస్తే చాలు. గాజా ప్రజలపై ఇజ్రాయెల్ జాలి, కరుణ, ప్రేమ చూపాలి. దాడులు ప్రతి దాడులు చేయకుండా, పౌరులను బంధించకుండా ఇరుపక్షాలూ సంయమనం పాటించాలి.


– కనుమ ఎల్లారెడ్డి, అమెరికా

ఎవరిని ఉద్ధరించటానికి?

సూర్యాపేట జిల్లా మోతె మండలం రావి పహాడ్ గ్రామ కేంద్రంగా బయో ఫ్యూయల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ చేపడుతున్న ఇథనాల్ తయారీ కర్మాగార నిర్మాణాన్ని ప్రజల అభిప్రాయ సేకరణ లేకుండానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో ప్రారంభించారు. 2022 సంవత్సరంలో 172 కోట్ల పెట్టుబడితో 34 ఎకరాల విస్తీర్ణంలో పనులు ప్రారంభించారు. రెండు సంవత్సరాలుగా బోర్డు కూడా పెట్టకుండా కంపెనీ నిర్వాహకులు విత్తనాలు శుద్ధి చేసే కంపెనీ అని అబద్ధపు ప్రచారాలు చేసి ప్రజలను నమ్మించారు. ఇప్పటికే నలభై శాతం పనులు పూర్తి చేశారు. మూడు మండలాల పరిధిలోని 30 గ్రామాలకు చెందిన వేలాది ప్రజలు, ఇతర జీవరాశుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వ్యవసాయం, పర్యావరణానికి తీవ్ర ప్రమాదం తలపెడుతున్నరు.

ఇథనాల్ అంటే (ఇథైల్ ఆల్కహాల్) మద్యం తయారీలో వాడే ఆల్కహాల్. దీన్ని ఆహార ధాన్యాలను పులియబెట్టడం ద్వారానూ, పెట్రోలియం ఉత్పత్తుల నుండీ తయారు చేస్తారు. పెట్రోలియం ఉత్పత్తి క్షీణత, సరఫరాలోని ఆటంకాలు, ఇంధన భద్రత సమస్య వంటి వాటికి విరుగుడుగా అమెరికా ప్రోద్బలంతో ఇథనాల్ కలిపిన పెట్రోల్ ఉత్పత్తికి మన కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వడం ప్రారంభించింది. తక్కువ ఖర్చుతో వాహనాలు నడుపుకోవడం, ముడి చమురు దిగుమతులు తగ్గించు కోవడం, పర్యావరణానికి హితమైనదిగా ఇథనాల్‌కు పేరుండడం వల్ల దీని ఉత్పత్తికి ఉదారంగా అనుమతులు ఇస్తున్నారు. మోదీ ప్రభుత్వం 2021లో తీసుకు వచ్చిన 'ఇథనాల్ 20' విధానంలో భాగంగా మన తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో 30 ఇథనాల్ కంపెనీలు ఏర్పాటుకు కేసీఆర్ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇటీవల ప్రజా ఆందోళనల వల్ల రద్దు చేయబడిన దిలావర్ పూర్ ఇథనాల్ కంపెనీ ఇందులో భాగమే.

దేశ వ్యాప్తంగా వాహనాలలో వినియోగిస్తున్న ప్రతి లీటర్ పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం ఈ 'ఇథనాల్ 20' విధానం లక్ష్యం. బీజేపీ ప్రభుత్వం ఈ కంపెనీల నిర్మాణం కోసం అనుమతులు సరళతరం చేసి 'ప్రజాభిప్రాయ సేకరణ'ను రద్దు చేసింది. ఆరేళ్ళ పాటు వడ్డీలేని రుణాలను, ఇతర రాయితీలు ఇచ్చారు. జీవ ఇంధన విధానం 2018ని సవరించి 'ఇథనాల్ 20' లక్ష్యాన్ని సాధించడానికి బీజేపీ ప్రభుత్వం ఇథ నాల్ కంపెనీలు నడవడానికి 2022 నుండి భారత ఆహార సంస్థ తన దగ్గర ఉండే బఫర్ స్టాక్ నిల్వల నుండి కిలో బియ్యం 20 రూపాయలకే సరఫరా చేసింది. ఆ తరువాత కంపెనీలే బియ్యం సేకరించుకోవాలని చెప్పగా రైతులను మోసగించే మాయ మాటలతోపాటు, సబ్సిడీ బియ్యాన్ని దొంగ చాటుగా కిలో ఎనిమిది రూపాయలకే కొల్లగొట్టి పేదల కడుపు కొట్టే కుట్రలు తీవ్రమైనాయి.




రావి పహాడ్‌లో నిర్మాణంలో ఉన్న ఇథనాల్ ఫ్యాక్టరీ

రైతులు పండించే ధాన్యాలను ఇథనాల్ తయారీ కంపెనీలకు సరఫరా చేస్తే భవిష్యత్తులో తీవ్రమైన ఆహార ధాన్యాల కొరత ఏర్పడే అవకాశం ఉంది. అలాగే ధాన్యపు పంటల విస్తీర్ణం పెరిగి కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు వంటి పంటల విస్తీర్ణం తగ్గవచ్చు. ఆ మేర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. ఇది ఆహార ద్రవ్యోల్బణం పెరగడానికి కారణమవుతుంది. భూగర్భ జలాలు అంతంత మాత్రంగా ఉన్న తెలంగాణలో ఇథనాల్ తయారీ కంపెనీల వల్ల నీటి ఎద్దడి మరింత తీవ్రతరం కావచ్చు. ఎందుకంటే ఒక లీటర్ ఇథనాల్ ఉత్పత్తికి 4 నుంచి 8 లీటర్ల నీరు ఉపయోగిస్తారు. రావి పహాడ్‌లోని కంపెనీ రోజుకు లక్షా యాభై వేల లీటర్ల ఇథనాల్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది కాబట్టి ఏడాదికి ఎంత నీటి వినియోగం అవుతుందో ఊహించవచ్చు. ఇథనాల్ వాడకం వల్ల వాయు కాలుష్యం ఉండదంటున్నారు. కానీ దాన్ని తయారు చేసే సమయంలో ఫార్మాల్డిహైడ్, అసెటాల్డిహైడ్, అక్రోలీన్, హెక్సేన్ వంటి విష వాయువులు విడుదల అవుతాయని ఈ రంగంలో పనిచేస్తున్న కలపాల బాబూరావు వంటి నిపుణులు అంటున్నారు. అందువల్ల ప్రజలు అనేక రోగాల బారిన పడే అవకాశం ఉంది. అందుకే ఇథనాల్ కంపెనీని ఎత్తివేసే వరకూ ప్రజలు పోరాడాలి.

– ఆవుల నాగరాజు,
ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు । 96185 66356

మాతృ రుణం

భారతీయ సంస్కృతిలో మాతృమూర్తి స్థానం ఉన్నతమైనది. ఆమె రుణం తీర్చుకోవడం అసాధ్యం. అందుకు ఈ కథ ఒక ఉదాహరణ. పూర్వం వీరబలుడు అనే యువకుడు మాతృ రుణం తీర్చుకోవాలని లక్ష బంగారు నాణాలు ఇచ్చి 'అమ్మా! ఈ నాణాలను తీసుకుని హాయిగా జీవించు. నీ రుణం నుండి నాకు విముక్తి లభిస్తుంది' అన్నాడు. అందుకు తల్లి... 'బిడ్డా! నా రుణం తీర్చుకోవాలీ అనుకుంటే ఈ డబ్బు అవసరం లేదు, ఒక రాత్రిపూట నా వద్ద పడుకో చాలు' అంది. వీరబలుడు సరే అని ఆ రోజు తల్లి దగ్గరే పడుకున్నాడు. అతనికి నిద్ర రాగానే తల్లి లేపి 'నాయనా! దప్పికవుతోంది, నీళ్ళు తాగించు' అంది. వీరబలుడు సంతోషంగా లేచి గ్లాసుతో నీళ్ళిచ్చాడు. రెండు గుటకలు వేసి గ్లాసును జార విడిచింది. నీళ్ళుపడి పక్క తడిసిపోవడం చూసి 'ఏమిటమ్మా ఇది' అన్నాడు. 'పొరపాటు అయిపోయింది నాయనా' అంది తల్లి. వీరబలుడు మౌనంగా పడుకున్నాడు. ఇలా అతడు నిద్రలోకి జారుకునే సమయంలో మరో మూడుసార్లు మంచినీరు అడిగి నీళ్ళు ఒలకబోసిందామె. దాంతో వీరబలుడు ఉగ్రుడయ్యాడు. పెద్దగా అరుస్తూ అనరాని మాటలన్నాడు తల్లిని.



జ్యోతిర్మయం

అప్పుడు ఆమె 'వీరా! చాలించు. అరుపులు ఆపు. నా రుణం తీర్చుకుంటానన్నావు, తల్లి రుణం తీర్చుకోగలుగుతావా? నీ తలమీద ఎన్ని వెంట్రుకలు ఉన్నాయో అన్ని జన్మలెత్తి, నిరంతర సేవ చేసినా మాతృ రుణం నుండి విముక్తుడవు కాలేవు. ఎందుకంటావా... నువ్వు పసిబిడ్డగా ఉన్నప్పుడు రోజూ పక్కమీదే మల మూత్రాదులు చేసేవాడివి. నువ్వు తడిపిన వైపు నేను పడుకుని నిన్ను పొడిగా ఉన్నవైపు పడుకోబెట్టి నిద్రబుచ్చేదాన్ని. ఇలా కొన్ని సంవత్సరాల పాటు ప్రతిరోజూ ఎంతో ప్రేమతో చేస్తూ ఉండేదాన్ని. కానీ నువ్వు ఒకటి రెండు సార్లు నీళ్ళతో పక్క తడిపినందుకే కోపం వచ్చి విసుక్కుంటున్నావు. ఒక్క రాత్రి నిద్ర లేనందుకే వీరంగం వేస్తున్నావు' అంది. వీరబలుడు సిగ్గుపడి తల్లి పాదాలు పట్టుకుని 'అమ్మా! నా కళ్ళు తెరుచుకున్నాయి. నీ రుణం చెల్లించడం అసంభవం' అన్నాడు.

'మాతృ భవతు సంమనాః' అని వేదం చెప్తుంది. అంటే తల్లి మనస్సును ఎప్పుడూ సంతోష పెడుతుండాలని అర్థం. అలాంటి ఉత్తమ సంతానంగా నిలబడటం మనిషి ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒక మజిలీ.

– సాక్షి

క్లుప్తంగా...

బలరామునిగా భద్రగిరి రామయ్య


బలరామావతారంలో స్వామివారు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు బలరామావతారంలో దర్శనమిచ్చారు. ఈ రూపంలో అలంకరించిన స్వామివారిని మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం తిరువీధి సేవ నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా భద్రాద్రి రామయ్య బుధవారం చివరిదైన శ్రీకృష్ణావతారంలో దర్శనమివ్వనున్నారు. కాగా గురువారం సాయంత్రం పవిత్ర గోదావరిలో తెప్పోత్సవం, శుక్రవారం తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం ఉంటాయి.

బీసీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం


నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా మొకురాల చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ దేశబోయిన రమ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. దోమలగూడలోని బీసీ భవన్‌లో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి ఎన్నికల అధికారిగా హైదరాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్.కోటజీ వ్యవహరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు బాలాచారి, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ పాల్గొన్నారు.

పట్టాలపై పసికందు

- కాపాడి ఆస్పత్రికి తరలించిన రైల్వే పోలీసులు


పసికందును ఆస్పత్రికి తీసుకెళ్తున్న పోలీసులు

పెద్దపల్లి రూరల్: ఏ తల్లి కన్నబిడ్డో తెలియదు కానీ.. మంగళవారం ఉదయం పెద్దపల్లి–కూనారం రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు వద్ద 2 నెలల వయసున్న మగ శిశువును ఎవరో రైలు పట్టాలపై వదిలేసి వెళ్లారు. సమాచారం అందుకున్న రామగుండం రైల్వే సీఐ సురేశ్, ఎస్ఐ క్రాంతి కుమార్, కానిస్టేబుల్ సుమన్ వెంటనే ఘటనా స్థలికి చేరుకుని బాబును ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పసికందు ఆరోగ్యం నిలకడగానే ఉందని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి కమలాకర్, సూపర్‌వైజర్ రమాదేవి బాబును తమ సంరక్షణలోకి తీసుకుని వైద్యసేవలు అందిస్తున్నారు.

సాగర్ ఆయకట్టు పెంచుతాం

- డ్యామ్ స్పిల్‌వేలో గుంతలు పూడ్చి సామర్థ్యం పెంచుతాం
- ప్రాజెక్టు మరమ్మతులపై ఐఐటీ రూర్కీతో అధ్యయనం
- నెల్లికల్లు ఫేజ్–1 కింద వచ్చే ఖరీఫ్‌కు నీళ్లు అందిస్తాం
- ఎస్ఎల్‌బీసీ హైలెవల్, లోలెవల్ కాల్వల మధ్య లింక్ కాల్వ
- సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి


మంగళవారం జలసౌధలో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్, కె.జానారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ డ్యామ్ స్పిల్‌వేకి పడిన గుంతలను పూడ్చివేసి ప్రాజెక్టును పటిష్టపరిచి.. దాని కింద ఆయకట్టు పెంపుదలకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. డ్యామ్ మరమ్మతులపై ఐఐటీ రూర్కీ నిపుణులతో అధ్యయనం జరిపించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. సాగర్ కెనాల్ నెట్‌వర్క్‌కు సైతం మరమ్మతులు నిర్వహించాలని సూచించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రాజెక్టుల పనుల పురోగతిపై మంగళవారం ఆయన జలసౌధలో కాంగ్రెస్ సీనియర్ నేత కె.జానారెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు.

చిన్న లిఫ్టులతోనే అధిక ప్రయోజనం

రాష్ట్రంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీసీ) పరిధిలోని 334 చిన్న ఎత్తిపోతల పథకాలు కింద 4,69,138 ఎకరాల ఆయకట్టు ఉండగా.. కొన్ని లిఫ్టులు పూర్తిగా, మరి కొన్ని పాక్షికంగా పనిచేస్తున్నాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. పూర్తి సామర్థ్యంతో సాగునీటి సరఫరా చేసేలా ఈ లిఫ్టులను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. చిన్న ఎత్తిపోతల పథకాలే రైతులకు ప్రయోజనం చేకూర్చుతాయని, వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నెల్లికల్లు ఎత్తిపోతల పథకం తొలి దశ పనులను సత్వరం పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ నాటికి ఆయకట్టుకు నీళ్లు అందించాలని ఆదేశించారు. రూ.664.8 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే 24,624 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు లభిస్తుందని తెలిపారు. ఖరీఫ్ నాటికి ప్రాజెక్టు తొలి దశ పనులు పూర్తి చేసి 7,600 ఎకరాలకు నీరందించాలని ఆదేశించారు.

లోలెవల్ కాల్వకు మహర్దశ

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగమైన హైలెవల్, లోలెవల్ కాల్వల మధ్య 15 కి.మీల లింక్ కాల్వ నిర్మాణం విషయంలో ముందుకు వెళ్లాలని మంత్రి ఉత్తమ్ నిర్ణయించారు. మేడవార్మ్, పోతునూరు, సంగారం, పెద్దవూర, తుంగతుర్తి చెరువులను అనుసంధానం చేస్తూ లింక్ కాల్వను నిర్మిస్తామని చెప్పారు. రూ.62.26 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న లింక్ కాల్వ నిర్మాణానికి 65.02 ఎకరాల భూసేకరణ జరపాల్సి ఉండగా, ఇప్పటికే 43.31 ఎకరాల సేకరణ పూర్తయ్యిందని, తక్షణమే టెండర్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రూ.125 కోట్ల అంచనా వ్యయంతో 0–63 కి.మీల లోలెవల్ కాల్వ లైనింగ్ పనులను చేపడుతామని తెలిపారు. అదనంగా లోలెవల్ కాల్వకు సంబంధించిన డీ–1 నుంచి డీ–27 వరకు డిస్ట్రిబ్యూటరీలకు 60 మి.మీల మందంతో కాంక్రీట్ లైనింగ్ వేసి కాల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరిస్తామని చెప్పారు. 90.43 కి.మీల పొడవైన ఈ డిస్ట్రిబ్యూటరీల లైనింగ్‌కు రూ.42.26 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఫ్లడ్ ఫ్లో కాల్వగా పేరొందిన లోలెవల్ కెనాల్ 80 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోందని చెప్పారు. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల్లోనే 50 వేల ఎకరాలకు నీరందిస్తోందని తెలిపారు. 19 చిన్న ఎత్తిపోతల పథకాల ద్వారా మరో 30 వేల ఎకరాలను స్థిరీకరిస్తుందని వివరించారు. అనుమలవారిగూడెం వద్ద శశిలేరు వాగుపై చెక్ డ్యామ్ నిర్మాణానికి మంత్రి అనుమతిచ్చారు. సాగర్ పరిధిలోని 39 ఐడీసీ లిఫ్టులకు మరమ్మతులు చేసి పునరుద్ధరించాలని ఆదేశించారు. సమీక్షలో నల్లగొండ ఎంపీ కె.రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు జయవీర్ రెడ్డి, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ పాల్గొన్నారు.

సృజనకు పదును పెడితేనే ఆవిష్కరణలు

- విద్యార్థుల ఆలోచనలను ప్రోత్సహించండి
- రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మంత్రి రాజనర్సింహ
- అద్భుత ఆవిష్కరణలు ప్రదర్శించిన విద్యార్థులు


ప్రదర్శనలను పరిశీలిస్తున్న మంత్రి రాజనర్సింహ, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహిస్తేనే కొత్త ఆవిష్కరణలు పుట్టుకొస్తాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి ఇండస్ట్రియల్ గ్రీన్ పార్కులోని ఎస్‌వీకేఎంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను మంత్రి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రతి పాఠశాలలోనూ సైన్స్ ప్రయోగశాలలు ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ ప్రదర్శనలో 33 జిల్లాల నుంచి ఇన్‌స్పైర్ 2023– 24 విభాగంలో 301.. 2024– 25 రాష్ట్రీయ బాల్ వైజ్ఞానిక ప్రదర్శన కింద 563 ఎంట్రీలు వచ్చాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సంజీవని హెలికాప్టర్



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల హైస్కూల్ విద్యార్థి ప్రణీత్ కుమార్ తన గైడ్ శోభారాణితో కలిసి 'సంజీవని హెలికాప్టర్'ప్రయోగాన్ని ప్రదర్శించాడు. హెలికాప్టర్ ప్రమాదం జరిగినప్పుడు బుల్లెట్ ప్రూఫ్, ఫైర్ ప్రూఫ్‌తో కూడిన బెలూన్ ఓపెన్ అయి సురక్షితంగా బయటపడేందుకు వీలుగా రూపొందించారు. బెలూన్‌లోనే ఆక్సిజన్ ఉండటం వల్ల అందులో ప్రయాణించే వారికి ఎలాంటి ప్రాణహాని ఉండదు. దీనికి జీపీఎస్ అనుసంధానం ఉండటం వల్ల హెలికాప్టర్ క్రాషెస్‌ను గుర్తించేందుకు సులువవుతుంది.

మొక్కజొన్న వ్యర్థాల నుంచి బయో ఆయిల్

మొక్కజొన్న వ్యర్థాలు, పేడ నుంచి బయో ఆయిల్ ఉత్పత్తి చేసే ఆవిష్కరణను నిజామాబాద్ విజయ హైస్కూల్ విద్యార్థులు విజిదేంద్రియ, శ్రీకర్ కలసి ప్రదర్శించారు.



అల్ట్రాసోనిక్ హెల్మెట్



వినికిడి లోపం ఉన్నవారితో పాటు వాహనదారులకు బైక్ నడిపే సమయంలో ప్రమాదాల నివారణకోసం అల్ట్రాసోనిక్ హెల్మెట్‌ను ఖమ్మం జిల్లా చెన్నారం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ప్రియ రూపొందించింది. వాహనం నడిపేటప్పుడు సెన్సార్‌ల ఆధారంగా హెల్మెట్ గ్లాస్‌కు కంటికి కనిపించే విధంగా గ్రీన్, ఆరెంజ్, రెడ్ లైట్లను ఏర్పాటు చేశారు. దీని ఖర్చు కేవలం రూ.400 నుంచి రూ.1,000 వరకు అవుతుంది.

ప్రముఖ చిత్రకారుడు జగదీశ్ మిట్టల్ కన్నుమూత

సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ చిత్రకారుడు, చారిత్రక, సాంప్రదాయ కళారూపాల పరిరక్షకుడైన జగదీశ్ మిట్టల్ (101) మంగళవారం అశోక్‌నగర్‌లోని స్వగృహంలో వయోభారంతో కన్నుమూశారు. బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. ఆయన భార్య కమలా మిట్టల్ నాలుగేళ్ల క్రితమే మృతిచెందారు. ఆమె కూడా చిత్రకారిణియే. అపారమైన కళాసంపదను, ఎన్నో విలువైన కళారూపాలను ఆయన సేకరించి జాగ్రత్తగా కాపాడారు. సుమారు రూ.వెయ్యి కోట్ల విలువైన ప్రఖ్యాత చిత్రకళారూపాలు, సాంప్రదాయ కళావస్తువులు మిట్టల్ మ్యూజియంలో ఉన్నట్లు సమాచారం. చిత్రకళావస్తువులతో పాటు బింద్రి, కళంకారీ, మినీయేచర్ వంటి అనేక రకాల కళావస్తువులు ఆయన భాండాగారంలో ఉన్నాయి. భోపాల్‌కు చెందిన జగదీశ్ మిట్టల్ 1950 ప్రాంతంలో హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. కమలా, జగదీశ్ దంపతులు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి సంతానం లేరు. ఒక అబ్బాయిని దత్తత తీసుకున్నట్లు సమాచారం. జగదీశ్ మృతి పట్ల ప్రముఖ శిల్పి ఎంవీ రమణారెడ్డి, సినీదర్శకుడు బి.నర్సింగరావు సంతాపం తెలిపారు.

కళల పరిరక్షణలో మిట్టల్ ప్రోత్సాహం అమూల్యం: సీఎం

ప్రముఖ కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత జగదీశ్ మిట్టల్ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. మన కళల పరిరక్షణలో జగదీశ్ మిట్టల్ అందించిన ప్రోత్సాహం, జరిపిన కృషి అమూల్యమైనదని ఆయన పేర్కొన్నారు. 'జగదీశ్ అండ్ కమలా మిట్టల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ ఆర్ట్ ద్వారా ఆయన అందించిన వారసత్వం కళాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. జగదీశ్ మిట్టల్ మృతి పట్ల అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ విచారం వ్యక్తం చేశారు. కళల పరిరక్షణకు ప్రోత్సాహం అందించడంలో మిట్టల్ కృషి అమూల్యమైనదని ఆమె ఓ ప్రకటనలో కొనియాడారు.

ఫిబ్రవరి 7న లక్ష డప్పులతో మాదిగల గుండె చప్పుడు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


డప్పు కొట్టి కళాజాతను ప్రారంభిస్తున్న మంద కృష్ణ మాదిగ తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): వంద డప్పులతో గ్రామాలకు వెళ్లి లక్ష డప్పులతో హైదరాబాద్‌కు తిరిగి వస్తామని, డప్పు చప్పుడుతోనే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకులను ఓడిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ప్రపంచానికి మాదిగల గోడు తెలిసేలా లక్ష డప్పులతో మాదిగల గుండె చప్పుడు వినిపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం వరకు 10 జిల్లాల రథయాత్ర కార్యక్రమాన్ని జెండా ఊపి మందకృష్ణ డప్పు వాయించి ప్రారంభించారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ తుదిదశకు చేరిందని, అంతిమ ఘట్టాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత మాదిగ కళాకారులపై ఉందన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు తీర్పు మేరకు విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించి, అమలు చేయకుండా జాప్యం చేయడంలో ఆంతర్యం ఏంటని మందకృష్ణ ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రముఖ సినీగేయ రచయిత మిట్టపల్లి సురేందర్, బహుజన గాయకుడు ఏపూరి సోమన్న, గిద్దా రామనర్సయ్య, అంతడుపుల నాగరాజు, పాటమ్మ ప్రేమ్ సింగర్, రాంబాబు, మాట్ల తిరుపతి, మాదిగ కళామండలి జాతీయ అధ్యక్షుడు అశోక్, నలిగంటి శరత్‌తోపాటు కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పౌరసరఫరాల సంస్థ హమాలీల సమ్మె విరమణ

- కూలి రేట్ల పెంపు జీవో జారీకి మంత్రి ఉత్తమ్ అంగీకారం

సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల సంస్థ పరిధిలోని మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లలోని హమాలీలకు కూలి రేట్ల పెంపు జీవో జారీకి మంత్రి ఉత్తమ్ అంగీకరించడంతో హమాలీలు వారంరోజులుగా చేస్తున్న సమ్మెను విరమించారు. హమాలీ రేట్లను పెంచేందుకు అంగీకరించినప్పటికీ, అధికారిక ఉత్తర్వులు జారీ చేయకపోవడాన్ని నిరసిస్తూ జనవరి 1వ తేదీ నుంచి హమాలీలు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు. దీంతో చాలా జిల్లాల్లో రేషన్ దుకాణాలకు రేషన్ బియ్యం అందలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో మంత్రి ఉత్తమ్‌తో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు తదితరులతో కూడిన ప్రతినిధి బృందం సమావేశమైంది. 2024, అక్టోబర్ 4న జరిగిన వేతన ఒప్పందం ప్రకారం హమాలీ రేట్లను వెంటనే పెంచి అమలు చేయాలని చాడ మంత్రికి వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి రెండ్రోజుల్లో ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయనున్నట్లు చెప్పారు. దీంతో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సివిల్ సప్లైస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, సివిల్ సప్లైస్ హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, రాష్ట్ర, జిల్లాల నాయకులతో సంప్రదించి మెజార్టీ నిర్ణయం ప్రకారం సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు.

ఆసుపత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించిన అల్లు అర్జున్



బన్సీలాల్‌పేట్ (హైదరాబాద్): సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను మంగళవారం ఉదయం సినీనటుడు అల్లు అర్జున్ పరామర్శించారు. గత నెల 4న పుష్ప–2 బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో రేవతి చనిపోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవడానికి అల్లు అర్జున్ ఉదయం సుమారు 9.45కి తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత దిల్‌రాజుతో కలిసి ఆసుపత్రికి చేరుకున్నారు. బాలుడిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వంతెనపై నుంచి విసిరేశారు..

- 32 కుక్కలను పడేసిన గుర్తు తెలియని వ్యక్తులు
- 21 శునకాలు మృతి, పదకొండింటికి గాయాలు

కంది (సంగారెడ్డి): గుర్తు తెలియని వ్యక్తులు 32 కుక్కలను వంతెన పైనుంచి పడేశారు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలో ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనపై ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు. 4వ తేదీన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కంది మండలం ఎద్దుమైలారం వద్ద బెంగళూరు బైపాస్ రోడ్డు వంతెనపై నుంచి 32 కుక్కలను పడేశారు. వీటిలో 21 కుక్కలు మృతి చెందగా.. మరో 11 కుక్కలు గాయపడ్డాయి. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న ఇంద్రకరణ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన కుక్కలను సిటిజెన్ ఫోరం ఫర్ యానిమల్స్ సభ్యులకు అందజేశారు. మృతి చెందిన 21 కుక్కలకు మండల పశు వైద్యాధికారి జబీన్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కలను వంతెనపై నుంచి ఎవరు పడేశారన్న కోణంలో విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహా కుంభమేళా @144

144 ఏళ్ల తర్వాత వచ్చిన గొప్ప వేడుక

ఈ నెల 13 నుంచి వచ్చే నెల 26వ తేదీ దాకా పుణ్య స్నానాలు	ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాట్లు పూర్తిచేసిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం	40 కోట్ల మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం

మహా కుంభమేళా కోసం దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో ఈ నెల 13 నుంచి వచ్చే నెల 26వ తేదీ వరకు.. 45 రోజులపాటు జరిగే ఈ వేడుకకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లు దాదాపు పూర్తి చేసింది. 40 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించబోతున్నారని అంచనా. మకర సంక్రాంతి పర్వదినం నుంచి భక్తుల సందడి ప్రారంభం కానుంది. ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన, సాంస్కృతిక ఉత్సవంగా కుంభమేళా రికార్డుకెక్కింది. సాధారణంగా కుంభమేళాను నాలుగేళ్లకోసారి నిర్వహిస్తారు. ఈ ఏడాది యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించే కుంభమేళాకు ఒక విశిష్టత ఉంది. ఇది 144 సంవత్సరాల తర్వాత జరుగబోతున్న మహా కుంభమేళా. ఖగోళంలో నక్షత్రాలు, గ్రహగతుల్లో ప్రత్యేక పరిణామాల వల్ల ఇలాంటి అరుదైన కుంభమేళా జరుగుతుందని పండితులు చెబుతున్నారు.

నాలుగు రకాల కుంభమేళాలు

- కుంభమేళా(నాలుగేళ్లకోసారి)
- అర్ధ కుంభమేళా(ఆరేళ్లకోసారి)
- పూర్ణ కుంభమేళా(12 ఏళ్లకోసారి)
- మహా కుంభమేళా(144 ఏళ్లకోసారి)

ఏడాదికోసారి మాఘమేళా

ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి సంవత్సరం మాఘ మేళా జరుగుతుంది. దీనిని 'చోటా కుంభ్' అని పిలుస్తారు. హిందూ క్యాలెండర్ ప్రకారం జనవరి–ఫిబ్రవరిలో ఈ మాఘమేళా నిర్వహిస్తారు.

మహా కుంభమేళాలో షాహీ స్నానాల తేదీలు

- జనవరి 13: పుష్య పూర్ణిమ స్నానం
- జనవరి 15: మకర సంక్రాంతి స్నానం
- జనవరి 29: మౌని అమావాస్య స్నానం
- ఫిబ్రవరి 3: వసంత పంచమి స్నానం
- ఫిబ్రవరి 12: మాఘ పూర్ణిమ స్నానం
- ఫిబ్రవరి 26: మహా శివరాత్రి స్నానం


టెంట్లు తదితర ఏర్పాట్లతో మహా కుంభమేళాకు సిద్ధమైన ప్రయాగ్‌రాజ్‌లోని సంగమం

కుంభమేళా ఎలా మొదలైంది?

కుంభమేళా మూలాలు హిందూ పురాణాల్లో ఉన్నాయి. అమృతం కోసం దేవతలు, రాక్షసులు కలిసి సముద్ర మథనం చేసిన విషయం తెలిసిందే. సముద్రం నుంచి ఒక కుంభం(కుండ)లో అమృతం పైకి తేలింది. అమృతం రాక్షసుల చేతికి దక్కకూడదన్న ఉద్దేశంతో మహా విష్ణువు ఈ కుంభాన్ని తన ఆధీనంలో ఉంచుకున్నారు. అసురులు ఆయనను వెంబడించారు. మహా విష్ణువు అమృతభాండంతో ముందుకు పరుగులు తీస్తుండగా, కొన్ని అమృతం చుక్కలు నాలుగు చోట్ల పడిపోయాయి. అవే ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్. అందుకే ఇవి పవిత్ర పుణ్యక్షేత్రాలుగా మారాయి. కుంభం నుంచి అమృతం పడిన చోట కుంభమేళా నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఏ మేళా ఎప్పుడంటే..

కుంభమేళా: ఈ వేడుక దేశంలో నాలుగుచోట్ల (హరిద్వార్, ప్రయాగ్‌రాజ్, ఉజ్జయిని, నాసిక్) నాలుగేళ్లకోసారి జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లోని పవిత్ర నదులు భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తారు. తద్వారా పాప విముక్తి కలుగుతుందని విశ్వసిస్తారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో గంగా నది, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో షిప్రా నది, మహారాష్ట్రలోని నాసిక్‌లో గోదావరి నది, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో గంగా, యమున, సరస్వతి నదుల సంగమం ఉన్నాయి.

అర్ధ కుంభమేళా: ప్రయాగ్‌రాజ్, హరిద్వార్‌లో ఆరేళ్లకోసారి అర్ధ కుంభమేళా జరుగుతుంది.

పూర్ణ కుంభమేళా: ఇది ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. గ్రహగతుల ఆధారంగా పూర్ణ కుంభమేళా తేదీలను నిర్ణయిస్తారు. పుణ్య స్నానాల కోసం కోట్లాది మంది తరలివస్తారు.

మహా కుంభమేళా: 12 పూర్ణ కుంభమేళాలు పూర్తయిన తర్వాత మహా కుంభమేళా జరుగుతుంది. అంటే 144 ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. మహా కుంభమేళాలను అత్యంత పవిత్రంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా అఖాడాలు, నాగా సాధువుల ఆధ్వర్యంలో ఎన్నెన్నో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. మరో మహాకుంభమేళా కోసం 144 సంవత్సరాలు ఎదురు చూడాల్సిందే. కొందరు తమ జీవిత కాలంలో మహా కుంభమేళాను చూడలేకపోవచ్చు కూడా.

హస్తిన సమరం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

- ఫిబ్రవరి 5వ తేదీన పోలింగ్... 8వ తేదీన ఓట్ల లెక్కింపు
- మిల్కీపూర్, ఈరోడ్ అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలకు సైతం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల సంగ్రామానికి నగారా మోగింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఫిబ్రవరి 23వ తేదీతో పదవీకాలం ముగియనున్న ఢిల్లీ అసెంబ్లీకి ఈసారి ఒకే విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నెల 10వ తేదీన ఎన్నికల ప్రక్రియకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 5వ తేదీన పోలింగ్ జరుగనుంది. ఫిబ్రవరి 8వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్, కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ మంగళవారం ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో మొత్తం 70 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా, ఇందులో 58 స్థానాలు జనరల్ కేటగిరీలో, 12 స్థానాలు ఎస్సీ రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. ఫిబ్రవరి 1వ తేన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఢిల్లీకి సంబంధించి ప్రత్యేకంగా ఎలాంటి కేటాయింపులు, ప్రకటనలు చేయరాదని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఉత్తరప్రదేశ్‌లోని మిల్కీపూర్, తమిళనాడులోని ఈరోడ్ అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలు సైతం ఫిబ్రవరి 5న జరుగుతాయి. జమ్మూకశ్మీర్‌లోని బుద్గాం, నాగ్రోటా అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉండగా ప్రతికూల వాతావరణం కారణంగా వాయిదా వేశారు. పశ్చిమ బెంగాల్‌లోని బసీర్‌హాత్, గుజరాత్‌లోని విసావదార్ లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉండగా, వీటిపై పిటిషన్లు కోర్టుల్లో పెండింగ్ ఉండడంతో ఎన్నికలు నిర్వహించకూడదని నిర్ణయించారు.

2020 ఎన్నికల్లో	ఆప్	బీజేపీ
	62 సీట్లు	8 సీట్లు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్

- ఎన్నికల నోటిఫికేషన్: జనవరి 10
- నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ: జనవరి 17
- నామినేషన్ల పరిశీలన: జనవరి 18
- నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ: జనవరి 20
- పోలింగ్: ఫిబ్రవరి 5
- ఓట్ల లెక్కింపు : ఫిబ్రవరి 8

ఢిల్లీలో ఓటర్లు మొత్తం: 1.55 కోట్లు

- పురుషులు : 83.49 లక్షలు
- మహిళలు: 71.74 లక్షలు
- యువ ఓటర్లు (20-29 ఏళ్ల మధ్య): 25.89 లక్షలు
- తొలిసారి ఓటర్లు (18-19 ఏళ్లు): 2.08 లక్షలు
- పీడబ్ల్యూడీ ఓటర్లు: 79,436
- వందేళ్లు దాటిన ఓటర్లు: 830
- 85 ఏళ్లు దాటిన ఓటర్లు: 1.09 లక్షలు
- ట్రాన్స్‌జెండర్ ఓటర్లు: 1,261


సీఈసీ రాజీవ్ కుమార్

ఓట్ల తొలగింపు సులభం కాదు

ఢిల్లీలో ఎన్నికల జాబితా రూపకల్పనలో అవకతవకలు జరిగాయని, చాలా ఓట్లను కుట్రపూరితంగా తొలగించాలరంటూ వస్తున్న ఆరోపణలను సీఈసీ రాజీవ్ కుమార్ ఖండించారు. ఓట్లను తొలగించడం అంత సులభం కాదని అన్నారు. దానికి సుదీర్ఘమైన ప్రక్రియ ఉంటుందని గుర్తుచేశారు. ఢిల్లీలో ఓట్లను ఎక్కడా తొలగించలేదని చెప్పారు. ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా రూపొందించామని, అవకతవకలకు ఆస్కారం లేదని వివరించారు. పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహిస్తామని, రాజకీయ పార్టీలు సహకరించాలని, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని విన్నవించారు. ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎంలు) విషయంలోనూ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగే అవకాశమే లేదని స్పష్టంచేశారు. ఈవీఎంలపై జరిగే తప్పుడు ప్రచారం నమ్మొద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని బహిర్గతం చేయడానికి వీల్లేకుండా ఎన్నికల నిబంధనల్లో ఇటీవల చేసిన మార్పులను రాజీవ్ కుమార్ సమర్థించారు. 100 కోట్ల మందికిపైగా ఓటర్లతో మన దేశం అతిత్వరలో సరికొత్త రికార్డు సృష్టించబోతోందని పేర్కొన్నారు. వచ్చే నెలలో పదవీ విరమణ చేయబోతున్నానని, సీఈసీగా ఢిల్లీ ఎన్నికలే తనకు చివరి ఎన్నికలని రాజీవ్ కుమార్ వెల్లడించారు. హిమాలయాలకు వెళ్లి నాలుగైదు నెలలు ఒంటరిగా కాలం గడుపుతానని చెప్పారు. తనకు ఏకాంతం కావాలన్నారు.

శ్వాస సంబంధ వ్యాధులపై నిఘా

- హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్రాలకు కేంద్రం సూచన
- మహారాష్ట్రలో బయటపడిన రెండు అనుమానాస్పద కేసులు

న్యూఢిల్లీ: శ్వాస సంబంధమైన అన్ని రకాల వ్యాధులపై ఓ కన్నేసి ఉంచాలని, హ్యూమన్ మెటా న్యుమోవైరస్(హెచ్‌ఎంపీవీ) వ్యాప్తిని నివారించేందుకు ప్రజల్లో అవగాహన పెంచాలని కేంద్రం రాష్ట్రాలను కోరింది. దేశంలో ఇప్పటికే హెచ్‌ఎంపీవీ సంబంధిత ఐదు కేసులు బయటపడగా, మంగళవారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో రెండు హెచ్‌ఎంపీవీ అనుమానిత కేసులను వైద్యులు గుర్తించారు. సోమవారం కర్ణాటక, తమిళనాడు, గుజరాత్‌లలో ఐదుగురు చిన్నారులకు హెచ్‌ఎంపీవీ పాజిటివ్‌గా గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పరిస్థితిని సునిశితంగా పరిశీలిస్తోందని, ఎలాంటి భయాందోళనలకు ప్రజలు గురి కావాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా భరోసా ఇచ్చారు. చైనాలో ఒక్కసారిగా హెచ్‌ఎంపీవీ కేసులు పెరగడంతో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులతో వర్చువల్‌గా సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. ఇప్పటి వరకు అందిన డేటా ప్రకారం చూస్తే ఇన్‌ఫ్లూయెంజా లైక్ ఇల్‌నెస్(ఐఎల్ఐ), సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ ఇల్‌నెస్(ఎస్ఏఆర్ఐ) సహా అన్ని రకాల శ్వాస సంబంధ ఇన్ఫెక్షన్ల కేసుల్లో అనూహ్యమైన పెరుగుదల కనిపించలేదని ఆమె వివరించారు. అదీకాకుండా, ప్రపంచ దేశాల్లో 2021 నుంచే ఈ వ్యాధి ఉన్నందున ప్రజలు భయపడాల్సిన అవసరం కూడా లేదన్నారు. ప్రస్తుత శ్వాసకోశ సంబంధ వ్యాధుల్లో నమోదైన పెరుగుదలపై ఆమె మాట్లాడుతూ.. ఏటా ఈ సీజన్‌లో ఇలా కేసులు పెరగడం మామూలేనన్నారు. అయితే, శ్వాస సంబంధమైన అన్ని రకాల వ్యాధుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని ఆమె రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులను కోరారు.

నాగ్‌పూర్‌లో రెండు అనుమానాస్పద కేసులు..

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో హెచ్‌ఎంపీవీ అనుమానాస్పద కేసులు రెండింటిని గుర్తించారు. 7, 14 ఏళ్ల బాధితులిద్దరికీ స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో అవుట్ పేషెంట్ విభాగంలో చికిత్స చేసి, ఇంటికి పంపించివేశారు. ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారు. అనుమానితుల నుంచి సేకరించిన నమూనాలను నాగ్‌పూర్‌లోని ఎయిమ్స్‌కు, పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించామని జిల్లా కలెక్టర్ విపిన్ ఇటంకర్ చెప్పారు. హెచ్‌ఎంపీవీ కేసులంటూ వచ్చిన వార్తలు అబద్ధమన్నారు. నాగ్‌పూర్‌లో హెచ్‌ఎంపీవీ కేసులు లేవని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని వెల్లడించారు.


జిగాజెలోని చాంగ్సువోలో బాధితుల కోసం సహాయక సిబ్బంది గాలింపు

టిబెట్‌ను వణికించిన భూకంపం

- రిక్టర్ స్కేలుపై తీవ్రత 6.8గా నమోదు
- 126 మంది మృతి, 188 మందికి గాయాలు

బీజింగ్: చైనాలోని అటానమస్ ప్రాంతం టిబెట్‌లో మంగళవారం ఉదయం తీవ్ర భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.05 గంటల సమయంలో చోటుచేసుకున్న భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.8గా నమోదైంది. దీని తీవ్రత డింగ్రీ కౌంటీలోని జిగాజెపై ఎక్కువగా పడింది. అక్కడ నివాస భవనాలు కూలడం వంటి ఘటనల్లో కనీసం 126 మంది ప్రాణాలు కోల్పోగా మరో 188 మంది క్షతగాత్రులయ్యారు. అయితే, భూకంప తీవ్రత 7.1 వరకు ఉందని అమెరికా జియోలాజికల్ విభాగం అంటోంది. ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ, సహాయక చర్యలను ముమ్మరం చేయాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో, అధికారులు ఆహార పదార్థాలు, మంచినీరుతోపాటు కాటన్ టెంట్లు, కాటన్ కోట్లు, కిల్టులు, బెడ్లు తదితరాలను హుటాహుటిన పంపించారు. జిగాజె ప్రాంతాన్ని షిగస్తె అని కూడా పిలుస్తారు. ఇది భారత్‌తో సరిహద్దులకు సమీపంలోనే ఉంటుంది. టిబెట్‌లోని పవిత్ర నగరాల్లో షిగస్తె ఒకటి. టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామా తర్వాతి స్థానంగా భావించే పంచన్ లామా ఉండేది షిగస్తెలోనే. భూకంప కేంద్రం డింగ్రి కౌంటీలోని త్సొగోలో ఉంది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించిందని అధికారులు తెలిపారు. భూకంప కేంద్రం నేపాల్‌లోని లొబుట్సెకు 90 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. భూ ప్రకంపనల ప్రభావంతో నేపాల్‌లోని కవ్‌రెపలన్‌చౌక్, సింధుపలన్‌చౌక్ ధడింగ్, సొలుకుంభు జిల్లాలతోపాటు రాజధాని కఠ్మాండులోనూ కరెంటు స్తంభాలు, చెట్లు, భవనాలు కదిలాయి. ఇళ్లలో వస్తువులు శబ్దాలు చేస్తూ పడిపోవడంతో జనం భయభ్రాంతులకు గురై వీధుల్లోకి పరుగులు తీశారు.

జాహ్నవి ఉసురు తీసిన
పోలీసుపై వేటు

- సియాటెల్ పోలీస్ వాహనం డ్రైవర్ కెవిన్ డేవ్ తొలగింపు
- రోడ్డు దాటుతుండగా జాహ్నవిని అతి వేగంతో ఢీకొట్టిన కెవిన్
- సరిగ్గా రెండేళ్ల క్రితం ఘటన
- ఘటనపై వెకిలిగా మాట్లాడిన డేనియల్‌పై ఇప్పటికే చర్యలు

సియాటెల్/న్యూయార్క్: అమెరికాలోని సియాటెల్‌లో రెండేళ్ల క్రితం తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవి(23) మృతి ఘటనకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదకరంగా వాహనాన్ని నడిపి జాహ్నవి మృతికి కారణమైన పోలీసు అధికారి కెవిన్ డేవ్‌ను ఉన్నతాధికారులు సోమవారం విధుల నుంచి తొలగించారు. 2023 జనవరి 23వ తేదీన మితిమీరిన వేగంతో దూసుకువచ్చిన పోలీసు వాహనం రోడ్డు దాటుతున్న జాహ్నవిని ఢీకొనడంతో ఆమె 100 అడుగుల దూరం ఎగిరిపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘటనపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాహ్నవిని వాహనం ఢీకొట్టిన విషయం తెలిసి వాహనంలో ఉన్న మరో పోలీసు అధికారి డేనియల్ ఆడెరర్ వెకిలిగా మాట్లాడటంపై సర్వత్రా అభ్యంతరం వ్యక్తమైంది. సంచలనం రేపిన ఈ ఘటనపై విచారణ చేపట్టిన సియాటెల్ పోలీసులు ఇప్పటికే ఉద్యోగం నుంచి తొలగించారు. తాజాగా, ఆ వాహనం నడిపిన కెవిన్‌పై చర్యలు తీసుకున్నారు. ఈ విషయాన్ని సియాటెల్ పోలీస్ విభాగం తాత్కాలిక చీఫ్ స్యూ రహర్ ప్రకటించారు. డ్రగ్ ఓవర్ డోస్ అంటూ అందిన కాల్‌కు స్పందనగా సాధ్యమైనంత త్వరగా సంఘటనా ప్రాంతానికి చేరుకునేందుకు కెవిన్ అతి వేగంతో వాహనం నడిపాడు. 'ఎవరికి హాని కలిగించడం కెవిన్ ఉద్దేశం కాకపోవచ్చు. కానీ, ప్రమాదకరమైన వేగంతో వాహనాన్ని నడిపితే కలిగే విషాదకర పరిణామాలపై ఆయన అప్రమత్తంగా వ్యవహరించలేదు. అందుకే ఒక నిండు ప్రాణం బలైంది'అని స్యూ పేర్కొన్నారు. 'ఎమర్జెన్సీ కాల్‌కు స్పందనగా వెళ్లేటప్పుడు వాహనానికి ఎమర్జెన్సీ లైట్లు వాడాలనే విషయాన్ని, పెట్రోల్ వాహనాన్ని సురక్షితంగా నడపాలన్న కనీస బాధ్యతను ఆయన మరిచారు'అని ఆమె వివరించారు. కందుల జాహ్నవిని ఢీకొట్టిన సమయంలో ఆ వాహనం గంటకు 119 కిలోమీటర్లకు మించి వేగంతో వెళ్తున్నట్లు గుర్తించారు. ఆ సమయంలో వాహనం డ్రైవర్, అందులోని పోలీసు డేనియల్ చేసిన వ్యాఖ్యలు రికార్డయ్యాయి. తాజా చర్యతో కందుల జాహ్నవి కుటుంబానికి న్యాయం జరిగినట్లుగా భావిస్తున్నామని సియాటెల్‌లోని భారత కాన్సులేట్ కార్యాలయం పేర్కొంది.


మంచు తుఫాను కారణంగా సిన్సినాటిలోని ఓ వీధిలో చిక్కుకుపోయిన అమెజాన్ ట్రక్కు

అమెరికాలో 'మంచు' బీభత్సం

- ఐదుగురు మృతి, అంధకారంలో 2 లక్షల మంది
- 2,400 విమానాలు రద్దు

వాషింగ్టన్: తుఫాను కారణంగా తూర్పు అమెరికా అంతటా భారీ మంచు బీభత్సం సృష్టిస్తోంది. ఐదుగురు మృతి చెందారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో లక్షలాది మంది అంధకారంలో ఉండిపోయారు. 2,400కు పైగా విమానాలు రద్దయ్యాయి. వాషింగ్టన్‌లో ఒక అడుగు వరకు మంచు కురిసే అవకాశం ఉందని నేషనల్ వెదర్ సర్వీస్ (ఎన్‌డబ్ల్యూఎస్) అంచనా వేసింది. పరిస్థితులను అధ్యక్షుడు జో బైడెన్ నిశితంగా పరిశీలిస్తున్నారని, ప్రభావిత రాష్ట్రాలకు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని వైట్‌హౌస్ ప్రతినిధి ఒకరు తెలిపారు. అమెరికా రాజధానిలోని ఇళ్లన్నీ మంచులో కూరుకుపోయాయి. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నగరంలోని పాఠశాలలు మూసివేశారు. కాన్సాస్, మిస్సోరి సహా పలు రాష్ట్రాల్లో మంచు తుఫాను పరిస్థితులు నెలకొన్నాయి. తుపాను సంబంధిత ఘటనల్లో ఇప్పటివరకు ఐదుగురు మృతి చెందారు. కెంటకీ, మిస్సోరి, వర్జీనియా, మేరీల్యాండ్ సహా పలు రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. రోడ్లను క్లియర్ చేయడానికి అత్యవసర నిర్వహణ పనులు జరుగుతున్నాయని, ప్రజలు ఇళ్లలోనే ఉండాలని గవర్నర్లు, స్థానిక అధికారులు కోరారు. ఆగ్నేయ రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని, వడగండ్లు, టోర్నడోలు వస్తాయని ఎన్‌డబ్ల్యూఎస్ హెచ్చరించింది. మంచు దట్టంగా పేరుకుపోతుందని, శక్తివంతమైన గాలులతో చెట్లు కూలిపోతాయని, దీర్ఘకాలిక విద్యుత్ అంతరాయం కలిగే అవకాశముందని తెలిపింది.

సుప్రీంకోర్టు జడ్జిగా వినోద్ చంద్రన్

సిఫారసు చేసిన కొలీజియం

న్యూఢిల్లీ: పాట్నా హైకోర్టు చీఫ్ జస్టిస్ కె.వినోద్ చంద్రన్ సుప్రీంకోర్టు జడ్జిగా నియమించాలని మంగళవారం కొలీజియం సిఫారసు చేసింది. కేరళ హైకోర్టులో నవంబరు 8, 2011లో జడ్జిగా నియమితులైన వినోద్ చంద్రన్‌కు సర్వోన్నత న్యాయస్థానానికి పదోన్నతి కల్పించాలని భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కొలీజియం సిఫారసు చేసింది. చంద్రన్ మార్చి 29, 2023న పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయన నియామకానికి కేంద్రం ఆమోదముద్ర వేస్తే సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 33కు చేరనుంది. మంజూరైన పోస్టులు 34 కాగా జస్టిస్ సి.టి.రవికుమార్ ఈ నెల 3న పదవీ విరమణ చేశారు. అఖిల భారత స్థాయిలో హైకోర్టుల జడ్జిల్లో వినోద్ చంద్రన్ 13వ స్థానంలో ఉన్నప్పటికీ.. కేరళ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టులో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆయన్ను కొలీజియం ఎంపిక చేసింది. అలాగే బాంబే హైకోర్టు న్యాయమూర్తి దేవంద్ర కుమార్ ఉపాధ్యాయను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేసింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధేను బాంబే హైకోర్టుకు బదిలీ చేసింది.

'వికసిత్ ఢిల్లీ' స్వప్నాన్ని
సాకారం చేస్తాం: జె.పి.నడ్డా

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ సమగ్రాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జె.పి.నడ్డా పేర్కొన్నారు. ఢిల్లీని ప్రగతి పథంలో ముందుకు నడిపించే బీజేపీని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో నడ్డా మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. అంత్యోదయ అనేది తమ నినాదమని వివరించారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను సమాజంలో చిట్టచివరన ఉన్నవారికి అందించాలన్నదే తమ ఆశయమని ఉద్ఘాటించారు. అభివృద్ధి రాజకీయాలకు ఎన్నికల్లో పట్టం కట్టాలని కోరారు. ప్రజల జీవితాలను మెరుగుపర్చడం, అవినీతిని అంతం చేయడం, కాలుష్యాన్ని నివారించడం, ప్రతి ఒక్కరి జీవనాన్ని సులభతరం చేసేలా నాణ్యమైన సేవలు అందించడం తమ లక్ష్యాలని నడ్డా వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో 'వికసిత్ ఢిల్లీ' స్వప్నాన్ని సాకారం చేస్తామని ఉద్ఘాటించారు.

పోరాడేది ముగ్గురైనా.. పోటీ ఇద్దరి మధ్యే!

ఢిల్లీ ఎన్నికల్లో ఆప్, బీజేపీల మధ్యే ప్రధాన పోటీ

- అస్థిత్వాన్ని కాపాడుకునే పనిలో కాంగ్రెస్
- 2015లో 67, 2020లో 62 స్థానాలతో ఊడ్చేసిన ఆప్

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజకీయాలను ప్రభావితం చేసే ఢిల్లీ ఎన్నికలకు శంఖారావం మోగడంతో మూడు ప్రధాన పార్టీలు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఎన్నికల పోరులో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తలపడుతున్నా ప్రధాన పోటీ మాత్రం ఆప్, కాషాయ పార్టీల మధ్యే ఉండనుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు రెండు నెలల ముందే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి కదనరంగంలోకి కాలుదువ్విన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇప్పటికే ప్రచారపర్వంలో దూసుకుపోతుండగా, పరివర్తన్ యాత్రల పేరిట ప్రచారానికి శ్రీకారం చుట్టిన ప్రధాని నరేంద్ర మోదీ, తన ప్రభావం చూపేందుకు సమాయత్తమయ్యారు. ఇక ప్రచార పర్వంలో కాస్త వెనుకబడ్డ కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటనలో మాత్రం ముందుంది. తన గత వైభావాన్ని పొందే పరిస్థితి లేకున్నా, అస్థిత్వాన్ని నిలుపుకునేందుకు తంటాలు పడుతోంది.

జాతీయ పార్టీలను ఊడ్చేసిన ఆప్..

సామాన్యుడినంటూ 2012లో ఆమ్ ఆద్మీ పార్టీని స్థాపించిన కేజ్రీవాల్ అసమాన్య రీతిలో జాతీయ పార్టీలను తన చీపురుతో ఊడ్చేశారు. 2013లో కాంగ్రెస్ పొత్తుతో ముఖ్యమంత్రి పీఠమెక్కిన కేజ్రీవాల్ జన్ లోక్‌పాల్ బిల్లు విషయంలో తలెత్తిన విభేదాల నేపథ్యంలో ప్రభుత్వంలోంచి దిగిపోయారు. అనంతరం 2015లో జరిగిన ఎన్నికల్లో అసమాన్య రీతితో 70 స్థానాలకు గానూ ఏకంగా తన ఛరిష్మాతో 67 స్థానాలు సాధించిన బీజేపీ, కాంగ్రెస్‌లను మట్టికరిపించారు. ఏకంగా 50 శాతానికి పైగా ఓట్ల శాతాన్ని పొందిన ఆప్, ఆ తర్వాత 2020లోనూ రెండు పార్టీలకు చుక్కలు చూపించింది. 2020 ఎన్నికల్లో ఆప్ ఏకంగా 53.57% ఓట్లతో 62 స్థానాలు సాధించింది. 38.51% ఓట్లు సాధించిన బీజేపీ కేవలం 8 స్థానాలకు మాత్రమే పరిమితం కాగా... షీలాదీక్షిత్ హయాంలో వరుసగా 15 ఏళ్ళపాటు అధికార హవాను కొనసాగించిన కాంగ్రెస్ పార్టీ కేవలం 4.26% ఓట్లకు పడిపోయి కనీసం ఖాతా కూడా తెరవలేదు. కాగా ప్రస్తుత ఎన్నికల్లోనూ అదే హవాను కొనసాగించే వ్యూహంతో... ఎన్నికలకు నాలుగు నెలల ముందే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ప్రచారాన్ని ప్రారంభించిన కేజ్రీవాల్ మరోమారు జాతీయపార్టీలకు సవాల్ విసురుతున్నారు.

మళ్లీ కొత్త పంథాలో ఆమ్ ఆద్మీ

ప్రస్తుత ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ తన ఏకఛత్రాధిపత్యాన్ని నిరూపించుకొనేందుకు సిద్ధమైన ఆమ్ ఆద్మీ పార్టీ కొత్త పంథాలో దూసుకెళ్తోంది. లిక్కర్ స్కాం ఆరోపణల నేపథ్యంలో అప్రతిష్టపాలైన కేజ్రీవాల్ ఆరు నెలల జైలు జీవితం గడిపిన తర్వాత ఏకంగా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆప్ అధినేతగా ప్రచార బాధ్యతలను భుజస్కంధాలపై ఎత్తుకున్న కేజ్రీవాల్... పార్టీని ముందుండి నడిపిస్తున్నారు. విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్ పథకాలతో ప్రజలకు చేరువైన ఆయన కొత్త తరహా హామీలతో ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ఆటో డ్రైవర్లకు రూ.5 లక్షలకు బీమా, ఆటో డ్రైవర్ల కుమార్తెల వివాహాలకు రూ.1 లక్ష సహాయం, మహిళా సమ్మాన్ యోజనలో భాగంగా మహిళలకు నెలకు రూ.2,100 ప్రత్యేక సహాయం, ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వృద్ధులందరికీ ఉచిత వైద్యం, హిందు, సిక్కు పూజారులకు నెలకు రూ.18 వేలు సహాయం, విదేశీ విద్యను అభ్యసించే దళిత విద్యార్థుల పూర్తి ఖర్చులను భరించేటువంటి హామీలను ఇచ్చారు. వీటితో పాటు అక్రమంగా పెంచిన నీటి బిల్లులను అధికారంలోకి రాగానే మాఫీ చేస్తామని ప్రకటించారు. ఆప్ హామీల ప్రకటన ప్రభావం ఎలా ఉన్నప్పటికీ కైలాష్ గెహ్లోత్ రాజీనామా, సీఎం అధికార నివాసం శీష్ మహల్‌పై రగులుతున్న వివాదం ఆమ్ ఆద్మీ పార్టీని ఇక్కట్లకు గురిచేస్తోంది. అంతేగాక ఆప్ అధినేతకు పోటీగా ఇద్దరు మాజీ ముఖ్యమంత్రుల కుమారులు బరిలో దిగారు. షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్‌తో పాటు బీజేపీ నేత పర్వేష్ వర్మను ఎదుర్కోవడం కేజ్రీవాల్‌కు సవాలుగా మారింది.

పీఠం దక్కించుకోవాలన్న కాంక్షతో కమలం

ఆమ్ ఆద్మీ పార్టీని అప్రతిష్టపాలు చేసి అధికార పీఠాన్ని దక్కించుకొనేందుకు బీజేపీ ప్రణాళికలను అమలు చేస్తోంది. లిక్కర్ స్కాం విషయంలో ఆమ్ ఆద్మీ పార్టీని బజారుకీడ్చడంలో సక్సెస్ సాధించింది. ఈ నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 8 స్థానాలకే పరిమితం అయిన బీజేపీ... లోక్‌సభ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసింది. ఆప్, కాంగ్రెస్‌లు కలిసి పోటీచేసినప్పటికీ బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో 54.35% ఓట్లను రాబట్టుకుంది. ఇదే పంథాను కొనసాగించాలన్న బలమైన లక్ష్యంతో ఉన్న బీజేపీ... యమునా కాలుష్యం, శీష్ మహల్‌లో విలాస జీవితం, లిక్కర్ స్కాం వంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఆప్‌ను ఇరుకునపెడుతోంది. సామాన్యుడు అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్... అవినీతి సొమ్ముతో అద్దాల మేడలో విలాసంగా జీవించారంటూ బీజేపీ ప్రముఖంగా విమర్శిస్తోంది. ఈ నెల 3, 5 తేదీల్లో పరివర్తన యాత్రలో భాగంగా ఢిల్లీలో ఎన్నికల ప్రచారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ శీష్ మహల్ కేంద్రంగానే కేజ్రీవాల్‌పై విమర్శలు గుప్పించారు. పార్టీ సీనియర్ నేతలు మనోజ్ తివారీ, బాన్సురీ స్వరాజ్, ప్రదీప్ ఖండేల్వాల్, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా వంటి నేతలు బీజేపీ గెలుపు కోసం పరిశ్రమిస్తున్నారు.

ఒంటరి పోరులో కాంగ్రెస్

1998 నుంచి 2013 వరకు వరుసగా 15 ఏళ్లపాటు ఢిల్లీని పాలించిన కాంగ్రెస్ ప్రస్తుత ఎన్నికల్లో పరువు నిలుపుకొనేందుకు పోటీ పడుతోంది. గత రెండు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కనీస ఖాతా తెరవలేకపోయిన కాంగ్రెస్ , అస్తిత్వాన్ని చాటుకునేందుకు కష్టపడుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఆప్‌తో కలిసి పోరాడి 18.19% ఓట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ... ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరు చేయనుంది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పెరిగిన ఓట్ల శాతంతో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న అంశాన్ని పార్టీ బలంగా విశ్వసిస్తోంది. ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ దేవేందర్ యాదవ్, అల్కా లాంబ, అజయ్ మాకెన్, సందీప్ దీక్షిత్ వంటి పార్టీ సీనియర్ నేతలు ఆప్‌కు పోటీగా ఎన్నికల హామీలు గుప్పిస్తున్నారు.

సాక్షి
హైదరాబాద్
బుధవారం ౹ 8 ౹ జనవరి ౹ 2025



బతుకమ్మ కుంటపై కీలక తీర్పు

అంబర్‌పేట పరిధిలోని బతుకమ్మ కుంట విషయంలో మంగళవారం హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఆ స్థలాన్ని బతుకమ్మ కుంటగానే గుర్తిస్తూ తుది తీర్పు వెలువరించింది. -8లో



విహంగం.. వీక్షణం..

బైనాక్యులర్స్, కెమెరాలతో బర్డ్ లవర్స్ సిద్ధమవుతున్నారు. ఆకాశానికి ఎక్కుపెట్టిన చూపులతో విహంగాలను తీక్షణంగా వీక్షించనున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
30.0/16.0

వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

లేడీస్ డే.. సందడే..





నుమాయిష్‌లో మహిళలు సందడి చేశారు. మంగళవారం లేడీస్ డే వేడుకలు జోరుగా నిర్వహించారు. దాదాపు 10 వేల మంది మహిళలు ఎగ్జిబిషన్‌ను సందర్శించినట్లు అంచనా. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. లేడీస్ డే కార్యక్రమానికి రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా హాజరై ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే బాలికల్లో ధైర్య సాహసాలు నింపేలా తల్లిదండ్రులు, విద్యా సంస్థలు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, డి.సంధ్య, ఎస్.సుచరిత, నీతా మిశ్రా, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు. - అబిడ్స్

సెప్టెంబర్‌లో అల్వాల్ టిమ్స్ ఆస్పత్రి ప్రారంభం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీ గణేష్ తదితరులు

కంటోన్మెంట్: వచ్చే సెప్టెంబర్ వరకు అల్వాల్ టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తో కలిసి అల్వాల్‌లో నిర్మాణంలో ఉన్న భవనాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కోడ్ కారణంగా నిర్మాణంలో కొంత జాప్యం ఏర్పడిందన్నారు. అయినా ప్రస్తుతానికి 90% నిర్మాణం పూర్తయిందన్నారు. అల్వాల్ పెన్ ఆవరణలోనూ ధర్మశాల నిర్మాణం చేపట్టాల్సిందిగా అధికారులకు సూచించినట్లు చెప్పారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తేవాలని లక్ష్యంతోనే టిమ్స్ ఆస్పత్రులను నిర్మిస్తున్నామన్నారు. ఉస్మానియా ఆస్పత్రి మూతపడగా గాంధీ ఆసుపత్రిలో రోగుల తాకిడి ఎక్కువైందన్నారు. మూడు టిమ్స్ ఆస్పత్రులు అందుబాటులోకి వస్తే ప్రజలకు వెసులుబాటు కలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తోందని మంత్రి తెలిపారు. ఈ క్రమంలోనే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచామన్నారు. ప్రతిరోజూ వందలాది మందికి సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఓసీ కింద లక్షల రూపాయలు విడుదల చేస్తున్నామన్నారు. ఏడాదిలోనే ఆరోగ్యశ్రీకి రూ.1,600 కోట్లు చెల్లించినట్లు కోమటిరెడ్డి తెలిపారు. అల్వాల్ టిమ్స్ నిర్మాణం పూర్తయితే ఉత్తర తెలంగాణ తో పాటు కంటోన్మెంట్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు.

10 నుంచి రంగనాథస్వామి దర్శనం



బ్రోచర్ విడుదల చేస్తున్న అర్చకులు తదితరులు

జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి దేవస్థానంలో ఈ నెల 10 నుంచి వైకుంఠ ముక్కోటి ద్వార దర్శనం కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ట్రస్టీ ఛైర్మన్ ఎస్‌టీ చారి, ప్రతినిధి శేషాచారిలు తెలిపారు. మంగళవారం ఆలయంలో వేడుకల బ్రోచర్‌ను కార్పొరేటర్లు బోయిని దర్శన్, శంకర్ యాదవ్, లాల్ సింగ్, కుల్సుంపురా ఏసీపీ మునావర్‌లతో కలిసి విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ నెల 10 నుంచి 15 వరకు వేడుకలు కొనసాగుతాయన్నారు. 13న గోదా రంగనాథ స్వామి కల్యాణం, 14న నమ్మాళ్వార్ పరమపదోత్సవం, 15న గోదా అమ్మవారి కరినోము ఉత్సవం, ధనుర్మాస సమాప్తి ఉంటుదన్నారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాస రంగనాథ చార్యులు, మాజీ కార్పొరేటర్లు ముకేష్ సింగ్, పరమేశ్వరి సింగ్, జీవన్, ఇన్‌స్పెక్టర్ సునీల్ సింగ్, బొట్టు రామ్, డీవీఎస్ రాజు, లక్ష్మీనారాయణ, బద్రినాథ్, ఆల పురుషోత్తమ్, వినోద్ చౌగ్లే, నరహరి చారి, సందీప్‌లాల్ పాల్గొన్నారు.

'గాంధీ'లో హెచ్‌ఎంపీవీ ఐసోలేషన్ వార్డుల ఏర్పాటు



గాంధీఆస్పత్రి: హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) దేశంలోకి ప్రవేశించడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కోవిడ్ నోడల్ సెంటరైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో హెచ్‌ఎంపీవీ వార్డులను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి నేతృత్వంలో సంబంధిత విభాగాధికారులు, ఆస్పత్రి పాలనాధికారులతో మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆస్పత్రి ప్రధాన భవనంలో కొనసాగుతున్న జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్ విభాగాల్లో 40 పడకలతో హెచ్‌ఎంపీవీ ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేశారు. పురుషులకు 5 బెడ్లు, మహిళలకు 15 బెడ్లు కేటాయించారు. చిన్నారుల కోసం 20 వెంటిలేటర్ పడకలు అందుబాటులోకి తెచ్చారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి ఆధ్వర్యంలో జరిగిన అత్యవసర సమావేశంలో, డిప్యూటీ సూపరిండెంటెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, జనరల్ మెడిసిన్, ఫల్మనాలజీ, పీడియాట్రిక్ హెచ్‌ఓడీలు ప్రొఫెసర్ సునీల్ కుమార్, కృష్ణమూర్తి, వాసుదేవ్, ఆర్‌ఎంఓ-1 శేషాద్రి, మైక్రోబయోలజీ ఇంఛార్జి డాక్టర్ పూజ, ఆర్‌ఎంఓ శాంతరాణిలు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ.. పోలీసుల పోటీ!

ఫోర్త్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం ముందడుగు

శివారు జోన్, డివిజన్ పోస్టులకు డిమాండ్

- మహేశ్వరం, యాదాద్రి- భువనగిరి, శంషాబాద్‌లకు ప్రాధాన్యం
- వికారాబాద్, మెదక్ పోస్టులకూ పైరవీలు ముమ్మరం
- నేతల చుట్టూ ఆశావహుల చక్కర్లు

సాక్షి, సిటీబ్యూరో: పోలీసు వర్గాల్లో ప్రస్తుతం 'ఫోర్త్ సిటీ' హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో.. శివారు ప్రాంతాల్లోని జోన్, డివిజన్ పోలీసు పోస్టులకు డిమాండ్ విపరీతంగా ఏర్పడింది. ఫోర్త్ సిటీ ప్రతిపాదనతో శివార్లలో రియల్ ఎస్టేట్ బూమ్ ఊపందుకోవడంతో ఇదే అదనుగా పలువురు పోలీసు ఉన్నతాధికారులు వారి 'ఫ్యూచర్'ను చక్కదిద్దుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టారు. త్వరలోనే ఖాకీల బదిలీలు జరగనున్న నేపథ్యంలో ఆశావహులు ప్రభుత్వంలోని ప్రముఖులను, నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ఖాకీలు, బిల్డర్లు.. చెట్టాపట్టాల్..

- హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరం 'ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. యువత అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా ఆధునిక టెక్నాలజీ హబ్‌గా ఫోర్త్ సిటీని నిర్మించాలని సంకల్పించారు. ఈ క్రమంలోనే నాలుగో నగరంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రానిక్ సిటీ, మెడికల్ టూరిజం, స్పోర్ట్స్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాలకు ప్రాతినిధ్యమిస్తున్నారు.
- రంగారెడ్డి జిల్లాలోని బేగరికంచె, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల ప్రాంతాలలో రానున్న ఫోర్త్ సిటీ కోసం ప్రభుత్వం ఇప్పటికే 13,973 ఎకరాల భూమిని సేకరించింది. మరో 15 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ చేయనుంది. స్థిరాస్తి నిపుణులు అంచనా ప్రకారం ఫోర్త్ సిటీ ప్రతిపాదన తర్వాత ఆయా ప్రాంతాలలో భూముల ధరలు 30- 40 శాతం మేర పెరిగాయి.
- ముచ్చర్ల, దాసర్లపల్లి, కడ్తాల్, నేదునూర్, కందుకూరు, మీర్‌ఖాన్‌పేట, తుమ్మలూరు, మహేశ్వరం, గూడూరు, పంజగూడ, నాగిరెడ్డిగూడ, మక్త మాదారం, ఆమన్‌గల్, యాచారం ప్రాంతాల్లోని భూములకు డిమాండ్ పెరిగింది. రియల్టర్లతో పోలీసులు సత్సంబంధాలు కొనసాగిస్తారనే అభిప్రాయం ఉంది. దీంతో తమ అనుయాయులు పోస్టింగ్‌ల్లో ఉంటే స్థిరాస్తి క్రయ విక్రయాలు, తగాదాలలో ఇబ్బందులు తలెత్తవని పలువురు బిల్డర్లు భావిస్తున్నారు.



జోన్, డివిజన్ పోస్టులకు పైరవీలు..

మహేశ్వరం మండలంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం ముందడుగు వేయడంతో.. శివారు ప్రాంతాల్లోని జోన్, డివిజన్ పోలీసు పోస్టులకు డిమాండ్ ఏర్పడింది. మహేశ్వరం, యాదాద్రి- భువనగిరి, శంషాబాద్ డీసీపీలతో పాటు మెదక్, వికారాబాద్ ఎస్పీ పోస్టింగ్‌లకు ప్రాధాన్యం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా ప్రాంతాలకు కొత్త పోలీసు బాస్‌లను నియమించినప్పటికీ.. ఏడాది కాలం పూర్తవడంతో బదిలీ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. దీంతో ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాకుండా.. మహేశ్వరం జోన్ పరిధిలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం డివిజన్లతో పాటు ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) పోస్టులకు పైరవీలు తుది దశకు చేరుకున్నాయి.

ఫ్యూచర్‌కు డైనమిక్ ఐఏఎస్..

ఫోర్త్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వ ప్రణాళికలు, భారీ ప్రాజెక్టును పర్యవేక్షించడానికి సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇంధనం, రెవెన్యూ శాఖల్లోని పలువురు డైనమిక్ ఐఏఎస్‌లను నాలుగో నగరి బాధ్యతలు అప్పగించేందుకు త్వరలోనే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, సమన్వయం, పర్యవేక్షణ, భద్రత, నిర్వహణ కోసం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) ఏర్పాటు చేయనున్నారు. నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్), గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహాలో అంతర్జాతీయ స్థాయిలో ఈ అథారిటీ కార్యాచరణ, విధి విధానాలు ఉండనున్నాయి.

ప్రభుత్వం పేదల పక్షమే

హైడ్రా కమిషనర్ రంగనాథ్

- ఎమ్మెల్యే దానంతో కలిసి గురుబ్రహ్మానగర్ బస్తీలో పర్యటన



గురుబ్రహ్మానగర్ బస్తీలో ఎమ్మెల్యే దానం నాగేందర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్

బంజారాహిల్స్: ప్రభుత్వం పేద ప్రజల పక్షానే ఉంటుందని, వారి ఆకాంక్షలకు అనుగుణంగానే పని చేస్తుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. మంగళవారం ఆయన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ కాలనీని ఆనుకొని ఉన్న గురుబ్రహ్మానగర్ బస్తీలో పర్యటించారు. హైడ్రా ఏర్పాటైన తొలినాళ్లలో ఇక్కడ పార్కు ప్రహరీ నిర్మాణం ఘటన వివాదానికి కారణమైన సంగతి తెలిసిందే. నాటి ఘటనలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు బస్తీవాసులపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ పర్యటన స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది. ఈ సందర్భంగా కమిషనర్ ఎమ్మెల్యేతో కలిసి బస్తీ మొత్తం కలియతిరిగారు. చుట్టూ జరుగుతున్న కబ్జాలతో పాటు బస్తీవాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. 2011లోనే ఇక్కడి బస్తీకి ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు ఉన్నట్లు తాము గుర్తించామన్నారు. బస్తీకి మొత్తంగా ఒక ఎకరా 25 గుంటల స్థలం ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయని, త్వరలోనే ఇక్కడ క్షేత్రస్థాయిలో డీజీపీఏ సర్వే చేయిస్తామని తెలిపారు. ఆ తర్వాత పక్కన పార్కు స్థలం గురించి ఆలోచిస్తామన్నారు. బస్తీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా వారికి అనుకూలంగా పార్కును అభివృద్ధి చేసే పనులు చేపడతామని తెలిపారు. కొన్ని చోట్ల కాలనీవాసులు పార్కును అడ్డం పెట్టుకొని కబ్జాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని త్వరలోనే వాటిపై విచారణ చేస్తామని అన్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, కాలనీ లే అవుట్‌లకు చాలా తేడాలున్నాయని, త్వరలోనే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి పేదల బస్తీకి న్యాయం చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ.. అధికారులకు, ప్రజాప్రతినిధులకు సంబంధం లేకుండా కాలనీ అసోసియేషన్ వారు సీఎస్ఆర్ కింద పార్కును అభివృద్ధి చేస్తామంటూ బస్తీవాసులను ఇబ్బందులకు గురి చేశారని.. అందుకే ఆ రోజు బస్తీవాసులు ప్రహరీ నిర్మాణంపై తిరగబడ్డారని చెప్పారు. కార్యక్రమంలో హైడ్రా అదనపు డైరెక్టర్ పాపయ్య, షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గల్లీ చిన్నది.. గరీబోళ్ల కథ పెద్దది!

'ఎట్ల బతుకుతున్నరయ్యా ఈ బస్తీలో.. సరిగా నడవడానికి సైతం బాటల్లేవు.. నిలబడే జాగా లేదు.. ఇరుకు సందులు.. మురికి కూపాలు' అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. మంగళవారం ఆయన జూబ్లీహిల్స్‌లోని గురుబ్రహ్మానగర్ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా గుడిసెల మధ్య ఉన్న మురికి కాల్వల మీదుగా.. ఇరుకు సందుల నుంచి బయటకి వస్తూ.. 'ఇదేం సందయ్యా.. నేనంటే సన్నగా ఉన్నాను కాబట్టి ఇందులో నుంచి రాగలిగాను. అదే కొంచెం దొడ్డుగా ఉన్నోడి పరిస్థితి ఏంది? అసలు ఇక్కడ ఎలా ఉండగలుగుతున్నారయ్యా' అంటూ బస్తీవాసుల పరిస్థితిని చూసి ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. 'గల్లీ చిన్నది.. గరీబోళ్ల కథ పెద్దది.. అనే పాట విన్నదే కానీ ఇప్పుడు నాకు ప్రత్యక్షంగా కనిపించింది' అంటూ ముందుకు సాగారు.



ఇరుకు సందులోంచి అతి కష్టంగా బయటికి వస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్



గాంధీ భవన్ వద్ద..



ఉత్కంఠ.. ఉద్రిక్తత

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై ఢిల్లీలో ఇటీవల బీజేపీ ఎంపీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం నగరంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ చేపట్టిన బీజేపీ కార్యాలయ ముట్టడి యత్నం ఆ రెండు పార్టీల మధ్య అగ్గి రాజేసింది. అనంతరం గాంధీభవన్ వద్ద బీజేపీ చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బీజేవైఎం, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. ఇరు పార్టీల పరస్పర దాడులతో యుద్ధ వాతావరణం నెలకొంది. పలువురు ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారీగా పోలీసు బలగాలు మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి.



బీజేపీ కార్యాలయం వద్ద..

చర్లపల్లిలో గ్రాండ్ ఇండస్ట్రియల్ కాన్‌క్లేవ్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీఎన్‌ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజన షా తదితరులు

కుషాయిగూడ: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) ప్రపంచంలోనే అతి పెద్ద సామాజిక భద్రత సంస్థగా పేరుగాంచిందని హైదరాబాద్ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ జె. శ్రీనివాస్ అన్నారు. బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) గ్రాండ్ ఆధ్వర్యంలో మంగళవారం చర్లపల్లి పారిశ్రామిక వాడలోని సీఐఏ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన గ్రాండ్ ఇండస్ట్రియల్ కాన్క్లేవ్‌ను ఈఎస్‌ఐసీ డిప్యూటీ డైరెక్టర్ మహేష్ నారాల, బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజన షాలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈపీఎఫ్‌ఓలో 8 లక్షల మంది క్రియాశీల సభ్యులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. నిధి రూ.25 లక్షల కోట్లు ఉంటుందని, తెలంగాణ ప్రభుత్వ బడ్జెట్ కంటే పదింతలు ఎక్కువన్నారు. ఈపీఎఫ్ నిధికి వచ్చే వడ్డీతో రాష్ట్రాన్ని నడిపించవచ్చన్నారు. బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజన షా మాట్లాడుతూ.. చర్లపల్లి పారిశ్రామికవాడలో అద్భుతమైన సదుపాయాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే మరింత సులభతరంగా వ్యాపారాలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఐలా చైర్మన్ రోషిరెడ్డి, సీఐఏ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి, సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, బీఎన్ఐ అధ్యక్షుడు వంశీకృష్ణ, సెక్రటరీ ప్రశాంత్ గార్లపాటి, రఘువీర్, కెప్టెన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రసూల్‌పురా ఫ్లై ఓవర్ డిజైన్.. మారున్..

భూసేకరణ తగ్గించేందుకు..

- కొత్త డిజైన్ల కోసం టెండర్లు

సాక్షి, సిటీబ్యూరో: హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పథకం కింద ఫ్లై ఓవర్లు, రహదారులు తదితర పనులకు ప్రభుత్వం రూ.7 వేల కోట్లకు పైగా పరిపాలన అనుమతులు మంజూరు చేయడంతో పనులు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధమవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లోని క్షేత్రస్థాయి పరిస్థితుల దృష్ట్యా ఇప్పటికే రూపొందించిన డిజైన్లను మార్చాలని భావిస్తున్నారు. అలా.. ఆల్విన్ జంక్షన్, జేఎన్‌టీయూ జంక్షన్ల వద్ద డిజైన్ల మార్పునకు ఇప్పటికే కన్సల్టెంట్లను ఆహ్వానించిన అధికారులు తాజాగా రసూల్‌పురా ఫ్లై ఓవర్/అండర్‌పాస్ డిజైన్లను కూడా మార్చేందుకు సిద్ధమయ్యారు.



ప్రత్యామ్నాయ డిజైన్ అవసరం..

మెట్రో రెండోదశ దృష్టిలో ఉంచుకొని ఆల్విన్, జేఎన్‌టీయూ జంక్షన్ల వద్ద డిజైన్ల మార్పుకు సిద్ధమైన అధికారులు బేగంపేట సమీపంలోని రసూల్‌పురా ఫ్లై ఓవర్ /అండర్‌పాస్ నిర్మాణానికి డిఫెన్స్ భూములు సేకరించాల్సి ఉందన్నారు. ఎక్కువ భూ ములు ఇచ్చేందుకు సంబంధిత అధికారులు సుముఖంగా లేకపోవడంతో భూసేకరణ వీలైనంత తగ్గించేందుకు కొత్త డిజైన్ల కోసం కన్సల్టెంట్లను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఈ టెండరు పొందే కన్సల్టెంట్స్ ఇప్పటికే ఉన్న డిజైన్‌ను పరిశీలించి, ప్రత్యా మ్నాయ డిజైన్‌ను రూపొందించాల్సి ఉంటుంది.

రూ.105 కోట్లు మంజూరు..

- ఈ ఫ్లై ఓవర్/అండర్‌పాస్ పనులకు ప్రభుత్వం రూ. 105 కోట్లు మంజూరు చేయడంతో పని ప్రారంభించేందుకు పరిస్థితుల్ని అధ్యయనం చేసిన అధికారులు ప్రత్యామ్నాయ డిజైన్‌తో ప్రాజెక్ట్ ప్రిపరేషన్ రిపోర్ట్ కోసం (పీపీఆర్) కన్సల్టెంట్లను ఆహ్వానించారు. తక్కువ భూసేకరణతో పాటు ప్రజల భద్రత, సేవల పెంపుదల కొత్త డిజైన్ ప్రధాన లక్ష్యం. సేకరించాల్సిన ఆస్తుల సరిహద్దులతోపాటు యుటిలిటీస్ షిఫ్టింగ్ వంటి అంశాలను కూడా బేరీజు వేసి, ఉన్న డిజైన్ కంటే మెరుగైన డిజైన్ రూపొందించాల్సి ఉంటుంది.
- సమీప ప్రాంతాల్లో ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు, మెట్రో రైలు, బీఆర్‌టీఎస్, సీటీఎస్ మాస్టర్‌ప్లాన్‌లను కూడా దృష్టిలో ఉంచుకోవడంతో పాటు ప్రాజెక్టు వ్యయం తగ్గేందుకు కూడా తగిన మార్గాలుంటే సూచించాలి. ఇంకా, మేజర్ జంక్షన్లు, బాటిల్‌నెక్స్, ప్రార్థనా మందిరాలు, శ్మశాన వాటికల వంటి వాటిని దృష్టిలో ఉంచుకోవాలి. రాబోయే ఇరవయ్యేళ్ల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ఫ్రీగా ప్రయాణం సజావుగా సాగేందుకు శాశ్వత పరిష్కారంగా కొత్త డిజైన్ ప్లాన్ ఉండాలి.

నగరవాసికి గ్లోబల్ ఐకానిక్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్ న్యూఢిల్లీ జనపథ్ వేదికగా అంబేద్కర్ ఆడిటోరియంలో ప్రతిష్టాత్మక 'మహారాజా అగ్రసేన్ గ్లోబల్ ఐకానిక్ అవార్డు-25'ను అందుకున్నారు. జాతీయ స్థాయిలో పబ్లిక్ రిలేషన్స్, సోషల్ సర్వీసెస్ విభాగాల్లో డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సమక్షంలో అవార్డు అందించారు.

9న 'ఫాస్'-అక్కినేని సెంటినరీ ఫిలిం అవార్డుల ప్రదానం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మారావు, రేలంగి నరసింహారావు

చిక్కడపల్లి: ఫిలిం ఎనలిటికల్ అండ్ అప్రిసియేషన్ సొసైటీ (ఫాస్) 27వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 9న ఫిలించాంబర్‌లో 'ఫాస్'-అక్కినేని సెంటినరీ ఫిలిం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు రత్న ధర్మారావు, సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం రాత్రి చిక్కడపల్లిలో వారు ఆవిష్కరించారు. అక్కినేని సినీ జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రఖ్యాత సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు, నాలుగు దశాబ్దాల సినీ జీవిత అవార్డులను నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, నటి కవిత తదితరులకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా బాబూ మోహన్, ప్రముఖ నిర్మాత సి.కల్యాణ్, తెలుగు సినీ నిర్మాతల మండలి కార్యదర్శి కె.దామోదర్ ప్రసాద్, కార్యదర్శి టి.ప్రసన్న కుమార్ తదితరులు హాజరవుతారని వివరించారు.

బతుకమ్మ కుంటపై హైకోర్టు కీలక తీర్పు

- ఎడ్ల సుధాకర్‌రెడ్డి పిటిషన్ డిస్మిస్
- సుందరీకరణకు హైడ్రాకు లైన్ క్లియర్



అధికారులను సన్మానించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

నల్లకుంట: అంబర్‌పేట పరిధిలోని బతుకమ్మకుంట విషయంలో మంగళవారం హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ వివాదంపై వాదోపవాదనలు విన్న హైకోర్టు.. ఎడ్ల సుధాకర్ రెడ్డి బతుకమ్మకుంట స్థలం తనదేనంటూ వేసిన పిటిషన్‌ను కొట్టి వేసింది. ఆ స్థలాన్ని బతుకమ్మ కుంటగానే గుర్తిస్తూ తుది తీర్పునిచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే..బతుకమ్మ కుంటను పునరుద్ధరించాలని కోరుతూ మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు హైడ్రాను సంప్రదించడంతో పాటు అందుకు సంబంధించిన పత్రాలను కూడా అందజేశారు. ఈ మేరకు చెరువుల పునరుద్ధరణలో భాగంగా గతేడాది నవంబర్ 13వ తేదీన హైడ్రా కమిషనర్ రంగనాథ్ అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను సందర్శించారు. ఈ కుంటను సుందరీకరించేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి బతుకమ్మ కుంట స్థలం తనదంటూ నవంబర్ 14న హైకోర్టును ఆశ్రయించగా కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. ఆ తర్వాత హైడ్రా, రెవిన్యూ, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులు సర్వే నంబర్ 563లో ఉన్న భూ రికార్డులను పరిశీలించి కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భాస్కరరెడ్డి.. పిటిషనర్ ఎడ్ల సుధాకర్‌రెడ్డికి ఈ భూమిపై ఎలాంటి హక్కు లేదంటూ తీర్పునిచ్చారు. హైకోర్టు తీర్పు పట్ల హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైడ్రా ద్వారా బతుకమ్మకుంటకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. 1962-63 లెక్కల ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతకమ్మకుంట ఉండేది. బఫర్ జోన్‌లో కలిపి మొత్తం 16.13 ఎకరాల విస్తీర్ణం ఉంటుందని సర్వే అధికారులు తేల్చారు. తాజా సర్వే ప్రకారం అక్కడ మిగిలిన భూమి 5.13 ఎకరాల విస్తీర్ణమని తేలింది. ప్రస్తుతం ఉన్న 5.13 ఎకరాల విస్తీర్ణంలోనే బతుకమ్మ కుంటను పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు చేపట్టనుందని చెప్పారు. ప్రస్తుతం అక్కడ నివాసముంటున్న వారికి ఎలాంటి ముప్పు లేకుండా చెరువు తవ్వకాలకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఒకప్పటి ఎర్రకుంటనే బతుకమ్మకుంటగా మారిందని స్థానికులు, రెవెన్యూ రికార్డులు కూడా చెబుతున్నాయి. కాగా బతుకమ్మ కుంట సుందరీకరణ పూర్తయితే చెరువు నీటితో కళకళలాడి..పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణ ఏర్పడనుంది.

అధికారులకు సన్మానం

బతుకమ్మకుంటపై ప్రభుత్వం తరఫున సంబంధిత పత్రాలను కోర్టుకు సమర్పించి.. కోర్టు నుంచి అనుకూలంగా తీర్పు రావడంలో కృషి చేసిన హైడ్రా లీగల్ బృందం, రెవెన్యూ ఉద్యోగులను మంగళవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్ సన్మానించారు. హైడ్రా స్టాండింగ్ కౌన్సిల్ కె.రవీందర్‌రెడ్డి, సీహెచ్.జయకృష్ణ, హైడ్రా న్యాయ సలహాదారు శ్రీనివాస్, హైడ్రా లీగల్ విభాగం లైజనింగ్ అధికారి డి.మోహన్, హైడ్రా డిప్యూటీ కలెక్టర్ ఎల్.సుధ, తహసీల్దార్లు ఎం.హైమమాలిని, పి.విజయ్ కుమార్, అంబర్‌పేట తహశీల్దార్ వీరాబాయి. సర్వేయర్ కిరణ్ తదితరులు సన్మానం అందుకున్నారు.

నిందితులు ఎంతటివారైనా
వదిలే ప్రసక్తే లేదు

- పథకం ప్రకారమే నాగమణి హత్య
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య



నాగమణి భర్త శ్రీకాంత్‌తో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

ఇబ్రహీంపట్నం: కుట్రపూరిత పథకం ప్రకారమే కానిస్టేబుల్ నాగమణిని దారుణంగా హతమార్చారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆరోపించారు. రాయపోల్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ నాగమణి కులాంతర వివాహం చేసుకుందన్న కక్షతో గత నెల 2న దారికాచి సొంత తమ్ముడే హత్యచేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య మంగళవారం రాయపోల్ గ్రామానికి చేరుకుని నాగమణి భర్త శ్రీకాంత్, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత సోదరుడే నాగమణిని హత్య చేయడం బాధాకరమని అన్నారు. హత్య కేసుతో సంబంధం ఉన్న వారు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులను రెండు రోజుల్లో అరెస్టు చేయాలని రాచకొండ సీపీని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి భూమి, ఇల్లు ఇచ్చి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, తహసీల్దార్ సునీతరెడ్డి తదితరులు ఉన్నారు.

మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి ద్వారా మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు అందించనున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద నిరాశ్రయులు, వితంతువు, విడాకులు తీసుకున్న మహిళలు అనాథ, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. తెల్ల రేషన్‌కార్డు, ఆహార భద్రత కార్డు రెండు లేకపోతే గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షలు ఆదాయం మించకూడదన్నారు. వయస్సు 21 నుంచి 55 సంవత్సరాలు మించరాదన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా ప్రభుత్వ గుర్తింపుపొందిన సంస్థ ద్వారా నేర్చుకున్న టైలరింగ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. కనీసం 5వ తరగతి విద్యార్హత కలిగి ఉండలన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు మైనార్టీ క్రిస్టియన్ మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దళితులపై వివక్షను అరికట్టాలి



సభలో మాట్లాడుతున్న సయ్యద్ అజీజ్ పాషా

ఖైరతాబాద్: స్వాతంత్య్రం సిద్ధించి 78 ఏళ్లు గడుస్తున్నా దళితులు ఇప్పటికీ వివక్షకు గురికావడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఎఐఆర్‌డీఎం) 2వ జాతీయ మహాసభల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంటరానితనం నిర్మూలన, అత్యాచారాల నిరోధక చట్టం లాంటి అనేక చట్టాలు వచ్చినప్పటికీ దేశ వ్యాప్తంగా దళితులపై ఇంకా దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. దళితులు, ఆదివాసీలు, బీసీలు కులాల వారిగా విడిపోయి ఐక్యతను కోల్పోవడం వల్లే వారిపై వివక్ష, దాడులు కొనసాగుతున్నాయన్నారు. ఎఐడీఆర్‌ఎం జాతీయ మహాసభల స్ఫూర్తితో దళితుల హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎఐడీఆర్‌ఎం జాతీయ అధ్యక్షులు ఎ.రాంమ్మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎఐడీఆర్‌ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.నిర్మల్ కుమార్, జాతీయ నాయకులు ఎం.బాలనరసింహ, కె.ఏసురత్నం, మరుపాక అనిల్ కుమార్, దేవీ కుమారి, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లిది ప్రాణం కాదా..

- అల్లారుముద్దుగా పెంచుకున్నాం..
- తినడం లేదని ఆస్పత్రికి తెస్తే చంపేశారు
- వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణం
- ఆరోపించిన బాధితులు
- పరస్పరం పోలీసులకు ఫిర్యాదు



మృతి చెందిన పిల్లి ఇదే..

చేవెళ్ల: 'ప్రాణం ఎవరిదైనా ఒకటే.. పిల్లిది అయితే ప్రాణం కాదా.. అల్లారు ముద్దుగా ఐదునెలలుగా పెంచుకుంటున్నాం.. అది ఇప్పుడు ఇంట్లో లేదంటే ఎంతో బాధగా ఉంది.. ఏమీ తినడం లేదని ఆస్పత్రికి వస్తే ఏవో మందులు ఇచ్చి చంపేశారు' అంటూ ఓ మహిళ కంటతడిపెట్టుకుంది. ఈ సంఘటన చేవెళ్లలో మంగళవారం చోటు చేసుకుంది. నగరానికి చెందిన పాజియా బేగం పిల్లలతో కలిసి కొంతకాలంగా చేవెళ్లకు వచ్చి స్థిరపడింది. ఐదు నెలల క్రితం ముచ్చటపడి పిల్లిపిల్లను తెచ్చుకుంది. ఇంటిల్లిపాదీ దానిని అపురూపంగా చూసుకోవడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో రెండు రోజులుగా అది ఏమీ తినకపోవడంతో చేవెళ్లలోని వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి సిబ్బంది ఇంజెక్షన్ ఇచ్చి, ఓ మందు తాగించి పంపించారు. ఇంటికి వెళ్లిన కాసేపటికి పిల్లి ఫిట్స్ వచ్చినట్లు కొట్టుకుంటూ అడ్డం పడిపోయింది. మళ్లీ ఆస్పత్రికి తీసుకురాగా వైద్య సిబ్బంది వైద్యం అందిస్తుండగా అది మృతి చెందింది. దీంతో పాజియా బేగం, ఆమె కుమారుడు అక్బర్ సిబ్బందితో గొడవకు దిగారు. అల్లరుముద్దుగా పెంచుకుంటున్న పిల్లి వైద్యం వికటించి మృతి చెందిందని.. తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు. సరైన వైద్యం చేయకపోవడంతోనే పిల్లి చనిపోయిందని వైద్యం చేసిన సిబ్బందిపై ఫిర్యాదు చేశారు.

విచారణకు ఆదేశం

పిల్లికి అనారోగ్యంగా ఉండడంతో నయం చేసేందుకు వైద్యసిబ్బంది ప్రయత్నించారని చేవెళ్ల వెటర్నరీ వైద్యుడు తిరుపతిరెడ్డి తెలిపారు. ముందుగా వచ్చినప్పుడు ఆస్పత్రిలో ఉండే కాంట్రాక్ట్‌పై పనిచేసే సబార్డినేట్ దేవేందర్ నట్టల మందు, జ్వరం మందు వేసి పంపించాడని.. తరువాత మళ్లీ పరిస్థితి విషమంగా ఉందని రాగా చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు చెప్పారు. ఈ విషయంపై జేడీ విజయ్‌కుమార్‌కు సమాచారం అందించామని ఆయన ఆలూరు వైద్యులతో బుధవారం పోస్టుమార్టం చేయించాలని.. ఏం జరిగిందో విచారణ చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. కాగా తనపై దాడి చేశారని దేవేందర్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదాయ వనరుల పెంపే లక్ష్యం!

నగరానికి సమాంతరంగా శివారు పురపాలికల్లో వసతుల కల్పన

29 పురపాలికల్లో ఆదాయానికి బ్రేకులు వేస్తున్న ఉద్యోగులపై చర్యలకు సన్నద్ధం

ట్రేడ్ లైసెన్సులు, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లపై కార్యాచరణ

ఉన్నతాధికారుల ఆదేశాలతో పురపాలికల్లో కసరత్తు



సాక్షి, సిటీబ్యూరో: శివారు పురపాలికల్లో ఆదాయ వనరులను పెంచుకోవటం ద్వారా ప్రజలకు నగరానికి సమాంతరంగా మౌలిక వసతులు కల్పించాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. ప్రజలపై భారం పడకుండా..ఆదాయ వనరుల సమీకరణ లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో పురపాలికల్లో సంపద బృహత్తర వనాలను పెంచుతున్న సంబంధిత అధికారులు..ట్రేడ్ లైసెన్సులు, ఖాళీల స్థలాల పన్ను(వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్)పై కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. గ్రేటర్ శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలోని 29 పురపాలక సంఘాల్లో ఆదాయ మార్గాలు పెంచుకోవడానికి అన్ని రకాల వనరులను వినియోగించుకోవాల్సి ఉన్నప్పటికీ కొందరు ఉద్యోగులు గండి కొట్టేలా వ్యవహరిస్తున్న తీరుపై కూడా ఉన్నతాధికారులు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

పన్నుల మదింపుపై...

పురపాలికల్లో ఇప్పటికే కొత్తగా ఇల్లు నిర్మించుకుంటే అనుమతులు, ఇంటి పన్ను, నల్లా పన్నుల మదింపు వంటివి చేస్తుండటంతో పాటు వాణిజ్య, వ్యాపార సంస్థల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ జారీ చేయడం తప్పనిసరి చేశారు. ట్రేడ్ లైసెన్సు జారీలో పలువురు ఉద్యోగులు చేతి వాటం ప్రదర్శించటం వల్ల..లక్ష్యానికి తగ్గట్టుగా ఆదాయం రావడం లేదు. అలాగే, ఖాళీ స్థలాలకు పన్ను విధింపుతో కొంత మేర ఆదాయం పెంచుకోవచ్చని పురపాలికల అధికార యంత్రాంగం భావిస్తోంది

ఫీజుతో పాటు అదనంగా ...

గ్రేటర్ శివారులో 29 పురపాలక సంఘాల పరిధిలోని దుకాణాలు, హోటళ్లు, ఆసుపత్రులు, ఇతర షాపింగ్ మాల్స్ వంటి అన్ని రకాల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ అవసరముంటుంది. వీరంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు ద్వారా అనుమతులు పొందుతున్నారు. రహదారులను బట్టి పొడవు, వెడల్పుల ఆధారంగా పన్ను వసూలు చేయాలి. కానీ నగర శివారు పరిధిలో పదుల సంఖ్యలో మాంసం దుకాణాలు ఉండగా పొడువు, వెడల్పు కొలతలు లేకుండానే రూ.1000 చొప్పున నిర్ణయించి...అదనంగా ఒక్కో దుకాణానికి రూ.700 వసూలు చేస్తున్నట్లుగా సంబంధిత దుకాణాదారులు పేర్కొంటున్నారు. ఇతర వ్యాపార ,వాణిజ్య సముదాయాల ట్రేడ్ లైసెన్సుల జారీలో కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కాగా నగర శివార్లలో వ్యాపారం నిర్వహించాలంటే..పురపాలక సంఘానికి రుసుం చెల్లించి ట్రేడ్ లైసెన్సు పొందాలి. రుసుం విధింపులో ఇటీవల కొత్త విధానం అమల్లోకి వచ్చింది. చదరపు అడుగుకు రూ.5 చొప్పున నిర్ణయించారు. సాధారణంగా షోరూంలు, మిల్లులు, సరకు నిల్వ చేసే హోల్‌సేల్ వర్తకుల భవన సముదాయాల విస్తీర్ణం ఎక్కువగా ఉంటోంది. కొత్త విధానంలో మదింపు చేస్తే వీరు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది.

ట్రేడ్ లైసెన్స్ లేనివెన్నో...

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 4854 వ్యాపార సముదాయాలకు గానూ 2,935 సముదాయాలకు మాత్రమే ట్రేడ్ లైసెన్సులు జారీ చేసినట్లు తెలుస్తోంది. పోచారం మున్సిపాలిటీలో 511 వ్యాపార సముదాయాలకు గానూ 273 లైసెన్సులు జారీ చేశారు. ఇదే పరిస్థితి జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లలోనూ ఉన్నట్లు తెలిసింది.

బ్యాంకులో రుణం తీసుకున్న వారు తప్ప మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారు ట్రేడ్ లైసెన్సులు పొందటానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. దీనిపై అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలకు సిద్ధమవుతోంది.

ఖాళీ స్థలాలపై పన్ను

శివారు పురపాలికల్లో ఎలాంటి నిర్మాణాలు లేని ఖాళీ స్థలాలు (ప్లాట్లు) కోకొల్లలుగా ఉన్నాయి. వీటిని సంబంధిత యాజమానులు పట్టించుకోక చెట్ల పొదలు, చెత్తా చెదారం, మురికి నీరుతో నిండి పందులు, దోమలకు నిలయాలవుతున్నాయి. దీంతో సమీప బస్తీలు, కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యజమానులు ఎవరో తెలియక పురపాలికల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకుంటున్న పరిస్థితి లేదు. ఖాళీ స్థలాలపై పన్ను మదింపుతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ఆదాయం పెంచుకోవచ్చునని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

క్లుప్తంగా

ప్రిన్సిపాల్ అసభ్యప్రవర్తన.. కేసు నమోదు

కుషాయిగూడ: స్టడీ అవర్స్ పేరుతో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ ప్రిన్సిపాల్‌పై కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌రావునగర్‌లోని సదాశివ స్కూల్‌లో ప్రిన్సిపాల్ నాగేందర్ గత కొద్ది రోజులుగా విద్యార్థినులను తాకుతూ అసభ్యంగా ప్రవర్తిస్తుండగా..బాధితులు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలువురు తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లి ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలిసిన విద్యార్థి సంఘాల ప్రతినిధులు అక్కడకు చేరుకొని ధర్నాకు దిగారు. ప్రిన్సిపాల్‌ను నాగేందర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ అంజయ్య తెలిపారు.

పాన్‌షాప్‌లో గంజాయి చాక్లెట్స్ విక్రయం



గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

శామీర్‌పేట్: గంజాయి చాక్లెట్స్‌ను విక్రయిస్తున్న వ్యక్తిని మేడ్చల్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు సోమవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన చుంచున్ ఉపేంద్ర మండల్ అనే వ్యక్తి తూంకుంటలో నివాసం ఉంటూ పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. పాన్‌షాప్ ముసుగులో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారంతో మేడ్చల్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు షాపును, అతని ఇంటిని సోదా చేశారు. ఈ సోదాల్లో 17.5 కిలోల 85 గంజాయి చాక్లెట్లు లభించాయి. వీటిని స్వాధీనం చేసుకొని, ఉపేంద్రను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

నీటి సంపులో పడి రెండేళ్ల బాలుడి మృతి

శామీర్‌పేట్: నీటి సంపులో పడి రెండేళ్ల బాలుడు మృతిచెందిన సంఘటన జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బిహార్ రాష్ట్రానికి చెందిన దంపతులు మహంత్ మండల్, పూనందేవిలు లాల్‌గడి మలక్‌పేటలోని చర్చి కాలనీలో నివాసం ఉంటూ కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నలుగురు సంతానం. రోజు మాదిరిగానే పిల్లలను ఇంట్లో వదిలి భార్యాభర్తలు కూలిపనికి వెళ్లి..భోజనం చేసేందుకు మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. కాగా వీరి చిన్న కుమారుడు అర్యాణ్ కుమార్(2)కు పాలు పట్టడానికి తల్లి చూడగా కనిపించలేదు. ఇంటి బయట ఉన్న నీటి సంపులో పడి ఉండటాన్ని గమనించి చికిత్స నిమిత్తం మెడిసిటీ ఆసుపత్రికి తరలించగా..అప్పటికే బాలుడు మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

హైదర్‌షాకోట్‌లో మహిళ హత్య

మణికొండ: అర్ధరాత్రి ఓ వ్యక్తి గుడిసెలోకి వచ్చి వివాహితను హత్య చేసిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌షాకోట్‌లోని నర్సారెడ్డి కాలనీ ప్లాట్ నెంబర్ 12లో మొగులమ్మ (38), భర్త కిష్టప్ప గుడిసె వేసుకుని ఉంటున్నారు. వీరి స్వస్థలం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ కాగా..బతుకు దెరువు నిమిత్తం నగరానికి వచ్చి కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. సోమవారం రాత్రి భోజనం చేసి పడుకున్నాక అర్ధరాత్రి ఓ వ్యక్తి వచ్చి మొగులమ్మతో ఘర్షణ పడి..ఆమెను గొంతు నులిమి హత్య చేశాడు. సమీపంలోని సీసీ కెమరాలను పరిశీలించగా గుడిసెలోకి ఓ వ్యక్తి వచ్చిన విషయం రికార్డు అయ్యింది. దీని ఆధారంగా హంతకున్ని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కాగా ఆమెకు పరిచయం ఉన్న వ్యక్తే ఏదో విషయంలో తేడా వచ్చి ఆమెను హత్య చేసి ఉండవచ్చని స్థానికులు తెలిపారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు ఆరుగురు

హుడాకాంప్లెక్స్: జాతీయ వాలీబాల్ పోటీలకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అకాడమీ నుంచి ఆరుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ మోహన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ.. వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అడహక్ బాడీ నిర్వహిస్తున్న సీనియర్ వాలీబాల్ జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలు రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈ నెల 7 నుంచి 13 వరకు పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించడమే ధ్యేయంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. సీనియర్ వాలీబాల్ పురుషుల జట్టుకు బి.మధు, సిరిల్ రెడ్డి, పరహాన్‌ఖాన్, హబీబ్, ప్రశాంత్, మహిళల జట్టుకు హారిక ఎంపికయ్యారని చెప్పారు. క్రీడాకారులను సన్మానించిన వారిలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్‌లు రవిందర్, చంద్రారెడ్డిలు ఉన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ కార్యకర్త



బంజారాహిల్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ దుర్గాభవానీనగర్ బస్తీకి చెందిన బీఆర్‌ఎస్ నేత ఓర్సు ముత్యాలు ఫాంహౌస్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫిలింనగర్ బస్తీల బాగోగుల గురించి, బీఆర్‌ఎస్ హయాంలో ఇక్కడ జరిగిన అభివృద్ధి గురించి కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎలా ఉండేది, ప్రస్తుత ప్రభుత్వం ఎలా ఉంది అని కూడా కొద్దిసేపు ముచ్చటించారు. తన స్వగ్రామం దిండి అని ముత్యాలు చెప్పగా అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 20 నిమిషాల పాటు ఫిలింనగర్‌కు చెందిన సామాన్య కార్యకర్తతో మాజీ సీఎం కేసీఆర్ తాజా పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా తమలపాకుల పూజ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ భక్త హనుమాన్ ఆలయంలో మంగళవారం స్వామివారికి 18 వేల తమలపాకులతో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ప్రతియేటా ధనుర్మాసంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. ఈ పూజల్లో బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

దారంతా మురుగే..!



బంజారాహిల్స్: పంజగుట్ట రహదారిపై ఉన్న మ్యాన్‌హోల్ కారణంగా పంజగుట్ట నుంచి సోమాజిగూడ యశోద ఆస్పత్రి వరకు దారి పొడవునా మురుగుతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతివారంలో రెండురోజులకొకసారి ఈ మురుగు సమస్యతో సతమతమవుతున్నామంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్డుపై మ్యాన్‌హోళ్లలో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న సిబ్బంది శాశ్వత పరిష్కార మార్గానికి మాత్రం ప్రణాళికలు రూపొందించడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

దాడులపై ఊరుకునేది లేదు

శ్రీనగర్‌కాలనీ: బీజేపీ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడులను చేస్తే బీజేపీ ఊరుకోదని తగు రీతిలో జవాబిలిస్తామని బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కన్వీనర్ కుంబాల గంగరాజు అన్నారు. మంగళవారం నాగార్జుననగర్‌కాలనీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏదైనా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రవర్తించాలని, పార్టీ కార్యాలయాలపై దాడులను బీజేపీ శ్రేణులు తిప్పికొడతాయని హెచ్చరించారు. మా శ్రేణులు కన్నెర్ర చేస్తే ఏమవుతుందో మీ ఊహకే వదిలేస్తున్నామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కాంగ్రెస్ జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల పక్షాన పోరాడే పార్టీ బీజేపీ అని, క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన పార్టీ, మీ తాటాకు చప్పుళ్లకు బీజేపీ భయపడదన్నారు.

ట్రాఫిక్ బూత్‌ను ఢీకొట్టిన అంబులెన్స్



బంజారాహిల్స్: అతివేగం వల్ల అదుపుతప్పిన ఓ అంబులెన్స్ ట్రాఫిక్ బూత్‌ను ఢీకొట్టిన సంఘటన బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... నైటింగేల్ ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ (ఏపీ 26 టీపీ 8196) బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని నిలోఫర్ హోటల్ వైపు నుంచి అపోలో ఫిలింనగర్ వైపు మితిమీరిన వేగంతో రావడంతో అదుపుతప్పింది. దీంతో అగ్రసేన్ చౌరస్తాలో ఉన్న ట్రాఫిక్ బూత్‌ను ఢీకొట్టి డివైడర్‌పైకి ఎక్కింది. ఆ సమయంలో శివ, హరి ఇద్దరు కానిస్టేబుళ్లు ట్రాఫిక్ బూత్‌లో విధులు నిర్వహిస్తుండగా ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అంబులెన్స్‌లో కూడా రోగులు ఎవరూ లేకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. వేగం ధాటికి ట్రాఫిక్‌బూత్ మాత్రం కొంత ధ్వంసం కాగా డివైడర్ కూడా దెబ్బతింది. బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జవహర్‌నగర్‌లో చోరీ

వెంగళరావునగర్: ఇంట్లో దొంగలు పడి సుమారు రూ.56వేల రూపాయల విలువైన వస్తువులను దోచుకెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జవహర్‌నగర్‌లో నివసించే వి.స్వాతి బ్యూటీషియన్‌గా పని విధులు కొనసాగిస్తుంది. ఆమె అత్తగారు 15 రోజుల కిందట విజయవాడ వెళ్లారు. ఈనెల 5వ తేదీ రాత్రి స్వాతి తన భర్తతో కలిసి లింగంపల్లికి వెళ్లి ఉదయం ఇద్దరూ వచ్చి చూసేసరికి ఇంటి తలుపు తాళం తీసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.30వేలు నగదు, బంగారు చెవి రింగులు, ఫోన్ (మొత్తం రూ.56వేలు) కనిపించలేదు. దీంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేగానికి తప్పదు భారీ మూల్యం..!

- మితిమీరిన వేగంతో వెళ్లిన వారి ఇంటికే జరిమానాలు
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ రోడ్లలో స్పీడ్ లేజర్ గన్ల ఏర్పాటు
- మరికొన్ని ప్రదేశాల్లో ఏర్పాటుకు ప్రయత్నాలు

లేజర్ గన్‌తో స్పీడ్‌కు బ్రేకులు

నగరంలో మితిమీరిన వేగంతో వెళ్లడం సర్వసాధారణంగా మారింది. ముఖ్యంగా యువత బైక్ ఎక్కిందే మొదలు.. అదేదో స్పీడ్‌గా నడపపోతే తప్పన్నట్లుగా రయ్..రయ్ అంటూ వాహనాలను నడుపుతున్నారు. దీంతో కొన్ని సందర్భాల్లో వాహనాలు నడిపే వారితో పాటు ఇతరులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీరికి కళ్లెం వేయాలని భావించిన ట్రాఫిక్ పోలీసులు పలు చోట్ల వేగాన్ని కొలిచే స్పీడ్ గన్లను ఏర్పాటు చేసి.. డైరెక్ట్‌గా ఇంటికే జరిమానాలు పంపిస్తున్నారు. దీంతో మితిమీరిన స్పీడ్ కంటే ఎక్కువ వేగంతో వెళ్లిన వారు జరిమానా రూపంలో మూల్యం చెల్లించుకుంటున్నారు.



జూబ్లీహిల్స్ రోడ్డులో ఓవర్ స్పీడ్ వాహనాలకు స్పీడ్ లేజర్ గన్ ద్వారా చలానాలు విధిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: విశాలంగా రోడ్డు ఉంది కదా? అని మితిమీరిన వేగంతో దూసుకుపోతున్నారా? అయితే ఇక నుంచి స్పీడ్ లేజర్ గన్‌లు నిర్దేశించిన వేగాన్ని మించితే ఆటోమేటిక్‌గా ఫొటోలు తీసి ఇంటికే చలాన్లు పంపిస్తాయి. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు- జూబ్లీహిల్స్ రోడ్డులో కొత్తగా స్పీడ్ లేజర్ గన్‌లు సిద్ధంగా ఏర్పాటు చేశారు. రోడ్డు బాగుంది కదా.. అని ఇష్టమొచ్చినట్లు దూసుకుపోతే మాత్రం ఇవి ఆయా వాహనాల నెంబర్‌ను ఇట్టే పసిగట్టేసి ఇంటికే చలాన్లు పంపిస్తోంది. గతకొద్ది రోజుల నుంచి ఈ రోడ్డులో స్పీడ్ లేజర్ గన్‌లు ద్వారా ట్రాఫిక్ పోలీసులు వేగాన్ని కొలుస్తూ అదుపు తప్పిన వేగంతో వెళితే ఆయా వాహనాలను గుర్తిస్తున్నారు. ఇప్పటి వరకు ట్రాఫిక్ పోలీసులే తమ చేతిలో ఉండే సెల్‌ఫోన్ల ద్వారా ఫొటోలు తీసేవారు. ఈ ఫొటోల్లో వాహనం నెంబర్ సరిగా కనిపించేది కాదు. అంతేకాకుండా కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో కూడా నిర్దేశించిన స్పీడ్‌కు మించి దూసుకెళ్లే వాహనాల ఫొటోలు స్పష్టంగా రాకపోవడంతో సాంకేతికపర ఇబ్బందులు తలెత్తేవి. ఇప్పుడు ఈ సమస్యకు పోలీసులు చెక్ పెడుతున్నారు. ఎంత స్పీడ్‌గా వెళ్లినా ఆ వాహనం నెంబర్‌ను స్పష్టంగా ఫొటో తీసేలా ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో స్పీడ్ లేజర్ గన్‌లను ప్రవేశపెట్టారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ రహదారుల్లో చాలా మంది రోడ్లు విశాలంగా ఉండడంతో దూసుకెళ్తున్నారు. ఇక నుంచి వీరందరికీ చాలానాలు ఇంటికే వెళ్తాయి. కేవలం కేబీఆర్ రోడ్డులోనే కాకుండా నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, ఫిలింనగర్, మాదాపూర్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి వైపు కూడా ఈ లేజర్ గన్‌లు అందుబాటులో తెచ్చే యోచనలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు. ఇదిలా ఉండగా కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ వైపు వాహనాల స్పీడ్ లిమిట్‌ను నిర్దేశించిన దాని కంటే స్పీడ్‌గా వెళ్లేవారిని ప్రతిరోజూ 150 నుంచి 200 వాహనాల వరకు గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు.

ఎక్కువ ఫలాలు పొందారని నిరూపిస్తే

రూ.30 లక్షల రివార్డు

మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్



రూ. 30 లక్షల డీడీని ప్రదర్శిస్తున్న మాల సంఘాల నేతలు

పంజగుట్ట: ఇటీవల బీసీ నాయకులు ఎమ్ఆర్‌పీఎస్‌కు మద్దతు తెలుపుతూ మాల కులస్తులను తప్పు పడుతూ ఎస్సీ ఫలాలు మొత్తం మాల కులస్తులే పొందుతున్నారని అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భవించిన 2 జూన్ 2014 నుంచి నేటి వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ డవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్, ఎస్సీ కార్పొరేషన్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, సాంస్కృతిక రథసారధి సంస్థల్లో అమలైన పథకాల్లో మాదిగలకన్నా మాల కులస్తులు ఎక్కువ లబ్ధిపొందారని నిరూపిస్తే రూ. 30 లక్షల రివార్డు ప్రకటిస్తామని ఆయన సవాల్ విసిరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రివార్డుకు సంబంధించిన రూ. 30 లక్షల డీడీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సమత సైనిక్ గల్ సౌత్ ఇండియా అధ్యక్షులు దిగంబరి కామ్లే, ప్రజాగాయకుడు రేంజర్ల రాజేష్, ఆర్టీసీ మాల ఉద్యోగుల సంఘం నాయకులు దాసరి లక్ష్మయ్య, ఆనపూసల వెంకటేష్‌లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కొంత మంది బీసీ నాయకులు మద్దతు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో మాల కులస్తులను స్మగ్లర్లు, ఎస్సీ ఫలాలు మొత్తం వారే దోచుకుతిన్నారు అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గాలి మాటలు మాట్లాడకుండా గత 10 సంవత్సరాల నుంచి ప్రభుత్వ పథకాల్లో ఎవరు ఎక్కువ లబ్ధి పొందారో ఆధారాలు ఉంటే 15 రోజుల్లో ఇవ్వాలని అన్నారు. ఇకపై మాల కులస్తులపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెట్లపల్లి అరుణ్‌కుమార్, రవీందర్, చొక్కంపేట ఆజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం సీజ్



అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేస్తున్న సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3 లోని 8-2-334/ఎన్/3 ఇంటి యజమాని టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిపారంటూ ఆ భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్టిల్ట్ ప్లస్-3 నివాస భవనానికి అనుమతులు తీసుకుని సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణం చేయడంతో పాటు వాణిజ్య ప్రయోజనాల కోసం నిర్మిస్తున్నారని అధికారులు గుర్తించారు. ఇందుకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. ఆ తర్వాత మళ్లీ స్పీకింగ్ ఆర్డర్‌లు కూడా జారీ చేశారు. అయినా నోటీసులను సైతం బేఖాతరు చేస్తూ నిర్మాణ పనులను కొనసాగిస్తుండడంతో మంగళవారం సదరు ఇంటి భవనాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది పోలీసుల సహాయంతో జీహెచ్ఎంసీ చట్టం 1955లోని సెక్షన్ 461ఏ కింద భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయండి

రహమత్‌నగర్: మానుకోటలో ఈ నెల 19న జరిగే తెలంగాణ ఉద్యమకారులు ఆత్మగౌరవ యాత్రకు హైద్రాబాద్ నగరం నుంచి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నగర నాయకులు కంకట సురేందర్ కోరారు. రహమత్‌నగర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా పోయిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు డా.చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 19న మానుకోటలో జరిగే అత్మగౌరవ యాత్రకు ప్రతి ఒక్క ఉద్యమకారుడు పాల్గొని ఐక్యతనుచాటాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ప్రకటించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో ఉద్యమకారులు తరలివెళ్లే విధంగా తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

యేసు బోధనలు ఆచరణీయం

రహమత్‌నగర్: యేసు ప్రభువు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమైనవని నగర కాంగ్రెస్ నాయకురాలు, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా అన్నారు. బోరబండ డివిజన్ ఆచార్య జయశంకర్ కమ్యూనిటీ హాల్లో ఫుల్ గాస్పెల్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యేసు క్రీస్తు బోధించిన కరుణ, ప్రేమ, శాంతి మార్గాలు మనిషిని సన్మార్గంలో నడిపిస్తాయన్నారు. చర్చి ఫాదర్‌తో పాటు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌బీటీనగర్‌లో ఆక్రమణల తొలగింపు



ఎన్‌బీటీనగర్‌లో రోడ్ల పక్కన అక్రమ పార్కింగ్‌లను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



రోడ్ల పక్కన వ్యాపారాలు పెట్టవద్దని సూచనలు ఇస్తున్న ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని కమాన్‌లో ఉన్న ఎన్‌బీటీనగర్ బస్తీలో ఇటీవలే నిర్వహించిన 'ఆపరేషన్ రోప్' ద్వారా పెద్ద ఎత్తున రోడ్ల పక్కన ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌లు బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. స్థానికుల నుంచి హర్షం వ్యక్తం కావడంతో పాటు ఇంకా కొన్నిచోట్ల ఆక్రమణలు ఉన్నాయని, వాటిని కూడా తొలగించాలంటూ ట్రాఫిక్ పోలీసులకు విజ్ఞప్తులు అందాయి. దీంతో మంగళవారం వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా ఆధ్వర్యంలో మరోసారి ఆపరేషన్ రోప్ నిర్వహించారు. రోడ్ల పక్కన అక్రమంగా పార్కింగ్ చేసిన కార్లను, ఇతర వాహనాలను క్రేన్ ద్వారా తరలించారు. రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు ఉండడం వల్ల వాహనాలు ముందుకు సాగడం లేదని, వాటిని తొలగించాలని, మరోసారి వచ్చినప్పుడు క్రేన్ వాటిని తొలగించడం జరుగుతుందని సూచించారు. కమాన్ నుంచి పోచమ్మగుడి, బస్తీ దవాఖానా మీదుగా చర్చి వరకు అక్రమ పార్కింగ్‌లు, ఆక్రమణలు సుమారు 150 వరకు రెండు దఫాలుగా తొలగించడం వల్ల ఈ రోడ్డంతా విశాలమైనదని, ఇప్పుడు వాటర్ ట్యాంకర్లు, అంబులెన్స్‌లు తేలిగ్గా రాకపోకలు సాగిస్తున్నాయని స్థానికులు ట్రాఫిక్ పోలీసులను అభినందించారు. అప్పుడప్పుడు ఆపరేషన్ రోప్ నిర్వహించి ఇలాగే రోడ్లను క్లియర్ చేయడం ద్వారా తమ రాకపోకలు కూడా సులువుగా ఉంటాయని వారు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ సాయిప్రకాష్‌గౌడ్, ఎస్ఐ గవాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లను నడపాలి

లిబర్టీ: హైదరాబాద్ మహానగరం నుంచి కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను నడపాలని సనాతధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్ కోరారు. ఈ మేరకు మంగళవారం రైల్వే అధికారులకు కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 45 రోజుల పాటు ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ నుంచి లక్షలాది మంది భక్తులు వెళ్లే అవకాశం ఉన్న కారణంగా రైల్వే అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. హైదరాబాద్ మహానగరం నుంచే కాకుండా తెలంగాణలోని 33 జిల్లాల నుంచి భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తారని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చొరవ చూపి రైళ్లను నడపాలని విన్నవించారు.

సన్మానం

రహమత్‌నగర్: ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ సమితి సౌత్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మామిళ్ల నాగేష్ చేస్తున్న ప్రజాసేవ అభినందనీయమని హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-1 బస్తీనాయకులు కొనియాడారు. బస్తీలో ప్రమాదకరంగా మారిన సెల్ టవర్‌ను తొలగించడంలో కీలకపాత్ర పోషించిన నాగేష్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో బస్తీవాసులు సన్మానించారు. ఈ సందర్భంగా బస్తీ నాయకులు ఖుతుబుద్దీన్, అబ్దుల్ కరీం, మహ్మద్ అన్వర్, ముజీబ్, రమేశ్‌లు మాట్లాడుతూ ప్రజా సేవకుడు నాగేష్ నిస్వార్థంగా సేవలందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దస్తగీర్, అక్బర్, సయ్యద్‌నాసర్, షకీర్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలు చేస్తేనే ఉన్నత శిఖరాలు

వి హబ్ సీఈవో సీతా పల్లచోళ్ల



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న సీతా పల్లచోళ్ల

బంజారాహిల్స్: విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలంగాణ వి హబ్ సీఈవోఓ సీతా పల్లచోళ్ల అన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కాలేజీలో ఫార్మసీ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వి హబ్ సీఈవో సీతా పల్లచోళ్ల మాట్లాడుతూ కొవిడ్ తర్వాత ఫార్మసీ విద్యార్థులకు బాగా డిమాండ్ ఏర్పడిందన్నారు. చదువు అయిపోయింది కదా అని పట్టాలు పొందిన వారు ఉదాసీనంగా ఉండవద్దని నిత్యం ఏదో ఓ కొత్త విషయాన్ని నేర్చుకోవడంతో పాటు అధ్యయనం చేస్తూ ఉండాలని అప్పుడే మంచి అవకాశాలు వస్తాయని అన్నారు. వి హబ్ కూడా వినూత్నంగా ఆలోచించే విద్యార్థులకు, వారి ఉపాధికి, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నదని అన్నారు. అనంతరం డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆమె పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా, గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు, జాయింట్ సెక్రటరీ సయ్యద్ ఆమెర్ జావెద్ తదితరులు పాల్గొన్నారు.

కళ్ల ముందుకు పల్లె అందాలు

అందమైన రంగవల్లులు వేసిన విద్యార్థినులు



బంజారాహిల్స్: ముగ్గుల ద్వారా పల్లె అందాలను విద్యార్థినులు కళ్ల ముందుకు తెచ్చారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థినులు అందమైన రంగవల్లులు వేసి తమ ప్రతిభను చాటారు. రైతే రాజు, టెక్నాలజీ ప్రాముఖ్యత, మహిళా సాధికారత, దేశ భద్రత అనే అంశాలపై విద్యార్థినులు వేసిన ముగ్గులు చూపరులను కట్టిపడేశాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శైలజ విద్యార్థులు నగర జీవనంతోపాటు గ్రామీణ జీవన వాతావరణం గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు చదువులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్యమన్నారు. ముఖ్యంగా మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, డాక్టర్ రమ, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ అరవింద్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో ఇందిరాపార్క్, నిమ్స్, జవహర్‌నగర్ సబ్ స్టేషన్ల పరిధిలో చెట్ల నరికివేత, సబ్ స్టేషన్ల మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కవాడిగూడ, ఎస్‌బిఐ కాలనీ, సాయిబాబా టెంపుల్ ఏరియా, గాంధీ నగర్,ఎసిటిసి కాలేజ్ ఏరియా, వార్త కార్యాలయం, విష్ణు రెసిడెన్సి, కెనెరా బ్యాంక్ పార్క్, విజయ బ్యాంక్ ఏరియా, దేవీచౌక్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎర్రమంజిల్ ఏరియా, బాలాపురా బస్తీ ఏరియా, ఎర్రమంజిల్ చమాన్,పంచాయతీరాజ్ ఆఫీస్ ఏరియా,శ్రీ కావేరి సాంబశివరావు రెసిడెన్సీ, పాస్టాఫీస్ లేన్, జీవీకె మాల్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.అదే విధంగా జవహర్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జవహర్‌నగర్ ఏరియా, లేబర్ కమిషనర్ కార్యాలయం, ఎస్ఆర్‌టి క్వార్టర్స్, అంజయ్య భవన్ ఏరియా, హనుమాన్ టెంపుల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వెంగళరావునగర్ : డి.కె. రోడ్డు, శాంతాబాగ్, ప్లే గ్రౌండ్, ఎస్‌బీఐ స్టాఫ్ కాలేజీ, సీఎం క్యాంప్ ఆఫీస్ 11 కెవీ ఫీడర్లు, బేగంపేట, కుందన్‌బాగ్, గ్రీన్‌లాండ్స్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు డికె రోడ్డు, రోశయ్యలైన్, శాంతిబాగ్, శివబాగ కెకె జోన్‌హోటల్, శేషమహల్, ప్లేగ్రౌండ్, దిశ్యశక్తి లైన్, సీఎం ఓల్డ్ క్యాంప్ ఆఫీస్, సీఎం బిల్డింగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కుందన్‌బాగ్ 11కెవీ ఫీడర్ కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల ఐఏఎస్, ఐపీఎస్, మినిస్టర్స్ క్వార్టర్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు, అలాగే శాంతనగర్ 11కెవీ ఫీడర్ ఆల్విన్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల సౌభాగ్యనగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, కైలాస్‌నగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

కొనుగోళ్లపై 15 శాతం రాయితీ

బంజారాహిల్స్: నందగిరిహిల్స్ రోడ్డునెంబర్-69లోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కళా ఉత్పత్తులపై 15 శాతం రాయితీని ప్రకటించారు. ఈ నెల 13వ తేదీ వరకు ఈ రాయితీ సౌకర్యం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వృత్తి పనుల శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

లిబర్టీ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్కిల్స్ యూనివర్సిటీలో వృత్తి పనుల శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. యూనివర్సిటీలో గీతా నేత ఇతర సంప్రదాయ కులవృత్తుల పరిశ్రమల అభివృద్ధి సంక్షేమం పరిశోధన, ఉపాధి మార్గాలు శిక్షణ కోర్సులను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించారు.ఈ సందర్భంగా మంగళవారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనుమరుగవుతున్న కులవృత్తులకు ప్రధానంగా గీత, నేత, కమ్మరి, వడ్రంగి స్వర్ణకారులు వంటి వాటికి శిక్షణా కోర్సులు ప్రవేశపెడితే రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఆయన అన్నారు. అనేకేళ్లుగా తరతరాలుగా సంప్రదాయ కుల వృత్తులను నమ్ముకొని బతుకుబండి లాగుతున్న వృత్తిదారులకు ఉపాధి కల్పించే విధంగా ఆధునీక కోర్సులు ఉండాలని విన్నవించారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ నేపథ్యంలో కులవృత్తులు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో తాత ముత్తాల నుంచి వారసత్వంగా కులవృత్తులు నమ్ముకొని లక్షలాదిమంది బతుకుబండి లాగుతున్నారని కుమారస్వామి గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్కిల్స్ యూనివర్సిటీలో నైపుణ్యం పెంచేందుకు ఆధునీకరణ కోర్సులు ప్రవేశపెట్టి సంప్రదాయ వృత్తులకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.

నగరంలో నేడు

- బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కొనసాగుతున్న ఉద్యాన్ ఉత్సవ్ కార్యక్రమాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయి.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ కొనసాగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ నిర్వహిస్తారు.
- గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జాతీయ స్థాయి వర్క్‌షాప్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

స్పెషల్ పోలీసు ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్

రాష్ట్రానికి చెందిన మాజీ సైనిక, పోలీసు ఉద్యోగులకు ప్రాధాన్యం

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగంలో 191 స్పెషల్ పోలీసు ఆఫీసర్(ఎస్పీఓ) పోస్టుల భర్తీకి సంబంధించి అధికారులు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్రానికి చెందిన మాజీ సైనికోద్యోగులు, పోలీసులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ప్రకటించారు. ఈ నెల 1వ తేదీ నాటికి మాజీ సైనికోద్యోగులు 58 ఏళ్ల కంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలని, పారామిలటరీ, పోలీసులు రిటైర్ అయి రెండేళ్లలోపు అయి ఉండాలి. ఎంపికైన వారికి నెలకు రూ.26 వేల గౌరవ వేతనం చెల్లిస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు రిటైర్‌మెంట్‌కు సంబంధించిన ఆధారాలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, టెక్నికల్ ట్రేడ్ ఎఫిషియన్సీ సర్టిఫికెట్, డ్రైవర్ అభ్యర్థులు డ్రైవింగ్ లైసెన్సు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని స్వయంగా పేట్లబుర్జులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న ఎస్పీఓ ఆఫీస్‌కు వచ్చి దరఖాస్తులు సమర్పించాలి. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారు.

పెట్స్ అక్రమ రవాణాపై దృష్టి పెట్టండి

– కమిషనర్ సీవీ ఆనంద్‌కు విజ్ఞప్తి



సనత్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా దేశంలోని 20 రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే పిల్లులు, కుక్కల రవాణాపై పూర్తిస్థాయి నిఘా పెట్టి అరికట్టాల్సిన అవసరం ఉందని తెలంగాణ కెనైన్ అసోసియేషన్ సెక్రటరీ విశాల్ సూదం పోలీసు అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి మూగ జీవాల అక్రమ రవాణపై చర్చించి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. జంతువుల రవాణాను నియంత్రించేందుకు ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని, పప్పీలు, కిట్టెన్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం అన్నారు.

ప్రజావాణికి 450 అర్జీలు



లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో 450 అర్జీలు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 150 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు 119, రెవెన్యూ శాఖకు 68, ఇతర శాఖలకు సంబంధించి 113 దరఖాస్తులు అందాయి. ప్రజావాణి ఇన్‌చార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పలు అర్జీల గురించి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఆయన అప్పటికప్పుడే పరిష్కరించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక కౌంటర్ ద్వారా స్వీకరించారు. దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

కేంద్ర పథకాల అమలు దిశగా..

- ఎట్టకేలకు నేడు 'దిశ' సమావేశం
- ఏడు నెలలు తర్వాత ఏర్పాటైన కమిటీ
- పేదలకు కేంద్ర ప్రభుత్వ పథకాల పంపిణీపై చర్చ
- పథకాలకు నిధుల వినియోగమే ఎజెండా
- కమిటీకి చైర్మన్‌గా ఎంపీ ఈటల రాజేందర్





మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్

సాక్షి, సిటీబ్యూరో: ఎట్టకేలకు ఏడు నెలల తర్వాత జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశానికి ముహూర్తం ఖరారైంది. మేడ్చల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో 'దిశ' చైర్మన్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరగనుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన 21 ప్రాయోజిత పథకాలపై పర్యవేక్షణతో పాటు వాటి అమలు, నిధుల వినియోగం తదితర అంశాలు చర్చకు రానున్నాయి. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) ఏర్పాటులో సంబంధిత అధికారుల జాప్యం కారణంగా సమావేశం ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ఈ కమిటీకి కలెక్టర్ గౌతమ్ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా 'దిశ' కమిటీ మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు విస్తరించి ఉంది.

సమావేశంతో ప్రయోజనం ఎంతో..

ఎంపీ ల్యాడ్స్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, పీఎం ఫసల్‌బీమా యోజన, ముద్ర రుణాలు, పీఎం ఆవాస్ యోజన తదితర పథకాల అమలుపై సమావేశంలో నిర్మాణాత్మక చర్చ జరిగితేనే.. ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండగలదని భావిస్తున్నారు. మేడ్చల్ జిల్లా ఆవిర్భావం నుంచి 'దిశ' సమావేశంలో నిర్మాణాత్మక చర్చ జరగకపోవడంతో అర్హులైన వారికి కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనం చేకూరలేదు. దీనికి ప్రధాన కారణం అప్పటి ఎంపీలు పట్టించుకోకపోవడమే అని తెలుస్తోంది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండటంతోపాటు ఎంపీ ఈటల రాజేందర్ కూడా మల్కాజిగిరి పార్లమెంట్‌కు బీజేపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో కేంద్ర పథకాల ప్రయోజనం అర్హులైన స్థానిక ప్రజలకు చాలా మేరకు వర్తించగలవని భావిస్తున్నారు. ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించడంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు పరిహారం అందే వీలుంటోంది. అలాగే, ఉపాధి హామీ పథకం, దీన్ దయాళ్ అంత్యోదయోజన, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సర్వ శిక్షా అభియాన్, ఐసీడీఎస్, టెలికామ్, రైల్వే, రహదారులు, గనులు, డిజిటల్ భారత్, ఉజ్వల్ యోజన, మౌలిక సదుపాయాల కల్పన తదితర 21 కేంద్ర పథకాలకు సంబంధించిన కార్యక్రమాలపై దిశ కమిటీలో చర్చ జరిగే అవకాశముంది. ఇది జరిగితే.. అర్హులైన ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

3 నెలలకు ఒకసారి.. దిశ

ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశ సమావేశాలు జరగనున్నాయి. గతంలో మల్కాజిగిరి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన నేతలు రెండు, మూడు పర్యాయాలు మినహాయించి ఎక్కువగా నిర్వహించలేకపోయారన్న అపవాదులను మూటగట్టుకున్నారు. తాజాగా మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ బాధ్యతలు చేపట్టి దాదాపు 7 నెలలు గడుస్తోంది. ఎంతో అనుభవం కలిగిన రాజకీయ ఉద్దండుడుగా పేరున్న ఈటల రాజేందర్ ఉమ్మడి ఏపీతో పాటు తెలంగాణ మంత్రిగా సుదీర్ఘకాలం పని చేశారు. పేదల పక్షపాతిగా ముద్ర వేసుకున్న బడుగు బలహీనవర్గాల నేతగా 'దిశ'కు చైర్మన్‌గా వ్యవహరించనున్న ఆయన ప్రజా సమస్యలను పరిష్కరించడంలో దిట్ట కావడంతో ఆయనపై పార్లమెంట్ పరిధిలోని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో జరిగే 'దిశ' సమావేశాలతో కేంద్ర పథకాలు అందగలవని అర్హులు ఎదురుచూస్తున్నారు. ఈ కమిటీలో స్థానిక మల్కాజిగిరి ఎంపీ, కలెక్టర్‌తో పాటు జిల్లాలోని శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, నగర పాలక సంస్థ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు(డీఆర్డీవో)లతో పాటు పలువురు నామినేటెడ్ సభ్యులు ఉంటారు. జిల్లా, మండల పరిషత్‌ల పాలకవర్గాల పదవీ కాలం ముగిసిపోవడంతో ప్రస్తుతం ఏర్పాటైన కమిటీలో వారికి ప్రాతినిధ్యం కల్పించలేదు.

కఠిన పరిస్థితులను ఎదుర్కొని నిలిచాం



– జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్, టీజీవో, టీఎన్జీవో, ఫైనాన్స్ వింగ్ డైరీ, టేబుల్ కేలండర్లను ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు, ఉద్యోగులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది జలమండలి ఉద్యోగులు, సిబ్బంది అంతా కఠిన పరిస్థితులను ఎదుర్కొని నిలిచారన్నారు. వేసవిలో తాగునీటి డిమాండ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఈడీ మాయాంక్ మిట్టల్, ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్లు స్వామి, అమరేందర్‌రెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, జేఈఏ అధ్యక్షుడు రాజశేఖర్, టీజీవో జలమండలి శాఖ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జనరల్ సెక్రటరీ చంద్రజ్యోతి, టీఎన్జీవో జలమండలి శాఖ అధ్యక్షుడు మహేష్ కుమార్, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో 75 శాతం యాంత్రీకరణే లక్ష్యం



ఏజీవర్సిటీ: వ్యవసాయ యాంత్రీకణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అధిక ప్రాధ్యానం ఇస్తోందని, 2027 నాటికి వ్యవసాయ సాగులో 75 శాతం యాంత్రీకరణ సాధించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు భారతీయ వ్యవసాయ మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్(న్యూఢిల్లీ) డాక్టర్ ఎస్ఎన్ ఝా అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఫార్మ్ ఇంప్లిమెంట్స్ అండ్ మిషనరీ 39వ వర్క్‌షాప్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్య సాధనకు రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని ఆయన కోరారు. వ్యవసాయం రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశం కావడంతో ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌కు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ కార్యదర్శి ఇప్పటికే అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు లేఖలు రాశారని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్య మాట్లాడుతూ రానున్న కాలంలో తక్కువ మానవ ప్రమేయంతో కొన్ని పంటల్ని సాగు చేసే పద్ధతులు రానున్నాయని, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశంలో వ్యవసాయం, పారిశ్రామికీకరణ, పట్టణీకరణలో అనేక మార్పులు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ ఏడీజీ డాక్టర్ కేపీ సింగ్, ఐసీఏఆర్ బోపాల్ డైరెక్టర్ సీఆర్ మోహతా, అకోలా మాజీ వీసీ వీఎం మయాండే, శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయం అధికారులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే కార్మికుల హక్కుల సాధన



సాక్షి, సిటీబ్యూరో: ఐక్యతతోనే కార్మికులు హక్కులను సాధించుకోవచ్చని తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్(టీజేఈయూ) అధ్యక్షుడు చవ్వా సతీష్ కుమార్ అన్నారు. జలమండలి కార్మికుల పక్షాన పోరాడుతుండటం అదృష్టమన్నారు. డివిజన్–4 రెడ్‌హిల్స్, డివిజన్–6 ఎస్ ఆర్ నగర్‌లో సతీష్‌కుమార్ జన్మదిన వేడుకలను కార్మికులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ బదిలీలు, పదోన్నతల విషయంలో రాజీలేకుండా పోరాటం చేసి సాధించామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, కార్మిక నేతలు రాజిరెడ్డి, చంద్రశేఖర్, ఎండీ.జహంగీర్, అల్లి శ్రవణ్ కుమార్, బి.దేవేందర్, టీవీ.లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నేడు జేఎన్‌టీయూహెచ్‌లో వర్క్‌షాప్ ప్రారంభ సమావేశం

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ ఆడిటోరియంలో 'డిజైన్ ఆఫ్ కరికులం అండ్ కోర్సు స్ట్రక్చర్ ఫర్ యుజి ఇంజినీరింగ్ ప్రోగ్రామ్' రూపకల్పనపై బుధవారం వర్క్‌షాప్ ప్రారంభ సమావేశం నిర్వహించనున్నట్లు డా.ప్రసన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, గౌరవ అతిథులుగా రెక్టర్, ప్రొ.కె.విజయ కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ.కె.వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు.

విద్యాలయాలు దేవాలయాలే..

- చదువుతో పాటు సంస్కారం అవసరం
- క్యారెక్టర్ లేకపోతే తరాలు నాశనం
- స్క్రీన్లు చూడటం ఆపేసి.. ఆటలు ఆడాలి
- శాంతాబయోటెక్ ఎండీ వరప్రసాద్ రెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శాంతా బయోటెక్ ఎండీ వరప్రసాద్‌రెడ్డి తదితరులు

మాదాపూర్: మన సంస్కృతిలో దేవాలయాలకు ఎంత ప్రాముఖ్యత ఇస్తామో.. విద్యాలయాలకు కూడా అంతటి ప్రాధాన్యం ఇవ్వాలని, తల్లిదండ్రులు నడక నేర్పిస్తే.. గురువులు నీతి, రీతి నేర్పిస్తారని శాంతా బయోటెక్ ఎండీ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్సీ అవార్డులను మంగళవారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గురువులు విద్యార్థులను తమ పిల్లలుగా భావించి సమాజం పట్ల అవగాహన, మంచి నడవడిక, విద్యాబుద్ధులు నేర్పిస్తారన్నారు. సమగ్రమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతారని అన్నారు. మన సంస్కృతిలో దేవాలయాలకు ఎంత ప్రాముఖ్యత ఇస్తామో.. విద్యాలయాలకు కూడా అంతటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చదువు, సంస్కృతి అనేవి కవల పిల్లల్లాంటివని, ఈ రెండింటికీ తగిన ప్రాధాన్యం ఇస్తేనే అది నిజమైన విద్య అవుతుందని తెలిపారు. తల్లి ఒడిని తొలిబడిగా ఆయన అభివర్ణించారు. పౌర సమాజాన్ని తయారు చేయడంలో గురువులు కీలకంగా వ్యవహరిస్తారని చెప్పారు. చదువుతో పాటు సంస్కారం నేర్పించి.. సమాజం పట్ల అవగాహన కల్పించి.. విద్యార్థులను సమగ్రమైన వ్యక్తులుగా తీర్చిదిద్దే బాధ్యతను వాళ్లు తీసుకుంటారని తెలిపారు. లక్ష్య సాధనలో విద్యార్థులు వెనకడుగు వేయకూడదని ఆయన సూచించారు.

- విద్యతో పాటు రామాయణ, మహాభారతాలను విద్యార్థులకు నేర్పిస్తే అందులోని సన్నివేశాలు నిజజీవితంలో ఉపయోగపడతాయని సూచించారు. జ్ఞానం కోసం చదువుకునే వారు చాలా తక్కువ మంది ఉన్నారని, ఏ సెక్టార్‌లో అధికంగా డబ్బులు సంపాదించవచ్చో దాన్నే ఎంచుకుంటున్నారని తెలిపారు. ఐటీ, ఇంజినీరింగ్ తదితర విభాగాలకే చాలామంది పరిమితం అవుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. విద్యార్థులకు క్రీడా స్ఫూర్తి ఎంతో అవసరమని, ఆటలు ఆడటం మానేసి స్క్రీన్లు చూడటం మొదలుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న వాడికి క్యారెక్టర్ లేకపోతే అతడు చేసే ద్రోహం వల్ల కొన్ని తరాలు నాశనం అవుతాయన్నారు. విద్యారంగంలో విశేష కృషి చేసిన విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్యను లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించారు. విద్యారంగ అభివృద్ధికి కృషి చేసిన దాదాపు 60 మందికి పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో బీవీఆర్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇకనుంచి 'ఓమ్ని ఆస్పత్రి కూకట్‌పల్లి మెట్రో స్టేషన్'



ఇన్‌కార్ సంస్థ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీబీ రెడ్డి తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లి మెట్రో స్టేషన్‌కు ఓమ్ని ఆస్పత్రి కూకట్‌పల్లి మెట్రో స్టేషన్‌గా మంగళవారం నామకరణం చేశారు. ఇన్‌కార్ సంస్థ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీబీ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌కార్ సంస్థ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మెట్రో రైలు కార్డు ద్వారా ప్రయాణించే వారు రూ.399లతో కూడిన ఈసీజీ, చెస్ట్ ఎక్స్‌రే, సీబీపీ, ఆర్‌బీఎస్ డాక్టర్ కన్సల్టెంట్‌తో కూడిన హెల్త్ ప్యాకేజీని అందిస్తున్నామని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలులో ప్రయాణించే వారికి మెట్రో అధికారులు ఓమ్ని హాస్పిటల్స్ యాజమాన్యం సంయుక్తంగా రాయితీలు కల్పించనున్నట్లు చెప్పారు. మెట్రో ప్రయాణికులతో పాటు సంస్థలో పనిచేసే కార్మికులకు పలు రకాల సేవలు అందించేందుకు ముందుకు వచ్చామని చెప్పారు. ఇక నుంచి కూకట్‌పల్లి మెట్రో స్టేషన్‌కు సంబంధించి ఓమ్ని హాస్పిటల్స్ కూకట్‌పల్లిగా నామకరణం చేస్తున్నట్లు తెలిపారు. మెట్రో రైల్ సంస్థలో పనిచేసే ప్రతి ఒక్కరికీ తమ ఆస్పత్రి తరపున మెడికల్ ఎమర్జెన్సీ సమయంలో చేయాల్సిన పనులపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అన్నారు. మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ తమ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, తమ ప్రయాణికులకు రాయితీ కల్పించడం సంతోషం అన్నారు. కార్యక్రమంలో మెట్రో రైల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధీర్, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళి, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ లోకేష్, ఓమ్ని గ్రూప్ డైరెక్టర్ పూర్ణిమారెడ్డి, ఓమ్ని హాస్పిటల్ సీఈవో దుర్గేష్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అంకిత్ షా, యూనిట్ హెడ్ మెడికల్ సూపరింటెండెంట్ డా.వారీస్, జీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెచ్చిపోతున్న మెడికల్ మాఫియా

- మెడికల్ షాపుల్లో విస్తృత తనిఖీలు చేపట్టాలి
- పీవోడబ్ల్యు, పీవైఎల్ ప్రతినిధుల వినతి



డీజీ కమలాసన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీవోడబ్ల్యు, పీవైఎల్ ప్రతినిధులు

ముషీరాబాద్: మెడిసిన్స్ పట్ల ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో రాష్ట్రంలో మెడికల్ మాఫియా రెచ్చిపోతోందని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు డి.స్వరూప, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్ అన్నారు. రాష్ట్రంలో మెడికల్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, మెడికల్ షాపులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరుతూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ప్రతినిధుల బృందం మంగళవారం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ మెడికల్ షాపుల ఉల్లంఘనలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో సంఘం ప్రతినిధులు మెడికల్ షాపులలో సర్వేలు నిర్వహించినట్లు చెప్పారు. మెడిసిన్ కొనుగోలు చేసిన వారిని అడిగి తెలుసుకున్నామన్నారు. ఎక్కువ షాపుల్లో ఫార్మాసిస్టులు ఉండటం లేదన్నారు. వారు లేకుండానే ట్రెనింగ్ ఇచ్చిన వారితో షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేరు ఒకరిది, నిర్వహణ మరొకరిదిగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఫార్మసీ చదువుకు సంబంధం లేని వారు షాపులో మందులు ఇస్తున్నారని వివరించారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు ఇస్తున్నారన్నారు. చాలాచోట్ల మెడికల్ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ఇలా పలు అంశాలపై ప్రతి ప్రైవేట్ మెడికల్ షాపులో విస్తృత తనిఖీలు చేపట్టాలని కోరారు.

బ్రహ్మకుమారీస్ సంస్థపై దుష్ప్రచారం



గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ బెహన్

- పలువురు యూట్యూబర్స్‌పై సైబర్‌క్రైమ్‌కు ఫిర్యాదు చేశాం
- 140 దేశాల్లో కోట్లాది మంది సభ్యులు కలిగిన సంస్థ మాది
- బ్రహ్మకుమారీస్ సంస్థ శాంతిసరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్‌బెహన్

గచ్చిబౌలి: బ్రహ్మకుమారీస్ సంస్థపై సోషల్ మీడియా, యూట్యూబ్‌లలో వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని బ్రహ్మకుమారీస్ సంస్థ గచ్చిబౌలిలోని శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ బెహన్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ శాంతిసరోవర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థ సనాతన ధర్మ సంరక్షణకు ఎల్లప్పుడూ పాటుపడుతోందన్నారు. కొందరు తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది సభ్యులతో 140 దేశాల్లో బ్రహ్మకుమారీస్ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోందన్నారు. హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య, న్యాయవాది జయకృష్ణ మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థపై తప్పుడు కథనాల నేపథ్యంలో ఈ నెల 6వ తేదీన హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. బ్రహ్మకుమారీస్ సంస్థపై సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్లలో దుష్ప్రచారం చేస్తున్న కూకట్‌పల్లికి చెందిన యూట్యూబర్ లలిత్ కుమార్, మణికొండకు చెందిన మహిళ వనితా మైథిలిపై సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్, గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్, ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలోని సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని వారు గుర్తు చేశారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు అంజలీబెహన్, రజనీబెహన్ మాట్లాడుతూ గతంలో తమ సంస్థలో కొంతకాలం పనిచేసి మానేసిన న్యూఢిల్లీకి చెందిన వీరేంద్ర దేవ్ దీక్షిత్ ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం పేరిట నడిపిన సంస్థలో పనిచేసిన ఒక మహిళ ఈ తప్పుడు ఆరోపణలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. సదరు వ్యక్తికి ఆ సంస్థకు బ్రహ్మకుమారీస్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు.

విద్యారంగంలో స్పెక్ట్రమ్ సేవలు అభినందనీయం

– తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్



తానా అధ్యక్షుడు నిరంజన్‌తో స్పెక్ట్రమ్ అధినేత, బృందం సభ్యులు

అమీర్‌పేట: విద్యారంగానికి స్పెక్ట్రమ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ అన్నారు. నగరంలో పర్యటించిన ఆయన ఎస్ఆర్ నగర్‌కు చెందిన స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ అధినేత, ఎస్ఆర్‌నగర్ కమ్మ సంఘం అధ్యక్షుడు మోహన్‌నాయుడు తమ బృందంతో మంగళవారం కలిసి భవిష్యత్ కార్యాచరణను వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులు, గ్రంథాలయాకు స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో పుస్తకాలను అందజేయడం అభినందనీయం అన్నారు. దీంతో పాటు సేవా కార్యక్రమాలకు పెద్దపీట వేసిందని, సేవా దృక్పథం కలిగిన వ్యక్తులు ప్రజాజీవితంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ట్రంప్ రాకతో మన విద్యార్థుల ఉద్యోగ భద్రతకు, అభివృద్ధికి ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యానాల మురళి, రాజారావు, ఎం.రాఘవ, శివశంకర్, మధు, గుంటూరి సతీష్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంపై బలమైన ముద్ర వేసిన శ్రీశ్రీ కవితలు



శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న వంశీ రామరాజు, గరిమెళ్ల సీత, సీహెచ్ త్రినాథరావు, బండి శ్రీనివాస్

ఎమ్మెల్సీ మధుసూదనాచారి

చిక్కడపల్లి: తెలుగు సాహిత్యంపై శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) కవితలు బలమైన ముద్ర వేశాయని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయ గానసభ నిర్వహణలో విప్లవకవి, సినీ రచయిత శ్రీశ్రీ యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంప్రదాయ కవిత్వ ధోరణులకు భిన్నంగా తెలుగు సాహిత్యాన్ని మరో మలుపు తిప్పారని కొనియాడారు. ఆయన రాసిన మహాప్రస్థానం కావ్యం ఎందరికో దిక్సూచి అయ్యిందన్నారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ విప్లవ కవిగా విరసంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు, గాయకులు గరిమెళ్ల సీత, సీహెచ్.త్రినాథరావు, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్ । బుధవారం ।
8 । జనవరి । 2025

వైభవం.. సుందరకాండ పారాయణం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్–25లోని ప్రముఖ వ్యాపారవేత్త మెగా కృష్ణారెడ్డి నివాసంలో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ఆంజనేయస్వామి నిలువెత్తు ప్రతిమకు మెగా కృష్ణారెడ్డి సతీమణి సుధారెడ్డి లక్ష ఎనిమిది వడలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సుందరకాండ పారాయణం, పూజాదికాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 9వ తేదీన రాములవారి పట్టాభిషేకం కార్యక్రమాన్ని కూడా వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. స్వామివారికి సమర్పించిన లక్ష ఎనిమిది వడలను నగరంలోని రామకృష్ణ మఠంతోపాటు సమీపంలోని ఆలయాలు, అయ్యప్ప భక్తులకు, ఆస్పత్రుల వద్ద రోగుల సహాయకులకు ప్రసాదం పంపిణీ చేశారు. కనుల పండుగగా జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







- రెక్కలు తొడిగిన లెక్కల ప్రక్రియ..
- నగరం నలుచెరగులా పక్షుల కోసం అన్వేషణ
- పక్షి జాతులు, ప్రత్యేకతలు, విశేషాల సేకరణ
- వలసపక్షుల రాకపోకలు, జీవ వైవిధ్యంపై దృష్టి
- 700 మంది పక్షి ప్రేమికుల భాగస్వామ్యం
- ఏడాది పొడవునా సీజన్ల వారీగా సాగనున్న మ్యాపింగ్
- రూపుదిద్దుకోనున్న వినూత్న తరహా 'బర్డ్ అట్లాస్'

బైనాక్యులర్స్, కెమెరాలతో బర్డ్ లవర్స్ సిద్ధమవుతున్నారు. ఆకాశానికి ఎక్కుపెట్టిన చూపులతో విహంగాలను తీక్షణంగా వీక్షించనున్నారు. అరుదైన అందాలను కెమెరాలతో బంధించనున్నారు. బర్డ్ అట్లాస్ పేరిట సమగ్ర విహంగ విశేషవాహిని రూపకల్పనలో మేము సైతం అంటూ పాలు పంచుకోనున్నారు నగరంలోని పలువురు పక్షి ప్రేమికులు.

– సాక్షి, సిటీబ్యూరో





విహంగం.. వీక్షణం..

నగరాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారిపోయిన పరిస్థితుల్లో జీవవైవిధ్యం కనుమరుగవుతోంది. అదే క్రమంలో ఎన్నెన్నో అరుదైన పక్షి జాతులు అంతరించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణ ప్రేమికుల ఆలోచనల్లో నుంచే బర్డ్ అట్లాస్ ఊపిరిపోసుకుంది. నగరాల్లో పక్షుల సంచారాన్ని గుర్తించడం, సమగ్ర వివరాలతో డేటాను మ్యాప్ రూపంలో తయారు చేయడం తద్వారా వాటి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేయడం వంటి లక్ష్యాలతో రూపొందేదే బర్డ్ అట్లాస్. మొదట ఈ తరహా రాష్ట్ర వ్యాప్త బర్డ్ అట్లాస్‌ను రూపొందించిన ఘనత కేరళ సొంతం చేసుకోగా.. నగరాలకు సంబంధించి కొయంబత్తూర్, మైసూర్ మాత్రమే ఈ ప్రక్రియను పూర్తి చేశాయి. వాటి తర్వాత హైదరాబాద్ కూడా సిద్ధమై వాటి సరసన నిలిచేందుకు ప్రయత్నిస్తోంది..



700 మంది వాలంటీర్లు..

నగర జీవవైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం, పరిరక్షించడంలో భాగంగా పక్షుల విశేషాలను ఒడిసిపట్టుకునేందుకు బర్డ్ అట్లాస్ రూపకల్పనలో నగరానికి చెందిన వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్, హైదరాబాద్ బర్డ్ పాల్స్, డెక్కన్ బర్డర్స్ సంస్థలు చేతులు కలిపాయి. నగరం, చుట్టుపక్కల లేక్స్, పార్క్స్ నుంచి ఔటర్ రింగ్ రోడ్‌లోని అడవులు, గడ్డి భూములు, చిత్తడి నేలలతో పాటు 180 సెల్స్ (పక్షుల జాడ కనిపించే ప్రాంతాలను) గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో సర్వేలో పాల్గొనే వాలంటీర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నవంబర్‌లో ప్రారంభం కాగా, గత డిసెంబర్‌లో పూర్తయ్యింది. ఇప్పటికి 700 మంది వాలంటీర్లుగా నమోదయ్యారు. వీరిని 90 లేదా 45 బృందాలుగా విభజించనున్నారు. జనవరి నెల మొత్తం ఈ వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

పక్షులపై పట్టణీకరణ ప్రభావం..

'బర్డ్ అట్లాస్‌లు శాస్త్రవేత్తలు, పర్యావరణ పరిరక్షకులు, విధాన నిర్ణేతలకు అమూల్యమైన సాధనాలు. అవి పక్షుల జనాభాలో మార్పులను విశ్లేషించడంలో సంతానోత్పత్తి స్థలాలు, వలసలను నిలిపివేసే ప్రదేశాలు తదితర కీలకమైన విషయాలను గుర్తించడంలో సహాయపడతాయి. ఈ డేటా పక్షి జనాభా క్షీణత లేదా మార్పులు వంటి ముఖ్యమైన పోకడలను వెల్లడిస్తుంది. తద్వారా జీవవైవిధ్యానికి హాని చేయకుండా నగరాభివృద్ధి, విస్తరణ జరిపేందుకు సహకరిస్తాయి అని వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్‌కు చెందిన ఫరీదా తంపాల్, హైదరాబాద్ బర్డ్ పాల్స్ ప్రతినిధి, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీరామ్‌రెడ్డి, డెక్కన్ బర్డర్స్‌కు చెందిన సుధీర్‌మూర్తి అంటున్నారు. 'పక్షి జాతులను పట్టణీకరణ ఎలా ప్రభావితం చేస్తుందనే దానిపై అట్లాస్ అవగాహన అందిస్తుంది. భవిష్యత్తులో మానవ కార్యకలాపాలు, వాటిని ఎలా ప్రభావితం చేస్తాయో అంచనా వేయడంలో కూడా సహాయపడుతుంది' అని వీరు స్పష్టం చేస్తున్నారు. నగర పర్యావరణ పరిరక్షణకు వీలు కలిగేలా వీరు చేపట్టిన బృహత్తర యత్నం విజయవంతం కావాలని.. ఆకాశహర్మ్యాలతో పాటు ఆకాశంలో విహరించే పక్షులు కూడా పెద్ద సంఖ్యలో మనకి కనువిందు చేయాలని కోరుకుందాం.

మూడేళ్ల పాటు సాగనున్న వేట..

సంవత్సరానికి రెండు సార్లు–శీతాకాలంలో (ఫిబ్రవరి) వేసవిలో (జూలై) ఒకసారి.. ఇలా మూడు సంవత్సరాల పాటు పక్షుల సర్వేలను నిర్వహిస్తారు. తొలిగా వచ్చే ఫిబ్రవరిలో సర్వే ప్రారంభం అవుతుంది. టీమ్స్, వాలంటీర్ల వెసులుబాటును బట్టి ఆ నెల మొత్తం సర్వే కొనసాగుతుంది. అనంతరం మ్యాప్ తయారు చేస్తారు. ఇదే విధంగా మూడేళ్ల పాటు ఈ క్రతువు కొనసాగుతుంది.



జేఎన్‌టీయూహెచ్‌లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



కేపీహెచ్‌బీకాలనీ : జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో ప్రముఖ సంఘ సంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించటం హర్షదాయకమన్నారు. యూనివర్సిటీలో మహిళా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించటమే కాకుండా రీసెర్చ్‌లో వివిధ విభాగాల్లో కృషి చేస్తుండటం గర్వకారణమన్నారు. రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావు పాల్గొన్న కార్యక్రమానికి మహిళా డైరెక్టర్లు ప్రొఫెసర్ మాధవి కుమారి అధ్యక్షత వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్లు, సీనియర్ ప్రొఫెసర్లు, మహిళా ఆచార్యులు పాల్గొని విజయవంతం చేశారు.



కాలగమనంలో.. కేరాఫ్‌లు..

ముచ్చట్లకు కేంద్రాలుగా అప్పటి కేఫ్‌లు

మహానగరంలో ఒకనాటి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన కేఫ్‌లు చాలామటుకు కాలగర్భంలో కలిసిపోయాయి. చాయ్.. బిస్కెట్.. సమోసాతో కడుపు నింపిన ఆ మినీ హోటళ్ల అడ్రస్ గల్లంతయ్యాయి. రియల్ ఎస్టేట్ పుణ్యమా? కొన్ని..రోడ్ల విస్తరణలో మరికొన్ని.. ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటైన హోటళ్లు, చాయ్ బడ్డీల విస్తరణలో ఇంకొన్ని.. ఇలా కారణమేదైనా నలుగురినీ కలిపే అడ్డాలు కనుమరుగైపోయాయి. కొద్దిసేపు స్నేహితులతో బాతాఖానీ కొడితే గానీ ఆ రోజు మనశ్శాంతిగా గడవని వారు ఎందరో.. ఫ్రెండ్స్‌తో గడపడం ద్వారా మరింత ఉత్సాహం పెరుగుతుందని పలు సర్వేలు సైతం స్పష్టం చేస్తున్నాయి.. అయితే గతంలో ఆ ఊసులకు చిరునామాగా నిలిచిన పలు కేఫ్‌ల జాడ ఇప్పుడు కానరావడం లేదు.

– సనత్‌నగర్



- మాయమవుతున్న నాటి సంస్కృతి
- నగర విస్తరణలో నయా ట్రెండ్
- అలనాటి ఆదరణ కలిగిన అడ్రస్‌లు గల్లంతు

భానుడి కిరణాలు పుడమి తల్లిని తాకకమునుపే కేఫ్‌లలో సందడి మొదలయ్యేది. అప్పటి నుంచి అర్ధరాత్రి వరకూ అదే కోలాహలం కొనసాగుతూ ఉండేది. తాజా వార్తలతో ప్రింటింగ్ అయ్యి బయటకు వచ్చిన దినపత్రికలు ఆయా కేఫ్‌ల వద్దకు చేరే రోజులు అవి. అక్కడి నుంచే పేపర్‌బాయ్స్ దినపత్రికలను సర్దుకుని సైకిల్‌పై తమ జీవనయానాన్ని కొనసాగించిన వారు కోకొల్లలు. అలా 'పేపర్ బాయ్స్' మధ్య ఆత్మీయ బంధాన్ని కేఫ్‌లు పెనవేశాయి. ఇక కూలి పని కోసం తెల్లవారుజామునే వచ్చేవారికి కేఫ్‌లే అడ్డాలు. చాయ్..బిస్కెట్ కడుపులో పడేసి పనికి పోయే కూలీల మధ్య మైత్రీ బంధాన్ని కట్టిపడేశాయి. ఐటీ కోర్సులకు హబ్‌గా పేరొందిన అమీర్‌పేట లాంటి ప్రాంతాల్లో జాబ్ అన్వేషణలోనూ అనేక కొత్త పరిచయాలను ఈ అడ్డాలే కల్పించేవి.

రిలాక్సేషన్ మంత్రంగా..

ఒకప్పుడు రిలాక్సేషన్ కేంద్రాలంటే కేఫ్‌లే. గంటల తరబడి ఊసులు, ముచ్చట్లకు అవే ప్రధాన కేంద్రాలు. ఇప్పుడంటే పార్కులు, ప్రత్యేక డే కేర్ సెంటర్లు.. ఇలా వచ్చాయి గానీ, అప్పట్లో కేఫ్‌లే ఇందుకు వేదికలుగా ఉండేవి. కొద్దిసేపు తోటి సహచరులతో కబుర్లు చెప్పుకుంటూ మనసులోని భారాన్ని దింపుకునే రిలాక్సేషన్ కేంద్రాలుగా కేఫ్‌లు నిలిచేవని నాటి నగరవాసుల అభిప్రాయం.

ఒక్కో కేఫ్‌కూ.. ఒక్కో ప్రత్యేకత..

దేశంలోనే తొలి పారిశ్రామికవాడగా వర్ధిల్లిన సనత్‌నగర్ చెంతన ఆల్విన్ కంపెనీ ఎదురుగా ఇండస్ట్రియల్ కేఫ్ ఉండేది. ఈ ఎస్టేట్‌లో పని చేసే కార్మికులతో పాటు ఉద్యోగులు, ఉన్నత స్థానాల్లో ఉండేవారంతా రోజులో ఏదో ఒక సమయంలో అక్కడ కలుసుకుని కొంతసేపు కబుర్లు చెప్పుకునేవారు. అప్పట్లో ఎస్టేట్ కార్మికుల అడ్డాగా ఇది ఖ్యాతికెక్కింది. రానురాను ఇక్కడి పరిశ్రమలన్నీ తరలిపోవడంతో ఈ కేఫ్ కూడా మూతబడింది. ప్రస్తుతం అక్కడ ఆస్పత్రి వెలిసింది. నగరం నడిబొడ్డున అమీర్‌పేట చౌరస్తాలో దశాబ్దం క్రితం ఇరానీ కేఫ్ ఉండేది. ఎప్పుడు చూసినా యువకులతో కోలాహలంగా ఉండేది. ఇక ప్యారడైజ్ సమీపంలో సుపరిచితమైన రియో కేఫ్ రోడ్డు విస్తరణలో పోయింది. గ్యాస్‌మండీ సమీపంలోని సిటీలైట్ కేఫ్ అగ్ని ప్రమాదం అనంతరం కమర్షియల్ కాంప్లెక్స్‌గా మార్చేశారు. ఈఎస్ఐ ఆస్పత్రి సమీపంలో జుగ్ను ఇరానీ కేఫ్, ఎస్ఆర్ నగర్ పాత లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ ఆనుకుని గుడ్‌లక్ కేఫ్, ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద అల్మాస్ కేఫ్, అమీర్‌పేట శీష్‌మహల్ థియేటర్ వద్ద స్టాండర్డ్ కేఫ్ అడ్రస్ లేకుండాపోయాయి. ఫతేనగర్ ఫ్లైఓవర్ వద్ద డాట్సన్ కేఫ్ ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు సరిహద్దుగా ఉండేది. అయితే ఫతేనగర్ ఫ్లైఓవర్ నిర్మాణంతో దీని జాడ లేకుండాపోయింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఒకనాడు నగరంలో కళకళలాడిన ఎన్నో కేఫ్‌లు జాడ లేకుండాపోయాయి..

కష్టసుఖాలు పంచుకునేవాళ్లు..



అమీర్‌పేటలో ఒకప్పుడు చాలా కేఫ్‌లు ఉండేవి. వాటిల్లో అల్మాస్, ఆల్‌బ్రైట్, స్టాండర్డ్, గుడ్‌లక్..ఇలా ఏ కేఫ్‌కు వెళ్లినా కాసేపు కూర్చొని కష్టసుఖాలు మాట్లాడుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు అవన్నీ బంద్ అయ్యాయి. చాయ్ తాగాలంటే బడ్డీ దగ్గరకు వెళ్లి రావాల్సిందే.

– సర్దార్ సురేందర్‌సింగ్, అమీర్‌పేట

గుడ్‌లక్ కేఫ్‌తో ఎంతో అనుబంధం..



స్నేహితులంతా కలిసి ఎక్కువగా ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పక్కన గుడ్‌లక్ కేఫ్ హోటల్‌కు వెళ్లి బాతాఖానీ కొట్టేవాళ్లం. గంటల తరబడి ముచ్చట్లు పెట్టే వాళ్లం. నాటి కేఫ్‌లు ముచ్చట్లకు అడ్డాగా ఉండేవనడంలో ఎలాంటి సందేహం లేదు.

– సరాఫ్ సంతోష్, సనత్‌నగర్



శిల్పారామంలో.. సంక్రాంతి సందడి

నేటి నుంచి ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నేటి నుంచి గాంధీ శిల్పబజార్ నేషనల్, సంక్రాంతి సంబరాలను ఈ నెల 17వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు హస్తకళా ఉత్పత్తులతో శిల్పారామం ఆవరణలో ప్రదర్శించనున్నారు. ఫోక్ పేయింటింగ్, బస్తర్ ఐరన్ క్రాఫ్ట్, జరిజర్దోసి, జ్యూయలరీ, డ్రెస్ మెటీరియల్స్, చీరలతో పాటు సంక్రాంతి సంబరాలలో భాగంగా గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుక్కలు, జంగమదేవరలు వంటి ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.



మాజీలు X మావోయిస్టులు

మావోల దాడులకు బలవుతోంది ఎక్కువగా స్థానికులే

డీఆర్జీలో మాజీ నక్సల్స్, ఫైటర్స్‌లో లోకల్ యూత్

ముందుండి నడిపిస్తున్న డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బస్తర్ అడవుల్లో యాంటీ నక్సల్స్ ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. సీఆర్‌పీఎఫ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, సీఆర్‌పీఎఫ్–కోబ్రా, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్, బస్తర్ ఫైటర్స్, దంతేశ్వరి ఫైటర్స్ తదితర సాయుధ బలగాలు సంయుక్త ఆపరేషన్లు చేస్తూ బస్తర్ అడవుల్లోకి చొచ్చుకుపోతున్నాయి. అయితే భద్రతా దళాలపై మావోయిస్టులు జరిపే దాడుల్లో ఎక్కువగా స్థానికులతో కూడిన డీఆర్జీ యూనిట్ జవాన్లే హతమవుతున్నారు. తాజా ఘటనలో బస్తర్ ఫైటర్స్ కూడా ఉన్నారు.

బలగాలకు భారీ నష్టం

దేశంలోని విప్లవ శక్తులన్నీ కలిసి 2004లో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా ఏర్పడ్డాయి. నేపాల్ నుంచి శ్రీలంక వరకు రెడ్ కారిడార్ లక్ష్యంగా ముందుకు కదిలాయి. దీనికి ప్రతిగా ప్రభుత్వం 2005లో స్థానిక యువతతో సల్వాజుడుం (శాంతి



బీజాపూర్ జిల్లా కుట్రులో పేలుడు జరిగిన ప్రదేశం వద్ద పరిశీలిస్తున్న ఛత్తీస్‌గఢ్ డీజీపీ అశోక్ జునేగా, బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ (ఫైల్)

దళం) పేరుతో సాయుధ దళాలను ఏర్పాటు చేసింది.

- 2007లో మావోయిస్టులు జరిపిన దాడిలో ఏకంగా 55 మంది పోలీసులు చనిపోయారు. ఇందులో 31 మంది సల్వాజుడుం వారే ఉన్నారు.
- 2008లో ఒడిశా బలిమెల వద్ద జరిగిన దాడిలో 37 మంది గ్రేహౌండ్స్ పోలీసులు హతమయ్యారు.
- 2007 ఏప్రిల్ 25న చింతల్నార్ దగ్గర బాంబుదాడితో పాటు అంబుష్ ఎటాక్ జరిపారు. ఈ ఘటనలో ఏకంగా 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. సల్వాజుడుం, గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్ ఇలా ఏ రూపంలో బలగాలు దండకారణ్యంలోకి వెళ్లినా చేదు ఫలితాలే వచ్చాయి. దీంతో జనంలో జనంలా కలిసిపోయి గెరిల్లా యుద్ధతంత్రంతో మావోలు జరిపే దాడులను సమర్థంగా ఎదుర్కోవడం ప్రభుత్వ భద్రతా దళాలకు తప్పనిసరిగా మారింది.

మాజీలతో డీఆర్జీ..

గతంలో సల్వాజుడుంలో పనిచేసిన వారికి జంగిల్ వార్‌ఫేర్‌లో శిక్షణ ఇచ్చి డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ (డీఆర్జీ) పేరుతో 2008లో కాంకేర్ తొలి యూనిట్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కాలంలో మావోయిజం వైపు ఆకర్షితులై జనమిలీషియా నుంచి దళాల్లో వివిధ హోదాల్లో పనిచేసి లొంగిపోయిన మావోయిస్టులకు ఆశ్రయం కల్పించే సంస్థగా డీఆర్జీ రూపాంతరం చెందింది. జిల్లాకు ఒకటి వంతున 2015 నాటికి బస్తర్, నారాయణ్‌పూర్, కాంకేర్, దంతెవాడ, కొండెగావ్, బీజాపూర్, సుక్మా మొత్తం ఏడు డీఆర్జీ యూనిట్లు ఏర్పాటయ్యాయి. ప్రతీ యూనిట్‌లో 500 మంది జవాన్లు పని చేస్తున్నారు.

ముందుండేది వీరే..

గతంలో అడవుల్లో నక్సల్స్‌తో కలిసి పనిచేసిన అనుభవం, స్థానిక అడవులపై అవగాహన, వాగులు దాటడం, గుట్టలు ఎక్కడంలో నేర్పరితనం, అడవుల్లో దొరికే ఆకులు, దుంపలు, కాయల్లో ఆహార పదార్థాలను గుర్తించడం తదితర విషయాల్లో డీఆర్జీ జవాన్లు ప్రత్యేకతను చాటుకున్నారు. దీంతో అడవుల్లో చేపట్టే గాలింపు చర్యల్లో డీఆర్జీ యూనిట్లు కీలకంగా మారాయి. అంతేకాదు పారిశ్రామికీకరణ, పట్టణీకరణ లేక విద్యావకాశాలకు దూరంగా ఉన్న స్థానిక యువతకు వెంటనే లభించే ఉపాధి మార్గంగా డీఆర్జీ యూనిట్లు మారాయి. అయితే జవాన్ల వయోభారం, ఫిజికల్ ఫిట్‌నెస్ డీఆర్జీ యూనిట్లకు మైనస్‌గా మారింది.

బస్తర్ ఫైటర్స్..

డీఆర్జీతో వచ్చిన సానుకూల ఫలితాలను దృష్టిలో ఉంచుకొని లోకల్ యంగ్ టీమ్‌తో బస్తర్ ఫైటర్స్‌ను 2022లో అందుబాటులోకి తెచ్చారు. 300 మందితో కూడిన మొదటి యూనిట్‌కు నోటిఫికేషన్ ఇస్తే ఏకంగా 40 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. జిల్లాకు 300 మంది జవాన్లతో కూడిన ఏడు యూనిట్లు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. ఇదే ఊపులో కేవలం మహిళలతో దంతేశ్వరీ ఫైటర్స్ అనే యూనిట్ కూడా మొదలైంది. యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో స్థానికేతర దళాలకు సాయమందించే పనిలో ఉన్న ఈ లోకల్ జవాన్లే ఎక్కువగా మావోలు జరిపే దాడుల్లో చనిపోతుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

కడిగిన ముత్యంలా కేటీఆర్ బయటకొస్తారు

- ఫార్ములా–ఈ వ్యవహారంలో ఏ విచారణకైనా హాజరవుతారు
- మాజీమంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ రేస్ కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఫార్ములా ఈ వ్యవహారంలో కేటీఆర్ ఎలాంటి తప్పుచేయనందున ఏ తరహా విచారణకై నా హాజరవుతారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మినహా అధికారులు, కోర్టులపై తమకు నమ్మకం ఉందని చెప్పారు. కేటీఆర్‌పై పెట్టిన కేసులో ఎలాంటి పస లేదని వ్యాఖ్యానించారు. మంగళవారం ఉదయం బంజారాహిల్స్ నందినగర్‌లోని కేటీఆర్ నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఫార్ములా ఈ రేస్ అంశంలో హైకోర్టు విచారణకు మాత్రమే అనుమతి ఇచ్చిందని, కానీ కొందరు కాంగ్రెస్ నేతలు ఆ అంశంలో తప్పు జరిగిందనే రీతిలో కోర్టు తీర్పును వక్రీకరిస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. అక్రమ కేసులు, అరెస్టులతో తమను బలహీన పరచాలనే రేవంత్ కుట్రలు ఫలించవని చెప్పారు.

రేవంత్ ఓటుకు నోటు కేసుతో పొంతన లేదు

రేవంత్‌రెడ్డి డబ్బు కట్టలతో పట్టుబడిన ఓటుకు నోటు కేసుతో ఫార్ములా ఈ రేస్ కేసుకు ఎలాంటి పొంతన లేదని హరీశ్‌రావు అన్నారు. ఫార్ములా ఈ కేసులో విచారణకు సిద్ధమని గతంలో కేటీఆర్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తూ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచేందుకే హైదరాబాద్‌కు ఫార్ములా ఈ రేస్‌ను రప్పించారని చెప్పారు. ఫార్ములా ఈ వ్యవహారంలో ఒక్క రూపాయి కూడా చేతులు మారనప్పుడు అవినీతి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రైతుబంధు ఎగవేత నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. సర్వే నివేదికలన్నీ రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా వస్తుండటంతో ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో మాత్రం వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేదాకా వదలకుండా వెంట పడతామని హెచ్చరించారు.

కేటీఆర్ జైలుకెళ్తారని బీఆర్‌ఎస్ భయం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా – ఈ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్ జైలుకు పోతారనే భయం బీఆర్‌ఎస్‌కు పట్టుకుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తన అవినీతి, అక్రమాలతో కేటీఆర్ ఊచలు లెక్కపెడతారని స్పష్టం చేశారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. లొట్టపీసు కేసు అని వ్యాఖ్యానించిన కేటీఆర్.. క్వాష్ పిటిషన్ వేశారని ఎద్దేవా చేశారు. హైకోర్టు తీర్పు కేటీఆర్‌కు చెంపపెట్టు అని, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందన్నారు. విచారణకు వెళ్లడానికే కేటీఆర్ భయపడ్డారని, గతంలో కేటీఆర్‌ను అరెస్టు చేస్తే అల్లర్లు చేయాలని చూశారని ఆరోపించారు. అవినీతి అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు హరీశ్‌రావు ప్రయత్నం చేస్తున్నారన్నారు.

అవినీతితో ఇమేజ్ పెరుగుతుందా? : వీరేశం

సాక్షి, హైదరాబాద్: అవినీతి చేస్తే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందా అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కేటీఆర్‌ను ప్రశ్నించారు. కేటీఆర్ జైలుకు పోవడం ఖాయమన్న విషయం అర్థమైపోయి బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిపైన అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, అవినీతి అక్రమాలు బయటకు వస్తుంటే వాటిని డైవర్ట్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫార్ములా–ఈ కారు రేస్ కేసు లొట్టపీసు, తుపేల్ కేసు అయితే ఎందుకింత గగ్గోలు పెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

సుప్రీంలో న్యాయపోరాటం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి • 'క్వాష్' కొట్టివేతపై సర్వోన్నత న్యాయస్థానానికి

- న్యాయవాదుల సమక్షంలో ఏసీబీ విచారణ జరిపేలా హైకోర్టుకు..
- కోర్టు నాకు ఉరిశిక్ష వేసినట్లుగా కాంగ్రెస్ నాయకులు చంకలు గుద్దుకుంటున్నారు
- రేవంత్ మొగోడైతే ఫార్ములా–ఈపై తన జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో చర్చ పెట్టాలని సవాల్
- హైకోర్టు తీర్పు నేపథ్యంలో కేటీఆర్‌తో పార్టీ ముఖ్యనేతల భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అధికారాన్ని అడ్డు పెట్టుకుని తనపై బురదచల్లేందుకు పెట్టిన అక్రమ కేసులపై పోరాడేందుకు రాజ్యాంగం, చట్టపరంగా ఉన్న హక్కు లను ఉపయోగించుకుంటానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏసీబీ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ తాను దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంపై సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. అక్కడ న్యాయపోరాటం కొనసాగుతుందన్నారు. మరోవైపు 9న జరిగే ఏసీబీ విచారణకు తన న్యాయవాదులతో పాటు హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బుధవారం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు. హైకోర్టు నుంచి ఉపశమనం దొరికితే ఏసీబీతో పాటు ఈ నెల 16న ఈడీ విచారణకు కూడా హాజరవుతానని ప్రకటించారు. మంగళవారం రాత్రి కేటీఆర్ బంజారాహిల్స్‌లోని నందినగర్ నివాసంలో పార్టీ నేతలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.

లొట్టపీసు కేసులో శునకానందం

'చట్టంపై గౌరవంతో ఏసీబీ విచారణకు సోమవారం న్యాయవాదితో కలిసి వెళ్లి 45 నిమిషాలు ఎదురుచూశా. లగచర్ల కేసులో పట్నం నరేందర్‌రెడ్డి ఇవ్వని స్టేట్‌మెంట్‌ను కూడా ఇచ్చినట్లుగా మీడియాకు లీకులు ఇచ్చారు. దీనిని దృష్టిలో పెట్టుకుని న్యాయవాదుల సమక్షంలో విచారణ జరగాలని కోరుకుంటే నా హక్కులకు భంగం వాటిల్లేలా చేశారు. న్యాయవాదుల సమక్షంలోనే ఏసీబీ



నందినగర్ నివాసంలో పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

విచారణ జరగాలని కోరుతూ హైకోర్టుకు వెళ్తున్నా. ఏసీబీ తప్పుడు ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయమంటూ నేను వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేస్తే నాకు ఉరిశిక్ష వేసినట్లుగా కాంగ్రెస్ నాయకులు చంకలు గుద్దుకుంటున్నారు.

బ్రోకర్లు, దొంగలకు అవినీతే కన్పిస్తుంది

ఫార్ములా–ఈ వ్యవహారంలో అసెంబ్లీ సమావేశాల్లో చర్చ పెట్టకుండా సీఎం పారిపోయాడు. రేవంత్.. మొగోడైతే తన జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ప్రత్యక్ష చర్చ పెట్టాలి. అవినీతిపరులు, రూ.50 లక్షల సంచులతో దొరికిన బ్రోకర్లు, దొంగలకు ప్రతి పనిలో అవినీతి కనిపిస్తుంది. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నా మీద లొట్టపీసు కేసు పెట్టి చిట్టినాయుడు పైశాచిక, శునకానందం పొందుతున్నాడు. సీఎం నోట వచ్చేది వేదవాక్కులు, సీఎం ఆఫీసు నుంచి వచ్చే లీకులు సూక్తులు కాదు. దుర్మార్గుల నుంచి చట్టపరమైన రక్షణ కోరితే కాంగ్రెస్ నేతలు ఆగమవుతున్నారు. కొందరు మంత్రులు న్యాయమూర్తుల తరహాలో శిక్షలు వేస్తున్నారు..'అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేను అణాపైసా అవినీతికి పాల్పడలేదు

'ఫార్ములా –ఈ రేస్‌లో అణాపైసా అవినీతి జరగలేదు. నేను అణాపైసా అవినీతికి పాల్పడలేదు. హైకోర్టు విచారణకు మాత్రమే అనుమతించింది, కుంభకోణం అని ఎక్కడా చెప్పలేదు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్, మేఘా ఇంజనీరింగ్ కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పేరిట రూ.4,600 కోట్లు పనులు పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి మేఘా సంస్థ ఎలక్టోరల్ బాండ్లు ఇవ్వడం క్విడ్ ప్రోకో కిందకు వస్తుందా లేదా మంత్రి పొంగులేటి చెప్పాలి. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీటి తరలింపు, మూసీ సుందరీకరణ పనులు కూడా మేఘా సంస్థకు ఇస్తున్నట్లు సమాచారం వచ్చింది. ఓ కాంట్రాక్టర్ మంత్రి, ఓ బ్రోకర్ ముఖ్యమంత్రి దీనికి సమాధానం చెప్పాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి బీజేపీ రక్షణ కవచంగా నిలుస్తోందని విమర్శించారు.

కేటీఆర్ నివాసానికి పార్టీ నేతలు

కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు కేటీఆర్ నివాసానికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ కవిత కూడా అక్కడికి చేరుకుని పార్టీ నేతలతో మాట్లాడారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ గుప్తా నేతృత్వంలోని బీఆర్‌ఎస్ లీగల్ టీమ్‌తో కేటీఆర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. 35 పేజీల కోర్టు తీర్పును లీగల్‌టీమ్ అధ్యయనం చేయడంతో పాటు హైకోర్టులో కేటీఆర్ తరపున వాదించిన సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ దవేతో ఫోన్‌లో చర్చించారు. ఏసీబీ, ఈడీ తాజా నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించాలని న్యాయవాదులు సూచించినట్లు సమాచారం.

ఇంతకంటే బలంగా తిరిగి వస్తా: కేటీఆర్

'నా మాటలు గుర్తు పెట్టుకోండి.. ఈ ఎదురుదెబ్బ నుంచి ఇంతకంటే బలంగా తిరిగి వస్తా. మీ అబద్ధాలు నన్ను పడగొట్టలేవు. మీ విమర్శలు నా స్థాయిని తగ్గించలేవు. నా లక్ష్యాన్ని మీ చర్యలు అడ్డుకోలేవు. మీ అరుపులు, పెడబొబ్బలు నా గొంతు నొక్కలేవు. నేటి అడ్డంకులే రేపటి విజయానికి బాటలు వేస్తాయి. నిజం ఎప్పటికైనా గెలిచి తీరుతుంది. ప్రపంచమంతా త్వరలో దీనిని చూసి తీరుతుంది. మన న్యాయ వ్యవస్థపై నాకు అచంచల విశ్వాసం ఉంది. సత్యం కోసం నా పోరాటం కొనసాగుతుంది..'అని కేటీఆర్ 'ఎక్స్'వేదికగా పేర్కొన్నారు.

'ఫార్ములా-ఈ' కేసులో రేవంత్‌కే శిక్ష: జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ రేస్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డికే శిక్ష పడుతుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. కేటీఆర్‌పై రేవంత్ సర్కారు కేసులు కుట్రపూరితమని మండిపడ్డారు. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డితో కలిసి జగదీశ్‌రెడ్డి మంగళవారం నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో మీడియాతో మాట్లాడారు. అక్రమ కేసులను ఎదుర్కొని కేటీఆర్ నిర్దోషిగా బయట పడతారన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు ఫార్ములా–ఈ పేరిట కేటీఆర్‌పై అక్రమ కేసు బనాయించారని చెప్పారు. కేటీఆర్‌కు ఏసీబీ, ఈడీ నోటీసులు ఇవ్వడంతో కాంగ్రెస్, బీజేపీ మైత్రి బయట పడిందన్నారు. పాలన వైఫల్యాలను కప్పి పుచ్చు కునేందుకు సీఎం ఫార్ములా–ఈ రేస్ అంశం పేరిట హంగామా చేస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం

అక్రమ కేసులతో రేవంత్ ప్రభుత్వం ప్రతిపక్ష నేతల గొంతును నొక్కే ప్రయత్నం చేస్తోందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. మహిళా నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దర్యాప్తు సంస్థలు జేబు సంస్థగా మారాయన్నారు. ఫార్ములా–ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చకు ముందుకు రాని ప్రభుత్వం ఏడాది తర్వాత కేసులు పెడుతోందని మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు.

దర్యాప్తు అడ్డుకోలేం

▶ మొదటి పేజీ తరువాయి

హెచ్‌ఎండీఏ ఒప్పందం చేసుకోవడం వెనుక నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పాత్ర ఉందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఖజానాకు ఆర్థిక నష్టం వాటిల్లిందంటూ మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. దీంతో గత నెల 20న ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ గత నెల 20న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపి డిసెంబర్ 31న తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం..మంగళవారం ఉదయం 35 పేజీల తీర్పు వెలువరించింది.

సాక్ష్యాల సేకరణకు అవకాశం ఇవ్వాలి

'ఆర్థిక శాఖ అనుమతి లేకుండా రూ.54,88,87,043 నగదు రెండు దఫాలుగా విదేశీ కంపెనీకి చెల్లించాల్సిందిగా హెచ్‌ఎండీఏను నాటి మంత్రి కేటీఆర్ ఆదేశించారనేది ఆరోపణ. దురుద్దేశంతో నిధులు బదిలీ చేయమని ఆదేశించారా? తన లబ్ధి కోసం చెల్లించమన్నారా? మూడో పార్టీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారా? అనేది దర్యాప్తులో తేలుతుంది. హెచ్‌ఎండీఏ నిధుల దుర్వినియోగం, అనుమతి లేకుండా బదిలీ జరిగినట్టుగా ప్రాథమిక ఆధారాలు తెలియజేస్తున్నాయి. విచారణ జరిపేందుకు ఇవి సరిపోతాయి. ఆరోపణలపై నిజానిజాలు నిగ్గుతేలాలంటే దర్యాప్తు చేయడానికి అవకాశం ఇవ్వాలి. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మరుసటి రోజే దాన్ని కొట్టివేయాలంటూ దాఖలైన ఇలాంటి పిటిషన్‌పై గతంలో సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. దర్యాప్తు చేయడానికి అధికారులకు అవకాశం ఇవ్వకుండా ఎఫ్ఐఆర్ రద్దు చేసిన హైకోర్టు తీరును తప్పుబట్టింది. ఈ కేసులో కూడా డిసెంబర్ 18న ఫిర్యాదు, 19న ఎఫ్ఐఆర్ దాఖలు చేయగా, 20న కోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. దర్యాప్తు సంస్థలు విచారణ చేయడానికి, సాక్ష్యాలను సేకరించడానికి సహేతుకమైన అవకాశం ఇవ్వాలి. అందుకే ఈ కేసు దర్యాప్తును తొందరపడి అడ్డుకోవాలని ఈ కోర్టు అనుకోవడం లేదు. దురుద్దేశం, ఆరోపణలు, నిజాయితీ లేకుండా వ్యవహరించారా? లేదా? అనేది విచారణలో తేలుతుంది. ఇప్పుడు దర్యాప్తును అడ్డుకోవడం తొందరపాటు చర్యే అవుతుంది.

ఈ దశలో కోర్టుల మినీ ట్రయల్ సరికాదు

నేరం జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో వెల్లడించాల్సిన అవసరం లేదు. కేసు దర్యాప్తు ప్రాథమిక దశలో ఉండగా కోర్టులు మినీ ట్రయల్ నిర్వహించడం సరికాదు. పిటిషనర్‌పై ఐపీసీ సెక్షన్ 409, అవినీతి నిరోధక చట్టంలోని 13(1)(ఎ), 13(2) వంటి సెక్షన్ల కింద కేసు నమోదయ్యింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 528 మేరకు ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసేందుకు కోర్టుకున్న అధికారం పరిమితం. కేసు విచారణ ప్రక్రియ దుర్వినియోగం అవుతున్నప్పుడు, చట్ట దుర్వినియోగానికి దారితీసే సందర్భాల్లోనే చాలా అరుదుగా కోర్టుల జోక్యానికి వీలుంది. దర్యాప్తు అధికారాలను కోర్టులు తమ చేతుల్లోకి తీసుకోబోవు. ఈ కేసులో సెక్షన్ 528 కింద కోర్టు తన స్వాభావిక అధికారాన్ని వినియోగించి ఆరోపణలపై విచారణ చేపట్టబోదు.

ఆలస్యం జరిగిందనే కారణంతో కొట్టివేత కుదరదు

భజన్‌లాల్, నిహారిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇక్కడి కేసుకు వర్తించవు. 14 నెలలు ఆలస్యంగా కేసు నమోదు అయ్యిందని చెప్పి ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కోరడానికి వీల్లేదు. మంత్రిగా చేసిన వాళ్లపై కేసు నమోదుకు వీల్లేదన్న పిటిషనర్ వాదన ఆమోదయోగ్యంగా లేదు. ఏసీబీ కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు పూర్తి కాకుండానే ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కోరడం చట్ట వ్యతిరేకం. ఎఫ్ఐఆర్ రద్దు చేయడానికి అర్హమైనదా, కాదా అనే అంశంలోకి వెళ్లే ముందు పిటిషనర్‌పై ఉన్న అభియోగాలపై దర్యాప్తు జరగాల్సి ఉంది. హెచ్‌ఎండీఏ అనేది ప్రత్యేక సంస్థ. ఆస్తులు ఉండటమే కాకుండా అభివృద్ధిలో భాగంగా పలు ఒప్పందాలు చేసుకోవడానికి అధికారమున్న సంస్థ. పురపాలక శాఖ పరిధిలోనే ఇది పని చేస్తుంది. ఆ శాఖ అప్పటి మంత్రిగా పిటిషనర్ అధీనంలోనే హెచ్‌ఎండీఏ విధులు నిర్వహించింది.. ఆదేశాలు పాటించింది. ఈ కేసులో ఫార్ములా–ఈ రేసు నిర్వహించిన సంస్థ ఆర్థికంగా లబ్ధి పొందినా, ఆ సంస్థను నిందితుల జాబితాలో చేర్చలేదని పిటిషనర్ వాదించారు. అయితే ఇది ఏసీబీ దర్యాప్తులో తేలే అంశం. మొత్తంగా చూస్తే ఏసీబీ ఎఫ్ఐఆర్‌ను ప్రాథమిక దశలోనే కొట్టివేయలేం..' అని ధర్మాసనం స్పష్టం చేసింది. కేటీఆర్‌ను అరెస్టు చేయరాదంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పది రోజులపాటు పొడిగించాలన్న కేటీఆర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు అభ్యర్థనను తోసిపుచ్చింది. క్రిమినల్ కేసుల్లో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును నేరుగా సుప్రీంకోర్టులోనే సవాల్ చేయాల్సి ఉంటుంది. విచారణ జరిపే అధికారం హైకోర్టు ద్విసభ్య ధర్మాసనానికి ఉండదు.

హత్యాయత్నానికి ఆధారాలు లేవు

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కేసులో ట్విస్ట్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎక్సైజ్ మంత్రిగా పనిచేసిన వి.శ్రీనివాస్‌గౌడ్ హత్యకు కుట్ర..ఈ విషయం బయటకు పొక్కకుండా ఇద్దరిపై హత్యాయత్నానికి సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. దర్యాప్తులో హత్యాయత్నం, హత్యకు కుట్ర ఆరోపణలకు సంబంధించి పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు ఇటీవల న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పేట్ బషీరాబాద్ ఠాణాలో 2022 ఫిబ్రవరి 25న ఈ కేసు నమోదైంది. నాటకీయ పరిణామాల మధ్య ఎనిమిది మంది నిందితుల్ని సైబరాబాద్ పోలీసులు ఢిల్లీలో అరెస్టు చేశారు. సుదీర్ఘ కాలం దర్యాప్తు చేసిన సైబరాబాద్ పోలీసులకు శ్రీనివాస్‌గౌడ్ హత్యకు కుట్ర, ఈ విషయం తెలిసిన ఫారూఖ్, హైదర్ అలీలపై హత్యాయత్నాలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆయుధాలు స్వాధీనం కావడంతో కేవలం ఆయుధ చట్టం కింద మాత్రమే అభియోగాలు నమోదు చేశారు. ఇందులోనూ మొత్తం ఎనిమిదిమంది నిందితుల్లో కేవలం రాఘవేందర్‌రాజు, నాగరాజు, రవి పాత్ర పైనే ఆధారాలు ఉండటంతో కేవలం ఈ ముగ్గురి పైనే కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు.

నేడు పీఏసీ భేటీ


- ఏడాది పాలన, ఆరు గ్యారంటీల అమలు, స్థానిక ఎన్నికలే ఎజెండా
- ఈనెల 26 తర్వాత సీఎం జిల్లాల పర్యటనపైనా చర్చ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం బుధవారం జరగనుంది. గాంధీభవన్‌లో సాయంత్రం ఆరు గంటలకు జరగనున్న ఈ సమావేశానికి ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో పాటు మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ మాజీ అధ్యక్షులు, ఇతర పీఏసీ సభ్యులు హాజరు కానున్నారు. సమావేశంలో భాగంగా రాష్ట్రంలో ఏడాది కాంగ్రెస్ పాలన, ఆరు గ్యారంటీల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావడమే ఎజెండాగా చర్చ జరగనున్నట్టు సమాచారం.

అమాత్యుల పనితీరు కూడా..

టీపీసీసీ పీఏసీ సమావేశంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, పార్టీ పనితీరుపై, ప్రజలకు జరుగుతున్న మంచిని క్షేత్రస్థాయికి తీసుకెళుతున్న వైనం, పార్టీ కేడర్ కదలికలు తదితర అంశాలపై కూడా చర్చ జరగనున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా చాలా మంది మంత్రులు తమ శాఖలు, తమ జిల్లాలు, నియోజకవర్గాలకే పరిమితమవుతున్నారుతప్ప, పూర్తిగా ప్రభుత్వాన్ని భుజాన వేసుకునే ధోరణిలో పనిచేయడం లేదనే అభిప్రాయంలో ఏఐసీసీ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కేసీ వేణుగోపాల్ దిశానిర్దేశం చేసే అవకాశాలున్నట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మంత్రుల నిస్తేజం, జిల్లాల పర్యటనలపై ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావించినట్టు సమాచారం. ఇటీవల తనను కలిసిన సన్నిహితుడైన నేతతో సీఎం రేవంత్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన తర్వాత మొహమాటాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, అన్ని స్థాయిల్లోనూ కరాఖండిగా ముందుకెళ్తానని చెప్పినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నేడు జరగనున్న పీఏసీ సమావేశం ఒకింత వాడీవేడిగానే జరుగుతుందని సమాచారం. ఇక, ఈనెల 26 తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనలు, అంబేడ్కర్‌ను అవమానిస్తూ అమిత్‌షా మాట్లాడిన మాటలపై గ్రామస్థాయి వరకు నిర్వహించాల్సిన ఉద్యమ కార్యాచరణ తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్టు సమాచారం.

ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులను పెండింగ్‌లో పెట్టొద్దు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి అధికారులు పనిచేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అన్ని స్థాయిల్లో అధికారులు నిర్లిప్తత వీడాలన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల ప్రగతిపై మంగళవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే విజ్ఞప్తులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అది తమ పరిధిలో లేని అంశమైతే ఆ విషయాన్ని ప్రజాప్రతినిధులకు తెలపాలని సూచించారు. మార్కెట్ కమిటీల పునర్విభజనకు వస్తున్న ప్రతిపాదనలను దీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టడంపై మార్కెటింగ్ కార్యాలయ ఉన్నతోద్యోగిపై మంత్రి అసహనం వ్యక్తంచేస్తూ.. మూడు రోజుల్లో అన్ని విజ్ఞప్తులపై నివేదిక పంపాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌ను ఆదేశించారు. రాష్ట్రానికి వచ్చే కేంద్ర ప్రభుత్వ నిధులను పూర్తిగా వినియోగించి, అదనపు నిధుల కోసం కేంద్రానికి ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. రైతుల వద్దకే వెళ్లి మట్టి నమూనా పరీక్షలు చేసేందుకు వీలుగా సంచార పరీక్ష కేంద్రాలను జిల్లాల వారీగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాటిలైట్ చిత్రాలను అందించే కంపెనీల ప్రతినిధులతో మంత్రి సచివాలయంలో భేటీ అయ్యారు.

కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా అవసరమా?

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



డిచ్‌పల్లి (నిజామాబాద్ రూరల్): పదేళ్లు అధికారాన్ని అనుభవించి, అధికారం పోగానే ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా అవసరమా? అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. కేసీఆర్ కావాలనే అసెంబ్లీకి రావడం లేదా?.. లేక కేటీఆర్, హరీశ్‌రావు ఆయన్ను ఫామ్‌హౌస్‌లో బంధించి ఉంచారా అనే అనుమానం కలుగుతోందన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని కేఎన్ఆర్ గార్డెన్స్‌లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మహేశ్ మాట్లాడారు. మొన్నటి దాకా దమ్ముంటే అరెస్ట్ చేయండి.. జైలుకు వెళ్తా అని బీరాలు పలికిన కేటీఆర్.. ఇప్పుడు విచారణ ఎదుర్కోవడానికి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. అసలు విచారణే వద్దు.. ఏసీబీ కేసు కొట్టివేయాలని కేటీఆర్ హైకోర్టును ఆశ్రయిస్తే, ఆ పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడంతో కేటీఆర్‌లో భయం మొదలైందని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ప్రభుత్వ విప్ లక్ష్మణ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, ప్రొటోకాల్ ఇన్‌చార్జి వేణుగోపాల్, నుడా చైర్మన్ కేశ వేణు, ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

ఏస్ నెక్ట్స్ జెన్, గ్రీన్‌కో కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు

▶ మొదటి పేజీ తరువాయి

అనుబంధ సంస్థల నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో కోట్ల రూపాయలు వచ్చాయనే సమాచారంపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగానే ఫార్ములా ఈ రేసుకు మొదట్లో స్పాన్సర్‌గా వ్యవహరించిన ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు దాని అనుబంధ సంస్థ గ్రీన్‌కో కార్యాలయాల్లో మంగళవారం ఏసీబీ బృందాలు ఏకకాలంలో సోదాలు చేపట్టాయి. హైదరాబాద్ నగరంలోని మాదాపూర్‌లో సైబర్ టవర్స్‌లో, మచిలీపట్నంలోని గ్రీన్‌కో కార్యాలయాల్లో మంగళవారం రాత్రి వరకు తనిఖీలు కొనసాగాయి.

సహకరించని సిబ్బంది!

ఏసీబీ అధికారుల తనిఖీలకు ఆయా సంస్థల సిబ్బంది ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. మాదాపూర్ సైబర్ టవర్స్‌లోని గ్రీన్‌కో కార్యాలయంలో సోదాలకు ఆ సంస్థ సిబ్బంది మొదట అనుమతించలేదు. అధికారులు సెర్చ్ వారెంట్ వారెంట్ చూపడంతో వెనక్కి తగ్గారు. ఇక అదే ప్రాంతంలోని ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో అధికారులు సోదాలు జరిపారు. పలు కీలక పత్రాలు, ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. మరోవైపు ఏపీలోని కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఉన్న గ్రీన్ కో అనుబంధ సంస్థలైన ఏస్ అర్బన్ రేస్, ఏస్ అర్బన్ డెవలపర్స్ కార్యాలయాల్లోనూ మంగళవారం రాత్రి వరకు సోదాలు కొనసాగాయి. పలు ఫైళ్లతో పాటు హార్డ్ డిస్క్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. మచిలీపట్నంలో కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న గ్రీన్ కో కంపెనీకి చెందిన గెస్ట్‌హౌస్‌లో కూడా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు.

కేటీఆర్‌కు తాజాగా ఈడీ సమన్లు

ఫార్ములా–ఈ కారు రేస్ కేసు దర్యాప్తులో భాగంగా కేటీఆర్‌కు ఈడీ అధికారులు మరోమారు సమన్లు జారీ చేశారు. వాస్తవానికి కేటీఆర్ మంగళవారం ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సి ఉన్నా..తనకు మరికొంత సమయం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 16న విచారణకు హాజరుకావాలంటూ కేటీఆర్‌కు మంగళవారం మరోమారు ఈడీ అధికారులు సమన్లు జారీ చేశారు. కాగా ఈడీ అధికారులు ఇప్పటికే ఇచ్చిన సమన్ల ప్రకారం ..ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డి బుధవారం ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరుకానున్నారు.

కాంగ్రెస్, బీజేపీ పరస్పర దాడులు

అడ్డుకునే ప్రయత్నం చేసిన బీజేపీ కార్యకర్తలు.. బీజేపీ కార్యాలయంపైకి రాళ్లు విసిరిన కాంగ్రెస్ కార్యకర్తలు

ముగ్గురు బీజేపీ నేతలతోపాటు అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలు

అనంతరం గాంధీభవన్ ముట్టడికి ప్రయత్నించిన బీజేపీ కార్యకర్తలు

కాంగ్రెస్ నేతల ఫ్లెక్సీల చించివేత

రమేశ్ బిదూరీ వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించిన కాంగ్రెస్ శ్రేణులు



బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం



గాంధీభవన్ వద్ద బీజేవైఎం కార్యకర్తల్ని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్/అబిడ్స్: హైదరాబాద్‌లోని నాంపల్లి వద్ద బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ ప్రియాంకాగాంధీని ఉద్దేశించి ఢిల్లీ బీజేపీ నేత రమేశ్ బిదూరీ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహించిన కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు వచ్చారు. వారిని అడ్డుకునేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ కార్యాలయంపైకి కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. కర్రలతో దాడికి ప్రయత్నించడంతో ప్రతిగా బీజేపీ కార్యకర్తలు ఎదురుదాడికి ఉపక్రమించారు. దీంతో రెండు పార్టీల కార్యకర్తల మధ్య పరస్పర దాడులతో ఘర్షణ వాతావరణం నెలకొనగా, పోలీసులు లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. రాళ్లదాడిలో బీజేపీ ఎస్సీ మోర్చా కార్యకర్త నందు తలకు తీవ్ర గాయమైంది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ కూడా గాయపడ్డారు. వారిని పార్టీ నేతలు పక్కనే ఉన్న కేర్ ఆస్పత్రికి తరలించారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్‌కు కూడా గాయాలయ్యాయి. అనంతరం బీజేపీ కార్యాలయానికి కొంత దూరంలో రమేశ్ బిదూరీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ కార్యకర్తలు దహనం చేశారు. ఈ ఘర్షణ దాదాపు గంటపాటు కొనసాగింది. అనంతరం ఇరు పార్టీల నాయకులు పరస్పరం ఫిర్యాదులు చేసుకోగా, కేసులు నమోదయ్యాయి. అబిడ్స్ డివిజన్ పోలీసులతోపాటు అదనపు పోలీసు బలగాలు పలువురిని అదుపులోకి తీసుకొని అక్కడి నుంచి పంపించేశాయి.

గాంధీభవన్ ముట్టడికి బీజేపీ కార్యకర్తలు

తమ పార్టీ కార్యాలయంపై దాడికి ప్రతిగా బీజేపీ కార్యకర్తలు గాంధీభవన్‌కు చేరుకొని బారికేడ్లు తొలగించి ముట్టడికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు కల్పించుకొని వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులతో బీజేవైఎం కార్యకర్తలు వాదనకు దిగారు. అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కొందరు బీజేపీ కార్యకర్తలు అక్కడున్న కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీలను చించేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరు హెల్మెట్‌లను గాంధీభవన్‌పైకి విసిరారు. ఈ దాడిలో మీడియా ప్రతినిధులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. దీంతో గాంధీభవన్ వద్ద మరోసారి ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రేవంత్‌రెడ్డి సంజాయిషీ ఇవ్వాలి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్

బీజేపీ కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి సంజాయిషీ ఇవ్వాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ తలుచుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్ల మీద తిరగలేరని ఒక ప్రకటనలో హెచ్చరించారు. దాడుల విషయంలో బీజేపీ మరో నిర్ణయం తీసుకుంటే రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య ఎదురవుతుందని హెచ్చరించారు. పోలీసులను వెంట తీసుకొని బీజేపీ కార్యాలయ మెయిన్ గేటు వద్దకు వచ్చి బీజేపీ కార్యకర్తలపై, పార్టీ ఆఫీసుపై కర్రలు, రాళ్లతో దాడిచేయడం దుర్మార్గమన్నారు. 'కాంగ్రెస్ కార్యకర్తలు, గూండాలు దాడి చేస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. దీనిపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ స్పందించాలి' అన్నారు.

మేం తలుచుకుంటే..: కేంద్ర మంత్రి బండి సంజయ్

బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ సహా కాంగ్రెస్ కార్యాలయాల పునాదులు కూడా మిగలవని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అధికార పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడులు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. తప్పుడు వ్యాఖ్యలు ఎవరు చేసినా ఖండించాల్సిందే.. అంతేగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు.

సీఎం బాధ్యత వహించాలి: లక్ష్మణ్

➤ ఈ దాడులకు సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పూర్తి బాధ్యత వహించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 'ఇలాంటి గూండా రాజకీయాలు సాగవు.. మిస్టర్ రేవంత్‌రెడ్డి ఖబడ్దార్. చిల్లర రాజకీయాలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఈ ఘటన వెనుక రేవంత్ కుట్ర దాగుంది' అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. బీజేపీ కార్యాలయంపై గూండాలు, రౌడీషీటర్లు కాంగ్రెస్ కార్యకర్తల ముసుగులో దాడి చేశారని, ఈ దాడికి సీఎం రేవంత్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బాధ్యత వహించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. పార్టీ కార్యాలయాల మీద దాడిచేసే సంస్కృతి సిగ్గుచేటని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు.

నిరసన తెలపాలి తప్ప దాడి చేస్తారా?

యూత్ కాంగ్రెస్ నేతలను మందలించిన టీపీసీసీ అధ్యక్షుడు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నేతల దాడిని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఖండించారు. ఈ సంఘటనను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ తీవ్రంగా పరిగణించారు. ప్రియాంకా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ రమేశ్ బిదూరీ వైఖరిని ఖండిస్తూ నిరసనలు, ఆందోళన చేయాలి తప్ప.. ఆ పార్టీ కార్యాలయంపై దాడులు చేయడం సరైంది కాదని మంగళవారం ఒక ప్రకటనలో మహేశ్‌గౌడ్ హితవు పలికారు. బీజేపీ నేతలు కూడా దాడులు చేయడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడేందుకు బీజేపీ నేతలు సహకరించాలని కోరారు. కాగా, బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన యూత్ కాంగ్రెస్ నేతలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ హెచ్చరించారని, త్వరలోనే వారిని పిలిపించి మందలిస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

బీజేపీ దేశానికి క్షమాపణ చెప్పాలి

ప్రియాంకాగాంధీపై చేసిన వ్యాఖ్యలను ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు

మీడియాతో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

సాక్షి ప్రతినిధి, ఖమ్మం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

కాంగ్రెస్ నేత, ఎంపీ ప్రియాంకాగాంధీపై బీజేపీ నాయకుడు రమేశ్ బిదోరి చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆ పార్టీ కేంద్ర నాయకత్వం దేశానికి క్షమాపణ చెప్పాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ కుటుంబ సభ్యురాలైన ప్రియాంకాగాంధీపై బీజేపీ నేత వ్యాఖ్యలను దేశంపై ప్రేమ, అభిమానం, మహిళలపై గౌరవం ఉన్నవారు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలంలో పలు కార్యక్రమాలకు హాజరైన ఆయన, వెంకటాపురంలో మీడియాతో మాట్లాడారు. దేశ సంస్కృతిని దిగజార్చే పరిస్థితి తీసుకొచ్చినందుకు బీజేపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. ఇక బీజేపీ కార్యాలయం, గాంధీభవన్‌పై జరిగిన దాడులనూ ఉపేక్షించేది లేదని, రాష్ట్రంలో శాంతిభద్రతలను పటిష్టంగా అమలు చేస్తామని చెప్పారు. ప్రియాంకాగాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బీజేపీ కేంద్ర నాయకత్వం ఖండించకపోవడాన్ని జీర్ణించుకోలేక తాత్కాలిక ఆవేశంతో కొందరు యువజన కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీ కార్యాలయంపై దాడి చేశారన్నారు. కాగా, ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం మండలాన్ని పర్యాటకానికి కేరాఫ్‌గా మారుస్తామని భట్టి వెల్లడించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సర్వే జరుగుతోందని, సంక్రాంతి పండుగ తర్వాత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ మొదలవుతుందని డిప్యూటీ సీఎం వెల్లడించారు.

స్వతంత్రంగా ధరణి ఫోరెన్సిక్!

ఫోరెన్సిక్ బృందాలకు స్వయంప్రతిపత్తి!

నేరుగా జిల్లా కలెక్టర్లతో అటాచ్

రెవెన్యూ ఉన్నతాధికారులతో సంబంధం లేకుండా పని

ఆడిట్ బాధ్యతలిచ్చేందుకు మూడు కంపెనీల పరిశీలన

అక్రమాలు తేలితే వెంటనే భూముల స్వాధీనం

బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు కూడా

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ ద్వారా రాష్ట్రంలో జరిగిన భూముల క్రయ, విక్రయాలపై ఫోరెన్సిక్ ఆడిటింగ్ చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ ఆడిటింగ్ చేసే ఫోరెన్సిక్ బృందాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని భావిస్తోంది. డిజిటల్ ఫుట్ ప్రింట్స్ ఆధారంగా భూ లావాదేవీల్లో జరిగిన అవకతవకలను గుర్తించే ప్రక్రియలో నిపుణులను మాత్రమే భాగస్వాములను చేయాలని నిర్ణయించింది. జిల్లాలవారీగా భూములను ఆడిటింగ్ చేసేందుకు రెవెన్యూ శాఖలోని ఉన్నతస్థాయి అధికారులతో సంబంధం లేకుండా ఈ నిపుణుల బృందాలను నేరుగా ఆయా జిల్లాల కలెక్టర్లతో అటాచ్ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ బాధ్యతలు అప్పగించేందుకు హైదరాబాద్‌కు చెందిన రెండు, ముంబైకి చెందిన ఒక కంపెనీ సామర్థ్యాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. రెవెన్యూ వ్యవహారాలు, సాఫ్ట్‌వేర్ అంశాల్లో ఆ కంపెనీల బలమే ప్రాతిపదికగా ఈ మూడింటిలో ఒక దానిని ఎంపిక చేయనుంది. ఇప్పటికే ధరణి పోర్టల్ వివరాల రీవ్యాంప్ ప్రక్రియ జరుగుతోంది. రానున్న 10–15 రోజుల్లో ఆ ప్రక్రియను పూర్తి చేసి, అనంతరం ఫోరెన్సిక్ ఆడిటింగ్ బాధ్యతలు అప్పగించే కంపెనీని ఎంపిక చేయాలన్న యోచనలో ప్రభుత్వ వర్గాలున్నట్టు సమాచారం.

భూముల స్వాధీనమే!

ఫోరెన్సిక్ ఆడిటింగ్‌లో భాగంగా తొలుత హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని భూముల లావాదేవీలను మాత్రమే పరిశీలించాలని ప్రభుత్వం భావించింది. తాజాగా సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో భూ అక్రమాలు బయటపడటంతో రాష్ట్ర వ్యాప్తంగా అనుమానం ఉన్న ప్రతి లావాదేవీని ఫోరెన్సిక్ ఆడిటింగ్‌లో పరిశీలించాలని నిర్ణయించింది. ఇందుకు 2014 కంటే ముందు ఉన్న నిషేధిత భూముల జాబితాను ప్రాతిపదికగా తీసుకోనుంది. ఈ జాబితాలోని భూముల్లో ఎన్ని పట్టా



భూములుగా మారాయి? ఎందుకు మారాయి? కోర్టు ఉత్తర్వుల పరిస్థితి ఏంటి? కోర్టు ఉత్తర్వులను సవాల్ చేశారా? అసలు కోర్టు ఉత్తర్వులు నిజమైనవేనా? మాజీ సైనికుల పేరిట మార్చిన భూముల్లో ఎన్ని అసలైనవి? మాజీ సైనికులకు ఆవార్డు చేసినట్టు బోగస్ డాక్యుమెంట్లు సృష్టించారా? పనివేళల్లో జరిగిన లావాదేవీలెన్ని? అర్ధరాత్రి తర్వాత ఏయే లావాదేవీలు జరిగాయి? ఏ కంప్యూటర్ నుంచి జరిగాయి? అనుమతి ఇచ్చింది ఎవరు? అనే అంశాలను సాంకేతిక సమాచారంతో సరిపోల్చి ఏం జరిగిందో నిర్ధారించనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం అక్రమాలు జరిగాయని తేలిన పక్షంలో వెంటనే సదరు భూములను స్వాధీనం చేసుకొని.. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం.

భారతీయులు 'ఖర్చు' పెట్టేస్తున్నారు!



ఇండియాలో తగ్గుతోన్న పొదుపు రేటు.. ప్రపంచంలో నాలుగో స్థానంలో భారత్

సాక్షి, అమరావతి: భారతీయులు పొదుపు తగ్గించుకొని ఖర్చులు చేయడానికే మొగ్గు చూపుతున్నారు. కొంతకాలంగా దేశీయ పొదుపు రేటు తగ్గుతూ వస్తోంది. అంతర్జాతీయంగా పొదుపు రేటులో 2,3 స్థానాల్లో నిలుస్తూ వచ్చిన భారత్ ఇప్పుడు నాలుగో స్థానానికి దిగజారిపోయింది. 2023-24 సంవత్సరానికి దేశ జీడీపీలో పొదుపు రేటు 30.2 శాతానికి పడిపోయింది. 2023-24 కి సంబంధించి దేశ జీడీపీ రూ.173.82 లక్షల కోట్లుగా ఉంటే అందులో పొదుపు మొత్తం రూ.52.49 లక్షల కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది 31.2%గా ఉన్న పొదుపు రేటు ఈ ఏడాది 1% పడిపోయింది. 2011-12లో దేశ పొదుపు రేటు అత్యధికంగా 34%గా నమోదైంది. అప్పటినుంచి పొదుపు రేటు క్రమేపి తగ్గుతూ ఇప్పుడు 30%కి చేరింది. రానున్న కాలంలో ఈ పొదుపు రేటు మరింత తగ్గే అవకాశం ఉందని ఆర్థిక వేత్తల అంచనా. కానీ అంతర్జాతీయ సగటు పొదుపు రేటు 28.2%తో పోలిస్తే ఇండియా పొదుపు రేటు అధికంగానే ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. చైనా ఆ దేశ జీడీపీ రేటులో 46.6% పొదుపుతో ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచింది. అమెరికాలో మాత్రం పొదుపు రేటు18.1%గా ఉంది.7 దేశాలు మాత్రమే 20% కంటే అధిక పొదుపు రేటును కలిగి ఉన్నాయి.

పొదుపు ఖాతాలు పెరుగుతున్నాయి..

పొదుపు రేటు తగ్గుతున్నా పొదుపు ఖాతాలు పెరుగుతున్నాయి. 18 ఏళ్లు నిండిన వారిలో 80% మందికి ఏదో ఒక ఆర్థిక ఖాతాను కలిగి ఉన్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. 2011లో ఈ సంఖ్య 50%గా ఉంటే అది ఇప్పుడు 80%కు పెరిగినట్లు పేర్కొంది. ప్రస్తుత మన దేశ జనాభాలో 18 ఏళ్లు నిండిన వారు 96.88 కోట్లుగా ఉన్నట్లు అంచనా. దీని ప్రకారం చూస్తే 77.5 కోట్ల మంది పొదుపునకు సంబంధించి ఏదో ఒక ఖాతాను కలిగి ఉన్నారు. మూడేళ్లుగా బ్యాంక్ డిపాజిట్లలో ఇన్వెస్ట్‌మెంట్స్‌ను తగ్గిస్తూ మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్, పీపీఎఫ్ వంటి ఇతర పథకాల్లో ఇన్వెస్ట్ చేయడానికి మొగ్గు చూపుతున్నారు. 2021లో 47.6 శాతంగా ఉన్న బ్యాంకు డిపాజిట్ల పొదుపు 2023 నాటికి 45.2%కు పడిపోయింది. ఇదే సమయంలో మ్యూచువల్ ఫండ్స్‌లో పొదుపు శాతం 7.6% నుంచి 8.4%కు పెరిగినట్లు ఎస్‌బీఐ పేర్కొంది.

దేశ జీడీపీలో ఆయా దేశాల పొదుపు రేటు ఇలా..

■ దేశం ■ పొదుపు శాతం

దేశం	పొదుపు శాతం
చైనా	46.6
ఇండోనేషియా	38.1
రష్యా	31.7
ఇండియా	30.2
మలేషియా	27.5
థాయ్‌లాండ్	25.7
కెనడా	23.5

నేడు విశాఖలో ప్రధాని పర్యటన



సాక్షి, అమరావతి/మహారాణిపేట: విశాఖ పర్యటనకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం రానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం సచివాలయం నుంచి అధికారులతో సమీక్షించారు విశాఖ పర్యటనలో భాగంగా ప్రధాని వర్చువల్‌గా 20 వరకూ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను చేయనున్నట్లు సీఎస్ చెప్పారు. సాయంత్రం 4.15 గంటలకు ప్రధాని..విమానంలో విశాఖకు చేరుకుంటారు. 5.30 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. 5.30 గంటల నుంచి 6.45 గంటల వరకూ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం సభా వేదిక వద్ద నుంచి వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి ప్రసంగిస్తారు. అనంతరం విశాఖ విమానాశ్రయానికి చేరుకుని భువనేశ్వర్ వెళ్తారు.

సిద్దిపేటలోనూ భూపందేరం!

- సిరిసిల్ల తరహాలోనే ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వ భూమి
- ఒకే సర్వే నంబర్‌లో 484 ఎకరాల భూమి ప్రైవేటుపరం
- ఎన్నికల షెడ్యూల్‌కు రెండు రోజుల ముందు అప్పగింత
- మరింత లోతుగా దర్యాప్తు చేయాలని ప్రభుత్వం నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైన తరహాలోనే సిద్దిపేట జిల్లాలోనూ భూ అక్రమాలు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. జిల్లా కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఒక్క సర్వే నెంబర్‌లోనే 484 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల పేరిట రిజిస్టర్ అయిందని రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడేందుకు రెండు మూడు రోజుల ముందే ఈ భూమిని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ప్రైవేటు వ్యక్తుల పేరిట రిజిస్టర్ చేశారని తేలింది. భూ బదలాయింపు ప్రక్రియ పూర్తి కాగానే భూముల చుట్టూ కంచె వేశారనే నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో వెంటనే సదరు సర్వే నెంబర్‌ను ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టిందని సమాచారం. వాస్తవానికి ఈ భూములపై ఎప్పటి నుంచో ప్రైవేటు వ్యక్తుల కన్ను ఉంది. ఉమ్మడి రాష్ట్రంలోనే కొన్ని భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయి. అప్పట్లోనే ఈ భూమిపై రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో పోరాడి గెలిచిందని నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. దీంతో ఈ భూముల విషయంలో మరింత లోతుగా దర్యాప్తు జరపాలని జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులను రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించినట్టు తెలిసింది.

సిరిసిల్ల బాధ్యులపై త్వరలోనే చర్యలు

సిరిసిల్ల జిల్లాలో వేల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైన విషయంలో బాధ్యులైన రెవెన్యూ అధికారులపై రెండుమూడు రోజుల్లో చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇటీవలే పదవీ విరమణ పొందిన ఓ ఆర్డీవో స్థాయి అధికారి, పదోన్నతులు పొందిన మరో ఇద్దరు అధికారులను ఇందుకు బాధ్యులుగా గుర్తించామని, వీరిపై చర్యలు తీసుకుంటామని రెవెన్యూ శాఖ వర్గాలు చెపుతున్నాయి.

10 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తాం!

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (తెన్హా) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేశ్ నేతృత్వంలోని ప్రతినిధులు ఆరోగ్య శ్రీ సీఈవోకు మెయిల్ ద్వారా లేఖ పంపారు. 12 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని కోరారు.

రాష్ట్రంలో 368 నెట్‌వర్క్ హాస్పిటల్స్

రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కింద రాష్ట్రంలో 368 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీతో పాటు ఉద్యోగులు, జర్నలిస్టులకు వైద్యం అందించే ఈహెచ్‌ఎస్, జేహెచ్ఎస్ పథకాలను కూడా చేర్చారు. ఈ పథకాల కింద చేసే చికిత్సలకు అయ్యే ఖర్చును ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ద్వారా చెల్లిస్తుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.672 కోట్లు ఉన్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు అధిక ప్రచారంతో నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ కేసులు పెరిగాయి. రేవంత్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల కింద ఇప్పటివరకు రూ.920 కోట్లు చెల్లించింది. ఇందులో పాత బకాయి రూ.672 కోట్లు పోను సుమారు రూ. 250 కోట్లు మాత్రమే కొత్తగా ఈ ఏడాది కాలంలో చెల్లించిందన్న మాట. దీంతో బకాయిలు భారీగా పేరుకుపోయాయి. 368 ఆసుపత్రులకు కలిపి సుమారు రూ.1000 కోట్లకు పైగా రీయింబర్స్‌మెంట్ రావలసి ఉందని యాజమాన్యాలు అంటున్నాయి. ఒక్కో ఆసుపత్రికి రూ.50 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు చెబుతున్నాయి. కొన్ని ఆసుపత్రులకు గత సంవత్సరం జనవరి బిల్లులు కూడా ఇప్పటి వరకు రాలేదు. ఈ నేపథ్యంలో 10వ తేదీలోపు బకాయిలు చెల్లించాలని, లేని పక్షంలో ఆ తేదీ నుంచే ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేయనున్నట్లు తెన్హా అధ్యక్షుడు వద్దిరాజు రాకేశ్ స్పష్టం చేశారు.

బకాయిలు రూ.500 కోట్లే: అధికారులు

ఆరోగ్యశ్రీ బకాయిలు రూ. 1,000 కోట్లు ఉన్నాయన్న వాదనను అధికారులు తోసిపుచ్చారు. రూ.500 కోట్ల వరకు ఉంటాయని తెలిపారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఏడాది కాలంలో రూ.920 కోట్లు చెల్లించామని, డిసెంబర్ చివరి వారంలోనూ రూ.40 కోట్ల బిల్లులను విడుదల చేశామన్నారు. 2014- 2023 మధ్య ఆరోగ్యశ్రీ బకాయిలు నెలకు సగటున రూ.52 కోట్ల చొప్పున గత సర్కారు చెల్లిస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ మధ్య ప్రతి నెలా నెట్‌వర్క్ ఆసుపత్రులకు సగటున రూ.72 కోట్లు చొప్పున చెల్లించినట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

సంగారెడ్డిలో శ్రవణ గ్రంథాలయం

- సాధారణ పుస్తకాలనూ స్కాన్ చేసి వాయిస్‌లోకి మార్చే సదుపాయం
- అంధుల జాతీయ సమాఖ్య వినతితో ఏర్పాటు చేస్తున్న జిల్లా కలెక్టర్
- స్థలం కేటాయించాలని రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీల డైరెక్టరేట్‌కు ప్రతిపాదనలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అంధుల కోసం ప్రత్యేకంగా ఆధునిక సాంకేతిక పరికరాలతో కూడిన శ్రవణ గ్రంథాలయం (ఆడియో లైబ్రరీ) సంగారెడ్డిలో ఏర్పాటు కానుంది. అంధుల జాతీయ సమాఖ్య తెలంగాణ శాఖ విజ్ఞప్తి మేరకు దీని ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి చర్యలు చేపట్టారు. ఏకకాలంలో సుమారు 50 మంది చదువుకొనేలా ఈ లైబ్రరీ కోసం అవసరమైన స్థలాన్ని జిల్లా కేంద్ర లైబ్రరీ ఆవరణలో కేటాయించాలని రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీల డైరెక్టరేట్‌కు ప్రతిపాదనలు పంపారు. ఈ తరహా సౌండ్ లైబ్రరీ గతంలో హైదరాబాద్‌లో ఉండేది. వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ దాన్ని నిర్వహించేది. అప్పట్లో ఆడియో క్యాసెట్ల ద్వారా అంధులు పుస్తకాల్లోని పాఠాలను వినేవారు. కానీ అది దశాబ్దం క్రితమే మూతబడింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కొన్ని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అంధుల కోసం పలు ఆడియో లైబ్రరీలు ఉన్నప్పటికీ వాటిలో పాత సాంకేతికతనే వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వపరంగా ఎక్కడా సౌండ్ లైబ్రరీ లేదని.. సంగారెడ్డిలో ఆధునిక పరికరాలతో ఏర్పాటు కానున్న సౌండ్ లైబ్రరీయే తొలి ప్రభుత్వ ఆడియో లైబ్రరీ కానుందని అంధుల జాతీయ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ పేర్కొన్నారు.

బ్రెయిలీ లిపి పాఠ్యపుస్తకాలు అంతంతే..

- అంధుల కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిలో ఉండే పుస్తకాలు ప్రస్తుతం అంతంత మాత్రంగానే అందుబాటులో ఉంటున్నాయి. దీంతో వారికి జ్ఞాన సముపార్జన ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక ఆడియో లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వ ప్రెస్‌లో ప్రచురితమవుతున్న బ్రెయిలీ లిపితో కూడిన పాఠ్య పుస్తకాలు పదో తరగతి వరకే అందుబాటులో ఉంటున్నాయి. ఇంటర్ ఆపై చదువుకొనే వారికి పూర్తిస్థాయిలో ఈ ప్రత్యేక లిపితో కూడిన పాఠ్యపుస్తకాలు అంతంత మాత్రంగానే లభిస్తున్నాయి. దీంతో చాలా మంది నిరుపేద దివ్యాంగులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఈ లైబ్రరీ ద్వారా ఈ సమస్యకు కొంత పరిష్కారం లభించనుంది.

డెహ్రాడూన్ ఎన్ఐవీహెచ్‌కు ప్రతినిధులు..

నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధుల బృందం త్వరలో ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఉన్న (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ విజువల్ డిసెబిలిటీ (ఎన్ఐఈపీవీడీ)ని సందర్శించనుంది. దివ్యాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పరిశోధన కేంద్రంలో ఉన్న ఆడియో లైబ్రరీ నిర్వహణ ఎలా ఉంది? ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలు వాడుతున్నారు? వంటి అంశాలపై ఈ బృందం అధ్యయనం చేయనుంది.

టెక్స్ టు వాయిస్..

- సాధారణ పుస్తకాలను స్కాన్ చేసి టెక్ట్స్‌ను వాయిస్ రూపంలోకి మార్చే సాంకేతికత ఈ లైబ్రరీలో ఉంటుంది. దీంతో దివ్యాంగులు సాధారణ పాఠకుల మాదిరిగా పుస్త కాలను చదువుకునేందుకు వీలు కలగనుంది.
- పోటీ పరీక్షలకు సంబంధించి బ్రెయిలీ లిపితో కూడిన స్టడీ మెటీరియల్ లభించడం చాలా కష్టం. దీనివల్ల దివ్యాంగ అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ లైబ్రరీలో ప్రీ-రికార్డెడ్ స్టడీ మెటీరియల్‌ను వినేందుకు వీలుగా హెడ్‌ఫోన్లను అందుబాటులో ఉంచనున్నారు.
- సౌండ్ ప్రూఫ్ వ్యవస్థ, కంప్యూటర్లు, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

చేయూతనిచ్చేందుకే...



దివ్యాంగులకు చేయూత అందించడంలో భాగంగా దీన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు అవసరమైన స్థలం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం.

– వల్లూరు క్రాంతి, జిల్లా కలెక్టర్

ఎంతో ప్రయోజనం..



బ్రెయిలీ లిపితో కూడిన పుస్తకాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్న చాలా మందికి సౌండ్ లైబ్రరీ వల్ల ఎంతో మేలు జరగనుంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు, ఉన్నత విద్య కోర్సులు చేసేందుకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

– ప్రవీణ్, అంధుల జాతీయ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి









● అదర్ సైడ్


● శ్వేత

ఆమే వనమై...

**ఎస్.పి గారి డ్యూటీ నేరాలను అరికట్టడం.
భూమి మీద చెట్టు చేమా
లేకుండా పోయేలా
మనిషి వహిస్తున్న నిర్లక్ష్యాన్ని మించిన
నేరం ఉంటుందా?
దానినీ అరి కట్టాలి కదా.
కామారెడ్డి జిల్లా ఎస్పీగా శ్వేత పనిచేస్తున్న
కాలంలో ఒక హరిత వనాన్ని పెంచడం
తన కర్తవ్యం అనుకున్నారు.
ఆరు ఎకరాల్లో ఎన్నో మొక్కలు నాటించారు.
ఇప్పుడది అడవిని తలపిస్తోంది.
హరిత రక్షక వనంగా నామకరణం చేసుకుంది.**

హరితహారం స్ఫూర్తితో తన వంతు బాధ్యతగా మొక్కలను నాటడమే కాదు వాటిని సంరక్షించాలనే లక్ష్యంతో రంగంలోకి దిగారు అప్పటి కామారెడ్డి ఎస్పీ శ్వేత. కామారెడ్డిలో ఆరు ఎకరాల స్థలంలో 80 రకాలైనవి ఎన్నో మొక్కలు నాటించారు. మొక్కలు నాటడమే కాదు వాటిని కాపాడేందుకు ఆమెతో పాటు పోలీసు సిబ్బంది నిరంతరం శ్రమించారు. ఫలితంగా ఇప్పుడు అక్కడ అడవిని తలపించే విధంగా చెట్లు పెరిగి పెద్దవయ్యాయి. మూడేళ్ల కాలంలో ప్రతీ రోజూ ఎస్పీ శ్వేత అక్కడికి వెళ్లేవారు. జరుగుతున్న పనులను పర్యవేక్షించేవారు. ప్రతీ రోజూ వాకింగ్, రన్నింగ్ అక్కడే చేసేవారు. ఈ వనానికి 'హరిత రక్షక వనం' అని నామకరణం చేశారు.

ఎనభై రకాల మొక్కలు...

స్థానికంగా పెరిగే అటవీ వృక్ష జాతులకు సంబంధించి దాదాపు 80 రకాల మొక్కలు నాటారు శ్వేత. రామ సీతాఫలం, బాదమ్, శ్రీగంధం, టేకు, ఖర్జూరం, వేప, పనస, నేరేడు, చింత, దానిమ్మ, జామ, ఈత, మేడి, మునగ, నిమ్మ, ఉసిరి, వెలగ, కుంకుడు, కదంబం, నల్లజీడి, రాచఉసిరి, జిత్రేగి... మొదలైన రకాలకు సంబంధించి ఎన్నో మొక్కలు నాటారు.

ప్రతీ మొక్కకు నీరందించడానికి డ్రిప్ ఏర్పాటు చేశారు. అక్కడ రెండు బోర్లు తవ్వించి వాటి ద్వారా నీటిని అందిస్తున్నారు. 'హరిత రక్షక వనం'లో రెండు నీటి గుంతలు తవ్వించారు. అందులో నీరు నిల్వ ఉండేలా వర్షపు నీరు ఆ గుంతలో నిండేలా ఏర్పాటు చేశారు. పై భాగాన ఉన్న గుంతలో పది అడుగుల మేర నీటి నిల్వ ఉంది. అందులో చేప పిల్లలను పెంచుతున్నారు. నీటిని నిల్వ చేయడం మూలంగా బోరుబావుల్లో భూగర్భ జల మట్టానికి ఇబ్బంది లేకుండాపోయింది.



ఆ శ్రమ వృథా పోలేదు...

'హరిత రక్షక వనం'లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు శ్రమించారు. ఆ మొక్కలను తమ ఇంటి పెరట్లో నాటిన మొక్కలలాగే చూసుకున్నారు. మొక్కల చుట్టు పెరిగే గడ్డిని తొలగించడం, నీరు మొక్కకు చేరుతుందా లేదా చూసుకోవడం, పనికి రాని చెత్తను తొలగించడంలాంటి పనులెన్నో చేసేవారు. పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు జిల్లా పోలీసు కార్యాలయానికి వస్తే వారితో మొక్కలు నాటించేవారు. ఆ చెట్లకు వారి పేర్లతో నేమ్‌ప్లేట్లు ఏర్పాటు చేశారు.

'చెట్లు అంటే....భూమాత రాసిన కవిత్వం' అనేది భావుకతతో కూడిన మాటే కాదు బాధ్యతను గుర్తుకు తెచ్చే మాట.

వృత్తిబాధ్యత, సామాజిక బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ పచ్చటి వనాన్ని సృష్టించడం కష్టమేమీ కాదు అని నిరూపిస్తున్నారు శ్వేత లాంటి అధికారులు.

– సేపూరి వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి

మానసిక స్థైర్యాన్ని ఇచ్చారు

శాంతిభద్రతలకు సంబంధించిన వ్యవహారాల్లో బిజీగా ఉంటూనే రకరకాల సామాజిక అంశాలపై స్పందించేవారు శ్వేత. కరోనా కాలంలో పోలీసు సిబ్బందిలో మానసిక స్థైర్యాన్ని కలిగించి ఎంతో మందికి అండగా నిలిచారు. నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాల కోసం రాత పరీక్షలకు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహించారు. శారీరక ధారుడ్య పరీక్షలకు శిక్షణ ఇప్పించారు.

అమ్మలాంటి చెట్లు

కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తరువాత కలెక్టరేట్, పోలీస్ కార్యాలయాల కోసం ఎంపిక చేసిన స్థలం దగ్గరికి వెళ్ళినప్పుడు ఈ స్థలం కనిపించి నాకు వనం పెంచాలన్న ఆలోచన వచ్చింది. పెద్ద పెద్ద భవనాలు నిర్మించినపుడు అక్కడ వాతావరణం మారిపోతుంది. చల్లబడాలంటే సమాంతరంగా చెట్లు పెంచాలి. అందుకే 2017 దసరా రోజు నేను, అప్పటి కలెక్టర్ సత్యనారాయణ గారు ఇక్కడ మొక్కలు నాటాం. కామారెడ్డికి పోలీస్ ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా వాళ్ళతో అక్కడ మొక్కలు నాటించాను. నాటడంతో పాటు మా పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ వాటి సంరక్షణకు నిరంతరం శ్రమించారు. అక్కడి ఉసిరి చెట్టు దగ్గర మా అమ్మ ప్రతీ కార్తీక పౌర్ణమి రోజున పూజలు చేసి అందరికీ భోజనాలు పెట్టేవాళ్ళు. నేను బదిలీ అయినా ఒక అమ్మలా ఆ చెట్టు గుర్తుకొస్తూ ఉంటుంది.

– ఎన్. శ్వేత, ఐపీఎస్

● నృత్యోద్యమం



లండన్‌లో శివతాండవం

నాట్యం అనేది ఆహ్లాదానికే కాదు మానసిక వికాసానికి కూడా అనుకుంటే... నాట్యం అంటే సంతోషమే కాదు మానసిక స్థైర్యం కూడా అనుకుంటే... నాట్యం అనేది ఆనందతరంగమే కాదు పర్యావరణహిత చైతన్యం అంటే గుర్తుకు వచ్చే పేరు.... సోహిని రాయ్ చౌదరి....

సోహిని రాయ్ చౌదరి తండ్రి సుబ్రతో రాయ్ సితార్ విద్వాంసుడు. తల్లి ఉమా రాయ్ చౌదరి శిల్పి. కోల్‌కత్తాలోని వారి ఇంటిలో ఎప్పుడూ కళాత్మక వాతావరణం ఉండేది. నాలుగు సంవత్సరాల వయసులోనే నృత్యకారిణిగా కాళ్లకు గజ్జె కట్టింది సోహిని రాయ్ చౌదరి. భరతనాట్యం నుంచి మోహినియాట్టం వరకు ఎన్నో నృత్యాలలో ప్రావీణ్యం సాధించింది.

'మన వైదిక సిద్ధాంతాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్నీ మానవతావాదం, మంచి గురించి చాటి చెప్పాయి. కోవిడ్, ఆర్థిక మాంద్యం, యుద్ధంలాంటి అనిశ్చిత కాలాల్లో అవి మనకు ధైర్యాన్ని ఇస్తాయి. ఇతరులకు సహాయపడేలా ప్రేరణ ఇస్తాయి. జీవితానికి సానుకూల దృక్పథాన్ని ఇచ్చే శక్తి మన పవిత్ర తత్వాలలో ఉంది' అంటుంది సోహిని.

వాతావరణ మార్పులపై ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఎన్నో సదస్సులలో సోహిని రాయ్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'వేదమంత్రాలతో కూడిన నా నృత్యప్రదర్శన ప్రకృతి గురించి, మన జీవితాల్లో దాని ప్రాముఖ్యత గురించి తెలియజేసేలా ఉంటుంది. పశుపతిగా శివుడు, అడవులు, జంతువులు, పర్యావరణాన్ని పరిరక్షించేవాడు. ప్రకృతిని మనుషులు ఎలా దుర్వినియోగం చేస్తున్నారో, విధ్వంసం సృష్టిస్తున్నారో చెప్పడానికి, ప్రకృతితో సన్నిహిత సంబంధాల కోసం శివతాండవం చేస్తున్నాను' అంటున్న సోహిని రాయ్ 'గ్లోబల్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ కూడా అందుకుంది.

ప్రపంచవ్యాప్తంగా భారతీయ కళలు, సంస్కృతికి సోహిని రాయ్ చౌదరి అంబాసిడర్‌గా మారింది. యూకేలోని ఇండియన్ హైకమిషన్‌కు చెందిన నెహ్రూ సెంటర్‌లో సోహిని చేసిన శివతాండవం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శివతాండవంతో పాటు శివుడి గురించి రుషి దాస్ గుప్తా చెప్పిన విలువైన మాటలను వినిపించింది.

మార్కండేయ పురాణం, శివపురాణాలలో నుంచి ఒక కథను ఎంపిక చేసుకొని దాన్ని నృత్యరూపకంగా మలుచుకుంది. లండన్ తరువాత అమెరికా, రష్యా, జర్మనీ, స్పెయిన్... మొదలైన దేశాల్లోనూ ప్రదర్శనలు ఇవ్వబోతోంది.


'డ్యాన్సింగ్ విత్ ది గాడ్స్' పేరుతో తొలి పుస్తకం రాసిన సోహిని రాయ్‌కు రచనలు చేయడం అంటే కూడా ఎంతో ఇష్టం. ఆమె రచనల్లో మహిళా సాధికారత నుంచి రంగస్థలం వరకు, నృత్యోద్యమం నుంచి దేవదాసీల దుస్థితి వరకు ఎన్నో అంశాలు ఉంటాయి.

శక్తివాదాన్ని ప్రధానంగా చేసుకొని ఎన్నో రచనలు చేసింది. 'ఇండియన్ స్టేజ్ స్టోరీస్: కనెక్టింగ్ సివిలైజేషన్స్' పేరుతో సోహినిరాయ్ రాసిన పుస్తకం భారతీయ రంగస్థలం ఆత్మను పట్టిస్తుంది. ఈ పుస్తకం ద్వారా మన నాగరికతలోని గొప్ప సాంస్కృతిక, సంప్రదాయల గురించి తెలియజేసే ప్రయత్నం చేసింది. యూరప్‌లోని పద్దెనిమిది యూనివర్సిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసింది.

'సూఫీ తత్వం, రూమీ కవిత్వం, ఠాగూరు మానవతా వాదంలో నాకు మహిళాసాధికారత కనిపిస్తుంది' అంటున్న సోహినిరాయ్ చౌదరి తన నృత్య కళను సామాజిక ప్రయోజనం కోసం ఉపయోగిస్తోంది.


● సోహిని రాయ్ చౌదరి

● ముగ్గు ముచ్చట




నల్లబెల్లి మనోజ్ఞ
మంచిర్యాల
17 చుక్కలు, 3 వరుసలు
3 వచ్చే వరకు, సరి చుక్కలు




సి. పుష్కల,
శ్రీనగర్ కాలనీ, కడప
17 చుక్కలు, 7 వచ్చేవరకు
మధ్య చుక్క



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

● గర్భసంచి

తొలగించడమే పరిష్కారమా?!

'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్, జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థ'కు చెందిన శాస్త్రవేత్తలు తాజాగా జర్నల్ ఆఫ్ మెడికల్ ఎవిడెన్స్ ద్వారా ఓ విషయాన్ని వెల్లడించారు. దేశంలోని 25 నుంచి 49 ఏళ్ల మధ్య వ్యవసాయ కూలీలుగా ఉన్న గ్రామీణ మహిళల్లో 32 శాతం గర్భసంచి తొలగింపు (హిస్టరెక్టమీ) శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారని, ఈ శస్త్ర చికిత్సలు ప్రభుత్వ బీమా పథకాల ద్వారానే జరుగుతున్నాయని వెల్లడి అయింది. గర్భసంచి తొలగింపు శస్త్ర చికిత్సలవైపు గ్రామీణ మహిళలు ఎందుకు మొగ్గు చూపుతున్నారు?! ఏ అంశాలు వీరిని ప్రేరేపిస్తున్నాయి?! గర్భసంచి తొలగిస్తే వచ్చే నష్టమేమిటి?! అవగాహన అవసరం...

దేశంలో బిహార్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. రాష్ట్రాల్లోని గ్రామాల్లో హిస్టరెక్టమీ రేటు పెరగడం ఆందోళన కలిగిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. అవగాహన లోపమే ఇందుకు ప్రధాన కారణం అంటున్నారు స్త్రీ వైద్య నిపుణులు. వారు చెబుతున్న విషయాలేంటంటే..

ఖర్చుకు భయపడి...

● వ్యవసాయ కూలీలుగా ఉన్న మహిళల్లో వ్యక్తిగత శుభ్రత తక్కువ. దీనివల్ల గర్భసంచికి ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి.

● పోషకాహార లోపం వల్ల రక్తహీనత, అధిక రక్తస్రావం, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్లు, రుతు సమయంలో వచ్చే నొప్పులను ఇంటిలో పనుల కారణంగా భరిస్తున్నారు. అయితే గర్భసంచి వాపు, సిస్టులు అనగానే క్యాన్సర్ అని భయపడుతున్నారు.

● సమస్య తీవ్రం అయినప్పుడు హాస్పిటల్‌కు రావడం, త్వరగా నయం కాకపోవడంతో పదే పదే డాక్టర్ దగ్గరకు వెళ్లవలసి వస్తుందని, దీనివల్ల ఇంటి పనులు, కూలి పనులకు ఇబ్బందులు వస్తాయని, తమ వెంట వచ్చేవారి పని కూడా పోతుందని, టెస్టులకు, మందులకు అదనపు ఖర్చు అని.. 'గర్భసంచి తొలగించుకుంటే' ఈ చికాకులన్నీ పోతాయనే ఆలోచనకు వస్తున్నారు.

● శస్త్ర చికిత్సకు ప్రభుత్వం అందించే ఉచిత పథకాల కోసం వెతుకుతున్నారు.

● గర్భసంచి సమస్యలను వాయిదా వేసుకుంటూ కూలి పనులు ఎక్కువ ఉండని వేసవి కాలాన్ని ఆపరేషన్‌కు కేటాయించుకుంటున్నారు.

● త్వరగా పెళ్ళిళ్లు అవడం, పిల్లలు పుట్టడం, త్వరగా గర్భసంచి తొలగించుకోవడం అనేది గ్రామాల్లో కూలి పనులకు వెళ్లే వారిలో తరచూ కనిపిస్తోంది.

అత్యవసర అవగాహన

● శుభ్రతకు సంబంధించిన అవగాహన అత్యవసరం.

● అధిక రక్తస్రావం సమస్యలకు కూడా పరిష్కారాలు ఉన్నాయి. హార్మోన్లకు, బలానికి వాడే మందులను అందజేయాలి.

● తప్పనిసరై గర్భసంచి తొలగించుకున్నా సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే రకరకాల ఇతర సమస్యలు తలెత్తుతాయి. దీంతో మళ్లీ హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. మధుమేహం, బలహీనత, ఎముకల సమస్యలు... వీటన్నింటి పైనా అవగాహన కల్పించాలి.

ఆర్థికంగానే కాదు ఆరోగ్యంగా ఉండటమూ దేశ భవిష్యత్తుకు కొలమానమే. వ్యవసాయ కార్మికులుగా ఉన్న మహిళలు తరచూ పురుగు మందులకు గురి కావడం వల్ల కూడా అధిక రుతుస్రావాలు, ఫైబ్రాయిడ్లు, గర్భాశయ లోపాలు, జననేంద్రియ సమస్యలకు కూడా గురవుతున్నారని నివేదికలు తెలియజేస్తున్నాయి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఏడాదికోసారి పాప్‌స్మియర్ టెస్ట్

గర్భసంచి తొలగించడం వల్ల అండాలు విడుదల కాక హార్మోన్ల పని తీరు దెబ్బతింటుంది. దీనివల్ల ఎముకలపై ప్రభావం పడి, త్వరగా కీళ్ల సమస్యలు వస్తాయి. చాలా మందిలో రకరకాల ఇన్ఫెక్షన్ల వల్ల గర్భసంచి వాపు వస్తుంది. ఫైబ్రాయిడ్స్, సిస్టులు వస్తుంటాయి. అయితే అవగాహన లేక క్యాన్సర్ వస్తుందేమో అనే భయంతో గర్భసంచి తీసేయమని కోరుతున్నారు. పాప్‌స్మియర్ స్క్రీనింగ్‌తో గర్భసంచి సమస్య ఏంటో ముందే తెలుసుకోవచ్చు. దానికి తగిన మందులు వాడితే సరిపోతుంది. 40 ఏళ్ల లోపు మహిళలకు గర్భసంచి తొలగించకపోవడమే మంచిది. హెల్త్ అవేర్‌నెస్ క్యాంప్స్, ఏడాదికోసారి పాప్ స్మియర్ టెస్టులు, కుటుంబం మొత్తానికి స్త్రీ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు.



– డాక్టర్ భానుప్రియ, గైనకాలజిస్ట్, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్, నిజామాబాద్



అర్థంకిగా భావిస్తున్నారు

గ్రామీణ మహిళలు ఓవర్ బ్లీడింగ్, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్స్ వంటి సమస్యలతో మా దగ్గరకు వస్తుంటారు. ఇలాంటప్పుడు టెస్టులు చేయించుకోవడం మందులు వాడటం, పదే పదే వైద్యులను సంప్రదించడం వారికి కష్టంగా మారుతుంది. అందుకు గర్భసంచి తొలగించుకోవడం మేలేమో అనే ఆలోచన చేస్తున్నారు. సాధారణంగా 50 ఏళ్లలో మెనోపాజ్ లక్షణాలు కనిపిస్తాయి. సర్జికల్‌గా వచ్చే మెనోపాజ్ వల్ల చెమటలు పట్టడం, అలసిపోవడం, చిరాకు, హాట్ ఫ్లషెస్.. అన్నీ ముప్పైల్లోనే కనిపిస్తాయి.



– డాక్టర్ మనోరమ, మధిర, ఖమ్మం జిల్లా

● బ్యూటిప్స్



కురుల చివరలు చిట్లుతుంటే...

చలికాలం చర్మ ఆరోగ్యాన్నే కాదు శిరోజాల సహజత్వాన్ని కాపాడుకోవాలి. లేదంటే వెంట్రుకలు పొడిబారడం, చిట్లడం, చుండ్రు సమస్య తలెత్తడం వంటివి చూస్తుంటాం. ఈ సమస్యకు పరిష్కారంగా...

అలెవెరాతో కండిషనింగ్

షాంపులు, కాలుష్యం, గాలిలో తేమ తగ్గడం.. వంటి వాటి వల్ల ఈ కాలంలో వెంట్రుకలు త్వరగా పొడిబారడం, చిట్లడం వంటివి సహజంగా జరుగుతుంటాయి. వీటి వల్ల జుట్టు నిస్తేజంగా కనిపిస్తుంది. రసాయనాల గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేసిన తర్వాత అలోవెరా జెల్‌ను జుట్టుకు పట్టించాలి. 15–20 నిమిషాల తర్వాత నీటితో కడిగేయాలి. అలోవెరా రసం జుట్టుకు కావలసినంత కండిషన్ లభించేలా చేస్తుంది.

ఉసిరితో మృదుత్వం

ఉసిరి, మందారపువ్వులు మరిగించిన కొబ్బరినూనెతో మాడుకు, వెంట్రుకలకు రాసి, మర్దనా చేయాలి. మరునటి రోజు ఉదయం తలస్నానం చేయాలి. ఈ విధంగా చేస్తే వెంట్రుకలు చిట్లడం సమస్య తగ్గుతుంది. కురుల మృదుత్వం పెరుగుతుంది.

లీగల్

నిరాశ పడద్దు... మీకు న్యాయం జరుగుతుంది

మా ఇంటి పక్కన వారు మా ఇంటికి ఆనుకొని ఎలాంటి అనుమతి లేకుండా వారి పెంట్‌హౌస్ కట్టుకుంటున్నారు. ఆ పెంట్‌హౌస్ కట్టడం వలన మా ఇంటిలోకి వెలుతురు రావడం ఆగి పోతుంది. వారు పెంట్ హౌస్ కట్టుకోవడానికి అనుమతి కూడా లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే మా ఇల్లు మా ఇష్టం, నీ కెందుకు సమాధానం చెప్పాలి అని గొడవ పడుతున్నారు. కాలనీ అసోసియేషన్ వారు మాట్లాడినా లాభం లేకుండా పోయింది. ఏం చేయాలో సలహా ఇవ్వగలరు.

– పవన్ కుమార్, హైదరాబాద్

ముందుగా మీరు వ్యక్తిగతమైన వాగ్వాదానికి చోటు ఇవ్వకండి. అది సరైనది కాదు, దాని వల్ల వివాదం పెరుగుతుందే తప్ప తగ్గదు! ఎవరి ఇంటిలో వారు నిర్మాణాలు చేసుకోవచ్చు కానీ అది పక్కవారికి ఇబ్బంది కలగకుండా, పక్కవారి హక్కులకు భంగం కలగకుండా ఉండాలి. అంతేకాక, చట్టరీత్యా నిబంధనలకు లోబడి ఉండాలి. సరైన అనుమతి లేకుండా నిర్మించే ఎలాంటి కట్టడమైనా అక్రమ కట్టడంగానే పరిగణించబడుతుంది. చట్టరీత్యా చర్యలు తీసుకుంటే అలాంటి అక్రమ కట్టడాలను తొలగించాల్సి వస్తుంది. మీరు వెంటనే మునిసిపల్ అధికారులకు ఒక ఫిర్యాదు చేయండి. అందులో మీకు కలిగే నష్టం ఏమిటి, మీ పక్కింటి వారు చేస్తున్న అక్రమ నిర్మాణం ఏమిటి, ఎందుకని ఆ నిర్మాణాన్ని అక్రమ నిర్మాణం అని మీరు అంటున్నారు వంటి విషయాలను ప్రస్తావిస్తూ రాయండి. నేరుగా వెళ్తే అధికారులు మీ ఫిర్యాదు తీసుకోలేము అనటం సహజంగా చూస్తుంటాం. అందుకే రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మీ ఫిర్యాదును పంపించవచ్చు. సరైన వ్యవధిలో అధికారులు చర్యలు తీసుకోకపోతే, మీరు హైకోర్టును కూడా ఆశ్రయించి మీ ఫిర్యాదు పై చర్యలు తీసుకోవాలి అని హైకోర్టు ఆర్డరు పొందవచ్చు. అలా చేయడం ద్వారా అధికారులు సదరు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి, నిజానిజాలు తేల్చిన తర్వాత తొలగించే చర్యలను చేపడతారు. అయితే, కోర్టు కేసులలో కొంత ఆలస్యం జరగవచ్చు. దానికి నిరాశ పడవలసిన అవసరం లేదు. చట్టరీత్యా మీకు న్యాయం జరుగుతుంది.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.



శ్రీలంక చేతిలో 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్‌లో ఓటమి... 36 ఏళ్ల తర్వాత సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఒక టెస్టులో పరాజయం... భారత టెస్టు చరిత్రలో స్వదేశంలో తొలిసారి 0-3తో క్లీన్‌స్వీప్... ఇన్నింగ్స్‌లో 46కే ఆలౌట్... ఇప్పుడు బోర్డర్-గావస్కర్ ట్రోఫీని కోల్పోవడంతో పాటు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరే అవకాశం చేజార్చుకున్న పరిస్థితి... హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత టీమిండియాకు ఎదురైన నిరాశాజనక ఫలితాలు ఇవి. ఒక్క బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ విజయం మినహా హెడ్ కోచ్‌గా అతను చెప్పుకోదగ్గ ఘనమైన ప్రదర్శన ఏదీ భారత జట్టు నుంచి రాలేదు. మైదానంలో జట్టు పరాజయాలకు ఆటగాళ్ల వైఫల్యం కారణం కావచ్చు. కానీ జట్టు కోచ్ కూడా దానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. టీమిండియాకు ఓటములు ఎదురైనప్పుడు అప్పటి కోచ్‌లంతా తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నవారే. అన్నింటికి మించి ఎంతో ఇష్టంతో బీసీసీఐ ఏరికోరి ఎంపిక చేసిన కోచ్... గతంలో జట్టుకు కోచ్‌గా పని చేసిన వ్యక్తులను విమర్శిస్తూ తానైతే అద్భుతాలు సాధిస్తానంటూ పదే పదే చెబుతూ వచ్చిన వ్యక్తి ఇప్పుడు కోచ్‌గా ఫలితాలు రాబట్టలేకపోతే కచ్చితంగా తప్పు పట్టాల్సిందే. గంభీర్ వాటికి అతీతుడేమీ కాదు!

-సాక్షి క్రీడా విభాగం

పరిస్థితి గంభీరం!

టీమిండియాపై కనిపించని హెడ్ కోచ్ ముద్ర

ఓటముల్లో కనిపిస్తున్న వైఫల్యం | **భారత జట్టుకు వరుస పరాజయాలు**

భారత జట్టుకు హెడ్ కోచ్‌గా ఎంపిక కాకముందు గంభీర్ ఏ స్థాయిలో కూడా కోచ్‌గా పని చేయలేదు. ఏ జట్టు సహాయక సిబ్బందిలోనూ అతను భాగంగా లేడు. 2018లో ఆట నుంచి రిటైర్ అయిన తర్వాత మూడు ఐపీఎల్ సీజన్లలో లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ టీమ్‌లకు మెంటార్‌గా పని చేశాడు. ఇందులో 2024లో అతను మెంటార్‌గా వ్యవహరించినప్పుడు కోల్‌కతా జట్టు ఐపీఎల్ టైటిల్ గెలుచుకుంది. సాధారణంగా ఏ జట్టు కోచ్ లైనా చేసే పనులు అతనేవీ చేయలేదు. ప్రాక్టీస్ సెషన్లలో నేరుగా భాగమై ప్రణాళికలు రూపొందించడం, త్రోడౌన్స్ ఇవ్వడం, ఆటగాళ్ల టెక్నిక్‌లను చక్కదిద్దే పని చేయడం ... ఇవన్నీ గంభీర్ చూపించలేదు. ఒక టి20క్లబ్ టీమ్‌కు మెంటార్‌గా పని చేస్తూ అప్పుడప్పుడు మార్గనిర్దేశనం ఇవ్వడంతో పోలిస్తే ఒక జాతీయ జట్టుగా కోచ్ అనేది పూర్తిగా భిన్నమైన బాధ్యత. అయితే ఆటగాడిగా గంభీర్ రికార్డు, జట్టు పట్ల అతని అంకితభావం చూసిన వారు కోచ్‌గా కొత్త తరహాలో జట్టును తీర్చిదిద్దగలడని నమ్మారు. అయితే అతను రాక ముందు వరకు వరుస విజయాల్లో శిఖరాన ఉన్న టీమ్ మరింత పైకి లేవడం సంగతేమో కానీ ఇంకా కిందకు పడిపోయింది. స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు భారత జట్టు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ చేరడంపై ఎలాంటి సందేహాలు లేవు. కానీ 8 టెస్టుల్లో 6 పరాజయాలతో దానికి జట్టు దూరమైంది.

ఆ ముగ్గురు ఏం పని చేశారో?

నిజానికి తాను పూర్తి స్థాయిలో కోచ్‌గా పని చేయలేదనే విషయం గంభీర్‌కూ తెలుసు. అందుకే అతను సహాయక సిబ్బందిని ఎంచుకునే విషయంలో తనకు సన్నిహితులైన వారిని తీసుకున్నాడు. ఐపీఎల్‌లో తనతో కలిసి పని చేసిన మోర్నీ మోర్కెల్ (దక్షిణాఫ్రికా), అభిషేక్ నాయర్ (భారత్), టెన్ డస్కటే (నెదర్లాండ్స్) బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ కోచ్‌లుగా వచ్చారు. వీరిని స్వయంగా ఎంచుకునేందుకు బీసీసీఐ గంభీర్‌కు అవకాశం ఇచ్చింది. అయితే ఆటగాడిగా మోర్కెల్‌కు మంచి రికార్డు ఉన్నా... మిగతా ఇద్దరికి పెద్దగా పేరు లేదు. అసలు గంభీర్ కోచ్‌గా వచ్చిన తర్వాత ఈ ముగ్గురు ఏం పని చేశారో, ఎలాంటి ప్రభావం చూపించారో కూడా తెలీదు. కొన్నేళ్లు వెనక్కి వెళితే ఇంగ్లండ్ సిరీస్‌లో వరుసగా ఘోరమైన ప్రదర్శన తర్వాత బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ సూచనలతో తనను తాను మార్చుకొని మంచి ఫలితాలు సాధించానని, అందుకు కృతజ్ఞుడినని కోహ్లి స్వయంగా చాలాసార్లు చెప్పుకున్నాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో ఒకే తరహాలో కోహ్లి అవుటవుతున్న సమయంలో కనీసం అతని ఆటలో స్టాన్స్ మొదలు ఆడే షాట్ విషయంలో మార్పు గురించి చర్చ అయినా జరిగిందా అనేది సందేహమే. ఐదు టెస్టుల పాటు భారత జట్టు ప్రాక్టీస్ సెషన్లను గమనిస్తే ఒక్కసారి కూడా గంభీర్ మైదానంలో చురుగ్గా ఆటలో భాగమైనట్లు ఎక్కడా కనిపించలేదు. అసలు కోచ్‌గా అతని ముద్ర ఎక్కడా కనిపించనే లేదు.

దిగితే కానీ లోతు తెలీదు...

కొంత కాలం క్రితం వరకు కామెంటేటర్‌గా పని చేసినప్పుడు, టీవీ షోలలో మాజీ ఆటగాళ్లను విమర్శించడంలో గంభీర్ అందరికంటే ముందు ఉండేవాడు. అప్పటి వరకు పని చేసిన వారిని తక్కువ చేసి మాట్లాడుతూ జట్టులో మార్పులపై సూచనలు చేసేవాడు. ముఖ్యంగా 'ఇది భారత అత్యుత్తమ టెస్టు జట్టు' అని చెప్పుకున్న కోచ్ రవిశాస్త్రిని అతను బాగా తప్పు పట్టాడు. కెరీర్‌లో ఆయన ఏం సాధించాడని, ఇలాంటి వారే అలాంటి మాటలు మాట్లాడతారని కూడా గంభీర్ వ్యాఖ్యానించాడు. అయితే శాస్త్రి కోచ్‌గా ఉన్నప్పుడే భారత్ వరుసగా రెండుసార్లు ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలిచిందనే విషయాన్ని అతను మర్చిపోయాడు. రవిశాస్త్రికి కూడా కోచ్‌గా అనుభవం లేకున్నా జట్టులో స్ఫూర్తి నింపడంలో అతని తర్వాతే ఎవరైనా. ప్లేయర్లకు స్నేహితుడి తరహాలో అండగా నిలిచి మైదానంలో సత్తా చాటేలా చేయడం అతనికి బాగా వచ్చు. 'అడిలైడ్ 36 ఆలౌట్' తర్వాత టీమ్ అంతా కుంగిపోయి ఉన్న దశలో శాస్త్రి 'మోటివేషన్ స్పీచ్' వల్లే తాము కొత్త ఉత్సాహంతో మళ్లీ బరిలోకి దిగి సిరీస్ గెలిచే వరకు వెళ్లగలిగామని ఆటగాళ్లంతా ఏదో ఒక సందర్భంలో చెప్పుకున్నారు. గంభీర్ ఇలాంటి పని కూడా చేయలేకపోయాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కోచ్‌గా ఎంత వరకు!

గంభీర్ బాధ్యతలు స్వీకరించిన దగ్గరి నుంచి భారీ వ్యాఖ్యలైతే చాలా చేశాడు. బంగ్లాదేశ్‌పై గెలిచిన తర్వాత 'ఒకే రోజు 400 పరుగులు చేయగలిగే, అవసరమైతే రెండు రోజులు నిలిబడి 'డ్రా' చేయగలిగే జట్టును తీర్చిదిద్దుతా' అని అతను అన్నాడు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లలో ఇందులో ఏదీ జరగలేదు. ఈ రెండు సిరీస్‌లలో కలిపి రెండుసార్లు మాత్రమే స్కోరు 400 దాటింది. తన మాటలకు, వ్యాఖ్యలకు దేశభక్తి రంగు పులమడం గంభీర్‌కు అలవాటుగా మారింది. కోచ్‌గా ఎంపికైన సమయంలోనూ 'దేశానికి సేవ చేయబోతున్నా. 140 కోట్ల భారతీయుల దీవెనలు ఉన్నాయి' తదితర మాటలతో ముందుకు వచ్చిన అతను సిడ్నీ టెస్టులో పరాజయం తర్వాత జట్టు ముఖ్యం అనే వ్యాఖ్యతో ఆగిపోకుండా 'దేశం అన్నింటికంటే ముఖ్యం' అంటూ ఎక్కడికో వెళ్లిపోయాడు. సాధారణంగా ఇలాంటి వరుస పరాజయాల తర్వాత సహజంగానే కోచ్‌పై తప్పుకోవాలనే ఒత్తిడి కూడా వస్తుంది. అయితే బీసీసీఐ పెద్దల అండ ఉన్న గంభీర్‌పై ఇప్పటికిప్పుడు వేటు పడకపోవచ్చు. కాంట్రాక్ట్ 2027 వరల్డ్‌కప్ వరకు ఉన్నా... ఆలోగా ఎలాంటి ఫలితాలు అందిస్తాడనేది చూడాలి. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరగబోయే సిరీస్‌ను పక్కన పెడితే చాంపియన్స్ ట్రోఫీ కోచ్‌గా గంభీర్‌కు పెద్ద పరీక్ష. ఇక్కడా విఫలమైతే ఇక తన వల్ల కాదంటూ తప్పుకునే అవకాశామూ ఉంది.

గాయత్రి-ట్రెసా జోడీ శుభారంభం



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం 21-10, 21-10తో ఒర్నిచా-సుకిత్త (థాయ్‌లాండ్) జోడీపై విజయం సాధించింది. 30 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ఆద్యంతం భారత జంట ఆధిపత్యం కనబరిచింది. రెండో గేమ్‌లో స్కోరు 11-9 వద్ద గాయత్రి-ట్రెసా ఒక్కసారిగా విజృంభించి వరుసగా ఎనిమిది పాయింట్లు గెలిచి 19-9తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఒక పాయింట్ ప్రత్యర్థి జంట నెగ్గినా ఆ వెంటనే భారత జోడీ రెండు పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్య సేన్ 14-21, 7-21తో చి యు జెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు.

పైకప్పు నుంచి నీరు కారడంతో...

టోర్నీ తొలి రోజు భారత ప్లేయర్ ప్రణయ్‌కు విచిత్ర పరిస్థితి ఎదురైంది. కోర్టు-3లో కెనడా ప్లేయర్ బ్రియాన్ యాంగ్‌తో మ్యాచ్‌లో ప్రణయ్ తొలి గేమ్‌ను 21-12తో నెగ్గి, రెండో గేమ్‌లో 6-3తో ఆధిక్యంలో ఉన్నాడు. ఈ దశలో స్టేడియం పైకప్పు నుంచి అనూహ్యంగా వర్షం నీరు కోర్టులోకి పడటం మొదలైంది. దాంతో కోర్టు-3లో ప్రణయ్ మ్యాచ్ నిలిచిపోయింది. గంట తర్వాత మ్యాచ్ మళ్లీ ప్రారంభమైంది. ప్రణయ్ 9-11తో వెనుకంజలో ఉన్న దశలో మళ్లీ పైకప్పు నుంచి నీరు కారడం మొదలైంది. దాంతో నిర్వాహకులు ప్రణయ్, యాంగ్ మ్యాచ్‌ను నిలిపివేసి బుధవారానికి వాయిదా వేశారు.


బీసీసీఐ కార్యదర్శిగా దేవజిత్ సైకియా



న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శిగా దేవజిత్ సైకియా ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. గతంలో సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించిన జై షా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ఆ స్థానం ఖాళీ కాగా... దేవజిత్ సైకియా ఒక్కరే ఈ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో పాటు బోర్డు కోశాధికారి పదవికి ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా మాత్రమే దరఖాస్తు చేసుకోవడంతో ఆయన ఎన్నిక కూడా ఖాయమైంది. మంగళవారంతో దరఖాస్తుల ఉపసంహరణ గడువు ముగియగా ఈ ఇద్దరే పోటీలో నిలిచారు. ఈ నెల 12న ఎన్నిక జరగనుంది. అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు. జై షా ఐసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సైకియా బోర్డు తాత్కాలిక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు గతంలో బోర్డు కోశాధికారిగా పనిచేసిన ఆశిష్ షెలార్ మహారాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆ స్థానం ఖాళీ కాగా... ఇప్పుడు ప్రభ్‌తేజ్ కోశాధికారి బాధ్యతలు చేపట్టనున్నారు.

సినిమా






ఆస్కార్‌పై గురి

● 97వ ఆస్కార్ అవార్డ్స్ బరిలో భారతీయ చిత్రాలు

భారతీయ చిత్రాలు ఆస్కార్ బరిలో నిలిచాయి. 97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 2న అమెరికాలోని డాల్బీ థియేటర్‌లో జరగనున్న సంగతి తెలిసిందే. కాగా ఆస్కార్ అవార్డుల కోసం 323 ఫీచర్ ఫిల్మ్స్ అర్హత సాధించినట్లుగా, వీటిలో 207 చిత్రాలు బెస్ట్ పిక్చర్ అవార్డు కోసం పోటీలో నిలిచినట్లుగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ సంస్థ అధికారికంగా వెల్లడించి, అర్హత సాధించిన సినిమాల జాబితాను విడుదల చేసింది. ఇక ఈ 97వ ఆస్కార్ అవార్డ్స్ రిమైండర్ లిస్ట్‌లో భారతీయ చిత్రాలు సూర్య 'కంగువ' (తమిళం), పృథ్వీరాజ్ సుకుమారన్ 'ఆడు జీవితం' (మలయాళం.. ఇంగ్లిష్ టైటిల్ 'ది గోట్ లైఫ్'), సహానా గోస్వామి 'సంతోష్' (హిందీ), రణ్‌దీప్ హుడా 'స్వతంత్ర వీర్ సావర్కర్' (హిందీ), కనిక కస్రుతి-దివ్య ప్రభల 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' (మలయాళం-హిందీ-మరాఠి), ప్రీతి ప్రాణిగ్రాహి 'గర్ల్స్ విల్ బీ గర్ల్స్' (ఇంగ్లిష్-హిందీ), బెంగాలీ ఫిల్మ్ తను శ్రీ శంకర్ 'పుతల్' చోటు సంపాదించాయి. అయితే ఈ ఏడు చిత్రాల్లో ఆస్కార్ అవార్డ్స్ రిమైండర్ లిస్ట్‌లో 'గర్ల్ విల్ బీ గర్ల్స్'కి చోటు దక్కింది కానీ, బెస్ట్ పిక్చర్ విభాగానికి అర్హత సాధించలేకపోయింది. అలాగే ఆస్కార్ బరిలో నిలిచిన తొలి చిత్రంగా 'పుతల్' నిలిచింది.

మొత్తం ఇరవైమూడు విభాగాల్లో ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. ఆల్రెడీ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్, డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్, ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్, మేకప్ అండ్ హెయిర్ స్టైలింగ్, ఒరిజినల్ స్కోర్ మ్యూజిక్, ఒరిజినల్ సాంగ్ మ్యూజిక్, యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్, లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్, సౌండ్, విజువల్ ఎఫెక్ట్స్... ఇలా పది విభాగాల్లో ఆస్కార్ కమిటీ షార్ట్ లిస్ట్ జాబితాలను ప్రకటించింది. మిగిలిన 13 విభాగాల నామినేషన్స్ కోసం తాజాగా ఆస్కార్ వెల్లడించిన సినిమాలు పోటీ పడనున్నాయి. ఇక బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా హిందీ చిత్రం 'లాపతా లేడీస్'ను ఇండియా అఫీషియల్ ఎంట్రీగా పంపగా, ఆస్కార్ షార్ట్‌లిస్ట్ జాబితాలో చోటు దక్కించుకోలేకపోయింది. ఫైనల్ నామినేషన్ లిస్ట్ ఈ నెల 17న విడుదల కానుంది. మరి... ఏ భారతీయ చిత్రాలు ఫైనల్ నామినేషన్ దక్కించుకుంటాయో? చూడాలి.




● అల్లు అర్జున్

ఇక రీ లోడెడ్

అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప 2: ది రూల్' సినిమా నిడివి మరో 20 నిమిషాలు పెరిగింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించగా, శ్రీలీల ప్రత్యేక పాటలో సందడి చేశారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గత డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన సంగతి తెలిసిందే. కాగా 'పుష్ప 2: ది రూల్' రీ లోడెడ్ వెర్షన్‌ని ఈ నెల 11 నుంచి ప్రదర్శించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం ఉన్న నిడివికి మరో ఇరవై నిమిషాలు పవర్‌ఫుల్ ఫుటేజ్‌ని యాడ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు మేకర్స్. ఇదిలా ఉంటే... భారతీయ చిత్ర పరిశ్రమలో కేవలం 32 రోజుల్లోనే 'పుష్ప 2: ది రూల్' ప్రపంచవ్యాప్తంగా రూ. 1831 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి, సరికొత్త రికార్డు సృష్టించినట్లు చిత్ర యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మరి... రీ లోడెడ్ వెర్షన్‌తో ఈ చిత్రం మరెన్ని రికార్డులు సృష్టిస్తుందో వేచి చూడాలి.

కారు ప్రమాదం నుంచి బయటపడ్డ అజిత్



హీరో అజిత్ కారు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. ఆయన కార్ రేసర్ అన్న విషయం తెలిసిందే. అజిత్ ప్రస్తుతం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసిన అజిత్ దుబాయ్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ కార్ రేస్‌లో పాల్గొనడానికి సిద్ధమవుతున్నారు. ఇందుకుగాను దుబాయ్ వెళ్లిన అజిత్ మంగళవారం ఈ పోటీ కోసం ప్రాక్టీస్ చేస్తుండగా కారు అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొని, ట్రాక్‌పై గిర్రున తిరిగి, నిలిచిపోయింది. ప్రమాదానికి గురైన కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అయితే కారులో ఉన్న అజిత్ అదృష్టవశాత్తూ ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. దీంతో ఆయన అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

– సాక్షి, తమిళ సినిమా

సాహసంలో భాగస్వామికి స్వాగతం



● వామికా గబ్బి, అడివి శేష్

అడివి శేష్ స్పై మిషన్‌లో చేరారు వామికా గబ్బి. అడివి శేష్ హీరోగా నటిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'జీ2'. అడివి శేష్ హీరోగా నటించిన 'గూఢచారి' (2018)కి సీక్వెల్‌గా, 'జీ2' రూపొందుతోంది. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా వామికా గబ్బి నటిస్తున్నట్లు వెల్లడించారు. 'వెల్‌కమ్ టు ది మిషన్. మై పార్ట్‌నర్ ఇన్ అడ్వెంచర్ (మిషన్‌కి స్వాగతం... సాహసంలో నా భాగస్వామి)'' అని వామికా గబ్బిని ఉద్దేశించి 'ఎక్స్'లో పేర్కొన్నారు అడివి శేష్. ''జీ2' ప్రయాణంలో భాగం కావడం హ్యాపీగా ఉంది'' అని వామికా పేర్కొన్నారు. ఇమ్రాన్ హష్మీ, మురళీ శర్మ, సుప్రియ యార్లగడ్డ, మధు షాలిని తదితరులు నటిస్తున్న 'జీ2' మూవీ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ ఏడాది విడుదల కానుంది.

చాలా రోజులకు చక్కటి సినిమా చూశా! - ఎస్వీ కృష్ణారెడ్డి



● అరవింద్ కృష్ణ, దివి, రమణ విల్లర్ట్, త్రినాథ్, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, రేణు దేశాయ్

''ఈ చిత్రంతో అందర్నీ కంటతడి పెట్టించారు. చాలా రోజులకు ఓ చక్కటి సినిమా చూశాననిపిస్తోంది. '1000 వర్డ్స్'కి అవార్డులు వస్తాయి'' అని దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. అరవింద్ కృష్ణ, 'బిగ్ బాస్' ఫేమ్ దివి, మేఘనా శ్రీనివాస్, వినయ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '1000 వర్డ్స్'. స్వీయ దర్శకత్వంలో రమణ విల్లర్ట్ నిర్మించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ చిత్రం ప్రత్యేక ప్రదర్శనకు ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చి రెడ్డి, మధుర శ్రీధర్, రేణు దేశాయ్, జ్యోతి పూర్వాజ్, సుకు పూర్వాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. షో అనంతరం రేణు దేశాయ్ మాట్లాడుతూ – ''రమణగారు ఫొటోగ్రాఫర్‌గా తెలుసు. ఆయన తీసిన '1000 వర్డ్స్' అద్భుతం అనిపించింది. సినిమా చూశాక నాకు కన్నీళ్లొచ్చాయి. అందరూ చూడాల్సిన సినిమా ఇది'' అని చెప్పారు. రమణ విల్లర్ట్ మాట్లాడుతూ– ''ఓ తల్లి బిడ్డను కనేటప్పుడు పడే బాధను చెప్పాలని, చూపించాలనీ '1000 వర్డ్స్' తీశాం. పురిటి నొప్పుల్ని డబ్బింగ్‌తో చూపించడంతో చూసినవారందరికీ కన్నీళ్లు వచ్చాయి'' అని తెలిపారు. ''1000 వర్డ్స్'లో నటించడం నా అదృష్టం'' అన్నారు అరవింద్ కృష్ణ. ''రమణగారి నుంచి ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలి'' అన్నారు నిర్మాత అచ్చి రెడ్డి. ''ఇంత మంచి చిత్రాన్ని ఇటీవల చూడలేదు'' అన్నారు దర్శక–నిర్మాత 'మధుర' శ్రీధర్. ఈ సమావేశంలో ఛాయాగ్రాహకుడు శివ రామ్‌చరణ్, సంగీతదర్శకుడు శివ కృష్ణ, నేపథ్య సంగీతదర్శకుడు రాజా, రచయిత సంకల్ప్, ఆప్తా ప్రెసిడెంట్ త్రినాథ్ ముద్రగడ తదితరులు మాట్లాడారు.

ఆ మాట తప్పని నిరూపించారు - ధర్మ



● లహరీధర్, ధర్మ, కిరణ్ తిరుమలశెట్టి

''డ్రింకర్ సాయి' సినిమాను ఆదరించి, చిత్ర పరిశ్రమలో యువ హీరోగా నాకంటూ ఓ స్థానం కల్పించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. కొత్తవాళ్లకు ఇండస్ట్రీలో ప్రోత్సాహం ఉండదనే మాట తప్పని నిరూపించి, హీరోగా నన్ను ఆదరించారు. ఇలాంటి మంచి సినిమా నాతో తీసిన డైరెక్టర్ కిరణ్‌గారికి, నిర్మాతలకు ధన్యవాదాలు'' అని ధర్మ చెప్పారు. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో ధర్మ, ఐశ్వర్యా శర్మ జంటగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరీధర్ నిర్మించిన ఈ సినిమా గత డిసెంబర్ 27న విడుదలైంది. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ– ''డ్రింకర్ సాయి'లో నేను అనుకున్న పాయింట్ ప్రేక్షకులకు బాగా రీచ్ అయ్యింది'' అన్నారు. ''మా 'డ్రింకర్ సాయి' మంచి విజయం సాధించింది. ఇప్పటిదాకా రూ. 5.75 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ వచ్చాయి'' అన్నారు బసవరాజు లహరీధర్.

కుటుంబ ప్రేక్షకులు మెచ్చేలా ఉంటుంది - సూర్యదేవర నాగవంశీ



● ప్రగ్యా జైస్వాల్, సూర్యదేవర నాగవంశీ, బాబీ కొల్లి, శ్రద్ధా శ్రీనాథ్

''డాకు మహారాజ్'లో యాక్షన్ సీన్స్ బాగుంటాయి. తెలుగుతో పాటు తమిళ్‌లోనూ ఈ నెల 12న మా సినిమాను రిలీజ్ చేస్తున్నాం. బాలకృష్ణగారి కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాల్లో ఒకటిగా నిలుస్తుంది'' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందినీ చౌదరి హీరోయిన్లుగా నటించగా, బాబీ డియోల్ కీలక పాత్ర చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మంగళవారం జరిగిన సమావేశంలో బాబీ మాట్లాడుతూ – ''ఈ చిత్రం రాబోయే రోజుల్లో పలు సినిమాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని నమ్ముతున్నాను. యాక్షన్‌తో పాటు మంచి వినోదం, భావోద్వేగాలతో కుటుంబ ప్రేక్షకులు మెచ్చేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు. ''ఈ నెల 12న నా బర్త్ డే కానుకగా ఈ చిత్ర విజయాన్ని అందించాలని కోరుకుంటున్నాను'' అని ప్రగ్యా జైస్వాల్ చెప్పారు. ''ఈ సినిమా నా జర్నీలో ప్రత్యేకంగా నిలుస్తుందని నమ్మకంగా ఉన్నాను'' అన్నారు శ్రద్ధా శ్రీనాథ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
234	92
78,199	23,708

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

● నాస్‌డాక్	19,580	▽	285
● డోజోన్స్	42,653	▽	54
● ఎఫ్‌టీఎస్ఈ 100	8,245	▽	4
● డాక్స్	20,340	△	124
● షాంఘై	3,230	△	23
● నికాయ్	40,083	△	770

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	77,126	▽	35
బంగారం (22 క్యారట్)	76,817	▽	35
వెండి (కేజీ)	89,474	▽	322


ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.39	86.41
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.20	109.06
€	యూరో	ఎస్‌బీఐ	87.97	90.58
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.66	54.99
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.35	54.53
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.68	65.44
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.96	23.52
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.45	24.23
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.82	12.65

భారత్‌లో మైక్రోసాఫ్ట్ రూ. 25,700 కోట్ల పెట్టుబడులు

- ఏఐ, క్లౌడ్‌పై ఫోకస్
- సంస్థ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడి

బెంగళూరు: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో తమ కార్యకలాపాలను భారీగా విస్తరించనుంది. ఇందులో భాగంగా 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 25,700 కోట్లు) పెట్టుబడులు పెట్టనుంది. క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేథ (ఏఐ) సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఇన్వెస్ట్ చేయనుంది. అలాగే 2030 నాటికి భారత్‌లో 1 కోటి మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ కూడా ఇవ్వనుంది. మంగళవారం ఒక సదస్సులో పాల్గొన్న సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ఈ విషయాలు వెల్లడించారు. అంకుర సంస్థల వ్యవస్థాపకులు, టెక్నాలజీ దిగ్గజాల ఎగ్జిక్యూటివ్‌లు మొదలైన వారు ఇందులో పాల్గొన్నారు. 'జియోతో కలిసి పనిచేస్తున్నాం. భారత్‌లో ప్రాంతీయంగా కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తున్నాం' అని చెప్పారు. తాము ప్రపంచ స్థాయి ఏఐ మౌలిక సదుపాయాలను రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. 'ఏఐ ఆవిష్కరణల్లో భారత్ చాలా వేగంగా అగ్రగామిగా ఎదుగుతోంది. మౌలిక సదుపాయాలు, శిక్షణపై మేము భారీగా పెట్టుబడులను ప్రకటించడమనేది, భారత్‌ను ఏఐ ప్రధాన దేశంగా తీర్చిదిద్దడంపై, అలాగే దేశవ్యాప్తంగా ప్రజలు, సంస్థలకు ప్రయోజనం చేకూర్చడంపై మాకున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది' అని నాదెళ్ల చెప్పారు. ఎన్నాళ్ల వ్యవధిలో 3 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనున్నదీ మాత్రం వెల్లడించలేదు. భారత పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో కూడా భేటీ అయిన నాదెళ్ల, తమ సంస్థ విస్తరణ ప్రణాళికలను వివరించారు.



డేటా సెంటర్లపై మరింత దృష్టి..

ప్రపంచవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్ నెట్‌వర్క్‌ను పటిష్టం చేసుకోవడంపై మైక్రోసాఫ్ట్ మరింతగా దృష్టి పెడుతోంది. ఈ ఏడాది డేటా సెంటర్లపై 80 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికలను ఇటీవలే ప్రకటించింది. అజూర్ బ్రాండ్ కింద మైక్రోసాఫ్ట్ క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసులను అందిస్తోంది. కంపెనీకి 300 పైచిలుకు డేటా సెంటర్లు ఉన్నాయి. ఇక భారత్ విషయానికొస్తే అధునాతన సొల్యూషన్స్‌ను రూపొందించడంలో దేశీ డెవలపర్లు కీలక పాత్ర పోషిస్తుండటాన్ని నాదెళ్ల గత పర్యటనలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏఐ నైపుణ్యాలకు సంబంధించి ఇరవై లక్షల మందికి శిక్షణనివ్వడంపై ఇన్వెస్ట్ చేస్తున్నట్లు చెప్పారు.

బ్యాంకింగ్, రిలయన్స్ ర్యాలీ

రెండు రోజుల నష్టాలకు చెక్



ముంబై: బ్యాంకులు, రిలయన్స్ ఇండస్ట్రీస్(2%) షేర్ల ర్యాలీతో స్టాక్‌సూచీలు రెండు రోజుల నష్టాల నుంచి గట్టెక్కాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో సెన్సెక్స్ 234 పాయింట్లు పెరిగి 78,199 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92 పాయింట్లు బలపడి 23,708 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలో కాస్త అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. వెంటనే తేరుకొని రోజంతా పరిమిత శ్రేణిలో లాభాల్లో కదలాడాయి. సెన్సెక్స్ ఒక దశలో 488 పాయింట్లు ఎగసి 78,453 వద్ద, నిఫ్టీ 179 పాయింట్లు పెరిగి 23,795 వద్ద గరిష్టాన్ని తాకాయి. బ్యాంకింగ్ షేర్లతో పాటు ఇంధన, ఆయిల్‌అండ్‌గ్యాస్, ఇండస్ట్రియల్, కమోడిటీ, సర్వీసెస్ షేర్లకూ కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ ఒకశాతం, స్మాల్ క్యాప్ సూచీ 2% రాణించాయి.

ఇండోఫార్మ్ ఎక్విప్‌మెంట్ హిట్



ఇండోఫార్మ్ ఎక్విప్‌మెంట్ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.215)తో పోలిస్తే 20% ప్రీమియంతో రూ.258 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 33% ర్యాలీ రూ.287 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 27% లాభంతో రూ.273 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,310.37 కోట్లుగా నమోదైంది.

అపోలో మైక్రో ర్యాలీ వెనుక!

- 10 రోజుల్లో షేరు 48 శాతం జూమ్
- షేర్ల జారీకి రేపు బోర్డ్ మీటింగ్
- పీఎస్‌యూల నుంచి పలు ఆర్డర్లు

ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రో మెకానికల్ సొల్యూషన్లు అందించే హైదరాబాద్ కంపెనీ అపోలో మైక్రో సిస్టమ్స్ షేరు ఇటీవల ర్యాలీ బాటలో సాగుతోంది. తాజాగా బీఎస్ఈలో 5.5 శాతం జంప్‌చేసి రూ. 136 వద్ద ముగిసింది. గత 10 రోజుల్లోనే ఈ కౌంటర్ ఏకంగా 48 శాతం దూసుకెళ్లింది. డిసెంబర్ 23న రూ. 93 వద్ద ట్రేడయింది. ఇందుకు పలు అంశాలు కారణమవుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన ఈక్విటీ షేర్లు లేదా మార్పిడికి వీలయ్యే సెక్యూరిటీలు(వారంట్లు) జారీకి గురువారం(9న) బోర్డు సమావేశం కానున్నట్లు గత వారాంతాన కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. తద్వారా పెట్టుబడులు సమకూర్చుకోనుంది. కంపెనీ ప్రధానంగా ఏరోస్పేస్, డిఫెన్స్, అంతరిక్ష రంగాలకు ఆధునిక సాంకేతికలతో కూడిన సొల్యూషన్లు అందిస్తోంది.

ఆర్డర్లు

2024 డిసెంబర్ 24న ప్రభుత్వ రంగ డీఆర్‌డీవో నుంచి రూ. 6.14 కోట్ల విలువైన ఆర్డర్ అందుకుంది. ఇదే నెల 3న పీఎస్‌యూ బీఈఎల్ నుంచి రూ. 21.42 కోట్ల ఆర్డర్ బిడ్‌ను గెలుచుకుంది. గతేడాది నవంబర్ 22న డీఆర్‌డీవోతో రూ. 4.65 కోట్ల విలువైన కాంట్రాక్టు కుదుర్చుకుంది. 2024 అక్టోబర్ 10న బీఈఎల్ ఆర్డర్ కోసం రూ. 28.74 కోట్ల విలువైన బిడ్ ఎంపికైనట్లు కంపెనీ వెల్లడించింది. మరోవైపు ఈ ఏడాది క్యూ2లో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం 84% జంప్‌చేయగా.. ఇబిటా 77% ఎగసింది. నికర లాభం మరింత అధికంగా 140% దూసుకెళ్లింది. ఈ అంశాల నేపథ్యంలో షేరు జోరు చూపుతున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కంపెనీలో ప్రమోటర్ల వాటా 55 శాతం. పబ్లిక్ వాటా దాదాపు 45%.

షేరు తీరిలా

2018లో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన అపోలో మైక్రో సిస్టమ్స్ షేరు 2023 నవంబర్ 20న రికార్డ్ గరిష్టం రూ. 162కు చేరింది. అంతకుముందు 2020 మార్చి 25న రూ. 40 వద్ద లైఫ్‌టైమ్ కనిష్టాన్ని తాకింది. ఇక గతేడాది ఫిబ్రవరి 27న రూ. 147ను అధిగమించి 52 వారాల గరిష్టాన్ని అందుకోగా.. అక్టోబర్ 23న రూ. 88 వద్ద ఏడాది కనిష్టం నమోదైంది. – సాక్షి, బిజినెస్ డెస్క్

పసిడి రుణాలే కీలకం

- సుంకాల తగ్గింపుతో బంగారానికి మరింత డిమాండ్
- ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు, 20 నిమిషాల్లోనే రుణాలు
- ఏయూ ఎస్ఎఫ్‌బీ డిప్యూటీ సీఈవో రాజీవ్ యాదవ్



సాక్షి ఇంటర్వ్యూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో పసిడి రుణాలకు డిమాండ్ పెరుగుతోందని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఏయూ ఎస్ఎఫ్‌బీ) డిప్యూటీ సీఈవో రాజీవ్ యాదవ్ తెలిపారు. రాబోయే 3–5 ఏళ్లలో తమ బ్యాంకు వృద్ధి వ్యూహాల్లో గోల్డ్ లోన్లు కీలక పాత్ర పోషించగలవని సాక్షి బిజినెస్ బ్యూరోకు వివరించారు. ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు, ఇరవై నిమిషాల్లోపే రుణాల మంజూరుతో కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించడంపై దృష్టి పెడుతున్నట్లు ఆయన చెప్పారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు అధిక స్థాయిలో ఉన్నప్పటికీ పసిడికి డిమాండ్ పటిష్టంగానే ఉంది. ఐబీఈఎఫ్ అధ్యయనం ప్రకారం, పసిడిపై దిగుమతి సుంకాలను తగ్గించడంతో ఈ ఆర్థిక సంవత్సరం జూలై–సెప్టెంబర్ మధ్య కాలంలో గోల్డ్‌కు డిమాండ్ 18 శాతం పెరిగింది. ఆర్థిక అనిశ్చితులతో పాటు ఫైనాన్సింగ్ ఆప్షన్‌గా బంగారం రుణాలపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో దేశీయంగా గోల్డ్ లోన్లకు డిమాండ్ పెరుగుతోంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం భారత్‌లో కుటుంబాల వద్ద 25,000 టన్నుల పైగా బంగారం ఉన్నట్లు అంచనా. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో సత్వరం, తక్కువ వడ్డీ రేటుపై రుణాలు తీసుకోవాలనుకునే వ్యక్తులు, వ్యాపారవర్గాలకు బంగారం రుణాలు ఆకర్షణీయమైన ఆప్షన్‌గా మారాయి. మేము తక్కువ డాక్యుమెంటేషన్, సరళతరమైన ప్రక్రియతో కస్టమర్లకు సేవలు అందిస్తున్నాం. 12.99 శాతం నుంచి ప్రారంభమయ్యే వడ్డీ రేటు, 20 నిమిషాల్లోపే వేగవంతంగా రుణ వితరణ, వ్యక్తిగత పరిస్థితులను బట్టి సరళతరమైన రీపేమెంట్ ఆప్షన్లు మొదలైన మార్గాల్లో మేము కస్టమర్లకు సర్వీసులు అందిస్తున్నాం. విశ్వసనీయత, పారదర్శకత, సౌకర్యానికి పెద్ద పీట వేస్తున్నాం.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భిన్నమైన ధోరణులు..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గోల్డ్ లోన్ ధోరణులు భిన్నంగా ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వ్యవసాయ ఖర్చులు, చిన్న వ్యాపారాలు, అత్యవసర పరిస్థితుల కోసం బంగారం రుణాలు తీసుకుంటున్నారు. ప్రత్యామ్నాయ రుణ సాధనాల లభ్యత పరిమితంగా ఉండటం వల్ల అత్యవసర పరిస్థితుల కోసం గ్రామీణ ప్రాంతాల కస్టమర్లు బంగారం రుణాలపై ఆధారపడుతుంటారు. ఇక పట్టణ ప్రాంతాల విషయానికొస్తే.. గోల్డ్ లోన్లను నిర్వహణ మూలధన అవసరాలు, ఔత్సాహిక వ్యాపారవేత్తల వెంచర్లు, లైఫ్ స్టయిల్ ఖర్చులు మొదలైన వాటికోసం తీసుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల కస్టమర్లు సౌకర్యం, వేగానికి ప్రాధాన్యమిస్తూ సత్వరమైన, టెక్ ఆధారిత సొల్యూషన్స్‌ను కోరుకుంటున్నారు. దానికి అనుగుణంగానే మేమూ సర్వీసులు అందిస్తున్నాం. పసిడి ధరలు ఆల్–టైమ్ గరిష్ట స్థాయిల్లో ఉన్న నేపథ్యంలో ఇటు బ్యాంకు అటు కస్టమర్ల ప్రయోజనాలను పరిరక్షించేలా ఏయూ ఎస్ఎఫ్‌బీ పటిష్టమైన రిస్క్ మేనేజ్‌మెంట్ విధానాలు పాటిస్తుంది. మెరుగైన లోన్–టు–వేల్యూ (ఎల్‌టీవీ) నిష్పత్తులను పాటిస్తుంది. ఎప్పటికప్పుడు పసిడి ధరల ధోరణులు, మార్కెట్ పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ, పాలసీలను అలాగే పథకాలను తదనుగుణంగా మార్చుకుంటూ ఉంటోంది.

వృద్ధి ప్రణాళికలు ..

మా పసిడి రుణాల పోర్ట్‌ఫోలియో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో సుమారు రూ. 1,986 కోట్లుగా ఉంది. క్యూ1లో ఇది రూ. 1,791 కోట్లు. వచ్చే 3–5 ఏళ్లలో బ్యాంకు వృద్ధి వ్యూహాల్లో గోల్డ్ లోన్లు కీలక పాత్ర పోషించనున్నాయి. మా రిటైల్, ఎంఎస్ఎంఈ పోర్ట్‌ఫోలియోలను విస్తరించడంలో పసిడి రుణాలు గణనీయంగా తోడ్పడే అవకాశముంది. టెక్నాలజీని వినియోగించుకుంటూ, బ్రాంచ్ నెట్‌వర్క్‌ను విస్తరించి, స్థానిక మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఆఫర్లను అందించడం ద్వారా మా గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియోను మరింతగా పెంచుకునే ప్రణాళికలు ఉన్నాయి.



వన్ ప్లస్ 13 వచ్చేసింది

వన్ ప్లస్ 13, 13ఆర్ భారత్‌లో ఆవిష్కరించారు. ప్రారంభ ధర రూ.69,999. వన్‌ప్లస్ 13 మోడల్ 6.82 అంగుళాల స్క్రీన్, 6000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఒక్కొక్కటి 50 ఎంపీ ట్రిపుల్ కెమెరా, 32 ఎంపీ ఫ్రంట్ కెమెరా, స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్, 12/16/24 జీబీ ర్యామ్,100 వాట్ ఫాస్ట్ చార్జింగ్ ఏర్పాటు ఉంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఎకానమీ స్పీడ్ 6.4 శాతమే..: ఎన్ఎస్ఓ | నష్టాల్లోకి మొబిక్విక్

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- సోషియాలజీ
» టెట్/డీఎస్సీ ప్రత్యేకం- బయాలజీ
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జాగ్రఫీ
» బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్


జాబ్ పాయింట్

దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో 4,232 అప్రెంటిస్‌లు

సికింద్రాబాద్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–దక్షిణ మధ్య రైల్వే ఎస్‌సీఆర్ వర్క్‌షాప్/యూనిట్‌లలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 4,232.
» **ఎస్‌సీఆర్ యూనిట్ ప్రదేశాలు:** సికింద్రాబాద్, లాలగూడ, మెట్టుగూడ, ఖాజీపేట, హైదరాబాద్, విజయవాడ, బిట్రగుంట, గూడూరు జంక్షన్, కాకినాడ పోర్టు, కొండపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్, ఒంగోలు, రాజమండ్రి, రాయనపాడు, నల్లపాడు, గుంటూరు, గుంతకల్, తిమ్మనచర్ల, యాద్‌గిర్, నాందేడ్, పూర్ణ జంక్షన్, ముద్‌ఖేడ్.
» **ట్రేడుల వారీగా ఖాళీలు:** ఏసీ మెకానిక్–143, ఎయిర్ కండిషనింగ్–32, కార్పెంటర్–42, డీజిల్ మెకానిక్–142, ఎలక్ట్రానిక్ మెకానిక్–85, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్–10, ఎలక్ట్రీషియన్–1053, ఎలక్ట్రికల్(ఎస్–టి)(ఎలక్ట్రీషియన్)–10, పవర్ పవర్ మెయింటెనెన్స్(ఎలక్ట్రీషియన్)–34, ట్రెన్ లైటింగ్(ఎలక్ట్రీషియన్)–34, ఫిట్టర్–1742, మోటార్ మెకానిక్ వెహికల్(ఎంఎంవీ)–08, మెషినిస్ట్–100, మెకానిక్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్(ఎంఎంటీఎం)–10, పెయింటర్–74, వెల్డర్–713.
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 28.12.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతి, ఐటీఐలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.01.2025
» **వెబ్‌సైట్:** https://scr.indianrailways.gov.in

విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో 91 పోస్టులు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజ్(జీఎంసీ)లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 91
» **పోస్టుల వివరాలు:** సైకియాట్రిక్ సోషల్ వర్కర్–02, సైకియాలజిస్ట్–02, స్పీచ్ థెరపిస్ట్–01, జూనియర్ అసిస్టెంట్ అండ్ కంప్యూటర్ అసిస్టెంట్–25, ల్యాబ్ అటెండెంట్–01, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్–22, టెక్నీషియన్–05, ఎలక్ట్రీషియన్ గ్రేడ్3–01, లైబ్రరీ అసిస్టెంట్–02, స్టోరీ అటెండర్–02, ఆఫీస్ సబార్డినేట్–03, జనరల్ డ్యూటీ అటెండెంట్–17, ఎలక్ట్రికల్ హెల్పర్–03, కంప్యూటర్ ప్రోగ్రామర్–02, అడ్మినిస్ట్రేటర్–02, ఫిజికల్ ఎడ్యుకేషనల్ ట్రెనర్–01.
» **విభాగాలు:** చైల్డ్, క్లినికల్, ల్యాబ్, ఓటీ, డెంటల్, సిస్టమ్, నెట్‌వర్క్ తదితరాలు.
» **అర్హత:** పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ(ఎంఏ/ఎంఎస్‌డబ్ల్యూ), బీఎస్సీ, బీఈ/బీటెక్, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**08.01.2025
» **వెబ్‌సైట్:** https://vizianagaram.ap.gov.in

ఉచిత కోర్సుల వేదిక.. స్వయం!

నేటి వర్చువల్ లెర్నింగ్ యుగంలో నేర్చుకునేందుకు మార్గాలెన్నో! కూర్చున్న చోటు నుంచే మనకు నచ్చిన కోర్సులను పూర్తిచేసుకునే అవకాశం ఉంది. అది కూడా ఉచితంగానే! అంతేకాకుండా ఈ కోర్సులకు ప్రభుత్వ గుర్తింపు కూడా లభిస్తుంది. అందుకు మార్గం.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్వయం వేదిక (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ మైండ్స్)!! స్వయం కోర్సులపై ప్రత్యేక కథనం...



ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'స్వయం' ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీని ద్వారా ఇంజనీరింగ్, టెక్నాలజీ మొదలు హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, బిజినెస్, లా వంటి అనేక విభాగాలకు సంబంధించిన ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేసుకోవచ్చు. 9వ తరగతి నుంచి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ వరకూ.. అనేక కోర్సులను స్వయం ద్వారా అందిస్తున్నారు. దేశంలోని టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌ల ఫ్యాకల్టీ రూపొందించిన ఈ కోర్సుల ద్వారా సబ్జెక్ట్ పరిజ్ఞానంతోపాటు విజ్ఞానాన్ని పెంచుకోవచ్చు.

స్వయం ప్రత్యేకతలు ఇవే

- స్వయం పోర్టల్ ద్వారా ఉచితంగా నాణ్యమైన కోర్సులు పూర్తిచేసుకోవచ్చు. సర్టిఫికెట్ కోరుకునే వారు నామమాత్రంగా పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- నేర్చుకునే వారి సౌకర్యాన్ని, సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కోర్సులను రూపొందించడం జరిగింది. కాబట్టి విద్యార్థులు ఇంటర్నెట్ ఉంటే చాలు ఎక్కడి నుంచైనా తమకు వీలున్నప్పుడు నేర్చుకోవచ్చు.
- స్వయం అనేది ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్. కాబట్టి విద్యార్థులు కోర్సు మెటీరియల్‌ను ఇంటర్నెట్ ద్వారా ఉచితంగా పొందొచ్చు. అనేక స్వయం కోర్సులకు సర్టిఫికెట్ సైతం అందిస్తున్నారు. వీటికి ఇన్‌స్టిట్యూట్‌లతోపాటు పరిశ్రమ వర్గాల్లోనూ గుర్తింపు ఉంది. ఇది జాబ్ మార్కెట్‌లో, ఉద్యోగ వేటలో ముందంజలో నిలిచేలా దోహదపడుతుంది.
- **స్వయం కోర్సుల సమన్వయకర్తలు:** ఏఐసీటీఈ, ఎన్‌పీటీఈఎల్, యూజీసీ, ఎన్‌సీఈఆర్‌టీ, ఐఐఎం బెంగళూరు, ఇగ్నో, ఎన్ఐఓఎస్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్), సీఈసీ(కన్సోర్టియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్), ఎన్ఐటీటీటీఆర్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్).
- **వెబ్‌సైట్:** https://swayam.gov.in

జనవరిలో ప్రారంభమయ్యే కోర్సులివే

అడ్వాన్స్‌డ్ సీ ++

- **ఫ్యాకల్టీ:** ప్రొఫెసర్ కన్నన్ మౌద్‌గాల్య(ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఆఫ్ స్పోకెన్ ట్యుటోరియల్, ఐఐటీ బాంబే).
- ఏఐసీటీఈ రూపొందించిన ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ) ఇది.

ఇందులో మొత్తం 10 ఆడియో–వీడియో స్పోకెన్ ట్యుటోరియల్స్ ఉన్నాయి. దీనిద్వారా అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ల్యాంగ్వేజ్ సీ++ను నేర్చుకోవచ్చు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో ఎంతో కీలకమైన సీ++ లాంగ్వేజ్‌కు సంబంధించిన అడ్వాన్స్‌డ్ కాన్సెప్ట్‌లను నేర్చుకునే అవకాశముంది. అభ్యర్థి ఆసక్తి, సమయం, సౌలభ్యం మేరకు ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా పూర్తిచేసుకోవచ్చు.

ఏఐ ఇన్ హ్యుమాన్ రిసోర్సెస్(హెచ్‌ఆర్) మేనేజ్‌మెంట్

- **ఫ్యాకల్టీ:** ప్రొఫెసర్ అబ్రహం సిరిల్ ఐజాక్(ఐఐటీ గౌహతి).
- ఈ స్వయం కోర్సు ద్వారా ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)లో తాజా ట్రెండ్స్‌ను తెలుసుకోవచ్చు. హ్యుమాన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్‌లో ఏఐ ప్రభావంపై అవగాహన పొందొచ్చు. ముఖ్యంగా హెచ్‌ఆర్ విభాగంలో నియామక ప్రక్రియ, మానవ వనరుల అభివృద్ధి, రిటెన్షన్‌లో ఏఐ పాత్రపై ఈ కోర్సు ద్వారా అవగాహన లభిస్తుంది. దీంతోపాటు ఏఐ ప్రవేశంతో మానవ వనరుల విభాగంలో ఎదురవుతున్న సవాళ్లు, పరిష్కారాల గురించి తెలుసుకునే అవకాశముంది.
- **కోర్సు కాల వ్యవధి:** 12 వారాలు
- **కోర్సు ప్రారంభం:** 2025, జనవరి 20
- **కోర్సు ముగింపు:** 2025, ఏప్రిల్11
- **దరఖాస్తుకు చివరి తేది:** 2025, జనవరి 27
- **పరీక్షకు రిజిస్ట్రేషన్:** 2025, ఫిబ్రవరి 14

అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్

- **ఫ్యాకల్టీ:** ప్రొఫెసర్ ఆశీష్ దత్తా, ఐఐటీ కాన్పూర్.
- రోబోటిక్స్ సిస్టమ్ డిజైన్, కంట్రోల్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు, ఇండస్ట్రీ నిపుణుల కోసం ఈ అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్ కోర్సును రూపొందించారు. ఇందులో లింకేజెస్,వర్క్‌స్పేసెస్, ట్రాన్స్‌ఫర్మేషన్స్, కైనమేటిక్స్, ట్రాజెక్టరీ ప్లానింగ్, డైనమిక్స్ తదితర అంశాలను నేర్చుకోవచ్చు.
- **కోర్సు కాల వ్యవధి:** 12 వారాలు
- **కోర్సు ప్రారంభం:** 2025, జనవరి 20
- **కోర్సు ముగింపు:** 2025, ఏప్రిల్ 11
- **దరఖాస్తుకు చివరి తేది:** 2025, జనవరి 27
- **పరీక్షకు రిజిస్ట్రేషన్:** 2025, ఫిబ్రవరి 14

ఎయిర్‌క్రాఫ్ట్ డిజైన్

- **ఫ్యాకల్టీ:** ప్రొఫెసర్ ఏకే ఘోష్, ఐఐటీ కాన్పూర్.
- ఎయిర్‌క్రాఫ్ట్ డిజైన్ కోర్సులో పూర్తిగా విమానం కాన్సెప్చువల్ డిజైన్‌ను పొందుపరిచారు.దీనిద్వారా ఎయిర్‌క్రాఫ్ట్ డిజైన్‌కు అవసరమైన వాటి నిర్వచనాల తోపాటు ప్రాథమిక స్థాయిలో సైజులు, కాన్ఫిగరేషన్ లేఅవుట్, అనాలసిస్, ఆప్టిమైజేషన్, ట్రేడ్ స్టడీస్ అంశాలపై అవగాహన పొందొచ్చు.
- **కోర్సు కాల వ్యవధి:** 12 వారాలు
- **కోర్సు ప్రారంభం:** 2025, జనవరి 20
- **కోర్సు ముగింపు:** 2025, ఏప్రిల్ 11
- **దరఖాస్తుకు చివరి తేది:** 2025, జనవరి 27
- **పరీక్షకు రిజిస్ట్రేషన్:** 2025, ఫిబ్రవరి 14

కాన్‌స్టిట్యూషన్ లా అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ ఇండియా

- **ఫ్యాకల్టీ:** సాయి రామ్ భట్, నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ.
- దేశంలో రాజ్యాంగం, చట్టాలు, ప్రజా పాలనపై అన్ని విభాగాల విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కోర్సును రూపొందించారు. దీనిద్వారా కాన్‌స్టిట్యూషనల్ లా, పబ్లిక్ అడ్మిషన్‌పై అవగాహన పెంచుకోవచ్చు.
- **కోర్సు కాల వ్యవధి:** 12 వారాలు
- **కోర్సు ప్రారంభం:** 2025, జనవరి 20
- **కోర్సు ముగింపు:** 2025, ఏప్రిల్ 11
- **దరఖాస్తుకు చివరి తేది:** 2025, జనవరి 27
- **పరీక్షకు రిజిస్ట్రేషన్:** 2025, ఫిబ్రవరి 14

కమ్యూనికేటివ్ ఇంగ్లిష్

- **ఫ్యాకల్టీ:** డాక్టర్ సలియా రెక్స్, సెయింట్ పాల్స్ కాలేజీ, కలామస్సరీ.
- ఈ కోర్సును ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై సంపూర్ణ అవగాహన కలిగించేలా రూపొందించారు. ఇంగ్లిష్ నేర్చుకోవడంలో కీలకమైన నాలుగు నైపుణ్యాలు రైటింగ్, రీడింగ్, లిజనింగ్, స్పీకింగ్ స్కిల్స్‌ను పెంపొందించుకోవచ్చు. అదేవిధంగా రిటెన్, స్పోకెన్ కమ్యూనికేషన్‌లో ఇంగ్లిష్‌ను ఒక పరికరంగా ఎలా ఉపయోగించాలి, ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడం, దైనందిన జీవితంలో ఇంగ్లిషను సమయోచితంగా ఉపయోగించడం గురించి ఈ కోర్సు ద్వారా తెలుసుకోవచ్చు.
- **కోర్సు కాల వ్యవధి:** 12 వారాలు
- **కోర్సు ప్రారంభం:** 2025, జనవరి 13
- **కోర్సు ముగింపు:** 2025, ఏప్రిల్ 13
- **దరఖాస్తుకు చివరి తేది:** 2025, జనవరి 28
- **పరీక్షకు రిజిస్ట్రేషన్:** 2025, ఫిబ్రవరి 28

ఏఐ ఫర్ ఇన్వెస్ట్‌మెంట్

- **ఫ్యాకల్టీ:** ప్రొఫెసర్ అభినవ త్రిపాఠీ,ఐఐటీ కాన్పూర్
- పెట్టుబడుల రంగంలో భవిష్యత్ అనలిస్టులు, ట్రేడర్లు, బ్రోకర్లు, కన్సల్టెంట్లు, ఇతర పరిశ్రమ నిపుణులకు ఉపయోగపడేలా ఏఐ ఫర్ ఇన్వెస్ట్‌మెంట్ కోర్సును రూపొందించారు. ఇప్పటికే ఈ రంగంతో పరిచయం ఉన్న వారితోపాటు తమ వృత్తిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ కీలకంగా మారుతుందని భావిస్తున్న వారి కోసం ఈ కోర్సును రూపొందించారు.
- **కోర్సు కాల వ్యవధి:** 12 వారాలు
- **కోర్సు ప్రారంభం:** 2025, జనవరి 20
- **కోర్సు ముగింపు:** 2025, ఏప్రిల్ 11
- **దరఖాస్తుకు చివరి తేది:** 2025, జనవరి 27
- **పరీక్షకు రిజిస్ట్రేషన్:** 2025, ఫిబ్రవరి 14

అప్రిసియేటింగ్ హిందుస్తానీ మ్యూజిక్

- **ఫ్యాకల్టీ:** ప్రొఫెసర్ లక్ష్మీ శ్రీరామ్, అసోసియేట్ ప్రొఫెసర్, అహ్మదాబాద్ యూనివర్సిటీ.
- ఈ కోర్సు ప్రధానంగా ప్రస్తుత అనుసరిస్తున్న విధానాలపై దృష్టిసారిస్తుంది. దీంతోపాటు చారిత్రక, మేథో కోణాలను కూడా చర్చిస్తుంది. ముఖ్యంగా ప్రముఖ సంగీతకారులు, పరిశోధకుల అభిప్రాయాలను పొందుపరుస్తుంది. ఈ కోర్సులో భాగంగా లైవ్ డెమాన్‌స్ట్రేషన్స్‌తో పాటు రికార్డు చేసిన సంగీతాన్ని వినడం తదితర అంశాలు ఉంటాయి.
- **కోర్సు కాల వ్యవధి:** 8 వారాలు
- **కోర్సు ప్రారంభం:** 2025, జనవరి 20
- **కోర్సు ముగింపు:** 2025, మార్చి 14
- **దరఖాస్తుకు చివరి తేది:** 2025, జనవరి 27
- **పరీక్షకు రిజిస్ట్రేషన్:** 2025, ఫిబ్రవరి 14

పీఆర్ అండ్ ఆర్‌డీ ఉద్యోగుల డిప్యుటేషన్లు రద్దు!

మంత్రి సీతక్క నిర్ణయం



సాక్షి, హైదరాబాద్ : వివిధ ప్రభుత్వ శాఖల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న పంచాయతీ, గ్రామీణాభివృద్ధి (పీఆర్ అండ్ ఆర్‌డీ) ఉద్యోగులను వెనక్కి రప్పించనున్నారు. పలు జిల్లాల పర్యటనకు వెళ్లిన సందర్భంలో మంత్రి సీతక్క దృష్టికి ఈ విషయం వచ్చింది. అంతేకాక పలు జిల్లాల్లో పీఆర్ అండ్ ఆర్‌డీ శాఖల్లో వివిధ పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. మూడు, నాలుగేళ్లకు మించి డిప్యుటేషన్ల పొడిగింపుపై విజ్ఞప్తులు, ఆయా జిల్లాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల్లో ఇన్‌చార్జ్‌ల నియామకం, అదనపు విధులు అప్పగించాల్సి రావడం వంటివాటిపై మంత్రి ఇటీవల ఆరా తీశారు. మున్సిపల్‌తోపాటు హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీతోపాటు వివిధ శాఖల్లో పలువురు అధికారులు వరుసగా కొన్నేళ్ల పాటు డిప్యుటేషన్‌పై పనిచేస్తుండడంతో వాటిని రద్దు చేసి.. పేరెంట్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా త్వరలోనే శాఖాపరంగా సర్క్యులర్ జారీచేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం. కాగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగుల పరిష్కారానికి గ్రీవెన్స్ డే నిర్వహించనున్నారు. నెలకు ఒకసారి రెండుగంటల పాటు కేవలం వివిధ స్థాయిల ఉద్యోగులు, అధికారుల గ్రీవెన్స్‌పైనే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. అవసరాన్ని బట్టి పదిహేను రోజులకు ఒకసారి జిల్లాస్థాయిలోనూ ఇదే తరహాలో ఉద్యోగులకు ఏవైనా సమస్యలుంటే పరిష్కరించాలని యోచిస్తున్నారు.

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా

సమీక్షలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రానున్న వేసవిలో ఎలాంటి అంతరాయాలకు ఆస్కారం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు సన్నద్ధమై ఉండాలని తెలంగాణ ట్రాన్స్‌కో, టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ సంస్థలను ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, తెలంగాణ జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. రబీ పంటలకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించాలని, సరఫరాలో అంతరాయాలు కలిగితే ఎప్పటికప్పుడు మరమ్మతులు నిర్వహించి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అంతరాయాల నివారణ కోసం 33 కేవీ, 11 కేవీ ఫీడర్ల నిర్వహణ, పర్యవేక్షణ పనులు చేపట్టాలన్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాకి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై మంగళవారం ఆయన విద్యుత్ సౌధలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో పంటలకు విద్యుత్ సరఫరా పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో చేపట్టిన 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ సబ్ స్టేషన్లతో పాటు ఎక్స్‌ట్రా హైటెన్షన్ లైన్ (ఈహెచ్‌టీ) నిర్మాణ పనులను వేసవి ప్రారంభానికి ముందు పూర్తి చేస్తామని సంస్థ ట్రాన్స్‌మిషన్ విభాగం డైరెక్టర్ వివరించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో గణనీయంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి తీసుకుంటున్న చర్యలపై ఉత్తర–దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు కె.వరుణ్‌రెడ్డి, ముషారఫ్ అలీ ఫారూఖీలు సమావేశంలో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఐటీ ఇన్‌స్ట్రక్టర్, పీఆర్వో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో 65 ఐటీ ఇన్‌స్ట్రక్టర్, రెండు పీఆర్‌ఓ పోస్టులను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గురుకుల విద్యాలయాల సంస్థ ప్రకటించింది. ఆసక్తి ఉన్న వారు ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఐటీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఎంటెక్/బీటెక్/ఎంసీఏ (కంప్యూటర్స్) పూర్తి చేసిన వారు, పీఆర్‌ఓ పోస్టుకు జర్నలిజంలో డిగ్రీ పూర్తి చేసి కనీసం పది సంవత్సరాల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అభ్యర్థులు 10వ తేదీన సాయంత్రం 4 గంటలలోగా మాసబ్ ట్యాంక్‌లోని దేశోద్ధారక భవన్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను పొంది దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది.

వేటగాళ్ల ఉచ్చులో నెమలి



మాంసం ముద్దగా నెమలి

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట, రంగసముద్రం చెరువుకట్ట, మంజునాథ్ ఎస్టేట్ పరిసరాల్లో నెమలిని వేటగాళ్లు చంపారు. వివరాలివి. ఈ ప్రాంతంలో నెమళ్లు సంచరిస్తున్న విషయం తెలిసి వేటగాళ్లు వలలు వేశారు. మంగళవారం ఉదయం 5 గంటలకే వలకు నెమలి చిక్కింది. అక్కడే చెట్లమాటున నెమలిని చంపి మంటల్లో కాల్చి తినేందుకు సిద్ధమయ్యారు. ఉదయం 6 గంటలకు కల్లు మండువకు వెళ్తున్న సమ్మయ్యగౌడ్‌ను దూరం నుంచి గమనించిన వేటగాళ్లు పరుగులు పెట్టారు. చెట్ల పొదల మాటున పొగ మంటను గమనించిన సమ్మయ్య వెళ్లి చూడగా.. నెమలి పూర్తిగా కాలిపోయి ఉంది. విషయాన్ని వెంటనే అటవీశాఖ అధికారులు, పోలీసులకు తెలిపాడు. వారు సంఘటన స్థలానికి చేరుకుని కాలిన నెమలి మాంసం ముద్దలను ఉన్నతాధికారుల ఆదేశాలతో తరలించినట్టు తెలిసింది.





తాజ్‌మహల్‌లో తెలంగాణ రాళ్లు!

దేవరకొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లోని క్రిస్టల్ క్వార్ట్జ్ రాళ్లను పాలరాతిలో పొదిగినట్లు గుర్తింపు

కాలిఫోర్నియాకు చెందిన పలువురు నిపుణుల అధ్యయనంలో వెలుగులోకి ..

సాక్షి, హైదరాబాద్

పాలరాతిని పేర్చి అద్భుత కట్టడంగా తాజ్‌మహల్‌ను మొఘల్ వంశీయులు ఎలా సృష్టించారో నిగ్గు తేల్చేందుకు ప్రపంచవ్యాప్తంగా ఎందరో నిపుణులు అధ్యయనాలు చేస్తున్నారు. అలా కాలిఫోర్నియాలోని విఖ్యాత జెమోలాజికల్ లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్ నుంచి రిటైర్డ్ లైబ్రేరియన్ డిర్లామ్, రీసెర్చ్ లైబ్రేరియన్ రోజర్స్, సంస్థ డైరెక్టర్ వెల్డన్‌లు కూడా నాలుగైదేళ్లలో విడతలవారీగా వచ్చి అధ్యయనం చేపట్టారు. పైకి పాలరాతి నిర్మాణమే అయినప్పటికీ తాజ్ నిర్మాణంలో వజ్రాలు, వైఢూర్యాలు, రత్నాలు, ముత్యాలు, స్ఫటికాలు, పచ్చలు.. ఇవి కూడా పొందికగా ఒదిగిపోయాయని తెలిసి వారు అధ్యయనానికి వచ్చారు. అలా జరిగిన వారి అధ్యయనం ద్వారానే తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలు పనిలోపనిగా మన దేవరకొండ, మహబూబ్‌నగర్ ప్రాంతం నుంచి వచ్చిన రాళ్లనూ మోశారని వెలుగు చూసింది.

పర్చిన్‌కారీ పద్ధతిలో..

పాలరాతిపై వివిధ ఆకృతులతో కూడిన నగిషీలను విడిగా పేర్చినట్లుగా కాకుండా పాలరాతిలో అంతర్భాగంగా ఉండేలా చేయాలని అప్పట్లో నిర్ణయించారు. ఇందుకు పర్చిన్‌కారి పద్ధతిని అనుసరించారు. ఇటలీ, గ్రీస్‌లలో పుటిన పియెత్రా డ్యురాకు కాస్త దగ్గరి పోలికుండే ఈ పర్చిన్‌కారి కళ 16వ శతాబ్దంలో భారత్‌లో అభివృద్ధి చెందింది. ముందుగా పాలరాతిపై ఆ ఆకృతిని గీసి దాని ప్రకారం రాయిని కట్ చేశారు. అదే ఆకృతిలో రంగురాళ్లను అరగదీసి సానబెట్టి మెరుపు తెప్పించాక, పాలరాయిని కట్ చేసిన భాగంలో పొదిగారు. దీంతో ఆ డిజైన్ రాయిలో భాగమనే భ్రమ కలిగిస్తోంది. అలా తాజ్‌మహల్ కట్టడంలో పాలరాతిలో ఇలాంటి ఎన్నో ఆకృతులు ఒదిగిపోయాయి. వాటిల్లో మన తెలంగాణ ప్రాంత రాళ్లు కూడా చిరస్థాయిగా మిగిలిపోయాయి. ఇంకొన్ని రాళ్లను పియెత్రా డ్యురా పద్ధతిలో పాలరాతిపై ప్రత్యేక జిగురుతో అతికించి కళాత్మకంగా ఆకృతులద్దారు.

పలుగురాయిలో భాగమే..

తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో పలుగు రాళ్లు కనిపిస్తాయి. అలాంటి రాళ్లలో కొన్ని క్రిస్టల్ (పారదర్శకంగా) లక్షణాలు కలిగి ఉంటాయి. వాటినే క్రిస్టల్ క్వార్ట్జ్‌గా పేర్కొంటారు. అవి విలువైన స్ఫటికంలో భాగమే. వాటిని నగల నగిషీల్లో వినియోగిస్తారు.

మన రాళ్లే ఎందుకు?..

తాజ్ కట్టడం గోడలపై పాలరాయి పరుచుకుంది. కానీ ప్రతి నిర్మాణంలోనూ కొత్తదనాన్ని కోరుకున్న మొఘల్ వంశీయులు ఆ పాలరాతి మీదుగా పూలతో కూడిన లతలు అల్లుకున్న అనుభూతిని కలిగించాలనుకున్నారు. నగల్లో వాడే వజ్రాలు, పచ్చలు, కెంపులు.. ఇలా అన్నింటినీ ఈ నగిషీలకు వాడాలని నిర్ణయించి వాటికి ప్రపంచంలో ఏయే ప్రాంతాలు ప్రసిద్ధో గుర్తించారు. ఆయా దేశాలను గాలించి వాటిల్లో మేలిమి వాటిని సేకరించి తెచ్చి తాజ్‌మహల్ నిర్మాణంలో వాడారు. అలా వాడే విలువైన రాళ్ల జాబితాలో క్రిస్టల్ క్వార్ట్జ్ (ఓ రకమైన స్ఫటికం) కూడా ఒకటి. వాటికి ఏ ప్రాంతాలు ప్రసిద్ధిగాంచాయో గాలిస్తే.. గోల్కొండ మైన్ అనే సమాధానం వచ్చింది. కృష్ణా నదీ తీరాన్ని ఆసరా చేసుకొని గోల్కొండ గనులు విస్తరించాయి. ఇది వజ్రాలతోపాటు క్రిస్టల్ క్వార్ట్జ్ కూడా ప్రసిద్ధే. అయితే ఇది ఆ గనుల ఆమూలాగ్రంలో లభించదు. మేలిమి రాళ్లు ప్రస్తుత దేవరకొండ, మహబూబ్‌నగర్‌లలోనే దొరికేవి. దీంతో ఈ ప్రాంతం నుంచి క్రిస్టల్ క్వార్ట్జ్ రాళ్లను తెప్పించారన్నది ఇప్పుడు వెలుగుచూస్తున్న విషయం.

నాణ్యత ఆధారంగా చూస్తే ఈ ప్రాంతానివే..



తాజ్‌మహల్‌లోని రాళ్లలో మేలిమి స్ఫటికంలా ఉన్నవి లభించే ప్రాంతాలు దేవరకొండ, మహబూబ్‌నగర్ పరిసరాలే. మేలిమి రాళ్లను సేకరించిన షాజహాన్.. ఈ రాళ్ల విషయంలోనూ నాణ్యమైనవే గుర్తించారు. అప్పటి వర్తకంలో కీలకంగా ఉన్న ప్రాంతాల నుంచే సేకరించినందున అవి ఈ ప్రాంతాలకు చెందినవిగానే పరిగణించాల్సి ఉంటుంది.

– చకిలం వేణుగోపాలరావు, జీఎస్ఐ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్

ఇంటర్‌లో ఉత్తుత్తి ప్రాక్టికల్స్‌కు చెక్

- నిఘా నీడన ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్న బోర్డు
- ప్రతి పరీక్ష కేంద్రంలోనూ సీసీ కెమెరాల ఏర్పాటు
- అధికారులకు బోర్డు కార్యదర్శి ఆదేశం
- ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభం కానున్న ప్రాక్టికల్స్



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలపై ఇంటర్ బోర్డు ప్రత్యేక దృష్టి పెట్టింది. నిఘా నీడలో ప్రయోగ పరీక్షలు జరగాలని బోర్డు కార్యదర్శి అన్ని జిల్లాల ఇంటర్ అధికారులను ఆదేశించారు. దీంతో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు సమీక్ష జరిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని ఇంటర్ బోర్డ్ ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.

ప్రైవేటు కాలేజీల్లో ప్రయోగాలు చేయకున్నా మార్కులు!

ఏటా ప్రాక్టికల్ పరీక్షలపై అనేక ఫిర్యాదులొస్తున్నాయి. ప్రైవేటు కాలేజీల్లో తూతూ మంత్రంగా ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారని, విద్యార్థులు ప్రయోగాలు చేయకపోయినా మార్కులు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షణకు ఇన్విజిలేటర్లుగా వెళ్ళే ప్రభుత్వ లెక్చరర్లను కాలేజీలు ముందే ఆకట్టుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. ఈ కారణంగా ప్రభుత్వ కాలేజీల కన్నా, ప్రైవేటు కాలేజీ విద్యార్థులకు ఎక్కువ మార్కులు వస్తున్నాయన్న విమర్శలున్నాయి. దీన్ని అడ్డుకునేందుకు కొన్నేళ్ళుగా ఇంటర్ బోర్డ్ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

మార్కులపై దృష్టి

రాష్ట్రంలో ఈ ఏడాది 3,80,960 మంది విద్యార్థులు ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాస్తున్నారు. వారిలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ఉన్నాయి. అలాగే అన్ని గ్రూపుల విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ ఉన్నాయి. ఇందులో 1,20,515 మంది ఎంపీసీ విద్యార్థులు, 75,040 మంది బైపీసీ విద్యార్థులు ఉన్నారు. ఎంపీసీ విద్యార్థులకు కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో ప్రయోగ పరీక్షలు ఉండగా బైపీసీ విద్యార్థులకు ఈ రెండింటితోపాటు బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో ప్రాక్టికల్స్ ఉన్నాయి. రెండేళ్లుగా ప్రభుత్వ కాలేజీల విద్యార్థులకు ప్రయోగ పరీక్షల్లో 75 శాతం మార్కులు వస్తుండగా కార్పొరేట్ కాలేజీల్లో ఏకంగా 90 శాతంపైనే మార్కులు వస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వ కాలేజీల్లో ప్రాక్టికల్స్ చేయిస్తుండగా చాలా వరకు ప్రైవేటు కాలేజీల్లో కనీసం లేబొరేటరీలు, రసాయనాలు కూడా ఉండటం లేదని పలువురు లెక్చరర్లు బోర్డు దృష్టికి తీసుకెళ్లారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాలేజీలపై నిఘా పెట్టాలని నిర్ణయించారు. ఆరోపణలున్న కాలేజీల సీసీ ఫుటేజీను పరిశీలించే ఆలోచన ఉందని ఓ అధికారి తెలిపారు.

పరీక్షలపై రోజూ నివేదిక

ఇంటర్ పరీక్షల తీరుతెన్నులపై ప్రతిరోజూ నివేదిక ఇవ్వాలని అధికారులను ఇంటర్ బోర్డు ఆదేశించింది. ఏ కాలేజీలో ఎందరు విద్యార్థులు ఏయే ప్రాక్టికల్స్ చేశారనే అంశాలను అందులో పొందుపర్చాలని సూచించింది. గతంలో ఒక కాలేజీకి పంపిన లెక్చరర్‌ను ఈసారి వేరే కాలేజీకి పంపాలని ఆదేశించింది.

చూడి ఆవుకు సేవలందించి..

వెటర్నరీ డాక్టర్లుగా కేఎంసీ వైద్య విద్యార్థులు




ఎంజీఎం: కేఎంసీ వైద్య విద్యార్థులు వెటర్నరీ వైద్యులుగా మారారు. చూడి ఆవుకు సేవలందించి ప్రాణం కాపాడారు. వరంగల్ కాకతీయ వైద్య కళాశాల మైదానంలో చూడి ఆవు తీవ్ర ఇబ్బంది పడుతుండటాన్ని రెండో సంవత్సరం విద్యార్థులు ఉదయ్‌కిరణ్, స్వరూప్, మోహన్‌దీప్, షణ్ముఖ్, నవనీత్, హేమంత్, మధుకర్ గమనించారు. వెంటనే వెటర్నరీ వైద్య నిపుణుడికి సమాచారం అందించారు. సమయం లేకపోవడంతో సదరు వైద్యుడిని వీడియో కాల్ ద్వారా సంప్రదించి.. ఆవుకు విజయవంతంగా సేవలు అందించారు. ప్రసవం అనంతరం ఆవు ఆరోగ్యం నిలకడగా ఉందని గోపాలమిత్ర సభ్యులకు తెలిపారు. వీరికి సెక్యూరిటీ సిబ్బంది సైతం అండగా నిలిచారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులను పలువురు ప్రశంసించారు.

హైడ్రా ఠాణా ఏర్పాటు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- బుద్ధభవన్‌లోని బీ–బ్లాక్ కేంద్రంగా త్వరలో కార్యకలాపాలు మొదలు
- ఓఆర్ఆర్ లోపలి వరకు పరిధితో ఏర్పాటు
- స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఏసీపీ స్థాయి అధికారి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ భూముల పరిరక్షణ, చెరువుల కబ్జాల నిరోధం, విపత్తుల వేళ సత్వర స్పందన తదితర లక్ష్యాలతో ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కోసం ప్రత్యేక పోలీసు స్టేషన్ ఏర్పాటైంది. నగరంలోని బుద్ధ భవన్‌లో బీ–బ్లాక్ కేంద్రంగా కార్యకలాపాలు హైడ్రా ఠాణా కార్యకలాపాలు సాగించనుంది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఠాణాకు ఏసీపీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) ఉండనున్నారు. ఓఆర్ఆర్ లోపలి భాగం, దానికి ఆనుకొని ఉన్న మున్సిపాలిటీలు దీని పరిధిలోకి వస్తాయి. ఈ ఠాణాలో పని చేయడానికి సిబ్బంది, అధికారులను డిప్యూటేషన్ ప్రాతిపదికన తీసుకోనున్నారు. గణతంత్ర వేడుకల్లోగా హైడ్రా ఠాణా కార్యకలాపాలు ప్రారంభించేలా రంగనాథ్ కసరత్తు చేస్తున్నారు.

దర్యాప్తులో జాప్యాన్ని నివారించేందుకు..

జలవనరుల్లో కట్టడాలకు అడ్డగోలు అనుమతులను హైడ్రా తీవ్రంగా పరిగణిస్తోంది. దీనిపై ఆయా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తోంది. సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ)తోపాటు అనేక చోట్ల ఇప్పటికే కేసుల దర్యాప్తు సాగుతోంది. అయితే రోజువారీ కార్యకలాపాల్లో తలమునకలై ఉండే స్థానిక పోలీసులు ఈ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వలేకపోతుండటంతో దర్యాప్తు ఆలస్యమవుతోంది. ఇది కబ్జాకోరులు, అక్రమార్కులకు వరంగా మారుతుండటంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేక పోలీసు స్టేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అందుకు సానుకూలంగా స్పందించిన సర్కారు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

పీడీపీపీ కింద కేసులు!

జీహెచ్ఎంసీ పరిధిలోని చెరువుల్లో అనేకం ప్రస్తుతం కబ్జాకోరల్లో చిక్కుకున్నాయి. వాటితోపాటు ప్రభుత్వ భూములు, పార్కులు సైతం అన్యాక్రాంతమయ్యాయి. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై ప్రజా ఆస్తుల విధ్వంసాల నిరోధక చట్టం (పీడీపీపీ) కింద కేసులు నమోదు చేసే అవకాశాన్ని హైడ్రా పరిశీలిస్తోంది. చెరువులను పూడ్చడమంటే ధ్వంసం చేసినట్లేననే ఉద్దేశంతో ఈ దిశగా యోచిస్తోంది. ఈ చట్టం కింద కేసు నమోదు వల్ల బాధ్యుల నుంచి జరిగిన నష్టాన్ని రికవరీ చేయడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

హైడ్రా ఠాణా పరిధి ఇలా...		
హైడ్రా విస్తరించి ఉన్న 2,053.44 చదరపు కిలోమీటర్లలో ఉండే కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీలు, ప్రత్యేక పాలనా సంస్థలు	ప్రత్యేక పరిపాలనా వ్యవస్థలు	సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియా, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, ఐలాలతో సహా 61 పారిశ్రామిక ప్రాంతాలు
	కార్పొరేషన్లు	జీహెచ్ఎంసీ, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్–జిల్లెలగూడ, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్
	మున్సిపాలిటీలు	పెద్ద అంబర్‌పేట్, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయాంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిబట్ల, తుక్కుగూడ, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, దమ్మాయిగూడ, నాగారం, ఘట్కేసర్, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, దుండిగల్, పోచారం.
	గ్రామ పంచాయతీలు	రామచంద్రాపురం, ఐలాపూర్, కర్దనూర్, కిష్టారెడ్డిపేట్, ముత్తంగి, పోచారం, సుల్తాన్‌పూర్, కాచివానిశింగారం, కొర్రెముల్, పీర్జాదిగూడ, ప్రతాపసింగారం, బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట్, చేర్యాల్, గుడుమకుంట, కీసర, రాంపల్లి, తిమ్మాయిపల్లి, యాద్గిర్‌పల్లి, మన్సల్, గౌడవెల్లి, పుద్దూర్, మంచిరేవుల, బొమ్మరాస్‌పేట్, గోల్కొండ కలాన్, గోల్కొండ కుర్ద్, హమీదుల్లానగర్, జన్వాద.



జైళ్లశాఖ కేలండర్ ఆవిష్కరించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జైళ్లశాఖ రూపొందించిన 2025 సంవత్సరం కేలండర్, డైరీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ మేరకు జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా ఆధ్వర్యంలో అధికారుల బృందం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన నేర చట్టాలపై తెలంగాణ జైళ్లశాఖ.. నల్సార్ లా యూనివర్సిటీతో కలిసి రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను సీఎం ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జైళ్లశాఖ ఐజీలు వై.రాజేశ్, ఎస్.మురళీబాబు, డీఐజీలు డాక్టర్ డి.శ్రీనివాస్, ఎం.సంపత్ ఉన్నారు.

భూ సంస్కరణలకు ఆద్యుడు పీవీ

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- కాళోజీకి పీవీ నరసింహారావు అవార్డు ప్రదానం



గన్‌ఫౌండ్రి (హైదరాబాద్): దేశంలో భూ సంస్కరణలకు ఆద్యుడు పీవీ నరసింహారావు అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. రవీంద్రభారతిలో మంగళవారం పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. భారతరత్న అవార్డు గ్రహీత పీవీ నరసింహారావు మెమోరియల్ అవార్డును.. పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావుకు ప్రకటించారు. ఆయన తరఫున కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెళ్ల భాస్కర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు సంస్కరణలు సమాజంలోని అనేకమంది ఎదుగుదలకు ఎంతగానో దోహద పడ్డాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీలు టి.సుబ్బిరామిరెడ్డి, కేవీపీ రామచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈవీ పాలసీ

రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్




సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) పరిధిలో ఏటా 5 లక్షల వాహనాలు రోడ్లపైకి వస్తున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. వాటి నుంచి వెలువడే కాలుష్యాన్ని అరికట్టేందుకు తమ ప్రభుత్వం రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) పాలసీ తీసుకొచ్చిందని తెలిపారు. ఈవీలకు 100 శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. 2026, డిసెంబర్ 31 వరకు తాము ఇచ్చిన ఈ రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం న్యూఢిల్లీలోని భారత మండపంలో కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరిగిన 42వ రవాణా అభివృద్ధి మండలి సమావేశంలో పొన్నం పాల్గొన్నారు. ఈ సమావేశంలో డ్రైవింగ్ శిక్షణా కేంద్రాల విధానాన్ని ప్రకటించారు. కొత్త మోటార్ వెహికల్ చట్టం సవరణలు, రహదారి భద్రత సమస్యలు, వాహన్ సారథి, ఫేస్‌లెస్ లావాదేవీలు వంటి అంశాలపై కేంద్రమంత్రి అధ్యక్షతన సుదీర్ఘమైన చర్చ జరిగింది. అనంతరం ఢిల్లీలో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్లను మంత్రుల బృందం పరిశీలించింది. 'రాష్ట్రంలో ఈ ఏడాది మే నుంచి వాహన్ సారథి అప్లికేషన్ అందుబాటులోకి వస్తుంది. చిన్న వయసులోనే పిల్లలకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కులను ఏర్పాటు చేయాలని డిపార్ట్‌మెంట్ నిర్ణయించింది' అని పొన్నం సమావేశంలో వివరించారు.

మొసళ్లకు జియోట్యాగింగ్‌పై సర్వే

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండల పరిధి పాకాల సరస్సులో ఎన్ని మొసళ్లు ఉన్నాయనే విషయాన్ని తెలుసుకోవడానికి జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. వరంగల్ డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్ మొసళ్ల సంరక్షణ కోసం జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జెడ్ఎస్ఐ) అధికారులతో చర్చించారు. దీంతో ఫారెస్ట్ అధికారుల సహకారంతో వారు మొసళ్లకు జియోటాగింగ్ చేసి సరస్సులో వదలనున్నారు. ఇందులో భాగంగా అధికారులు డాక్టర్ ప్రత్యూష్, డాక్టర్ ఎస్ఎస్ జాదవ్ పాకాల సరస్సును బోట్‌లో కలియదిరుగుతూ పరిశీలించారు. పాకాలకు వచ్చిన పర్యాటకులతో మాట్లాడారు. మొసళ్లు ఎక్కడెక్కడ ఒడ్డుకు చేరుతున్నాయనే వివరాలను సేకరించారు. సర్వే వివరాలతో కూడిన సమాచారాన్ని ప్రభుత్వానికి పంపి నెల రోజుల్లో మొసళ్లకు జియోట్యాగింగ్ ప్రక్రియ పూర్తిచేయించనున్నట్లు తెలిసింది. మొసళ్ల సంరక్షణపై ఎఫ్ఆర్వో రవికిరణ్ సమక్షంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు.



మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు కుదరదు



మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు ఇచ్చే మధ్యాహ్న భోజనంలో గుడ్డు ఇవ్వలేమని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ రాష్ట్రకార్యాలయంలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌పావని, జంపాల రవీందర్ మాట్లాడుతూ.. మార్కెట్లో పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచకుండా.. విద్యార్థులకు రెండు కూరలు, మూడు కోడిగుడ్లు, నాణ్యమైన భోజనం ఎలా అందిస్తారని ప్రశ్నించారు. గుడ్ల ధరలు కొండెక్కి కూర్చున్న పరిస్థితుల్లో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు అందించలేమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, డీఈవోలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని వంట కార్మికులపై ఒత్తిడి చేయరాదని కోరారు. కోడిగుడ్ల విషయంలో మండల విద్యాశాఖాధికారి, డీఈవో, కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని, వినతిపత్రాలు అందించాలని సూచించారు. మెస్ చార్జీల పెంపు, మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లకు సంబంధించి తలబెట్టే సమ్మె విషయంలో త్వరలోనే స్పష్టమైన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆఫీస్ బేరర్స్ సత్తెనపల్లి విజయలక్ష్మి, రంగారెడ్డి, బోయిని ప్రసాద్, నిమ్మటూరి రామకృష్ణ, పోలప్పోలు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
బుధవారం। 8-1-2025

నాలుగు దశాబ్దాల పీడకల!

ఇప్పటికీ ముచ్చెమటలు పట్టిస్తున్న భోపాల్ దుర్ఘటన ● 40 ఏళ్లనాటి కాళరాత్రి గుర్తు చేసుకుని జేపీనగర్ వాసుల కన్నీళ్లు

- ఊరిని అలుముకున్న సైనైడ్ విష మేఘం, వాకిళ్లలో రెండు అడుగుల మేర ధూళి
- పిల్లాజెల్లను పట్టుకొని తలోదిక్కు ఉరుకులు
- ఆ రాత్రి పరుగు ఆపితే.. పోయిన ప్రాణాలు
- గుట్టలుకొద్దీ శవాలు.. ట్రక్కుల్లో తరలింపు
- హెలికాప్టర్లతో నీళ్లు చిమ్మడంతో అదుపులోకి లీకేజీ..
- నేటికి జన్యు లోపాలతో శిశువుల జననం


యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ ప్రవేశ ద్వారం

భోపాల్ నుంచి భాషబోయిన అనిల్‌కుమార్ :

అది పాత భోపాల్ నగరంలోని జేపీనగర్.. అక్కడ ఓతల్లి తన పిల్లలను చంకనేసుకొని కొంగుతో ముక్కుమూసుకొని ప్రాణాల కోసం పరుగులు పెడుతున్నట్టుగా ఉన్న అమరుల స్తూపం 1984 డిసెంబర్ 2, 3వ తేదీల్లో భోపాల్ విషవాయువు లీకేజీ ఘటనకు 40 ఏళ్లుగా మూగ సాక్ష్యంగా నిలుస్తోంది. హిరోషిమా, నాగసాకిలపై వేసిన అణుబాంబు వల్ల మానవాళి ఎదుర్కొన్న విపత్తుకు ఏమాత్రం తీసిపోని దుర్ఘటన భోపాల్ విషవాయువు లీకేజీ. ఇటీవల దుర్ఘటనకు 40 ఏళ్లు నిండాయి. అదే సమయంలో విషవాయువు వెలువడి వేలాదిమంది ప్రాణాలు పోయేందుకు కారణమైన యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) ఫ్యాక్టరీ నుంచి నాటి వ్యర్థాలను సమీపంలోని పీతమ్‌పూర్‌కు తరలింపు ప్రక్రియ ప్రారంభం కాగానే.. ఈ దుర్ఘటనపై తిరిగి చర్చ మొదలైంది. 40 ఏళ్ల కింద విషవాయువు దుర్ఘటన మనదేశంలో వేలాదిమందిని పొట్టనబెట్టుకొని, లక్షలాదిమందిని అనారోగ్యం పాలుజేసింది. ఆనాటి కాళరాత్రి గురించి అడిగితే..అక్కడి స్థానికులు నేటికీ ఉలిక్కిపడతారు. ఆ రోజు బతికి బట్ట కట్టినవారిలో చాలామంది మరణించగా.. కొందరు జీవచ్ఛవాలుగా మారారు. వారి కడుపున పుట్టిన పాపానికి మరికొందరు జీవితాంతం దివ్యాంగులుగా జన్యులోపాలతో మంచాలకే పరిమితమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఘోర దుర్ఘటనలో ఒకటిగా నిలిచిన.. నాటి ఘటన ప్రభావం ఎలా ఉందో సాక్షి.. కనుక్కునే ప్రయత్నం చేసింది.


40 ఏళ్లుగా వెంటాడుతోంది...

అది డిసెంబర్ 2, 1984 అంతా వ్యవసాయ, కూలి పనులు చేసుకొని వచ్చారు. రాత్రి 7 గంటలకల్లా భోజనాలు చేసి చాలామంది నిద్రకు ఉపక్రమించారు. రాత్రి 8 గంటల సమయంలో దాదాపు 100 ఎకరాల్లో విస్తరించిన యూసీఐఎల్ ఫ్యాక్టరీ నుంచి హైడ్రోజన్ సైనైడ్ అనే విషవాయువు లీక్ కావడం మొదలైంది. వేగంగా గాలిలో కలవడం వల్ల అక్కడ ఆక్సిజన్ లెవెల్స్ పూర్తిగా పడిపోయాయి. లీకేజీని ఆర్పే క్రమంలో ముందుగా ఫ్యాక్టరీ కార్మికులే బలయ్యారు. పరిశ్రమను ఆనుకొని ఉన్న జేపీనగర్ వాసులు ఘాటైన వాసనతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. తొలుత ఏమీ కాదనుకున్నా.. క్రమంగా ఘాటు పెరగసాగింది. ఒక్క గంటలోనే బయటకు వచ్చి చూస్తే.. వాకిట్లో హైడ్రోజన్ సైనైడ్ ధూళి వర్షంలా కురుస్తోంది. చాలామంది స్పృహ తప్పడం చూసి పిల్లాజెల్లలను పట్టుకొని బయటకు వచ్చారు. రెండు అడుగుల మేర పేరుకుపోయిన ధూళిలో ఈడ్చుకుంటూ ప్రాణాల కోసం పరుగులు తీశారు. అప్పటికే దాదాపు 2 కి.మీల మేర భోపాల్‌ను విషవాయువు కమ్మేసింది. ఈక్రమంలో దాదాపు 2 కిలోమీటర్ల మేర పరుగులు తీసినవారు బతికారు. చాలామంది ఆక్సిజన్ అందక మధ్యలోనే ప్రాణాలొదలగా.. కొందరు అప్పటికే గాఢనిద్రలో ఉండటంతో పడుకునే తుదిశ్వాస విడిచారు.

ఇప్పటికీ వెన్నులో వణుకు

40 ఏళ్లు దాటినా.. ఇప్పటికీ ఆ దుర్ఘటన తలచుకుంటే తమకు వెన్నులో వణుకుపుడుతుందని జేపీనగర్ వాసులు గుర్తుచేసుకున్నారు. ఆ రోజు పనుల మీద భోపాల్‌లో లేనివారు బతికి బట్టకట్టారు. అధికారులు తీవ్రంగా శ్రమించడం, హెలికాప్టర్లలో నీటిని లీకేజీపై కుమ్మరించడం తదితర చర్యల వల్ల.. మరునాడు ఉదయం 8 గంటల కల్లా విషవాయువు లీకేజీ ఆగడం మొదలైందని స్థానికులు తెలిపారు. ఈ ఘటన మరునాడు ఫ్యాక్టరీ పరిసరాల్లోని ఏ వీధి, రోడ్డు చూసినా.. శవాలతో నిండిపోయిందని కన్నీరుమున్నీరయ్యారు. అంతా అనుకున్నట్టుగా ఆ రోజు చనిపోయింది 3787 మంది కానే కాదని, మరునాడు తాము తిరిగి ఇంటిబాట పట్టిన సమయంలో.. ట్రక్కులతో శవాలను తరలించడం తమకు ఇంకా గుర్తేనని కన్నీరు మున్నీరయ్యారు. ఇక కట్టివేసిన మూగజీవాలు, పక్షులు ఎక్కడికక్కడ మరణించాయన్నారు. ఆ రోజు బతికి బట్టకట్టినా.. నేటికీ ఆ పీడకల తమను వెంటాడుతూనే ఉందని, అక్కడి భూగర్భంలో, నేలలో, తమ శరీరాల్లో, రక్తంలో ఈ విషం ఇంకా నిండే ఉందని వాపోయారు. ఆ ప్రభావం తర్వాత తరాలపైనా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.


తన కుమారుడు వికాస్ ఫొటోతో తల్లి శారద


దివ్యాంగుడిగా మారిన.. అమన్ యాదవ్



జేపీనగర్‌లో అమరుల స్తూపం

పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నాం



“ఆ రోజు వ్యవసాయ పనులు ముగించుకొని రాత్రి త్వరగానే పడుకున్నం.. ఘాటు వాసనలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాం. కళ్ల వెంట నీరు కారుతుండగా.. ఆగకుండా చేతిలో పిల్లాజెల్లలతో కలిసి దాదాపు 2 కిలోమీటర్లు పరుగులు పెట్టాం. ప్రభుత్వం మంజూరు చేసిన నష్టపరిహారం కూడా దళారులు మింగేశారు. – కన్నయ్య, జేపీనగర్

రెండు అడుగుల మేర ధూళి



“ఆ రోజు విషవాయువు లీకవడం మొదలైనా.. ఆగిపోతుందనుకున్నాం. కానీ పెరిగింది. వాకిళ్లలో రెండడుగుల మేర ధూళి. అందులోనే పడుతూ లేస్తూ.. పరుగులు తీశాం. మరునాడు వీధుల్లో ఎక్కడ చూసినా శవాలే. నాకు శ్వాస సమస్యలు ఇప్పటికీ వేధిస్తున్నాయి. నేటికీ ఆ రోజు రాత్రి గుర్తుకొస్తే ఉలిక్కిపడతా. – లక్ష్మణ్, జేపీనగర్

ఇద్దరు కుమారులకు జన్యులోపాలే



“నేను, నా భర్త ఇద్దరం జేపీ కాలనీకే చెందినవారం. ఆ సమయంలో మాకు పదేళ్లు. మా పెద్దలు భుజాన మీద వేసుకొని పరుగెత్తి మమ్మల్ని కాపాడుకున్నారు. కానీ, ఆ రోజు ఆ గాలి పీల్చడం వల్ల మా ఇద్దరు కుమారులు వికాస్‌యాదవ్, అమన్‌యాదవ్ మానసిక, శారీరక వైకల్యంతో జన్మించారు. గత డిసెంబర్‌లో పెద్ద కుమారుడు వికాస్‌యాదవ్ (27) మరణించారు. చిన్న కుమారుడు అమన్ యాదవ్ ఇలా అచేతనంగా ఉంటాడు. – శారదాయాదవ్

ప్రభుత్వం నుంచి దక్కింది తక్కువే



“ఆ ఘోరకలి నుంచి బతికామన్న సంతోషం ఏమాత్రం లేదు. మా శరీరాల్లో ఏవో మార్పులు వచ్చాయి. ఫలితంగా పిల్లలు అచేతనులయ్యారు. వారికి సేవలు చేసి, సాకినా.. ఇటీవల నా పెద్ద కుమారుడు మరణించాడు. ప్రభుత్వం వారికి ఇచ్చే పింఛన్ దేనికీ సరిపోదు. ఇప్పటికైనా మా విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి. – సంజయ్ యాదవ్

బీఆర్ఎస్‌పై బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు

మాజీ మంత్రి గంగుల కమలాకర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్ఎస్ పార్టీపై కుట్ర చేస్తున్నాయని, కేసీఆర్ కుటుంబాన్ని బద్నాం చేయాలని చూస్తున్నాయని మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. ఆయన మంగళవారం కేటీఆర్ నివాసం వద్ద మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ కలిసి విలేకరులతో మాట్లాడారు. బట్టకాల్చి మీద వేయాలని కాంగ్రెస్, బీజేపీ భావిస్తున్నాయని ధ్వజమెత్తారు. కక్ష సాధింపు రాజకీయాలను తెలంగాణ సమాజం ఒప్పుకోదని, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బాంబులు పేల్చడానికి పొంగులేటి మంత్రి అయ్యారా? అని ప్రశ్నించారు. కేసుల పేరుతో రాష్ట్రాన్ని నడపాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్ములా– ఈ రేస్ ద్వారా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని స్పష్టం చేశారు. కేటీఆర్, కేటీఆర్‌ను జైల్లో పెట్టాలన్నదే వారి లక్ష్యమని, న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉందన్నారు.

కేటీఆర్ విదేశాలకు పారిపోయే అవకాశం ఉంది

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని, ఆయన పాస్‌పోర్టును ఏసీబీ అధికారులు సీజ్ చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కోరారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ ఎలాంటి తప్పు చేయకపోతే లీగల్ టీం ఎందుకు పెట్టుకున్నాడని ప్రశ్నించారు. బాధ్యతగల ఎమ్మెల్యేగా తాను తప్పు చేయలేదని నిరూపించుకోవాల్సిన కేటీఆర్ విచారణకు కూడా హాజరు కాకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫార్ములా ఈ రేసులో కేటీఆర్ పంచిపెట్టిన రూ.55 కోట్లు ప్రజల ఆస్తి అని వెంకట్ పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ కుటుంబంలో రూ.55 కోట్లు చిన్నవి కావచ్చు కానీ ప్రజల సొమ్ము దోచుకుంటే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

కేటీఆర్ ఊచలు లెక్కపెట్టడం ఖాయం: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కేటీఆర్ ఎన్ని వేషాలు వేసినా ఫార్ములా ఈ కేసులో ఊచలు లెక్కపెట్టడం ఖాయమని పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. హైకోర్టు తీర్పుతో కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమైందని, దీంతో ఆయనకు అరెస్ట్ భయం పట్టుకుందని పేర్కొన్నారు. విచారణకు హాజరు కావడానికి కూడా కేటీఆర్ వణికిపోతున్నాడన్నారు. అవినీతి జరగలేదని కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ చేసిన వాదనను హైకోర్టు విశ్వసించలేదని తెలిపారు.

జవాన్లకు నివాళులర్పించిన ఛత్తీస్‌గఢ్ సీఎం


జవాన్ల శవపేటికలను మోస్తున్న సీఎం విష్ణుదేవ్ సాయి, హోంమంత్రి విజయ్‌శర్మ

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు పేల్చిన మందుపాతరలో మృతి చెందిన జవాన్లకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, హోంమంత్రి విజయ్‌శర్మ మంగళవారం నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ క్యాంపు కార్యాలయంలో డీజీపీ అశోక్ జునేగా, బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్, ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తదితరులతో కలిసి జవాన్ల శవపేటికలపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జవాన్ల కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం సీఎం మాట్లాడుతూ మావోయిస్టులది పిరికిపంద చర్యగా అభివర్ణించారు. నేరుగా ఎదుర్కోలేక ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, అయినా త్వరలోనే మావోయిజం తుడిచిపెట్టుకుపోయి ఛత్తీస్‌గఢ్ ప్రజలు సుఖసంతోషాలతో జీవించే రోజులు వస్తాయని తెలిపారు. అమరులైన జవాన్ల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు.

పాకాల.. పక్షుల అల

చలికాలపు వలస పక్షుల రాకతో సందడి

- యూరప్, ఉత్తర భారతం నుంచి వలస
- సుమారు 60 రకాల పక్షుల కిలకిలలు
- 12న పాకాలలో ‘బర్డ్ వాక్’కు ఏర్పాట్లు
- 10వ తేదీలోపు రిజిస్ట్రేషన్లకు అవకాశం






సాక్షి, వరంగల్: పచ్చని అడవి.. విస్తారమైన ప్రాంతంలో స్వచ్ఛమైన నీళ్ల..అడవి ప్రతిధ్వనించేలా.. ఎంతసేపైనా అలా వింటూ ఉండాలనిపించేలా పక్షుల కిలకిలారావాలు.. నీటితో సయ్యాటలాడుతూ.. గంతులు వేసే వలస పక్షులు.. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలో విస్తరించి ఉన్న పాకాల సరస్సు.. అభయారణ్యంలో ప్రస్తుత దృశ్యమిది. శీతాకాలం కావడంతో యూరప్ దేశాలతోపాటు ఉత్తర భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 60 రకాలకు పైగా పక్షులు ఇక్కడకు రావడంతో సందడి నెలకొంది. ఏటా డిసెంబర్‌లో సుదూర ప్రాంతాల నుంచి పక్షులు ఇక్కడికి వలస వస్తుంటాయి. ఈసారి కూడా భారీగా రావడంతో 12వ తేదీన ‘బర్డ్ వాక్’నిర్వహించేందుకు వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్లు ఏర్పాట్లు చేశారు.

అరుదైన పక్షులకు ఆలవాలం..

30 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న పాకాల సరస్సు ప్రాంతంలో విదేశీ, స్వదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. రెడ్ క్రెస్టెడ్ పొచర్డ్స్, నార్తర్న్ పింటెల్స్, బార్ హెడెడ్ గీస్, నార్తర్న్ సావలర్స్, కటన్ పిగ్మిగూస్, టఫ్టెడ్ డక్, గార్గని డక్స్, గ్రేటర్ ఫ్లెమింగోస్, స్పాట్ బిల్డ్ పెలికాన్స్, బ్లాక్ రెడ్ స్టర్ట్, వెరీడైటర్ ఫ్లైక్యాచర్, యెల్లో ఫుటెడ్ గ్రీన్ పిజియాన్స్, సినరస్ టిట్, అల్ట్రామెరైన్ ఫ్లైక్యాచర్ వంటి పక్షుల వలసతో సరస్సు నిండిపోయింది. ఈ పక్షులు ఇక్కడ గుడ్లు పెట్టి పిల్లల్ని పొదిగిన తర్వాత.. వాటిని వెంటపెట్టుకొని ఫిబ్రవరిలో తిరిగి తమ సొంత ప్రాంతాలకు వెళ్లిపోతాయి. అలాగే క్రెస్టెడ్ సిపెంట్ ఈగల్, షార్ట్ టోయ్డ్ స్నేక్ ఈగల్, ఓరియంటల్ హనీ బజార్డ్, వాగ్ టెల్స్ వంటి పక్షులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకోవడంతో వీటిని రెసిడెంట్ బర్డ్స్‌గా పక్షి ప్రేమికులు పిలుస్తున్నారు. ఇలా ఓవైపు ప్రకృతి, మరోవైపు సరస్సులో పక్షుల సందడి మొదలవడంతో పర్యావరణ, పక్షుల ప్రేమికుల కోసం బర్డ్ వాక్ నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు 99855 49900 నంబర్‌లో సంప్రదించాలని వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. బర్డ్‌వాక్‌లో పాల్గొనాలనుకుంటే ఈ నెల 10లోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ‘ఈ బర్డ్ వాక్ ద్వారా పక్షుల రకాలు, వాటి ఆహారం, ఆవాసం గుర్తిస్తున్నాం. పక్షి ప్రేమికులు సరస్సు అందాలను తిలకించడంతోపాటు పక్షుల గురించి క్విజ్ నిర్వహించనున్నాం. బర్డ్ ఫొటోగ్రఫీ ఉంటుంది. బటర్ ఫ్లై పార్క్, హెర్బల్ గార్డెన్‌ను సందర్శించొచ్చు. పాకాల మత్తడి వీక్షించొచ్చు. అలాగే బోటింగ్ చేసేవారు కూడా సరస్సులో ప్రయాణాన్ని ఆస్వాదించొచ్చు’ అని వివరించారు.


పొలం గట్టు వద్ద మహిళల మధ్యాహ్న భోజనం


ఎలిగేడు మండల శివారులో నాట్లు వేస్తున్న మహిళలు

పగటేల సద్ది బువ్వ...

పోదాం పావే.. రామక్క పొద్దు పోతంది.. తినే యాలయ్యింది.. తిన్నంక మిగిలిన నాటు సూద్దాం పావే.. అంటూ రామక్క పిలుస్తుంటే.. ఆగరాదు నెత్తిమీదికి సూర్యుడన్న రాకపాయే.. జరాగి తిందాం.. సలి బువ్వ తినిరాలే పొద్దుగాల.. అంటూ మల్లక్క ఆగమంటోంది.. ఒక్క పాట పాడు మునుం ఖతం అయితది.. అంటూ మరొకరు, మాయిపొద్దు సలికాలం అయినకాడికాయే మిగిలింది రేపాయే.. అంటూ ఇంకొకరు.. పొలం పనుల్లో మహిళా కూలీలు నాట్లు వేస్తూ చెప్పుకొనే ఊసులు.. చమత్కారాలివి. పచ్చని పల్లెల్లో రబీ సీజన్ నాట్లు జోరందుకున్నాయి. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం శివారులో వరినాట్లు వేస్తున్న అమ్మలక్కలంతా కలిసి పగటేల భోజనం చేయడం కనువిందు చేస్తోంది. ప్రేమానురాగాలతో పాటు.. ఒకరి కూరలు మరొకరు పంచుకుంటున్న దృశ్యం పచ్చని పైర్ల మధ్య వనభోజనాన్ని తలపిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి.

బిజినెస్ రీల్

17 నుంచి ఆటో ఎక్స్‌పో



న్యూఢిల్లీ: భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో జనవరి 17 నుంచి ప్రారంభం కానుంది. న్యూఢిల్లీలోని భారత్ మండపం, ద్వారక వద్ద ఉన్న యశోభూమి (ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్), గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్ అండ్ మార్ట్ వేదికలుగా ఈ ఆటో ఎక్స్‌పో 22 వరకు జరగనుంది. ఆటో షో, బ్యాటరీ షో, టైర్ షో, ఎలక్ట్రానిక్స్ షో, కంపోనెంట్స్ షో, డ్రోన్ షో సైతం నిర్వహిస్తున్నారు. అన్ని వాహన విభాగాల్లో కలిపి 40కిపైగా నూతన మోడళ్లు తొలిసారిగా కొలువుదీరనున్నాయి. దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించనున్నాయి. రెండు లక్షలకుపైగా చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రదర్శన ముస్తాబవుతోంది.

రూ. 600 కోట్లతో కాయిన్‌స్విచ్ కేర్స్



న్యూఢిల్లీ: వజీర్‌ఎక్స్‌పై సైబర్‌దాడిలో నష్టపోయిన యూజర్లకు తోడ్పాటు అందించేందుకు క్రిప్టో ప్లాట్‌ఫాం కాయిన్‌స్విచ్ తాజాగా రూ. 600 కోట్లతో 'కాయిన్‌స్విచ్ కేర్స్' పేరిట రికవరీ ప్రోగ్రాంను ప్రకటించింది. ప్రభావిత యూజర్లు తమ నష్టాలను రికవర్ చేసుకునేందుకు, రివార్డులను పొందేందుకు, తిరిగి మార్కెట్లోకి ప్రవేశించేందుకు ఇది ఉపయోగపడగలదని వివరించింది. రికవరీ అంచనాలను తెలుసుకునేందుకు, ఫండ్స్‌ను డిపాజిట్ చేసేందుకు, రివార్డులను పొందేందుకు కాయిన్‌స్విచ్ కేర్స్ పోర్టల్‌ను సందర్శించాలని పేర్కొంది. ఈ ప్రోగ్రాం 24 నెలల పాటు అమల్లో ఉంటుందని తెలిపింది.

ఓలా ఎలక్ట్రిక్‌కి సెబీ వార్నింగ్



న్యూఢిల్లీ: కీలక వ్యాపార వివరాలను ఎక్స్ఛేంజీలకు తెలియజేయడానికి ముందే సోషల్ మీడియాలో వెల్లడించడంపై ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీకి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వార్నింగ్ ఇచ్చింది. ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనని, దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించింది. అలాగే తగు దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు ఓలాకు సెబీ లేఖ పంపింది. స్టోర్ల విస్తరణ ప్రణాళికలపై స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఓలా డిసెంబర్ 2న మధ్యాహ్నం సుమారు ఒంటిగంటన్నరకు సమాచారం ఇవ్వగా, కంపెనీ సీఈవో భవీష్ అగర్వాల్ ఆ వివరాలను ఉదయం సుమారు పది గంటల ప్రాంతంలో సోషల్ మీడియా సైట్ ఎక్స్‌లో వెల్లడించడం ఈ పరిణామానికి దారి తీసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-1-2025

విశాఖ	515-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	485-00
వరంగల్	487-00
రిటైల్ ధర	5.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ONGC	271.5	3.04
ITC	449.65	1.94
ASIANPAINT	2,336.50	1.91
DRREDDY	1,375.00	1.74
TCS	4,095.05	1.66

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
APOLLOHOSP	7,135.05	-4.06
TRENT	6,684.95	-2.75
ULTRACEMCO	11,370.00	-2.14
SHRIRAMFIN	2,899.95	-1.98
BAJAJ-AUTO	8,644.00	-1.89

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,459
ఎన్ఎస్ఈ	95,369
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,81,818
ఎఫ్ఐఐ	- 3,362
డీఐఐ	+ 2,716

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	73.29 (రాత్రి 11.30కు)	$ 74.25 (క్రితం ముగింపు)
బ్రెంట్	76.11 (రాత్రి 11.30కు)	$ 77.05 (క్రితం ముగింపు)

వ్యక్తిగత ఆదాయపన్ను తగ్గింపు!

- పన్నుల చట్టాల సరళతరం
- ఆర్థిక వృద్ధికి నిర్మాణాత్మక చర్యలు
- బడ్జెట్‌పై ఈవై ఇండియా అంచనాలు



న్యూఢిల్లీ: రానున్న కేంద్ర బడ్జెట్‌లో మూలధన వ్యయాలు, పన్ను చట్టాల సరళతరం, వ్యక్తిగత ఆదాయపన్ను తగ్గింపు ప్రతిపాదనలకు చోటు కల్పించొచ్చని ఈవై ఇండియా అంచనా వేసింది. ముఖ్యంగా తక్కువ ఆదాయ వర్గాలకు పన్నుల ఉపశమనం తప్పనిసరి అని పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను వచ్చే నెల 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుండడం తెలిసిందే. దీంతో బడ్జెట్ అంచనాలతో ఈవై ఇండియా ఒక నోట్‌ను విడుదల చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.31 లక్షల కోట్ల మేర ఆదాయపన్ను వివాదాల రూపంలో చిక్కుకుపోయినట్టు చెప్పింది. ఆదాయపన్ను కమిషనర్ (అప్పీళ్లు) సత్వరమే వీటిని పరిష్కరించాలని, ప్రత్యామ్నాయ పరిష్కార యంత్రాంగాలను తీసుకురావాలని సూచించింది. ''ప్రత్యక్ష పన్నుల కోడ్ సమగ్ర సమీక్షకు సమయం తీసుకోవచ్చు. కాకపోతే ఈ దిశగా ఆరంభ నిర్ణయాలకు బడ్జెట్‌లో చోటు ఉండొచ్చు. వ్యక్తిగత ఆదాయపన్నును సైతం తగ్గించొచ్చు. తక్కువ ఆదాయ వర్గాలకు ఉపశమనంతోపాటు డిమాండ్‌కు ఊతం ఇచ్చేందుకు వీలుగా చర్యలు ఉండొచ్చు''అని ఈవై ఇండియా నేషనల్ ట్యాక్స్ లీడర్ సమీర్ గుప్తా తెలిపారు. ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే విధంగా వ్యూహాత్మక సంస్కరణలపై బడ్జెట్‌లో దృష్టి సారించొచ్చన్నారు. ద్రవ్య స్థిరీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా స్థిరమైన ఆర్థిక వృద్ధికి తగిన నిర్మాణాత్మక చర్యలు ఉండొచ్చన్నారు.

పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు..

ముఖ్యంగా పన్నుల విధానాన్ని సులభంగా మార్చడం, కస్టమర్ల సేవలను మెరుగుపరచడం, వివాదాలను తగ్గించడం, పన్ను నిబంధనల అమలును పెంచడం దిశగా ప్రభుత్వం చర్యలు ప్రకటించొచ్చని ఈవై ఇండియా అంచనా వేస్తోంది. పన్ను చట్టాల సులభీకరణ కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రజల నుంచి సూచనలను ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేసింది. ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించడం, వ్యాపార ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై కీలకంగా దృష్టి సారించాలని పేర్కొంది. గత బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం మూలధన లాభాల విధానాన్ని హేతుబద్ధీకరించడానికి ప్రాధాన్యం ఇచ్చినట్టు చెబుతూ.. ఈ దిశగా మరిన్ని చర్యలు రాబోయే బడ్జెట్‌లో ఉండొచ్చని తెలిపింది. ముఖ్యంగా ఎస్ఎంఈలకు పన్నుల సంక్లిష్టతను తగ్గించడం ఎంతో అవసరమని అభిప్రాయపడింది.

నాలుగేళ్ల కనిష్టానికి జీడీపీ వృద్ధి

ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా ● ఆర్‌బీఐ, ప్రభుత్వ లెక్కలకన్నా తక్కువే



న్యూఢిల్లీ: బలహీనమైన డిమాండ్ వంటి పలు కారణాల నేపథ్యంలో మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి వృద్ధి రేటు 6.3 శాతంగా ఉంటుందని బ్యాంకింగ్ దిగ్గజం- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పరిశోధనా నివేదిక పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (6.6 శాతం), జాతీయ గణాంకాల కార్యాలయం మొదటి ముందస్తు అంచనాలు(6.4 శాతం), ఆర్థిక శాఖ తొలి అంచనా (7 శాతం) కన్నా ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా తక్కువగా ఉండడం గమనార్హం. వ్యవస్థలో డిమాండ్ ధోరణులు బలహీనంగా ఉన్నాయని నివేదిక పేర్కొంది. 2020-21లో కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో ఎకానమీలో అసలు వృద్ధిలేకపోగా 5.8 శాతం క్షీణతను నమోదుచేసిన సంగతి తెలిసిందే. అటు తర్వాత 6.3 శాతం వృద్ధి రేటు నమోదయితే అది నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి అవుతుంది. బేస్ ఎఫెక్ట్‌తో 2021-22లో ఎకానమీ వృద్ధి రేటు 9.7 శాతంగా నమోదయ్యింది. 2022-23లో 7 శాతం, 2023-24లో 8.2 శాతంగా ఈ రేట్లు ఉన్నాయి. . ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 6.7 శాతం వృద్ధి నమోదవగా, రెండవ క్వార్టర్‌లో 7 క్వార్టర్ల కనిష్ఠ స్థాయిలో 5.4 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే. గ్రూప్ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ సౌమ్య కాంతి ఘోష్ రూపొందించిన ఈ నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు...

- జీడీపీ వృద్ధిలో మందగమనం ఉన్నప్పటికీ తలసరి ఆదాయం 2023-24తో పోల్చితే, 2024-25లో రూ. 35,000 పెరిగే అవకాశం ఉంది.
- భారీ పెట్టుబడులుకు సంబంధించిన విభాగం- క్యాపిటల్ ఫార్మేషన్‌లో వృద్ధి రేటు 270 బేసిస్ పాయింట్లు (2.7%) 7.2 శాతానికి దిగిరానుంది.
- ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు 2024-25 జీడీపీలో 4.9 శాతంగా (బడ్జెట్ లక్ష్యం ప్రకారం) ఉంటుంది.

మళ్లీ రూ.80,000కు పసిడి



న్యూఢిల్లీ: పసిడి ధర దేశ రాజధాని న్యూఢిల్లీలో బుధవారం మళ్లీ రూ.80,000 స్థాయిని తాకింది. 99.9 శాతం ప్యూరిటీ ధర రూ.300 పెరిగి నెల గరిష్ఠం రూ.80,000కు చేరింది. ఆభరణ వర్తకులు, స్టాకిస్టుల నుంచి కొనుగోళ్ల డిమాండ్ దీనికి కారణం. ఇక 99.5 శాతం ప్యూరిటీ ధర సైతం రూ.300 పెరిగి రూ.79,600కు చేరింది. మరోవైపు వెండి ధర వరుసగా మూడవరోజూ పెరిగింది. బుధవారం క్రితం ముగింపుతో పోల్చితే రూ.500 పెరిగి రూ.92,500కు చేరింది. భారత్‌సహా ప్రపంచ వ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకుల భారీ కొనుగోళ్లు పసిడికి బలం చేకూర్చుతున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు 2024 నవంబర్‌లో 53 టన్నుల పసిడిని కొనుగోలు చేయగా, ఇందులో భారత్ వాటా 8 టన్నులుగా ఉంది.

పసిడి దిగుమతుల విలువ సవరణ

ఇదిలావుండగా, నవంబర్‌లో భారీ బంగారం దిగుమతులు (14.86 బిలియన్ డాలర్లు) జరిగాయన్న తొలి లెక్కలపై నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో తాజాగా వాణిజ్య మంత్రిత్వశాఖ ఈ అంకెలను సవరించింది. తొలి 14.86 బిలియన్ డాలర్ల లెక్కలకు దాదాపు 5 బిలియన్ డాలర్లు తగ్గించింది. దీనితో ఈ విలువ 9.84 బిలియన్ డాలర్లకు చేరింది. వాణిజ్యశాఖ అనుబంధ విభాగం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటిలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ (డీజీసీఐఎస్) ఈ విషయాలను తెలిపింది.

అరిష్ గ్లోబల్ సర్వీసెస్‌తో వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ జట్టు



న్యూఢిల్లీ: అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ తాజాగా బ్రిటన్‌కు చెందిన అరిష్ గ్లోబల్ సర్వీసెస్‌తో జట్టు కట్టింది. ఈ భాగస్వామ్యం ద్వారా వచ్చే మూడేళ్లలో 5,000 ఉద్యోగాలు కల్పించాలనేది ఇరు సంస్థల లక్ష్యం. ఔట్‌సోర్సింగ్ పరిశ్రమలో వర్టెక్స్ స్థానం మరింత పటిష్ఠమయ్యేందుకు ఇది తోడ్పడనుంది. కస్టమర్ సర్వీస్, ఐటీ సపోర్ట్, డేటా ప్రాసెసింగ్, ఫైనాన్స్, బ్యాక్-ఆఫీస్ మొదలైన కార్యకలాపాలకు సంబంధించి మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ సీఈవో గగన్ ఆరోరా తెలిపారు. దేశీయంగా ఔట్‌సోర్సింగ్ రంగానికి ఊతమివ్వడంతో పాటు వర్ధమాన టెక్నాలజీలు, మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో కెరియర్‌లను తీర్చిదిద్దుకునేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడగలదని అరిష్ గ్లోబల్ సర్వీసెస్ గ్లోబల్ డైరెక్టర్ సన్నీ క్వాత్రా వివరించారు.

నాల్కో సీఎండీగా బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (నాల్కో) సీఎండీగా బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్ బాధ్యతలు స్వీకరించారు. బర్న్‌పూర్-దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్‌కు డైరెక్టర్-ఇన్‌చార్జ్, సెయిల్ బోర్డులో సభ్యుడిగా గతంలో ఆయన పనిచేశారు. ఐఐటీ ధన్‌బాద్ (గతంలో ఐఎస్ఎం ధన్‌బాద్) నుండి మైనింగ్ మెషినరీ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్, మార్కెటింగ్‌లో ఎంబీఏ డిగ్రీ పట్టా అందుకున్నారు.

వేదాంతా చేతికి రివర్‌సైడ్ స్టూడియో


100 ఏళ్లుగా కార్యకలాపాలు



న్యూఢిల్లీ: కళలకు కేంద్రమైన లండన్‌లోని సుప్రసిద్ధ రివర్‌సైడ్ స్టూడియోను వేదాంతా గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ అనిల్ అగర్వాల్ సొంతం చేసుకున్నారు. 100 ఏళ్ల క్రితం థేమ్స్ నది ఒడ్డున ఏర్పాటైన ఈ సుప్రసిద్ధ స్టూడియోను ఇకపై అనిల్ అగర్వాల్ రివర్‌సైడ్ స్టూడియోస్ ట్రస్ట్‌గా నిర్వహించనున్నట్లు వేదాంతా గ్రూప్ పేర్కొంది. దీంతో భారత్‌తోపాటు ప్రపంచ కళలు, సంప్రదాయాలకు గమ్యంగా అవతరించనున్నట్లు ఒక ప్రకటనలో అనిల్ అగర్వాల్ పేర్కొన్నారు. వెరసి ఈ సందర్భంగా తమ నైపుణ్యాలు, కళలను ప్రదర్శించేందుకు తరలిరావలసిందిగా భారతదేశ కళాకారులు, సినీ పరిశ్రమను ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. ఇదేవిధంగా వివిధ గ్లోబల్ లీడర్లు సైతం తమ జీవిత ప్రయాణంలోని విశేషాలతో ప్రేక్షకులను ఉత్తేజితం చేసేందుకు స్టూడియోను వినియోగించుకోవలసిందిగా కోరారు.

కొంత చెల్లించి విమానం ఎక్కండి

మేక్‌మైట్రిప్ పార్ట్ పేమెంట్ ఆప్షన్



న్యూఢిల్లీ: ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ మేక్‌మైట్రిప్ దేశంలో తొలిసారిగా వినూత్న సేవలకు శ్రీకారం చుట్టింది. విమానాల్లో విదేశాలకు వెళ్లేవారికి పార్ట్ పేమెంట్ ఆప్షన్‌ను ప్రవేశపెట్టింది. మొత్తం ఛార్జీలో తొలుత 10 నుండి 40 శాతం మధ్య చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని ప్రయాణ తేదీకి ముందు లేదా టికెట్ బుక్ చేసిన 45 రోజుల్లోగా పూర్తి చేయాలి. పార్ట్ పేమెంట్ ఆప్షన్‌ని ఎంచుకునే కస్టమర్లు చార్జీ మొత్తాన్ని చెల్లించిన తర్వాత నిబంధనల ప్రకారం ధృవీకరించిన బుకింగ్‌లను సవరించుకోవచ్చని మేక్‌మైట్రిప్ తెలిపింది. 'పెద్ద కుటుంబాలు, బృందాలు ఒకేసారి మొత్తం టికెట్ చార్జీని చెల్లించడం భారం అవుతుంది. అటువంటి వారికి పార్ట్ పేమెంట్ ఆప్షన్ సౌకర్యవంతంగా చెల్లించేందుకు వీలు కల్పిస్తుంది' అని కంపెనీ సీవోవో సౌజన్య శ్రీవాస్తవ తెలిపారు. కాగా, ఎక్కువ మంది అంతర్జాతీయ ప్రయాణాలకు ప్రోత్సహించేందుకు పార్ట్ పేమెంట్ ఆప్షన్ దోహద పడుతుందని రిటైల్ రంగ నిపుణులు కలిశెట్టి నాయుడు తెలిపారు. 'ఇటువంటి సౌకర్యంతో విమానయాన సంస్థలకు క్యాష్ రొటేషన్ అవుతుంది. విద్యార్థులు, వ్యాపారస్తులకు చెల్లింపుల సౌలభ్యం ఉంటుంది' అని వివరించారు.

పీటీడబ్ల్యూ గ్రూప్‌తో బార్‌ట్రానిక్స్ ఇండియా ఎంవోయూ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫిన్‌టెక్ బిజినెస్ సొల్యూషన్స్ సంస్థ బార్‌ట్రానిక్స్ ఇండియా తాజాగా సింగపూర్‌కి చెందిన సెమీకండక్టర్ సొల్యూషన్స్ సంస్థ పీటీడబ్ల్యూ గ్రూప్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. భారత మార్కెట్లో పీటీడబ్ల్యూ గ్రూప్ ప్రవేశించేందుకు ఇది ఉపయోగపడనుంది. ఈ ఎంవోయూ ప్రకారం భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, రీఫర్బిషింగ్, శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థలు తెలిపాయి. అలాగే, పరిశోధన-అభివృద్ధి, తయారీ, సిబ్బందికి శిక్షణ కార్యకలాపాలకు కూడా ఇది ఉపయోగపడగలదని పేర్కొన్నాయి. దేశీయంగా సెమీకండక్టర్ల పరిశ్రమ వృద్ధి, కొత్త సొల్యూషన్స్ ఆవిష్కరణ దిశగా ఇరు సంస్థలు పనిచేయనున్నట్లు బార్‌ట్రానిక్స్ ఎండీ ఎస్. విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. దీర్ఘకాలికంగా తమ గ్లోబల్ కార్యకలాపాలకు భారత్ కీలక కేంద్రంగా నిలవగలదని పీటీడబ్ల్యూ గ్రూప్ ఎండీ టార్స్‌టెన్ సీఫ్రెడ్ చెప్పారు.

బ్యాంకింగ్ లాభాలకు గండి!

- 2025-26పై ఇండ్-రా అంచనా
- మొండి బకాయిల ప్రభావం పడుతుందని విశ్లేషణ



ముంబై: మొండిబకాయిల ప్రభావం ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) బ్యాంకింగ్ లాభదాయకతపై ప్రభావం చూపుతుందని దేశీయ రేటింగ్ సంస్థ-ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ (ఇండ్-రా) నివేదిక పేర్కొంది. బ్యాంకింగ్ లాభదాయకత 2024-25లో ''పీక్'' స్థాయిలో ఉన్నాయని, 2025-26లో ఇది దిగివచ్చే అవకాశాలు అధికమని వివరించింది. రిటైల్ రంగం నుంచి ప్రధానంగా మొండి బకాయిల సవాళ్లు తలెత్తే వీలుందని ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ ఫైనాన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ హెడ్ అండ్ డైరెక్టర్ కరణ్ గుప్తా నివేదికలో వెల్లడించారు.

నివేదికలోని ముఖ్యాంశాలు...

- మొండి బకాయిలు నియంత్రణ స్థాయిలోనే ఉంటాయి. రూ.50,000 కంటే తక్కువ రిటైల్ సురక్షిత రుణాలు బ్యాంకుల రుణాల మొత్తంలో 0.4 శాతంగా ఉన్నాయి. 11 శాతానికి పైగా వడ్డీ రేటు కలిగిన రుణాలు మొత్తం రుణాల్లో 3.6 శాతంగా ఉన్నాయి.
- 2024-25లో రుణ వృద్ధి మందగించింది. 2023-24తో పోల్చితే ఈ రేటు 15 శాతం నుండి 13-13.5 శాతానికి తగ్గే వీలుంది.
- బ్యాంకుల నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2025-26లో 0.10 శాతం తగ్గిపోతుంది. డిపాజిట్ వడ్డీ రేటు పెంపు, కొత్త అకౌంటింగ్ విధానాలు దీనికి కారణంగా ఉంటాయి.
- 2025-25లో రుణ-డిపాజిట్ వృద్ధి మధ్య వ్యత్యాసం తగ్గుముఖం పడుతుంది. అయితే ప్రాజెక్ట్ ఫైనాన్స్ కొత్త నిబంధనలు, లిక్విడిటీ కవరేజ్ రేషియో, క్రెడిట్ నష్టాల అంచనా విధానం వంటి అంశాలు బ్యాంకింగ్ రంగానికి సవాళ్లను సృష్టిస్తాయి.
- 2024-25లో మైక్రోఫైనాన్స్ ఆస్తుల వృద్ధి 5 శాతంగా ఉంటుంది. 2024-25లో ఇది 12 శాతానికి పెరుగుతుంది. గ్రామీణ ఎకానమీ బలోపేతం మైక్రోఫైనాన్స్ రంగానికి లాభదాయకంగా ఉండొచ్చు.

శక్తికాంతదాస్ విధానాలు భేష్

మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో ఆర్‌బీఐ తీసుకున్న సంస్కరణలు బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలంగా మార్చాయని నివేదిక పేర్కొనడం గమనార్హం. అయితే కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఈ నిబంధనల్లో పూర్తిగా కాకున్నా, కొంతమేర సరళతరం అయ్యే అవకాశం ఉందని అంచనావేసింది. వ్యక్తిగత రుణాలు, సురక్షిత వ్యాపార రుణాలు, మైక్రోఫైనాన్స్ రంగంపై అవుట్‌లుక్ 'స్థిరత్వం'' నుండి 'దుర్వినియోగ పరిస్థితి' గా మారుతోందని నివేదిక పేర్కొంది. బ్యాంకులు, నాన్-బ్యాంకు ఫైనాన్స్ కంపెనీలు అలాగే హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలపై ఇండ్‌రా రేటింగ్ తన అవుట్‌లుక్‌ను కొనసాగించింది. అయితే ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున కొన్ని అసెట్ సెగ్మెంట్లపై అవుట్‌లుక్‌ను సవరించింది.

కొత్త శిఖరానికి ఆఫీస్ స్పేస్ లీజింగ్

- హైదరాబాద్‌లో 17 శాతం అధికం
- 8 నగరాల్లో 21 శాతం వృద్ధి
- కరోనా ముందస్తు స్థాయి కంటే ఎక్కువ



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రధాన నగరాల్లో 2024లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ నూతన గరిష్టాలకు చేరింది. మొత్తం 719 లక్షల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) పరిమాణంలో లీజు లావాదేవీలు నమోదయ్యాయి. 2023లో స్థూల లీజింగ్‌తో పోల్చి చూసినప్పుడు 21 శాతం అధికం కాగా, కరోనా విపత్తుకు ముందు ఏడాది 2019 గణాంకాలతో పోల్చి చూసినప్పుడు 19 శాతం వృద్ధి కనిపించింది. ఈ వివరాలను రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా విడుదల చేసింది. కరోనా కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో ఆఫీస్ స్పేస్ మార్కెట్ కుదేలవడం గమనార్హం. ఆ తర్వాత నుంచి ఏటా పుంజుకుంటూ వస్తోంది.

పట్టణాల వారీ లీజింగ్

- బెంగళూరులో స్థూల ఆఫీస్ లీజింగ్ ముందటి సంవత్సరంతో పోల్చితే 2024లో 45 శాతం వృద్ధితో 181 లక్షల ఎస్ఎఫ్‌టీకి చేరింది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో 25% వృద్ధితో స్థూల లీజింగ్ 127 లక్షల ఎస్ఎఫ్‌టీగా నమోదైంది.
- ముంబై మార్కెట్లోనూ 40 శాతం వృద్ధి నమోదైంది. 104 లక్షల చదరపు అడుగుల లీజింగ్ లావాదేవీలు జరిగాయి.
- పుణెలో 19 శాతం పెరిగి 80 లక్షల చదరపు అడుగులకు చేరింది.
- అహ్మదాబాద్‌లో 64 శాతం వృద్ధితో 30 లక్షల ఎస్ఎఫ్‌టీ స్థూల లీజింగ్ లావాదేవీలు నమోదయ్యాయి.
- ఒక్క చెన్నై మార్కెట్లో మాత్రం 25 శాతం క్షీణించి 81 లక్షల ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది.

సానుకూలతలు ఎన్నో..

ఆఫీస్ స్పేస్ లీజింగ్ నూతన గరిష్టాలకు చేరడం వెనుక దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉండడం, బలమైన దేశీ వినియోగం, అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత్ ప్రాతినిధ్యం తదితర అంశాలను కారణాలుగా నైట్‌ఫ్రాంక్ ఇండియా పేర్కొంది. ఆఫీస్ స్పేస్‌కు అసాధారణ డిమాండ్ ఉండడం దేశ, విదేశీ సంస్థల్లో వ్యాపార విశ్వాసానికి నిదర్శనంగా పేర్కొంది. జీసీసీలు, ఐటీఈఎస్, బీఎఫ్ఎస్ఐ రంగాలు ఈ డిమాండ్‌కు దన్నుగా నిలుస్తున్నట్టు తెలిపింది.

ఏఐలో భారత్ కీలక పాత్ర పోషించాలి

- సొంత మోడల్స్ రూపొందించుకోవాలి
- మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల



న్యూఢిల్లీ: కృత్రిమ మేధకు (ఏఐ) సంబంధించి పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాల్లో భారత్ కీలక పాత్ర పోషించాలని టెక్ దిగ్గజం సత్య నాదెళ్ల చెప్పారు. ఏఐకి పునాదుల్లాంటి ఫౌండేషన్ మోడల్స్‌ను సొంతంగా రూపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఒక్క కొత్త మ్యాథ్స్ సూత్రం, అల్గోరిథంలాంటిది కనుగొన్నా మొత్తం ఏఐ స్వరూపం మొత్తం మారిపోయే అవకాశాలు ఉన్నాయని నాదెళ్ల పేర్కొన్నారు. కృత్రిమ మేధను ఉపయోగించి, పరిశ్రమల పనితీరును మెరుగుపర్చవచ్చని ఆయన పేర్కొన్నారు. అయితే, అధునాతనమైన ఏఐ సిస్టమ్స్ మీద కసరత్తు చేయాలంటే పెట్టుబడుల కొరత ప్రధాన అడ్డంకిగా ఉంటోందని ఆయన చెప్పారు. కానీ పరిశోధనలతో వ్యయాల భారాన్ని తగ్గించుకోవచ్చని మైక్రోసాఫ్ట్ ఇండియా ఏఐ టూర్ రెండో రోజు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నాదెళ్ల వివరించారు. ప్రస్తుతం ఓపెన్‌ఏఐ, గూగుల్‌లాంటి టెక్ దిగ్గజాలు తయారు చేసిన ఏఐ ఇంజిన్లనే (ఫౌండేషన్ మోడల్స్) దేశీయంగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, కార్యక్రమం సందర్భంగా రైల్‌టెల్, అపోలో హాస్పిటల్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా గ్రూప్ మొదలైన సంస్థలతో మైక్రోసాఫ్ట్ వ్యూహాత్మక భాగస్వామ్యాలను ప్రకటించింది. ఈ ఒప్పందాల కింద క్లౌడ్, ఏఐ ఆవిష్కరణల ద్వారా ఆయా సంస్థల సిబ్బంది, కస్టమర్లు ప్రయోజనం పొందేందుకు కావాల్సిన తోడ్పాటును మైక్రోసాఫ్ట్ అందిస్తుంది. అటు దేశీయంగా ఏఐ, కొత్త టెక్నాలజీలను మరింతగా అభివృద్ధి చేసేందుకు, సమ్మిళిత వృద్ధికి దోహదపడే ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఇండియా ఏఐతో కూడా కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది.

5 లక్షల మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ

ఇండియాఏఐతో భాగస్వామ్యం ద్వారా 2026 నాటికి 5 లక్షల మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణనివ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ తెలిపారు.


వైట్ కామెల్లియా

కామెల్లియా

(గులాబీలకు అందమైన ప్రత్యామ్నాయం)


కొత్త పంట


కామెల్లియా జపోనికా


కామెల్లియా సినెన్సిస్


కామెల్లియా ససన్‌కువ

గులాబీ ఎంత అందమైనదో అంత సున్నితమైనది. కామెల్లియా పువ్వు కూడా చూడటానికి గులాబీ పువ్వంత అందంగానే ఉంటుంది. అయితే, ఇది అంత సున్నితమైనది కాదు. ఈ పువ్వు రేకులు దృఢంగా ఉంటాయి. అందుకే, కామెల్లియా పంటను గులాబీ పంటకు చక్కని ప్రత్యామ్నాయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

కామెల్లియా ఆకర్షణీయమైన, అద్భుతమైన పువ్వులు. కామెల్లియా సొగసైన పుష్పించే మొక్క. తూర్పు ఆసియాకు చెందినది. ముఖ్యంగా జపాన్, చైనా, కొరియా దేశాల్లో సాగులో ఉంది. థియేసి కుటుంబానికి చెందినది. కామెల్లియా పూజాతిలో వైవిధ్యపూరితమైన అనేక వంగడాలతో పాటు సంకరజాతులు ఉన్నాయి.

నిగనిగలాడే సతత హరిత ఆకులతో ఈ చెట్టు అన్ని కాలాల్లోనూ నిండుగా ఉంటుంది. అందానికి, అలంకారానికి ప్రతీకగా అద్భుతమైన తెలుపు, గులాబీ, ఎరుపు, ఊదా రంగుల్లో కామెల్లియా మొక్క పూస్తుంది.

అందమైన నున్నని రేకులు, సున్నితమైన సువాసనకు ప్రసిద్ధి చెందిన కామెల్లియాను తరచుగా గులాబీతో పోల్చుతూ ఉంటారు. గులాబీలు సాంప్రదాయకంగా ప్రేమ ప్రతీకలైతే.. కామెల్లియా పూలు స్వచ్ఛత, అభిరుచి, పరివర్తనలకు ప్రతీకగా చెబుతుంటారు.

నీడలోనూ పెరుగుతుంది

గులాబీ చెట్టు చల్లదనాన్ని, నీడను తట్టుకోలేదు. అయితే, కామెల్లియా అందంగా కనిపించటమే కాదు ఇటువంటి విభిన్న వాతావరణాన్ని కూడా తట్టుకుంటుంది. పొదగా, చిన్నపాటి చెట్టుగా పెంచినా ముదురు ఆకుపచ్చని ఆకులతో కామెల్లియా మొక్క పూలు లేనప్పుడు కూడా ఆకర్షణీయంగా ఉంటుంది. అందువల్ల గార్డెన్‌లో గాని, అలంకరణలో గానీ కామెల్లియా పూలు గులాబీలకు ప్రత్యామ్నాయాలుగా నిలుస్తాయి.

కామెల్లియా పూలు గులాబీల మాదిరిగానే అనేక రంగుల్లో పూస్తాయి కాబట్టి ఆయా సందర్భాలకు తగిన రంగు పూలను ఉపయోగపెట్టుకోవచ్చు. పూరేకులు మృదువుగా, గుండ్రంగా, మందంగా ఉంటాయి కాబట్టి ఇన్‌డోర్ బొకేల్లో పెట్టినా, గార్డెన్‌లో పెంచినా ఈ పూలు ఏడాది పొడవునా చూడముచ్చటగా ఒదిగిపోతాయి. గులాబీలు ఇలా కాదు. గులాబీ రేకులు బాగా సున్నితమైనవి, పల్చటివి కాబట్టి త్వరగా వడబడిపోతాయి.

కామెల్లియా పూలు రంగు, రూపు, నిర్మాణం, పరిమాణం విషయంలో ఇతర పూజాతుల మధ్య వైవిధ్యంగా నిలబడుతుంది. ఈ పువ్వులోనే ఆడ (పిస్టిల్), మగ (స్టేమెన్స్) భాగాలు అమరి ఉండటం వల్ల పరాగ సంపర్కానికి అనువుగా ఉంటుంది. ఈ పువ్వులో వంగడాన్ని బట్టి 5 నుంచి 9 రేకులు ఉంటాయి. ఇవి సాధారణంగా గుడ్డు ఆకారంలో స్పైరల్ పద్ధతిలో కూడుకొని ఉంటాయి. కామెల్లియా పూలలో రేకుల వరుసలు సింగిల్ (కొద్ది రేకులతో) లేదా సెమీ డబుల్ నుంచి డబుల్ (అనేక వరుసలు కలిసి) ఉంటాయి.

పూల రంగులు... ప్రతీకలు

పూలు లేత గులాబీ నుంచి ముదురు ఎరుపు రంగులో ఉంటాయి. కొన్ని రకాల్లో ఊదా రంగులో, అనేక రంగులతో కూడిన రేకులతోనూ కామెల్లియా పూలు పూస్తాయి.

తెల్ల కామెల్లియా పూలు స్వచ్ఛతకు, అమాయకత్వానికి, అనురాగానికి ప్రతీకలు. గులాబీ రంగు కామెల్లియా పూలు ఇష్టానికి, ప్రేమకు ప్రతీకలు. ఎర్ర కామెల్లియా పూలు అభినివేశానికి, గాఢమైన ప్రేమకు ప్రతీకలు. ఊదా రంగు కామెల్లియా పూలు ఆరాధనకు, పరివర్తనకు ప్రతీకలుగా చెబుతారు.


కామెల్లియా చెట్టు

ఈ పువ్వు 5-10 సెం.మీ. (2-4 అంగుళాలు) వ్యాసార్థంతో ఉంటుంది. కొన్ని కామెల్లియా రకాల పూలు 12 సెం.మీ. (4.7 అంగుళాల) వరకు పొడవుగా, గుండ్రంగా అద్భుతమైన ఆకర్షణీయంగా పెరుగుతాయి. ఈ చెట్టు ఏ సీజన్‌లో అయిన నిగనిగలాడే ముదురు ఆకుపచ్చని ఆకులతో కళకళలాడుతూ ఉంటుంది. ఆకులు 5-10 సెం.మీ.ల పొడవున, 2-5 సెం.మీ. (0.8 నుంచి 2 అంగుళాల) వెడల్పున ఉంటాయి.

2 నుంచి 12 మీటర్ల ఎత్తు

కామెల్లియా మొక్కను పొద మాదిరిగా పెంచుకోవచ్చు లేదా చిన్నపాటి నుంచి మధ్యస్థ ఎత్తు ఉండే చెట్టుగానూ పెంచుకోవచ్చు. రకాన్ని, పరిస్థితులను బట్టి 2 నుంచి 12 మీటర్ల (6.5 నుంచి 40 అడుగుల) ఎత్తు వరకు పెరుగుతుంది. కాయ ఆకుపచ్చగా లేదా లేత పసుపు రంగులో ఉంటుంది. విత్తనాలు ఓవల్ షేపులో చిన్నగా, గట్టిగా ఉంటాయి. వీటి నూనెను సౌందర్యసాధనాల్లో వాడతారు. వంటకు కూడా వాడుతుంటారు. కామెల్లియా జాతిలో చాలా రకాల చెట్లు శీతాకాలంలో పూతకొస్తాయి. ఇవి పెరిగే వాతావరణ స్థితిగతులు, నేలలను బట్టి పూత కాలం మారుతూ ఉంటుంది.

ఆకులతో టీ, గింజలతో నూనె

కామెల్లియా జాతిలో 100-250 వైవిధ్యపూరితమైన రకాలు ఉండటం విశేషం. పువ్వు రూపు, రంగును బట్టి అది ఏ రకమో గుర్తించవచ్చు. 'కామెల్లియా జపోనికా (జపాన్ కామెల్లియా) రకం ఎక్కువగా సాగులో ఉంది. దీని పూలు పొడవుగా, ఆకర్షణీయంగా ఉంటాయి. తెలుపు నుంచి ముదురు ఎరుపు, గులాబీ రంగుల పూలు జపాన్ కామెల్లియా చెట్టు పూస్తుంది. కామెల్లియా సినెన్సిస్ (టీ కామెల్లియా) రకం చెట్టు ఆకులతో టీ కాచుకొని తాగుతారు. అందువల్ల దీని ఆకుల ద్వారా కూడా ఆదాయం పొందవచ్చు. దీని తెల్లని పూలు చిన్నగాను, తక్కువ ఆకర్షణీయంగానూ ఉంటాయి. కామెల్లియా ససన్‌కువ రకం పూలు చిన్న, అతి సున్నితంగా ఉన్నా సువాసనను వెదజల్లుతాయి. జపాన్ కామెల్లియా రకం కన్నా చాలా ముందుగానే ఈ రకం చెట్టు పూస్తుంది. కామెల్లియా రెటిక్యులాట జాతి చెట్లకు పొడవాటి పూలు పూస్తాయి. అందరినీ ఆకర్షించగల ఈ రకం చెట్లు చైనాలో విస్తారంగా కనిపిస్తాయి. కామెల్లియా ఒలీఫెరా రకం కూడా చైనాలో విస్తారంగా కనిపిస్తుంది. దీని విత్తనాల్లో నూనె శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ నూనెను వంటకాల్లో, సౌందర్య సాధనాల తయారీకి కూడా వాడుతున్నారు. చిన్న, తెల్లని పూలు పూస్తుంది. వాణిజ్యపరంగా చూస్తే మంచి ఆదాయాన్నిచ్చే రకం ఇది.


పింక్ కామెల్లియా


పూలు.. అనేక వారాలు!

కామెల్లియా మొండి జాతి. చల్లని ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. ఉష్ణోగ్రతల్లో తీవ్ర హెచ్చుతగ్గులున్న ప్రాంతాల్లోనూ తట్టుకుంటుంది. గులాబీ చెట్లతో పోల్చితే కామెల్లియా చెట్లు పెద్దవి, చాలా కాలం మనుగడసాగిస్తాయి. దీర్ఘకాలం ఆధారపడదగిన పూల చెట్ల జాతి ఇది. దీని పూలు అనేక వారాల పాటు చెక్కుచెదరకుండా ఉంటాయి. ఈ చెట్లకు ఆకులు ఏడాది పొడవునా నిండుగా, ముచ్చటగొలుపుతుంటాయి.

ఆమ్ల నేలల్లో పెరుగుతుంది

గులాబీ మొక్కను జాగ్రత్తగా పెంచాలి. తరచూ కొమ్మలు కత్తిరించాలి. చీడపీడల నుంచి జాగ్రత్తగా రక్షించుకోవాలి. తరచూ మట్టిలో ఎరువులు వేస్తూ ఉండాలి. కానీ, కామెల్లియా చెట్లు అలా కాదు. వీటి మెయింటెనెన్స్ చాలా సులభం. మొక్క నాటిన తర్వాత నిలదొక్కుకుంటే చాలు. నీరు నిలవని ఆమ్ల నేలల్లో పెరుగుతుంది. ఏడాదిలో చాలా తక్కువ రోజులు మాత్రమే ఎండ తగిలే ప్రాంతాల్లో పూల తోటను పెంచాలంటే కామెల్లియాను ఎంచుకోవాలి.

చిన్న పొదగా పెంచుకోవచ్చు. తరచూ కత్తిరిస్తూ హెడ్జ్‌లుగా అనేక రకాలుగా, అనేక సైజుల్లో దీన్ని పెంచుకోవచ్చు. గులాబీ మొక్కల్ని పొదలుగా, తీగలుగా మాత్రమే పెంచగలం. గులాబీల మాదిరిగానే అనేక రంగుల్లో అందంగా పూస్తుంది. ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉండే పూలు కావటం కూడా ముఖ్యమైన విషయం. ఇన్ని ప్రత్యేకతలున్నందునే గులాబీకి కామెల్లియాను చక్కని ప్రత్యామ్నాయంగా చెబుతారు.


రెడ్ కామెల్లియా

షేడ్‌నెట్ అవసరం లేదని మీకు తెలుసా?


ఇంటి పంట



మేడపైన ఖాళీ ఉంచకుండా పచ్చని పంటలతో కళకళలాడేలా చూసుకుంటే ఏడాది పొడవునా ఆ కుటుంబం అంతటికీ ఆరోగ్యదాయకమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు కొంతవరకైనా అందుబాటులోకి వస్తాయి. ఇప్పుడు మేడపైన, పెరట్లో ఖాళీ లేకుండా ఇంటిపంటలు సాగు చేసుకోవటం అర్బన్ ప్రాంతాల్లో సొంతి ఇంటి యజమానులకు చాలా వరకు అలవాటైపోయింది. అయితే, వేసవిలో తమ పంటలను రక్షించుకోవటానికి సేంద్రియ మిద్దెతోట / ఇంటిపంటల సాగుదారులు ఎంతగానో శ్రమిస్తూ ఉంటారు. షేడ్‌నెట్‌లు కట్టడం, గాలిదుమ్ములకు అవి చిరిగిపోవటం, ఎగిరిపోవటం పరిపాటి. అయితే, మండు వేసవిలోనూ షేడ్‌నెట్ అవసరం లేకుండానే పంటల ప్రణాళిక ద్వారా మిద్దె తోటలను సంరక్షించుకోవచ్చు అంటున్నారు సీనియర్ మిద్దెతోట నిపుణులు 'లతా కృష్ణమూర్తి'.. 'సాక్షి సాగుబడి'కి ఆమె తెలిపిన వివరాలు..

- వచ్చేది ఎండాకాలం. షేడ్‌నెట్‌కు బదులుగా సంవత్సరం పొడవునా దిగుబడి వచ్చే పండ్ల మొక్కలను మిద్దెతోటలో పది అడుగులకు ఒకటి చొప్పున పెద్ద కుండీల్లో పెంచుకుంటే.. వాటి పక్కన చిన్న మొక్కలకు ఎండ నుంచి రక్షణ ఉంటుంది.



- మిద్దెతోట ఏర్పాటు చేసుకునేటప్పుడే కూరగాయలు, ఆకుకూరలు, పూల మొక్కలతో పాటు పండ్ల మొక్కలు కూడా పెట్టుకోవాలి.
- పండ్ల మొక్కలు చిన్నవిగా ఉన్నప్పుడు (మొదటి సంవత్సరం) ఎండాకాలం ఉష్ణోగ్రతలకు మొక్కలు తట్టుకోలేకపోయినా రెండో సంవత్సరం నుంచి ఎలాంటి ఇబ్బందీ ఉండదు.
- మా మిద్దెతోటలో నిర్మించిన ఎత్తుమడుల్లో ప్రతి పది అడుగులకు ఒక పండ్ల చెట్టు పెంచుతున్నాం.
- మిద్దెతోట వల్ల ఇంటి లోపల చల్లగా ఉంటుంది. బయటి ఉష్ణోగ్రతల కంటే ఇంటి లోపల ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. మండువేసవిలోనూ ఇంట్లో ఏ.సి. అవసరం ఉండదు. అందువల్ల కరెంట్ వాడకం తగ్గుతుంది. ఖర్చు కలిసి వస్తుంది.
- అలాగే, ఇండోర్ ప్లాంట్స్ పెంచుకోవడం వల్ల కూడా స్వచ్ఛమైన ఆక్సిజన్ అందటంతో పాటు తేమ కూడా రిలీజ్ అయి, గదిలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.


సేద్యంలో మహిళా సైన్యం!

కేరళలో 10,000 హెక్టార్లలో కుడుంబశ్రీ ఆధ్వర్యంలో సేంద్రియ సేద్యం

దేవతల స్వంత దేశంగా భావించే భూమిపై తమకంటూ సొంతమైన కుంచెడు భూమి లేని నిరుపేద మహిళలు వారు. కేరళ ప్రభుత్వం ఇచ్చిన చిన్న ఆసరాతో సాగునే నమ్ముకొని వేరే ఉపాధికి నోచుకోని ఆ మహిళలు చేయి.. చేయి కలిపారు. సాగు బాటలో వేల అడుగులు జతకూడాయి. మహిళల నుదుటి చెమట చుక్కలు చిందిన బీడు భూములు విరగపండాయి. పైరు పరవళ్లు తొక్కాయి. వ్యవసాయం లాభసాటి కాదనే మాటలు నీటిమీది రాతలుగా తేలాయి. కేరళలో 10,000 హెక్టార్లలో కుడుంబశ్రీ ఆధ్వర్యంలో సేంద్రియ సేద్యం జరుగుతోంది. వ్యవసాయంలో మాదే పైచేయి సుమా అంటున్నారు కేరళ మహిళా రైతులు.







భూమిలేని మహిళల ఆర్థిక స్వావలంభన కల్పించే దిశగా కేరళ ప్రభుత్వం ప్రారంభించిన వినూత్న కార్యక్రమం కుడుంబశ్రీ. కేరళ రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ 1998లో ఊపిరిపోసుకున్న 'కుడుంబ శ్రీ' కేరళ గడ్డపై మహిళా సంఘటిత శక్తికి ప్రతీకగా ఎదిగింది. ఆ రాష్ట్రం మొత్తం ప్రధానంగా ఎదుర్కొనే సమస్య ఉపాధి. ముఖ్యంగా తమకంటూ సొంత వ్యవసాయ భూములు లేని కుటుంబాలే ఎక్కువ. స్థానిక సాగు భూములను వ్యవసాయేతర పనులకు ఉపయోగించటం వల్ల నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉండేది. వ్యవసాయ రంగంలో పనిచేసేది ఎక్కువగా మహిళలే కావటంతో పనులు దొరక్క తీవ్ర ఒడిదుడుకులకు లోనవ్వాల్సివచ్చేది. రాష్ట్ర భూ సంస్కరణల చట్టం కౌలుపై నిషేధం విధించింది. అనధికారికంగా కౌలుకు ఇస్తే తమ భూమిపై అధికారం శాశ్వతంగా కోల్పోతామనే భయం యజమానుల్లో ఉండేది. కూలి పనులు మానుకొని సొంత వ్యవసాయం చేయాలనుకునేవారికి అది అందని ద్రాక్ష అయింది.

సంఘటిత శక్తే తారక మంత్రం..

ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లోను కేరళ ప్రభుత్వం వెనుకడుగేయలేదు. సామూహిక వ్యవసాయ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. భూమిలేని మహిళలకు పొలం, పంటతో అనుబంధం కల్పించటమే లక్ష్య సాధనలో తొలి అడుగుగా కొంతమంది భూమిలేని మహిళలను కలిపి 15-40 మంది మహిళలను కలిపి స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, వ్యక్తిగత వ్యవసాయ భూములను గుర్తించి సంఘాలకు దఖలు పరిచారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు సాగులో సేంద్రియ పద్ధతులకు పెద్ద పీట వేశారు. సేంద్రియ / ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు మహిళా రైతుల కోసం ఏర్పాటు చేశారు. మంచి దిగుబడులను సాధించిన సంఘాలకు ఆర్థిక ప్రోత్సాహకాలను కల్పించేవారు. అన్ని జిల్లాల్లో 201 క్లస్టర్లలో 10,000 హెక్టార్లలో కుడుంబశ్రీ ఆధ్వర్యంలో సేంద్రియ / ప్రకృతి సేద్యం జరుగుతోంది.

నాబార్డు సహకారంతో కుడుంబశ్రీ పథకం కింద బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించారు. రుణాలు తీసుకోవటం తిరిగి చెల్లించటంలో ఆయా సంఘాల్లోని మహిళా సభ్యులందరిది ఉమ్మడి బాధ్యత. ఒక్క తిరువనంతపురం జిల్లాలోనే ఆరువేల గ్రూపులు ఏర్పాటయ్యాయి. వీటిలో సుమారు 30 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఆదునిక పద్ధతుల్లో అరటి సాగుపై కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇచ్చిన శిక్షణతో తక్కువ కాలంలోనే రెండింతల దిగుబడులు సాధించారు. వనితా కర్మసేన పేరుతో కుడుంబశ్రీ కోసం వ్యవసాయ పరికాలను, యంత్రాలను ఉపయోగించటంలో మహిళలకు శిక్షణ ఇచ్చారు. కొనుగోలుకు రుణాలు ఇచ్చారు. ప్రతి సంఘానికి తమ సొంత పరికరాలు ఉన్నాయి. దీంతో వారే శ్రామికులుగా మారటంతో ఖర్చును ఆదా చేయగలిగారు. పంటను నష్టపోయిన సందార్భాల్లో నాబార్డ్ మహిళా రైతులకు అండగా నిలిచింది.

47 వేల పై చిలుకు సంఘాలు, లక్ష ఎకరాల్లో సాగు చేస్తున్నాయి. జీడిమామిడి, కొబ్బరి, వరి, అరటి, పైనాపిల్ పండ్లతోటలు, ఆకుకూరలు, గుమ్మడి, బఠాణీ, సొర, అల్లం, బెండ, మిరప, వంటి పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. తాము పండించిన పంటలను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయించటంతో మంచి లాభాలు కళ్లజూశారు. ఆరు నెలలు తిరగకుండానే రుణాలు తిరిగి చెల్లించారు. ఒక్కో సీజన్‌లోనే ఈ సంఘాలు రూ. లక్ష వరకు నికరాదాయం ఆర్జించేవి. దీంతో తమకంటూ సొంత ఇళ్లను నిర్మించుకున్నారు. చిన్న వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నారు. బ్యాంకులు గతంలో మహిళలకు రుణాలు ఇచ్చేందుకు ముందుకొచ్చేవి కాదు. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారింది. 10543 స్వయం సహాయక సంఘాలకు రూ. 123 కోట్ల రుణాలు ఇచ్చారు. ఇప్పుడు బ్యాంకుల దృష్టిలో మహిళారైతులు అంటే మంచి పరపతిగల మహిళలు.

బిజినెస్ రీల్

స్టాండర్డ్ గ్లాస్ ఐపీవో 34.85 రెట్లు సబ్‌స్క్రైబ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ పరిశ్రమకు ప్రత్యేక ఇంజనీరింగ్ పరికరాల తయారీలో ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఐపీవోకు ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇష్యూ రెండవ రోజు 34.85 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఆఫర్‌లో 2.08 కోట్ల షేర్లకు గాను 72.58 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. తొలిరోజు 13.32 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. గ్రే మార్కెట్‌లో షేర్లు 66 శాతం ప్రీమియంతో ట్రేడయ్యాయి. ఇక బిడ్డింగ్ రౌండ్‌లో ముందున్న ఎన్ఐఐ విభాగం 78.17 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్స్ 32.87, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ కొనుగోలుదారుల విభాగం 4.69 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. జనవరి 9న షేర్లను కేటాయిస్తారు. అలాగే షేర్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో జనవరి 13న లిస్ట్ చేయనున్నారు. ఇష్యూ జనవరి 8న (నేడు) ముగుస్తుంది. ఒక్కో షేరుకు ప్రైస్ బ్యాండ్ రూ.133–140 మధ్య నిర్ణయించారు. ఐపీవోలో భాగంగా రూ.210 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తారు. ఆఫర్ ఫర్ సేల్ కింద ప్రమోటర్లు 1.42 కోట్ల షేర్లను విక్రయిస్తారు. ఇన్వెస్టర్లు కనీసం 107 ఈక్విటీ షేర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.123 కోట్లను కంపెనీ అందుకుంది.

నష్టాల్లోకి మొబిక్విక్

క్యూ2లో రూ. 3.6 కోట్లు



న్యూఢిల్లీ: డిజిటల్ వాలెట్ సేవలందించే మొబిక్విక్ ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో లాభాలను వీడి నష్టాలు ప్రకటించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో రూ. 3.6 కోట్ల నష్టం నమోదైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 6 కోట్ల స్టాండెలోన్ నికర లాభం ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 207 కోట్ల నుంచి రూ. 297 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 186 కోట్ల నుంచి రూ. 287 కోట్లకు భారీగా పెరిగాయి. ఈ కాలంలో రూ. 7 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) సాధించినట్లు కంపెనీ వెల్లడించింది. కాగా.. గత నెలలో లిస్టయిన వన్ మొబిక్విక్ సిస్టమ్స్ తొలిసారి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. తదుపరి వృద్ధి అవకాశాలకు వీలుగా పెట్టుబడులు వెచ్చిస్తుండటంతో నష్టాలు నమోదైనట్లు కంపెనీ తెలియజేసింది.

మొబిక్విక్ షేరు ఎన్ఎస్ఈలో 8.3% జంప్‌చేసి రూ. 608 వద్ద ముగిసింది. తొలుత దాదాపు 14% దూసుకెళ్లి రూ. 638కు చేరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-1-2025	
విశాఖ	510–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505–00
విజయవాడ	505–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480–00
వరంగల్	482–00
రిటైల్ ధర	5.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ONGC	264	3.79
SBILIFE	1,472.20	2.62
HDFCLIFE	619.95	2.31
TATAMOTORS	792.5	2.09
ADANIENT	2,524.80	2.03

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	6,844.20	-2.2
HCLTECH	1,916.75	-1.86
TCS	4,031.00	-1.56
EICHERMOT	5,175.00	-1.43
TECHM	1,669.65	-0.99

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,628
ఎన్ఎస్ఈ	94,300
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,37,724
ఎఫ్ఐఐ	- 1,491
డీఐఐ	+ 1,615

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	74.28 (రాత్రి 11.30కు)	$ 73.56 (క్రితం ముగింపు)
బ్రెంట్	76.94 (రాత్రి 11.30కు)	$ 76.03 (క్రితం ముగింపు)

ఎకానమీ స్పీడ్ 6.4 శాతమే..

2024-25 ఆర్థిక సంవత్సరంపై ప్రభుత్వ గణాంకాల అంచనా

- ఇదే జరిగితే ఈ రేటు నాలుగేళ్ల కనిష్ట స్థాయి
- తయారీ, సేవల పేలవ పనితీరు ఎఫెక్ట్



న్యూఢిల్లీ: భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు మార్చితో ముగిసే ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరంలో 6.4 శాతానికి పడిపోయే అవకాశాలు ఉన్నాయని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) ముందస్తు అంచనాలు సూచిస్తున్నాయి. ఇదే జరిగితే ఈ రేటు నాలుగు సంవత్సరాల కనిష్ట స్థాయి అవుతుంది. ముఖ్యంగా తయారీ, సేవల రంగాల పనితీరు బలహీనంగా ఉండడం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నట్లు గణాంకాలు వెల్లడించాయి. 2020–21లో కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో ఎకానమీలో అసలు వృద్ధి లేకపోగా 5.8 శాతం క్షీణతను నమోదుచేసిన సంగతి తెలిసిందే. అటు తర్వాత 6.4 శాతం వృద్ధి రేటు నమోదయితే అది నాలుగేళ్ల కనిష్ట స్థాయి అవుతుంది. బేస్ ఎఫెక్ట్‌తో 2021–22లో ఎకానమీ వృద్ధి రేటు 9.7 శాతంగా నమోదయ్యింది. 2022–23లో 7 శాతం, 2023–24లో 8.2 శాతంగా ఈ రేట్లు ఉన్నాయి. 2024–25పై జాతీయ గణాంకాల కార్యాలయం తాజా అంచనాలు రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) డిసెంబర్ 2024లో అంచనా వేసిన 6.6 శాతంతో పోలిస్తే తక్కువ కావడం గమనార్హం. ఆర్థిక మంత్రిత్వశాఖ తొలి అంచనా 7 శాతంకన్నా కూడా ఈ అంచానలు తక్కువగా ఉండడం గమనార్హం.

ఆర్‌బీఐ పాలసీ అంచనాలు ఇవీ..

ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటును 6.6 శాతంగా అంచనావేసిన ఆర్‌బీఐ ఇటీవలి ద్రవ్య పరపతి విధాన సమీక్ష క్యూ3లో 6.8 శాతం, క్యూ4లో 7.2 శాతం వృద్ధి రేట్లు నమోదవుతాయని, 2025–26 మొదటి రెండు త్రైమాసికాల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) వరుసగా 6.9 శాతం, 7.3 శాతం వృద్ధి నమోదవుతుందని విశ్లేషించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 6.7 శాతం వృద్ధి నమోదవగా, రెండవ క్వార్టర్‌లో 7 క్వార్టర్ల కనిష్ట స్థాయిలో 5.4 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే.

కీలక రంగాలపై అంచనాలు..



తయారీ రంగం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు 5.3 శాతంగా అంచనా. గత ఆర్థిక సంవత్సరం ఈ విభాగం 9.9 శాతం వృద్ధి రేటును నమోదుచేసుకుంది.



సేవల రంగం: ఎకానమీలో మెజారిటీ వాటా కలిగిన ఈ రంగం వృద్ధి అంచనా 5.8 శాతం. 2023–24లో ఈ రేటు 6.4 శాతం.



వ్యవసాయం: కొంత మెరుగైన ఫలితం వెలువడనుంది. 3.8 శాతం వృద్ధి నమోదవుతుందని గణాంకాలు అంచనా వేస్తున్నాయి. 2023–24లో 1.4 శాతంతో పోలిస్తే ఇది మెరుగైన స్థాయి కావడం గమనార్హం.

ఎకానమీ లెక్కలు ఇలా...

- 2024–25లో ఎకానమీ విలువ 3.8 ట్రిలియన్ డాలర్లు (డాలర్ మారకంలో రూపాయి విలువ రూ.85.71 ప్రాతిపదికన)
- ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రస్తుత ధరల ప్రకారం 2024–25లో జీడీపీ విలువ అంచనా రూ. 324.11 లక్షల కోట్లు, 2023–24లో ఈ విలువ రూ. 295.36 లక్షల కోట్లు. అంటే వృద్ధి 9.7 శాతం.
- ప్రైవేట్ తుది వినియోగ వ్యయం (పీఎఫ్‌సీఈ): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనా 7.3 శాతం. గత సంవత్సరంలో ఈ రేటు 4 శాతం.



ప్రభుత్వ తుది వినియోగ వ్యయం (జీఎఫ్‌సీఈ): 2024–25లో 4.1 శాతం వృద్ధి, 2023–24లో ఈ రేటు 2.5 శాతం.



తలసరి ఆదాయం: ద్రవ్యోల్బణం పరిగణనలోకి తీసుకోకుండా 2024–25లో ప్రస్తుత ధరల వద్ద తలసరి ఆదాయం 8.7 శాతం పెరిగి రూ. 2,00,162కు చేరుకునే అవకాశం ఉంది. 2023–24లో ఈ విలువ రూ. 1,84,205.

ముందస్తు గణాంకాల ప్రాధాన్యత!

ఫిబ్రవరి 1న లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించనున్న కేంద్ర బడ్జెట్‌కు సన్నాహకంగా తాజా ముందస్తు అంచనాలు ఉపయోగపడతాయి.



తగిన అంచనాలు...



2024–25 ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనాలు సమంజసంగానే ఉన్నాయి. అయితే కొన్ని రంగాలు అధిక వృద్ధిని నమోదుచేసుకునే అవకాశం ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఎకానమీపై కూడా అంతర్జాతీయ అనిశ్చితిలు, భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం పడే అవకాశం ఉంది. ఆయా అంశాలు పరిగనణలోకి తీసుకుంటూ 2025–25లో జీడీపీ వృద్ధి రేటును 6.5 శాతంగా మేము అంచనా వేస్తున్నాం.

– అదితి నాయర్, ఇక్రా చీఫ్ ఎకనమిస్ట్

మూలధన వ్యయ తగ్గుదల ప్రభావం



కరోనా మహమ్మారి తర్వాత ఎకానమీ పురోగతిలో ప్రభుత్వ మూలధన వ్యయాలు కీలకంగా మారాయి. వీటి తగ్గుదల ప్రభావం ఆర్థిక వ్యవస్థపై పడుతోంది. ఇక పట్టణ ఆర్థిక వ్యవస్థ అధిక ద్రవ్యోల్బణం అలాగే రుణ వృద్ధి మందగమనం సవాళ్లను ఎదుర్కొంటోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల విడుదల చేసిన డేటా ప్రకారం, పట్టణ ప్రాంతాల్లో వినియోగదారుల విశ్వాసం తగ్గింది. పట్టణ ఆర్థిక వ్యవస్థపై ఎక్కువ ప్రభావం చూపే రిటైల్ క్రెడిట్ వృద్ధి మందగించింది.

– ధర్మకీర్తి జోషి, క్రిసిల్ చీఫ్ ఎకనమిస్ట్

వృద్ధి 6.2 శాతానికి పరిమితం: హెచ్ఎస్‌బీసీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.2 శాతమేనని విదేశీ బ్రోకరేజ్ సంస్థ– హెచ్ఎస్‌బీసీ నివేదిక పేర్కొంది. అధికారిక అంచనాతో పోలిస్తే ఇది మరింత తక్కువగా ఉండడం గమనార్హం. అయితే ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.5 శాతానికి పెరుగుతుందని నివేదిక విశ్లేషించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో (జూలై –సెప్టెంబర్) వృద్ధి రేటు 5.4 శాతంగా నమోదుకావడం నిరాశాజనకంగా ఉన్నట్లు హెచ్ఎస్‌బీసీ నివేదిక పేర్కొంది.

క్యూ2 తర్వాత పరిస్థితులు మెరుగు...

''మేము విశ్లేషించే 100 సూచికల ప్రకారం సెప్టెంబర్ తరువాత వృద్ధి సూచికలు మెరుగుపడ్డాయి. అయితే జూన్ త్రైమాసికంతో ఇంకా బలహీనంగానే ఉన్నాయి'' అని నివేదిక పేర్కొంది. జూలై–సెప్టెంబర్ కాలంలో 55 శాతం సూచికలు సానుకూలంగా వృద్ధి చెందగా, డిసెంబర్ త్రైమాసికంలో ఇది 65 శాతానికి పెరిగిందని తెలిపింది. వ్యవసాయం, ఎగుమతులు, నిర్మాణ రంగాల్లో మెరుగుదల అంశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని నివేదిక తెలిపింది. ఇటీవల వారంలో చాలా చర్చనీయాంశంగా మారిన పట్టణ వినియోగంలో కూడా డిసెంబర్ త్రైమాసికంలో కొంత మెరుగుదల కనిపించిందని నివేదిక పేర్కొంది. అయితే, వినియోగ విద్యుత్ సేవలు, ప్రైవేటు పెట్టుబడుల సూచికలు ఇంకా బలహీనంగానే ఉన్నాయని తెలిపింది. జూన్ త్రైమాసికంలో 75 శాతం సూచికలు సానుకూలంగా ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితి అంత బాగోలేదని నివేదిక వెల్లడించింది. 2024–25లో రిటైల్ ద్రవ్యోల్బణం సగటున 4.9 శాతంగా ఉంటుందని, 2025–26లో ఇది 4.4 శాతానికి నివేదిక పేర్కొంది. నవంబరులో 5.5 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం డిసెంబరులో 5.3 శాతానికి, జనవరిలో 5 శాతం కంటే తక్కువకు పడిపోతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

అరశాతం రెపో రేటు కోత అంచనా...

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధానం ఫిబ్రవరి, ఏప్రిల్ విధాన సమీక్షలలో 0.25 శాతం చొప్పున రెండు రేట్ల కోత నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. వృద్ధే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొంది. ఇదే జరిగితే బ్యాంకులకు ఆర్‌బీఐ ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ ప్రస్తుత 6.5 శాతం నుంచి 6 శాతానికి తగ్గే అవకాశం ఉంది. 2025–26 నాటికి ద్రవ్యలోటును 4.5 శాతానికి కట్టడి చేయడానికి వ్యయ నియంత్రణ అవసరమని పేర్కొన్న నివేదిక, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం తగ్గుతుండడమే దీనికి కారణంగా వివరించింది.



షటర్‌స్టాక్, గెట్టీ ఇమేజెస్ విలీనం

3.7 బిలియన్ డాలర్ల విజువల్ కంటెంట్ సంస్థగా ఆవిర్భావం



న్యూయార్క్: విజువల్ కంటెంట్ కంపెనీలైన షటర్‌స్టాక్, గెట్టీ ఇమేజెస్ విలీనం కానున్నాయి. దీంతో 3.7 బిలియన్ డాలర్ల భారీ సంస్థ ఆవిర్భవించనుంది. విలీన సంస్థ గెట్టీ ఇమేజెస్ పేరుతో కొనసాగుతుంది, న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో గెట్టీ టికర్‌తో ట్రేడవుతుంది. సంస్థకు గెటీ ఇమేజెస్ సీఈవో క్రెగ్ పీటర్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా వ్యవహరిస్తారు. డీల్ ప్రకారం షటర్‌స్టాక్ షేర్‌హోల్డర్లకు కొన్ని ఆప్షన్లు ఉంటాయి. తమ దగ్గరున్న ఒక్కో షేరుకు 28.85 డాలర్ల చొప్పున నగదును తీసుకోవడం లేదా, ప్రతీ షేరుకు 13.67 గెట్టీ ఇమేజెస్ షేర్లను పొందడం వీటిలో ఉన్నాయి. ఈ రెండింటితో పాటు ఒక్కో షేరుకు 9.50 డాలర్ల నగదు, 9.17 షేర్లను కూడా తీసుకోవచ్చు. ఇమేజ్‌లు, వీడియోలు, మ్యూజిక్ మొదలైన కంటెంట్‌ను ఈ రెండు సంస్థలు అందిస్తున్నాయి. ఇరు సంస్థల విలీనానికి ఇదే మంచి తరుణమని పీటర్స్ తెలిపారు.

130 బిలియన్ డాలర్లకు దేశీ ఫార్మా

2030 నాటికి ఐపీఏ ప్రెసిడెంట్ సమీర్ మెహతా అంచనా



న్యూఢిల్లీ: దేశీయ ఫార్మా పరిశ్రమ 2030 నాటికి రెట్టింపు స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ) ప్రెసిడెంట్, టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీహ్ మెహతా తెలిపారు. అప్పటికి 120–130 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని, 2047 నాటికి 400–450 బిలియన్ డాలర్ల స్థాయిని అందుకోగలదని ఆయన పేర్కొన్నారు. గత 25 ఏళ్లలో భారతీయ ఫార్మా పరిశ్రమ 20 రెట్లు పెరిగిందని వివరించారు. 1999–2000లో 3 బిలియన్ డాలర్లుగా ఉన్నది 58 బిలియన్ డాలర్లకు చేరిందని మెహతా చెప్పారు. వాణిజ్య మిగులుకు దోహదపడుతున్న అయిదు రంగాల్లో ఇది కూడా ఒకటని ఐపీఏ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాసిన ఆర్టికల్‌లో ఆయన పేర్కొన్నారు. వికసిత భారత్ లక్ష్యాల సాధనలో భాగంగా ఉద్యోగాల కల్పన నుండి గ్లోబల్ ట్రేడ్ వరకు వివిధ అంశాల్లో ఫార్మా కీలక పాత్ర పోషించగలదని ఆయన వివరించారు. సానుకూల పాలసీలు, పరిశోధనలు.. అభివృద్ధిపై భారీ పెట్టుబడులు, చౌకగా వైద్యసేవలను అందుబాటులోకి తేవడం మొదలైనవన్నీ పరిశ్రమ పూర్తి సామర్థ్యాల మేరకు పని చేసేందుకు దోహదపడతాయని మెహతా తెలిపారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా జనరిక్ ఔషధాలకు నెలకొన్న డిమాండ్‌లో భారత్ 20 శాతం ఔషధాలను సరఫరా చేస్తోందని, పరిమాణం.. విలువపరంగా 11వ ర్యాంకులో ఉందని వివరించారు.

నెలకు 5,000 వాహన అమ్మకాలు లక్ష్యం

ఈవీల ధరలను వెల్లడించిన మహీంద్రా



పుణే: వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా బీఈ–6, ఎక్స్ఈవీ 9ఈ టాప్ వేరియంట్ల ధరలను ప్రకటించింది. రెండు మోడళ్లూ మూడు వేరియంట్లలో లభిస్తాయి. ఎక్స్‌షోరూంలో టాప్ వేరియంట్స్ అయిన బీఈ–6 ప్యాక్–3 ధర రూ.26.90 లక్షలు కాగా ఎక్స్ఈవీ 9ఈ ప్యాక్–3 రూ.30.5 లక్షలు ఉంది. 2024 నవంబర్‌లో కంపెనీ రెండు మోడళ్లను ఆవిష్కరించి ఎలక్ట్రిక్ విభాగంలోకి ఎంట్రీ ఇస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా ఈవీల ప్రారంభ ధర రూ.18.9 లక్షలు ఉంటుందని వెల్లడించింది. వేరియంట్‌ను బట్టి బీఈ–6 గరిష్ఠంగా ఒకసారి చార్జింగ్ చేస్తే 682 కిలోమీటర్లు, ఎక్స్ఈవీ 9ఈ 656 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. కాగా, నెలకు 5,000 యూనిట్లు విక్రయించాలని మహీంద్రా లక్ష్యంగా చేసుకుంది. చకన్ ప్లాంటు సామర్థ్యాన్ని నెలకు 90,000 స్థాయికి తీర్చిదిద్దుతోంది. దీనిని 1.2 లక్షల యూనిట్లకు పెంచే అవకాశమూ ఉంది. 2021–27 మధ్య ఎలక్ట్రిక్ వాహనాల వ్యాపారం కోసం రూ.16,000 కోట్లు పెట్టుబడి చేస్తున్నట్లు మహీంద్రా ఇప్పటికే వెల్లడించింది.

ఫిక్స్‌డ్ డిపాజిట్లకు ఒకే ప్లాట్‌ఫామ్

- పొదుపు ఖాతా అవసరం లేదు
- ఆవిష్కరించిన టాటా డిజిటల్



న్యూఢిల్లీ: ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా రిటైల్ ఇన్వెస్టర్లు వివిధ బ్యాంకులు లేదా ఎన్‌బీఎఫ్‌సీలలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసేందుకు టాటా డిజిటల్ తెరతీసింది. సూపర్‌యాప్ 'టాటా న్యూ' ద్వారా ఇందుకు వీలు కల్పిస్తోంది. కస్టమర్లు పొదుపు ఖాతా లేకుండానే తమ సొమ్మును వివిధ ఫైనాన్షియల్ సంస్థలలో ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మళ్లించుకోవచ్చునని టాటా డిజిటల్ తెలియజేసింది. గరిష్ఠంగా 9.1 శాతం వరకూ వడ్డీని ఫైనాన్షియల్ సంస్థలు ఆఫర్ చేస్తున్నట్లు పేర్కొంది. పోటీతత్వంతో కూడిన వడ్డీ రేట్లతో సులభంగా, భద్రంగా సొమ్మును ఎంపిక చేసుకున్న ఫైనాన్షియల్ సంస్థలలో దాచుకునేందుకు తమ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడుతుందని వివరించింది. రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చని, బ్యాంకులో పెట్టుబడులకు డీఐసీజీసీ ద్వారా రూ. 5 లక్షల వరకూ డిపాజిట్ బీమా ఉంటుందని తెలియజేసింది. ఎన్‌బీఎఫ్‌సీలలో బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ తదితరాలున్నట్లు పేర్కొంది.

వాహన రిటైల్ విక్రయాల్లో 9 శాతం వృద్ధి

మొత్తం అమ్మకాలు 2,61,07,679 యూనిట్లు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 2024లో ఆటోమొబైల్ రిటైల్ అమ్మకాలు 2,61,07,679 యూనిట్లు నమోదైంది. 2023తో పోలిస్తే విక్రయాలు గతేడాది 9 శాతం పెరిగాయని డీలర్ల సంఘం ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఏడీఏ) మంగళవారం తెలిపింది. సవాళ్లతో కూడిన వ్యాపార వాతావరణం మధ్య ద్విచక్ర, ప్యాసింజర్ వాహనాలకు బలమైన డిమాండ్ నేపథ్యంలో ఈ వృద్ధి నమోదైందని ఫెడరేషన్ వెల్లడించింది. ప్యాసింజర్ వెహికిల్స్ అమ్మకాలు 2023తో పోలిస్తే 5 శాతం వృద్ధితో గతేడాది 40,73,843 యూనిట్లుగా ఉన్నాయి. ద్విచక్ర వాహనాల విక్రయాలు 11 శాతం దూసుకెళ్లి 1,89,12,959 యూనిట్లకు చేరుకున్నాయి. త్రీవీలర్స్ రిజిస్ట్రేషన్లు 11 శాతం ఎగసి 12,21,909 యూనిట్లను తాకాయి. ట్రాక్టర్ల అమ్మకాలు 3 శాతం వృద్ధితో 8,94,112 యూనిట్లకు చేరాయి. వాణిజ్య వాహనాల విక్రయాలు 10,04,856 యూనిట్ల వద్ద స్థిరంగా ఉన్నాయి.

నిలకడగా పరిశ్రమ..

వేడిగాలులు, కేంద్రం, రాష్ట్ర స్థాయిలలో ఎన్నికలు, అసమాన రుతుపవనాలతో సహా పలు ఎదురుగాలులు ఉన్నప్పటికీ వాహన రిటైల్ పరిశ్రమ 2024లో నిలకడగా ఉందని ఎఫ్ఏడీఏ ప్రెసిడెంట్ సి.ఎస్.విఘ్నేశ్వర్ తెలిపారు. 'మెరుగైన సరఫరా, తాజా మోడళ్లు, బలమైన గ్రామీణ డిమాండ్ ద్విచక్ర వాహన విభాగంలో వృద్ధిని పెంచాయి. అయినప్పటికీ ఆర్థిక పరిమితులు, ఎలక్ట్రిక్ విభాగం నుంచి పెరుగుతున్న పోటీ సవాళ్లను కలిగిస్తూనే ఉన్నాయి. ప్యాసింజర్ వెహికల్ (పీవీ) విభాగం బలమైన నెట్‌వర్క్ విస్తరణ, ఉత్పత్తి లాంచ్‌ల నుండి ప్రయోజనం పొందింది. అధిక ఇన్వెంటరీ కారణంగా లాభాలపై ఒత్తిళ్లు ఏర్పడి ద్వితీయార్థంలో డిస్కౌంట్ల యుద్ధానికి దారితీసింది. ఎన్నికల ఆధారిత అనిశ్చితి, తగ్గిన మౌలిక సదుపాయాల మధ్య వాణిజ్య వాహనాల విభాగం పనితీరు స్తబ్దుగా ఉంది' అని వివరించారు.

హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాల జోరు

- 12 శాతం వృద్ధితో 36,974 యూనిట్లు
- 2024లో నమోదు
- 12 ఏళ్ల గరిష్టానికి హౌసింగ్ డిమాండ్
- ఎనిమిది నగరాలపై నైట్‌ఫ్రాంక్ నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరాయి. 2024లో 12 శాతం అధికంగా 36,974 యూనిట్ల ఇళ్లు అమ్ముడుపోయినట్టు నైట్‌ఫ్రాంక్ ఇండియా సంస్థ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఎనిమిది నగరాల్లో 2024లో 7 శాతం మేర ఇళ్ల విక్రయాలు పెరిగాయి. మొత్తం 3,50,613 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇది 12 ఏళ్ల గరిష్ట స్థాయి. హైదరాబాద్‌తోపాటు పుణెలో ఆల్‌టైమ్ గరిష్టాలకు విక్రయాలు చేరగా, ముంబైలో 13 ఏళ్ల గరిష్టానికి చేరుకున్నట్టు నైట్‌ఫ్రాంక్ తెలిపింది. ''ప్రీమియం ఇళ్లకు డిమాండ్ నెలకొంది. రూ.2–5 కోట్ల విభాగంలోని ఇళ్ల విక్రయాల్లో 85 శాతం వృద్ధి నమోదైంది. మరోవైపు రూ.50 లక్షల్లోపు ధరలో, రూ.50లక్షల నుంచి రూ.కోటి మధ్య ధరల విభాగాల్లోనూ వృద్ధి లేకపోవడం లేదా బలహీనపడడం కనిపించింది'' అని తెలిపింది. రూ.2–5 కోట్ల ధరల ఇళ్లకు బలమైన డిమాండ్ ఉన్నట్టు నైట్‌ఫ్రాంక్ ఇండియా చైర్మన్, ఎండీ శిశిర్ బైజాల్ తెలిపారు. 2020 నుంచి నివాస గృహాల మార్కెట్ అద్భుతమైన ర్యాలీని చూసిందని, 2024 విక్రయాలు 12 ఏళ్ల గరిష్టానికి చేరాయని చెప్పారు. ''ప్రీమియమైజేషన్ ధోరణి పెరిగిపోయింది. ఇళ్ల మార్కెట్‌లో క్రమంగా అధిక ధరల వైపు కస్టమర్లు మళ్లుతున్నారు. మెరుగైన జీవన అవసరాలకు అనుగుణంగా ఎంపిక చేసుకుంటున్నారు'' అని వివరించారు. స్థిరమైన ఆర్థిక వృద్ధి, వడ్డీ రేట్లు అనుకూలిస్తున్నట్టు చెప్పారు.

పట్టణాల వారీ విక్రయాలు..

- 2024లో ముంబైలో ఇళ్ల అమ్మకాలు అంతక్రితం ఏడాదితో పోల్చితే 11 శాతం పెరిగి 96,187 యూనిట్లుగా ఉన్నాయి.
- బెంగళూరులో 2 శాతం అధికంగా 55,362 ఇళ్ల యూనిట్లు అమ్ముడయ్యాయి.
- పుణెలో 6 శాతం వృద్ధితో ఇళ్ల అమ్మకాలు 52,346 యూనిట్లకు చేరాయి.
- అహ్మదాబాద్‌లో 15 శాతం వృద్ధి కనిపించింది. 18,462 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి.
- కోల్‌కతాలోనూ 16 శాతం పెరిగి 17,389 యూనిట్లు అమ్ముడయ్యాయి.
- చెన్నైలో అమ్మకాలు 9 శాతం మేర పెరిగి.. 16,238 యూనిట్లకు చేరాయి.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో 4 శాతం క్షీణించి 57,654 యూనిట్లకు విక్రయాలు పరిమితమయ్యాయి.

అందుబాటు ధరల ఇళ్ల విభాగం మెరుగుపడుతుంది..

''ఇళ్ల మార్కెట్లో సెంటిమెంట్ బలంగా ఉంది. ధరలతోపాటు అమ్మకాల్లోనూ స్థిరమైన పెరుగుదల కనిపిస్తోంది. రూ.కోటిలోపు ఇళ్ల అమ్మకాలు బలహీనపడడం పట్ల ఆందోళనలు నెలకొన్నాయి. కానీ, అందుబాటు ధరల ఇళ్లకు ప్రభుత్వం నుంచి మద్దతు, ప్రైవేటు రంగం ఆసక్తి చూపిస్తుండడంతో ఈ విభాగంలో అమ్మకాలు స్థిరపడతాయి'' అని నైట్‌ఫ్రాంక్ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రీసెర్చ్ సీనియర్ ఈడీ గులామ్ జియా వివరించారు.

నయా రాకెట్ నిశేష్ రెడ్డి...

- టెన్నిస్‌లో నిలకడగా రాణిస్తున్న తెలుగు సంతతి అమెరికన్ టీనేజర్
- ఉన్నత విద్యనభ్యసిస్తూనే ప్రొఫెషనల్‌గా మారిన వైనం
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వైల్డ్ కార్డ్ ఎంట్రీ

అంతర్జాతీయ స్థాయిలో మరో యువ టెన్నిస్ ఆటగాడు దూసుకొస్తున్నాడు. అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగు సంతతి కుర్రాడు నిశేష్ బసవరెడ్డి... గత సీజన్‌లో అనూహ్య ప్రదర్శనతో అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) యూత్ చాలెంజర్స్ టూర్ ఫైనల్స్ టోర్నీకి అర్హత సాధించడంతో పాటు... సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు వైల్డ్ కార్డు ఎంట్రీ పొందాడు. కాలిఫోర్నియాలో పుట్టి పెరిగిన 19 ఏళ్ల నిశేష్ బసవరెడ్డి డిసెంబర్‌లోనే ప్రొఫెషనల్ ప్లేయర్‌గా మారాడు. 457వ ర్యాంక్‌తో 2024వ సంవత్సరం టెన్నిస్ సీజన్‌ను ప్రారంభించిన నిశేష్... వరుస విజయాలతో సత్తా చాటి సీజన్ ముగిసేసరికి ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 138వ స్థానానికి చేరాడు. చాలెంజర్ టూర్ టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన నిశేష్ ఈ మధ్యకాలంలో 6 టోర్నీల్లో ఫైనల్‌కు చేరి రెండింట టైటిల్ చేజిక్కించుకున్నాడు. దీంతో అతడికి ఆస్ట్రేలియా ఓపెన్‌లో బరిలోకి దిగే అవకాశం దక్కింది. ఆదివారం నుంచి మెల్‌బోర్న్ వేదికగా ప్రారంభం కానున్న గ్రాండ్‌స్లామ్ టోర్నీలో నిశేష్ బరిలోకి దిగనున్నాడు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో డాటా సైన్సెస్ అభ్యసించిన నిశేష్ కుటుంబం నెల్లూరు నుంచి అమెరికాకు వెళ్లి స్థిరపడింది. నెల్లూరుకు చెందిన నిశేష్ తండ్రి మురళీ రెడ్డి టెక్ పరిశ్రమలో పని చేస్తుండగా... సోదరుడు నిశాంత్ రెడ్డి ఐటీ కంపెనీలో ఉద్యోగి. తల్లి సాయి ప్రసన్న గృహిణి. చిన్నప్పుడు చాలా సార్లు భారత్‌కు వచ్చి వెళ్లిన నిశేష్‌కు హైదరాబాద్, నెల్లూరులో బంధువులు ఉన్నారు. చుట్టాలు, స్నేహితుల వల్ల తెలుగుపై అవగాహన పెంచుకున్న నిశేష్ స్పష్టంగా మాట్లాడలేకపోయినా సినిమాలు మాత్రం బాగా చూస్తాడు. సబ్ టైటిల్స్ లేకుండా భాషను అర్థం చేసుకుంటాడు. ఒలింపిక్ పతక విజేత రాజీవ్ రామ్ వద్ద శిక్షణ పొందుతున్న నిశేష్... భవిష్యత్తుపై భరోసా పెంచుతున్నాడు. '17 ఏళ్ల వయసులోనే పట్టభద్రుడిగా మారాను. చాలా అంశాలపై ఆసక్తి ఉంది. అందుకే వాటిలో మరింత మెరుగవ్వాలని నిర్ణయించుకున్నా. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా దృఢంగా అయ్యేందుకు ప్రయత్నిస్తున్నా. చిన్నప్పుడు తరచూ గాయపడే వాడిని. పాఠశాల విద్య పూర్తవగానే ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్‌గా మారాలని అనుకోలేదు. కానీ అలా జరిగిపోయిందంతే. చిన్నప్పటి నుంచి టెన్నిస్ అంటే విపరీతమైన ఇష్టం. టీవీలో ఎప్పుడూ టెన్నిస్ చానల్ చూస్తూ ఉండేవాడిని. కామెంటేటర్‌లు చెప్పే మాటలు వింటూ ప్లేయర్ల లాగా షాట్లు ఆడేందుకు ప్రయత్నించేవాడిని. దేన్నైనా నిశితంగా పరిశీలించడం నాకు అలవాటు. దీనివల్లే ప్రత్యర్థి ఆటగాళ్ల తప్పులను గమనించి అందుకు తగ్గట్లు వ్యూహాలు రచించుకోవడం నేర్చుకున్నా. ఇది అంత సులువుగా సాధ్యం కాలేదు. నిరంతర సాధన వల్ల వచ్చింది' అని తాజా ర్యాంకింగ్స్‌లో 133వ ర్యాంక్‌లో ఉన్న నిశేష్ అన్నాడు.

-సాక్షి క్రీడా విభాగం



తల్లిదండ్రులు మురళీ రెడ్డి, సాయిప్రసన్న, సోదరుడు నిశాంత్‌లతో...



ఆక్లాండ్ ఓపెన్‌లో శుభారంభం

ఈ ఏడాది ఆడుతున్న రెండో ఏటీపీ-250 టోర్నీలో నిశేష్ బసవరెడ్డి శుభారంభం చేశాడు. న్యూజిలాండ్‌లో జరుగుతున్న ఆక్లాండ్ ఓపెన్ టోర్నీలో నిశేష్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. క్వాలిఫయింగ్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో క్వాలిఫయర్‌గా అడుగు పెట్టిన నిశేష్ తొలి రౌండ్‌లో 6-2, 6-2తో ప్రపంచ 85వ ర్యాంకర్ ఫ్రాన్సిస్కో కమ్సానా (అర్జెంటీనా)పై గెలుపొందాడు. 69 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిశేష్ ఆరు ఏస్‌లు సంధించాడు. ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయని నిశేష్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. గత వారం బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలోనూ క్వాలిఫయర్‌గా మెయిన్ 'డ్రా'లో ఆడిన నిశేష్ తొలి రౌండ్‌లో ఫ్రాన్స్ సీనియర్ స్టార్ ప్లేయర్ గేల్ మోన్‌ఫిల్స్ చేతిలో మూడు సెట్‌లపాటు పోరాడి ఓడిపోయాడు.

అథ్లెట్‌కే అథ్లెటిక్స్ సమాఖ్య పగ్గాలు

ఏఎఫ్ఐ కొత్త అధ్యక్షుడిగా 'డబుల్ ఒలింపియన్' బహదూర్ సింగ్



చండీగఢ్: భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) కొత్త కార్యవర్గం కొలువుదీరింది. 2002 బుసాన్ ఆసియా క్రీడల్లో షాట్‌పుట్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించిన బహదూర్ సింగ్ సాగూ ఏఎఫ్ఐ కొత్త అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2012 నుంచి ఏఎఫ్ఐ అధ్యక్షుడిగా ఉన్న 67 ఏళ్ల అదిలె సుమరివల్లా స్థానాన్ని బహదూర్ భర్తీ చేస్తారు. ఫలితంగా మరోసారి జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య పగ్గాలు మాజీ అథ్లెట్‌కే దక్కాయి. ఇప్పటికే మూడు పర్యాయాలు అధ్యక్షుడిగా వ్యవహరించిన సుమరివల్లా జాతీయ క్రీడా నియమావళి ప్రకారం మరోసారి పోటీపడే అవకాశం లేకపోవడంతో కొత్త అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. అదిలె సుమరివల్లా 1979 ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 4-100 మీటర్ల రిలేలో కాంస్య పతకం గెలిచారు. 1980 మాస్కో ఒలింపిక్స్‌లో 100 మీటర్ల విభాగంలో పోటీపడ్డారు. కొత్తగా ఎన్నికైన 51 ఏళ్ల బహదూర్ సింగ్ నాలుగేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. పంజాబ్‌లోని జలంధర్ పట్టణానికి చెందిన బహదూర్ సింగ్ ప్రస్తుతం పఠాన్‌కోట్‌లో ఇండియా రిజర్వ్ బెటాలియన్‌లో కమాండెంట్‌గా పని చేస్తున్నారు. 2000 సిడ్నీ ఒలింపిక్స్, 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన బహదూర్ సింగ్‌కు 2006లో దేశ నాలుగో అత్యుత్తమ పౌర పురస్కారం 'పద్మశ్రీ' కూడా లభించింది. 'డబుల్ ఒలింపియన్' మాజీ లాంగ్‌జంపర్ అంజూ బాబీ జార్జి మరోసారి సీనియర్ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయింది. ఏఎఫ్ఐ కొత్త కార్యవర్గానికి తెలంగాణకు చెందిన బీఈ స్టాన్లీ జోన్స్ కోశాధికారిగా, ఢిల్లీకి చెందిన సందీప్ మెహతా కార్యదర్శిగా వ్యవహరిస్తారు. తెలంగాణకే చెందిన కె.సారంగపాణి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

ఏఎఫ్ఐ కొత్త కార్యవర్గం: బహదూర్ సింగ్ సాగూ (అధ్యక్షుడు), అంజూ బాబీ జార్జి (సీనియర్ ఉపాధ్యక్షురాలు), అబూ మేథా, జయంత మల్లా బారువా, ఏకే శర్మ (ఉపాధ్యక్షులు), సందీప్ మెహతా (కార్యదర్శి), స్టాన్లీ జోన్స్ (కోశాధికారి), ఎస్.శ్రీనిబాస్ పట్నాయక్ (సీనియర్ సంయుక్త కార్యదర్శి), శరత్ చంద్ర సింగ్, జ్యోతిర్మయి సిక్దర్, ఫిన్లే పరియట్ (సంయుక్త కార్యదర్శులు), సుధా సింగ్, హర్జిందర్ సింగ్ గిల్, శారదా దేవి జడం, ప్రియాంక భానోత్, రచిత మిస్త్రీ, ఎ.రాజవేలు, కె.సారంగపాణి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు).

కళింగ లాన్సర్స్ చేతిలో బెంగాల్ టైగర్స్ చిత్తు



రూర్కెలా: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో కళింగ లాన్సర్స్ భారీ విజయాన్ని అందుకుంది. లాన్సర్స్ 6-0 గోల్స్‌తో బెంగాల్ టైగర్స్‌ను చిత్తుగా ఓడించింది. ఇందులో 4 ఫీల్డ్ గోల్స్ కాగా... 2 గోల్స్ పెనాల్టీ కార్నర్‌ల ద్వారా వచ్చాయి. లాన్సర్స్ తరఫున థియరీ (3వ నిమిషం, 47వ నిమిషం), సంజయ్ (4వ నిమిషం), హెన్‌డ్రిక్ (6వ నిమిషం), బందూరస్ (29వ నిమిషం), బాబీ సింగ్ ధామీ (49వ నిమిషం) గోల్స్ సాధించారు. తొలి క్వార్టర్స్‌లో 3 గోల్స్‌తో ముందంజ వేసిన లాన్సర్స్‌ను తర్వాతి రెండు క్వార్టర్‌లలో కొంత వరకు నిలువరించడంలో టైగర్స్ సఫలమైంది. అయితే చివరి క్వార్టర్‌లో కూడా మరో రెండు గోల్స్‌తో కళింగ తమ ఆధిక్యాన్ని పెంచుకుంది. నేడు జరిగే మ్యాచ్‌లలో తమిళనాడు డ్రాగన్స్‌తో గోనాసిక వైజాగ్...యూపీ రుద్రాస్‌తో హైదరాబాద్ తూఫాన్స్ తలపడతాయి.

నేపాల్‌తో భారత్ తొలి పోరు

- మొదటి ఖోఖో ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల
- పురుషుల, మహిళల విభాగంలో మొత్తం 39 జట్లు పోటీ
- ఈ నెల 13 నుంచి 19 వరకు ఢిల్లీ వేదికగా టోర్నమెంట్



న్యూఢిల్లీ: భారత్ వేదికగా జరగనున్న తొలి ఖోఖో ప్రపంచకప్ షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 13 నుంచి 19 వరకు న్యూఢిల్లీ వేదికగా జరగనున్న వరల్డ్‌కప్ తొలి పోరులో సోమవారం నేపాల్‌తో భారత్ తలపడుతుంది. ఈ మేరకు అఖిల భారత ఖోఖో సమాఖ్య మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ప్రపంచకప్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. రెండు విభాగాల్లో కలిపి మొత్తం 39 జట్లు టోర్నీలో పాల్గొననున్నాయి. పురుషుల విభాగంలో 20 జట్లను 4 గ్రూప్‌లుగా విభజించారు. తొలి నాలుగు రోజులు లీగ్ మ్యాచ్‌లు జరగనుండగా... ఈ నెల 17 నుంచి ప్లే ఆఫ్స్ దశ ప్రారంభం కానుంది. 19న తుదిపోరు నిర్వహించనున్నారు. గ్రూప్ 'ఎ'లో నేపాల్, పెరూ, బ్రెజిల్, భూటాన్‌తో కలిసి భారత్ పోటీ పడుతోంది. మహిళల విభాగంలో 19 జట్లను 4 గ్రూప్‌లుగా విభజించారు. ఇరాన్, మలేసియా, దక్షిణ కొరియాతో కలిసి భారత మహిళల జట్టు గ్రూప్ 'ఎ' బరిలోకి దిగనుంది. మహిళల విభాగంలో ఈ నెల 14న దక్షిణ కొరియాతో భారత జట్టు తొలి మ్యాచ్ ఆడుతుంది. లీగ్ దశలో ఒక్కో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లతో పాటు నాలుగు గ్రూప్‌ల్లో కలిపి మూడో స్థానంలో నిలిచిన రెండు అత్యుత్తమ జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించనున్నాయి. అందులో గెలిచిన జట్లు సెమీస్‌కు చేరతాయి.



సింధు

భారత్ నుంచి 21 మంది బరిలోకి

- ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీకి భారీ బృందం
- వివాహం తర్వాత తొలి టోర్నీలో ఆడనున్న పీవీ సింధు
- అక్సెల్‌సన్, ఆన్ సె యంగ్‌లాంటి స్టార్ ఆటగాళ్ల రాక
- జనవరి 14 నుంచి మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: భారత్‌లో జరిగే అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఇండియా ఓపెన్ ఈసారి స్టార్ ఆటగాళ్లతో కళకళలాడనుంది. ఈనెల 14 నుంచి 19 వరకు జరిగే ఈ మెగా టోర్నీలో భారత్ నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 21 మంది క్రీడాకారులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గత నెలలో వివాహం చేసుకున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఈ టోర్నీతో కొత్త సీజన్‌ను ప్రారంభించనుంది. సింధు, లక్ష్యసేన్‌తోపాటు పారిస్ ఒలింపిక్ చాంపియన్స్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్), అన్ సె యంగ్ (దక్షిణ కొరియా), ప్రపంచ నంబర్‌వన్ షి యుకి (చైనా) వంటి అంతర్జాతీయ స్టార్లు ఇందులో భాగం కానున్నారు. భారత్ నుంచి పురుషుల సింగిల్స్‌లో ముగ్గురు, మహిళల సింగిల్స్‌లో నలుగురు, పురుషుల డబుల్స్‌లో రెండు జోడీలు, మహిళల డబుల్స్‌లో 8 జంటలు, మిక్స్‌డ్ డబుల్స్‌లో 4 జోడీలు టోర్నీలో ఆడనున్నాయి. 'ఈ టోర్నీలో చాలా మంది భారత షట్లర్లు పాల్గొంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత బ్యాడ్మింటన్ పురోభివృద్ధికి ఇది సంకేతం. ఈ ఏడాది పురుషుల సింగిల్స్‌లో టాప్-20 నుంచి 18 మంది, మహిళల సింగిల్స్‌లో టాప్-20 నుంచి 14 మంది ఈ టోర్నీలో ఆడనున్నారు. ఇప్పటికే పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న వారు కూడా మరిన్ని విజయాలు సాధిస్తారనే నమ్మకముంది' అని భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) కార్యదర్శి సంజయ్ మిశ్రా అన్నారు.

భారత ఆటగాళ్ల జాబితా

పురుషుల సింగిల్స్: లక్ష్యసేన్, హెచ్ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రజావత్.

మహిళల సింగిల్స్: పీవీ సింధు, మాళవిక బన్సోద్, అనుపమ ఉపాధ్యాయ్, ఆకర్షి కశ్యప్.

పురుషుల డబుల్స్: సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, సాయి ప్రతీక్-పృథ్వీరాయ్.

మహిళల డబుల్స్: పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో, రుతుపర్ణ-శ్వేత పర్ణ, మానస రావత్-గాయత్రి రావత్, అశ్విని భట్-శిఖా గౌతమ్, సాక్షి-అపూర్వ, సానియా సికందర్-రష్మీ గణేశ్, మృణ్మయి దేశ్‌పాండే-ప్రేరణ అల్వేకర్.

మిక్స్‌డ్ డబుల్స్: ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో, సతీశ్ కుమార్-ఆద్య వరియత్, రోహన్ కపూర్-రుత్విక శివాని, అశిత్ సూర్య-అమృత.

'ఇప్పటికీ ఆ బాధ వెంటాడుతోంది'

ఆస్ట్రేలియా నుంచి వెనక్కి పంపడంపై జొకోవిచ్



మెల్‌బోర్న్: మూడేళ్ల క్రితం 2022 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడేందుకు టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఆసీస్ గడ్డపై అడుగు పెట్టాడు. అయితే ఆ సమయంలో అమల్లో ఉన్న కోవిడ్ ఆంక్షల కారణంగా వ్యాక్సిన్ వేసుకున్న వారినే దేశంలోకి అనుమతించారు. వ్యాక్సిన్ వేసుకోని కారణంగా జొకోవిచ్‌ను విమానాశ్రయంలోనే నిలిపివేశారు. ఆ తర్వాత అతను కోర్టును ఆశ్రయించడం, ఇతర పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. చివరకు టోర్నీలో ఆడకుండానే జొకోవిచ్‌ను ఆస్ట్రేలియా దేశం నుంచి అధికారులు పంపించి వేశారు. నాటి ఘటన తనను ఇప్పటికీ వెంటాడుతోందని, ఆస్ట్రేలియాకు ఎప్పుడు వచ్చినా దానిని మర్చిపోలేకపోతున్నానని జొకోవిచ్ వ్యాఖ్యానించాడు. తన 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచే లక్ష్యంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడేందుకు అతను ఇప్పుడు మళ్లీ వచ్చాడు. 'నాటి ఘటన నాపై తీవ్ర ప్రభావం చూపించింది. ఇప్పుడే కాదు గత రెండేళ్లుగా ఎప్పుడు ఆస్ట్రేలియాకు వచ్చినా అదే బాధ నన్ను వెంటాడుతూనే ఉంది. పాస్‌పోర్ట్, ఇమిగ్రేషన్ విభాగం నుంచి వద్ద తనిఖీలు జరుగుతుంటే నావైపు ఎవరైనా వస్తున్నారేమో అనిపిస్తూ ఉంటుంది. పాస్‌పోర్ట్‌ను చెకింగ్ చేస్తుంటే కూడా నన్ను రానిస్తారా, అదుపులోకి తీసుకుంటారా, వెనక్కి పంపిస్తారా అనే సందేహాలు వస్తుంటాయి' అని జొకోవిచ్ అన్నాడు. అయితే నిజాయితీగా చెప్పాలంటే నాటి సంఘటనకు సంబంధించి తనకు ఎవరి మీదా కోపంగానీ, ప్రతీకార భావనగానీ లేదని అతను స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 10 సార్లు విజేతగా నిలిచిన జొకోవిచ్... గత ఏడాది సెమీఫైనల్లో పరాజయం పాలయ్యాడు. అయితే రిటైరయ్యే లోగా ఇక్కడ కనీసం మరో టైటిల్ సాధించాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. బ్రిటన్ మాజీ ఆటగాడు ఆండీ ముర్రేను కోచ్‌గా ఎంచుకున్న తర్వాత జొకోవిచ్ ఆడనున్న తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఇదే కానుంది. ఈనెల 12న ప్రారంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ కోసం జొకోవిచ్ మంగళవారం నుంచి ప్రాక్టీస్ మొదలుపెట్టాడు.

భాగస్వామి కోర్డెకు ఒసాకా గుడ్‌బై



మెల్‌బోర్న్: జపాన్ టెన్నిస్ స్టార్ నయోమి ఒసాకా తన భాగస్వామి కోర్డె అమరి బ్రూక్స్‌తో విడిపోతున్నట్లు ప్రకటించింది. నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ఒసాకా సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్‌కు ముందు తన నిర్ణయాన్ని వెల్లడించింది. 'ఇకపై అతడితో సంబంధం లేదు. ముగిసినట్లే' అని ఒసాకా సామాజిక మాధ్యమాల వేదికగా స్పష్టం చేసింది. ర్యాపర్‌గా గుర్తింపు తెచ్చుకున్న కోర్డెతో కలిసి ఒసాకా 2023లో ఓ పాపకు జన్మనిచ్చింది. 'పరస్పర అవగాహనతోనే ఈ నిర్ణయం తీసుకున్నా. అతడిపై విమర్శలు చేసేందుకు కూడా లేదు. కోర్డె గొప్ప వ్యక్తి. అంతకుమించి అద్భుతమైన తండ్రి. వేర్వేరు దారుల్లో ప్రయాణించాలని నిర్ణయించుకున్నాం. ఈ క్రమంలో ఎన్నో నేర్చుకున్నా. నా కుమార్తె అతిపెద్ద ఆశీర్వాదం' అని ఒసాకా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

సహజ శుభారంభం



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల డబ్ల్యూ75 టోర్నమెంట్‌లో తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లి శుభారంభం చేసింది. థాయ్‌లాండ్‌లోని నొంతాబురి పట్టణంలో ఈ టోర్నీ జరుగుతోంది. మంగళవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో సహజ 6-3, 7-5తో పునిన్ కొవాపిటుక్‌టెడ్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించింది. 1 గంటా 50 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఏడు ఏస్‌లు సంధించింది. రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 76 పాయింట్లు గెలిచింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. డబుల్స్ విభాగంలో సహజ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. సహజ (భారత్)-దరియా అస్తకోవా (రష్యా) ద్వయం 3-6, 3-6తో నయామా కరామోకు (స్విట్జర్లాండ్)-ఇనెస్ ఇబు (అల్జీరియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' రేసులో బుమ్రా



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 2024 డిసెంబర్ నెలకుగాను భారత మేటి పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు నామినేట్ అయ్యాడు. ఆస్ట్రేలియాతో డిసెంబర్‌లో జరిగిన మూడు టెస్టుల్లో బుమ్రా 22 వికెట్లు పడగొట్టాడు. ఓవరాల్‌గా ఈ సిరీస్‌లో బుమ్రా ఐదు టెస్టులు ఆడి 32 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు గెల్చుకున్నాడు. బుమ్రాతోపాటు ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్, దక్షిణాఫ్రికా బౌలర్ డేన్ ప్యాటర్సన్ ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' పురస్కారం కోసం రేసులో ఉన్నారు. బుమ్రా గతంలో ఈ అవార్డును ఒకసారి గెల్చుకున్నాడు. 2024 జూన్ నెలలో బుమ్రాకు ఈ పురస్కారం లభించింది.



సౌదీ అరేబియాలో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. మక్కా నగరంలో రోడ్లపైకి భారీగా వరద చేరింది. వరద నీటిలోనే ముందుకు సాగుతున్న కార్ల దృశ్యమిది.



ఇంగ్లండ్‌లో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. దీంతో బారో అపాన్ సోర్ ప్రాంతంలో కార్లు, కారవాన్ వాహనాల చుట్టూ ఇలా వరద చేరింది



తీవ్ర తుపాను ప్రభావంతో మంగళవారం జర్మనీలోని ఉత్తర సముద్రం తీరాన ఉన్న డగెబుల్‌లోని పోర్టులోకి ఇలా వరద చేరింది.

కెనడా ప్రధాని బరిలో అనితా ఆనంద్

ఒట్టావా: జస్టిన్ ట్రూడో రాజీనామా ప్రకటన నేపథ్యంలో.. కెనడా ప్రధాని ఎవరనేది ఆసక్తి కరంగా మారింది. పదవికి భారత సంతతికి చెందిన అనితా ఆనంద్ పోటీ పడుతున్నారు. ప్రస్తుతం రవాణా శాఖ మంత్రిగా ఉన్న అనిత తోపాటు మాజీ డిప్యూటీ పీఎం క్రిస్టియా ఫ్రీలాండ్, బ్యాంక్ ఆఫ్ కెనడా మాజీ గవర్నర్ మార్క్ కార్నీ మరికొందరు పోటీలో ఉన్నారు. తదుపరి ప్రధానిని ఎన్నుకునే వరకు పదవిలో కొనసాగుతానని ట్రూడో సోమవారం తన ప్రకటనలో పేర్కొన్న విషయం తెలిసిందే. కొత్త నాయకుడిని ఎన్నుకునేందుకు మార్చి 24 వరకు సమయం ఉన్న నేపథ్యంలో పోటీలో ఉన్న నాయకులను ఓసారి చూద్దాం.

పోటీలో ఉన్న ఇతరులు..

2021 నుంచి విదేశాంగ మంత్రిగా పనిచేస్తున్న మెలానియా జోలీకూడా పోటీలో ఉన్నారు. అంతకుముందు మరో మూడు కేబినెట్ పదవులను నిర్వహించారు. ఆక్స్‌ఫర్డ్‌లో చదివిన 45 ఏళ్ల జోలీని రాజకీయాల్లోకి ప్రోత్సహించింది ట్రూడోనేనని చెబుతారు. పోటీ ప్రచారంలో ఉన్న మరో అభ్యర్థి క్రిస్టియా ఫ్రీలాండ్. ట్రూడో సహాయకురాలిగా, ఆయన కేబినెట్‌లో అత్యంత శక్తివంతమైన మంత్రుల్లో ఒకరిగా పేరొందారు. జర్నలిస్ట్ అయిన ఫ్రీలాండ్ 2013లో హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రవేశించారు. రెండేళ్ల తర్వాత ట్రూడో కేబినెట్‌లో చేరారు. పోటీ పడేవారిలో మార్క్ కార్నీ పేరు కూడా వినబడుతోంది. బ్యాంక్ ఆఫ్ కెనడా మాజీ గవర్నర్ అయిన కార్నీ.. ఇటీవలి నెలల్లో ట్రూడోకు ప్రత్యేక సలహాదారుగా పనిచేశారు. హార్వర్డ్ గ్రాడ్యుయేట్ అయిన 59 ఏళ్ల కార్నీ ఇంతకుముందెన్నడూ ప్రభుత్వ పదవుల్లో పనిచేయలేదు. కానీ ఆయనకు బలమైన ఆర్థిక నేపథ్యం ఉంది. ఇన్నోవేషన్, సైన్స్ అండ్ ఇండస్ట్రీ మంత్రి ఫ్రాంకోయిస్ ఫిలిప్ షాంపైన్ కూడా పోటీలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. 2015లో మొదటిసారి ఎంపీగా ఎన్నికైన షాంపైన్ అనేక కేబినెట్ బాధ్యతలను నిర్వహించారు. రాజకీయాల్లోకి రాకముందు స్వీడిష్-స్విస్ బహుళ జాతి ఆటోమేషన్ కంపెనీ ఏబీబీ గ్రూప్‌లో షాంపైన్ సీనియర్ పాత్ర పోషించారు.

కొత్త ప్రధాని ఎన్నిక...

కొత్త నాయకుడిని ఎన్నుకునే ప్రక్రియను ప్రారంభించాలని తాను పార్టీని కోరినట్లు ట్రూడో తెలిపారు. లిబరల్ అధ్యక్షుడు సచిత్ మెహ్రా ఈ వారంలో పార్టీ జాతీయ బోర్డు సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పారు. అమెరికా తరహాలోనే కెనడాలో ప్రత్యేక నాయకత్వ సమావేశాల ద్వారా నాయకుడిని ఎన్నుకుంటారు. ఇది నిర్వహించడానికి నెలలు పడుతుంది. ట్రూడో ఇంకా బాధ్యతలు నిర్వర్తిస్తున్నందున వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి పార్టీకి చాలా సమయం పట్టవచ్చు. 2013 ఏప్రిల్‌లో లిబరల్ నాయకుడిగా ట్రూడోని ఎన్నుకున్నప్పుడు పోటీ సరిగ్గా ఐదు నెలలు కొనసాగింది. 2006లో దాదాపు ఎనిమిది నెలల పాటు కొనసాగింది. అయితే ట్రూడో నాయకత్వంపై పెరిగిన వ్యతిరేకత కారణంగా లిబరల్ పార్టీ వీలైనంత త్వరగా ట్రూడో స్థానాన్ని భర్తీ చేసేలా సంక్షిప్త పోటీని ప్రకటించి కొత్త నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంది. ఈ ఎన్నిక లిబరల్ పార్టీ భవిష్యత్తునే కాకుండా కెనడా రాజకీయ దిశను కూడా నిర్ణయిస్తుంది.

ముందస్తు ఎన్నికలు జరిగేనా?

అయితే నాయకుడు ఎవరయినా లిబరల్స్ ఎన్నికల్లో ఓడిపోతారని సర్వేలు బలంగా చెబుతున్నాయి. అందుకే జనవరి 27 తర్వాత జరిగే పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టాలని తొలుత విపక్షాలు భావించాయి. జనవరి 27న తిరిగి ప్రారంభం కావాల్సిన పార్లమెంటును మార్చి 24 వరకు వాయిదా వేస్తున్నట్టు ట్రూడో ప్రకటించారు. సెషన్ ఎజెండా ప్రభుత్వ నియంత్రణలో ఉండటంతో పార్లమెంటు సమావేశాలకోసం ప్రతిపక్షాలు వేచి చూడక తప్పదు. సమావేశాల్లో అవిశ్వాస తీర్మానం పెట్టి ప్రతిపక్షాలన్నీ కలిసి ఓటు వేస్తే లిబరల్స్‌ను ఓడించే అవకాశం ఉంటుంది. అలాగైనా మే లోపు కొత్త ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఎలాగోలా జూన్ 20 వరకు లిబరల్స్ అధికారంలో ఉంటే అక్టోబర్ నెలాఖరులో షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరుగుతాయి.



తమిళ మూలాలు...

భారత సంతతికి చెందిన అనితా ఆనంద్ ఐదేళ్లుగా మంత్రి పదవిలో ఉన్నారు. రవాణా శాఖతో పాటు పబ్లిక్ సర్వీసెస్, ప్రొక్యూర్మెంట్ సహా పలు శాఖలను నిర్వహించారు. అనిత తండ్రి తమిళుడు. తల్లి పంజాబీ. 57 ఏళ్ల అనిత.. ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకున్నారు. 2019లో ఓక్‌విల్లే నుంచి ఎంపీగా గెలుపొందిన ఆమె ట్రూడో కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. 2019 నవంబర్ నుంచి 2021 అక్టోబర్ వరకు పబ్లిక్ సర్వీసెస్ అండ్ ప్రొక్యూర్మెంట్ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత 2021 అక్టోబర్ నుంచి 2023 జూలై వరకు రక్షణ మంత్రిత్వ శాఖకు సారథ్యం వహించారు. రక్షణ మంత్రిగా, రష్యాతో యుద్ధం మధ్య ఉక్రెయిన్‌కు సహాయం అందించడానికి కెనడా చేసిన ప్రయత్నాలకు ఆనంద్ నాయకత్వం వహించారు. అయితే 2024 డిసెంబర్ వరకు ట్రెజరీ బోర్డును పర్యవేక్షించడానికి ఆమెను రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి తప్పించారు. గత నెలలో జరిగిన మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ సందర్భంగా ఆమెను మళ్లీ రవాణా, అంతర్గత వాణిజ్య శాఖ మంత్రిగా మార్చారు.

అధికార నివాసం రద్దు చేశారు: ఆతిశీ

న్యూఢిల్లీ: తనకు కేటాయించిన అధికార నివాసాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రద్దు చేసిందని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత ఆతిశీ ఆరోపించారు. ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడారు. తన పంట్ల కేంద్రం వైఖరి ఎలా ఉన్నప్పటికీ ఢిల్లీ ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటానని స్పష్టంచేశారు. అధికార నివాసం అనేది తనకు పెద్ద విషయం కాదన్నారు. అవసరమైతే వీధుల్లో కూర్చొని మరీ సీఎంగా విధులు నిర్వర్తిస్తానని స్పష్టంచేశారు. తన హక్కును కేంద్రం నిరాకరించిందని తప్పుపట్టారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెట్టించిన ఉత్సాహంతో ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తానని ఆతిశీ వెల్లడించారు. మహిళలకు నెలకు రూ.2,100 చొప్పున అందజేస్తానని చెప్పారు. వృద్ధులకు ఉచితంగా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తానని వివరించారు. అయితే, అధికార నివాసం విషయంలో సీఎం ఆతిశీ అబద్ధాలు చెబుతున్నారని బీజేపీ నేత అమిత్ మాలవీయ విమర్శించారు. నిర్దేశిత గడువులోగా ఆ ఇంట్లో(శీష్ మహల్) ఆమె చేరలేదని, అంతేకాకుండా ఆ ఖరీదైన భవనంపై సీబీఐ/ఈడీ విచాణ జరుగుతోంది, అందుకే ప్రభుత్వం వెనక్కి తీసుకుందని తెలిపారు. నిబంధనల ప్రకారమే కేంద్రం వ్యవహరించిందని చెప్పారు.

సల్మాన్ నివాసం బాల్కనీకి బుల్లెట్ ప్రూఫ్

ముంబై: ముంబైలోని బాంద్రాలో ఉన్న బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం గాలక్సీ అపార్టుమెంట్ వద్ద అధికారులు మరిన్ని భద్రతా చర్యలు చేపట్టారు. నివాస భవనం బాల్కనీకి రక్షణగా బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్‌ను, బయటి రోడ్డుపై ఓ కన్నేసి ఉంచేందుకు హై-టెక్ సీసీటీవీ కెమెరాను అమర్చామని మంగళవారం పోలీసు అధికారి ఒకరు తెలిపారు. భవనం వెలుపల ఎలాంటి అనుమానాస్పద కదలికలున్నా గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. దాని చుట్టూ రేజర్ వైర్ ఫెన్సింగ్ కూడా ఉందన్నారు. అదే విధంగా, సల్మాన్ మెట్లు దిగి బాల్కనీలోకి వచ్చి వెలుపల వేచి ఉన్న అభిమానులకు అభివాదం చేసే సమయంలో రక్షణ కోసం బుల్లెట్ ప్రూఫ్ అద్దాలను ఏర్పాటు చేశామన్నారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ఇద్దరు ఆగంతకులు గతేడాది ఏప్రిల్‌లో బైక్‌పై వచ్చి గ్యాలక్సీ అపార్టుమెంట్ వెలుపల కాల్పులు జరపడం తెలిసిందే.

క్లాస్‌మేట్‌పై జూనియర్ డాక్టర్ అత్యాచారం

గ్వాలియర్: ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలోని ఉపయోగంలో లేని హాస్టల్‌లో ఓ జూనియర్ డాక్టర్(25) తోటి వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ నగరంలోని గజరాజా మెడికల్ కాలేజీలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుడు, బాధితురాలు వేర్వేరు హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. ఆదివారం నిందితుడు కాలేజీ ఆవరణలోనే ఉన్న ఉపయోగంలో లేని బాయ్స్ హాస్టల్‌లోకి రావాలని బాధితురాల్ని కోరాడు. అంగీకరించి అక్కడికి వెళ్లిన ఆమెను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఘటనపై బాధితురాలు కాంపు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, నిందితుడిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు నగర ఎస్పీ అశోక్ జడొన్ చెప్పారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

బ్రిక్స్ సభ్య దేశంగా ఇండోనేషియా

బ్రెజిల్: అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల కూటమి బ్రిక్స్‌లో ఇండోనేషియా పూర్తి సభ్యదేశంగా మారింది. ఈ మేరకు బ్రెజిల్ సోమవారం ప్రకటించింది. ఆగ్నేయాసియాలో అత్యధిక జనాభా కలిగిన దేశం.. ప్రపంచ పాలనా సంస్థలను సంస్కరించడానికి, గ్లోబల్ సౌత్‌లో సహకారానికి ఇతర సభ్యులతో పంచుకుంటుందని బ్రెజిల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 2023లో జోహాన్నెస్ బర్గ్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ఈ కూటమిలో చేరేందుకు ఇండోనేషియాకు ఆమోదం లభించిందని వెల్లడించింది.

15న కొత్త భవనంలోకి కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం త్వరలోనే మరో చోటుకు తరలనుంది. ప్రస్తుతం 24, అక్బర్ రోడ్డులో ఉన్న ఈ కార్యాలయం వచ్చే 15వ తేదీన 9ఏ, కోట్లా మార్గ్‌లోకి మారనుంది. కొత్త భవనానికి ఇందిరా గాంధీ భవన్‌గా పేరు పెట్టారు. ఈ కార్యాలయాన్ని పార్టీ మాజీ చీఫ్ సోనియాగాంధీ ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి పార్టీ చీఫ్ ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు హాజరుకానున్నారు. అయితే, ప్రస్తుత కార్యాలయాన్ని పూర్తిగా మూసివేయరని, కొన్ని విభాగాలు ఇక్కడి నుంచీ పనిచేస్తాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అక్బర్ రోడ్డులోని ప్రస్తుత కార్యాలయం ఇందిరా గాంధీ 1978లో కాంగ్రెస్(ఐ)ని ఏర్పాటు చేసినప్పటి నుంచి కొనసాగుతోంది. కొత్త భవనంలోకి కాంగ్రెస్ అనుబంధ మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐలను తరలిస్తారని భావిస్తున్నారు. కాంగ్రెస్ చీఫ్‌గా సోనియ గాంధీ పనిచేసిన సమయంలో ఈ భవన నిర్మాణం ప్రారంభమైంది.

యూన్‌కు మళ్లీ వారెంట్లు

- అభిశంసనకు గురైన దక్షిణకొరియా అధ్యక్షుడిని అదుపులోకి తీసుకునేందుకు తాజాగా ప్రయత్నాలు
- అంత తేలిక కాదంటున్న పరిశీలకులు

సియోల్: అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అరెస్టుకు అవినీతి నిరోధక విభాగం కోర్టు తాజాగా సమన్లు జారీ చేసింది. డిసెంబర్ 3న దేశంలో ఆయన మార్షల్ లా ప్రకటించడం, ఆరు గంటల అనంతరం పార్లమెంట్ ఆ ఆదేశాలను రద్దు చేయడం తదనంతర పరిణామాల్లో డిసెంబర్ 14న ఆయన్ను అభిశంసించడం తెలిసిందే. ఇందుకు సంబంధించి యూన్‌ను అరెస్ట్ చేయాలని, ఆయన నివాసంతోపాటు కార్యాలయంలో సోదాలు చేపట్టాలని అవినీతి నిరోధక విభాగం వారెంట్ జారీ చేసింది. మంగళవారం యూన్‌ను నిర్బంధంలోకి తీసుకునేందుకు ప్రయత్నించిన పోలీసులను అధ్యక్షుడి సొంత భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. దాదాపు ఐదు గంటల పాటు ప్రయత్నించిన దాదాపు 150 మంది పోలీసులు చేసేదిలేక వెనుదిరిగారు. సమన్ల కాల పరిమితి సోమవారంతో ముగియడంతో మంగళవారం కోర్టు తాజాగా సమన్లు పంపింది. అరెస్ట్ వారెంట్ల వ్యాలిడిటీ సాధారణంగా 7 నుంచి 10 రోజుల వరకు ఉంటుంది. మంగళవారం ఇచ్చిన సమన్ల కాల పరిమితి ఎంతనేది అవినీతి నిరోధక విభాగం తెలపలేదు. ఈదఫా యూన్‌ను ఎలాగైనా నిర్బంధంలోకి తీసుకునేందుకు మార్గాలను అన్వేషిస్తోంది. అయితే, అధికార నివాసంలో ఉన్నంతకాలం యూన్‌ను అరెస్ట్ చేయడం అంత తేలికైన వ్యవహారం కాదని చెబుతున్నారు. ఎలాగోలా నిర్బంధం లోకి తీసుకున్నా, అధికారికంగా అరెస్ట్ చేయాలంటే కోర్టు అనుమతి తప్పనిసరి. లేకుంటే 48 గంటల్లోగా ఆయన్ను విడుదల చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే అధ్యక్షుని నివాసానికి దారితీసే గుట్టతోపాటు, భవన సముదాయం చుట్టూ భద్రతా సిబ్బంది ఎత్తైన ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. అధికార రహస్యాల చట్టం ప్రకారం అధ్యక్షుడి అనుమతి లేకుండా ఆ సముదాయంలోకి ప్రవేశించడం నిషేధం. మార్షల్ లా విధింపునకు సంబంధించిన ఆరోపణలపై అవినీతి నిరోధక విభాగం దర్యాప్తు చేయడమేంటని యూన్ మద్దతుదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విభాగం చేపట్టే విచారణకు ఎలాంటి చట్టబద్ధత లేదని వాదిస్తున్నారు.

ఆశారాంకు మధ్యంతర బెయిల్

న్యూఢిల్లీ: 2013లో అత్యాచారం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న ఆశారాంకు సుప్రీంకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్య కారణాల వల్ల మార్చి 31 వరకు మూడు నెలలపాటు బెయిలు ఇస్తూ న్యాయమూర్తులు ఎంఎం సుందరేష్, రాజేష్ బిందాల్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 86 ఏళ్ల ఆశారాం గుండె సంబంధిత వ్యాధితో పాటు వివిధ వయసుల సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని సుప్రీంకోర్టు తెలిపింది. విడుదల తర్వాత తన అనుచరులను కలవవద్దని ఆదేశించింది. 2023లో గాంధీనగర్ కోర్టు తనకు విధించిన జీవిత ఖైదును నిలిపివేయాలని ఆశారాం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గుజరాత్ ప్రభుత్వ స్పందన కోరింది. వైద్యపరమైన కారణాల దృష్ట్యా మాత్రమే ఈ అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రస్తుతం ఆయనకు 85ఏళ్లు. 2013లో తన ఆశ్రమంలో నివసించే మహిళపై అత్యాచారం చేసినందుకు గాంధీనగర్ కోర్టు ఆశారాం బాపును దోషిగా నిర్ధారించింది. ఆశారామ్ బాపూ తనపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఓ 16 ఏళ్ల బాలిక ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ ఆశ్రమంలో తనపై ఈ దాష్టీకానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆశారామ్‌పై కేసు నమోదు చేశారు. ఘటన రాజస్థాన్‌లో జరిగినట్లు బాధితురాలు వెల్లడించడంతో కేసును అక్కడికి బదిలీ చేశారు. ఆశారాం బాపు ప్రస్తుతం రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్నాడు.

సమాచార కమిషన్లలో ఖాళీలు వెంటనే భర్తీ చేయండి

- నియామక ప్రక్రియను వేగవంతం చేయాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ), రాష్ట్ర సమాచార కమిషన్ల(ఎస్ఐసీ)లో పలు పోస్టులు ఖాళీగా ఉండడం పట్ల సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మంగళవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సీఐసీలో సమాచార కమిషనర్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొంది. సీఐసీ, ఎస్ఐసీల్లో ఖాళీలను భర్తీ చేయాలని సుప్రీంకోర్టు 2019లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, నియామకాల్లో జాప్యం చేస్తున్నాయని ఆరోపిస్తూ అంజలి భరద్వాజ్‌తోపాటు ఇతరులు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సమాచార హక్కు చట్టాన్ని ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని పిటిషనర్లు ఆక్షేపించారు. ఖాళీ అవుతున్న పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేసే లా ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. కీలకమైన పోస్టులు ఖాళీగా ఉంటే ఇక ఆయా సంస్థలు మనుగడలో ఉండి ఏం లాభమని ప్రశ్నించింది. ఖాళీలను త్వరగా భర్తీ చేసి, ప్రజలకు సేవలందించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. సమాచార కమిషన్లలో కేవలం ఒక కేటగిరీకి చెందిన వ్యక్తులను నియమిస్తున్నారని, ఇలాంటి విధానం సరైంది కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. కేవలం ప్రభుత్వ ఉన్నతాధికారులకే పెద్దపీట వేయకుండా అన్ని వర్గాల నిపుణులను సమాచార కమిషన్లలో నియమించాలని సూచించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. సమాచార కమిషన్లలో ఖాళీల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. తద్వారా సమాచార హక్కు చట్టం ఉద్దేశం నెరవేరడం లేదని అన్నారు. సంబంధిత కార్యదర్శులను పిలిపించి, వివరణ అడగాలని ధర్మాసనాన్ని కోరారు. ఇదిలా ఉండగా, పోస్టుల భర్తీపై స్టేటస్ రిపోర్టు సమర్పించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. సమాచార కమిషనర్లుగా వేర్వేరు రంగాలకు చెందిన నిపుణులను నియమించాలని స్పష్టంచేసింది.

స్వలింగ వివాహాల రివ్యూ పిటిషన్లపై రేపు సుప్రీంకోర్టు విచారణ

న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించేందుకు నిరాకరిస్తూ 2023 అక్టోబర్‌లో వెలువరించిన తీర్పును సమీక్షించాలంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈ నెల 9వ తేదీన విచారణ చేపట్టనుంది. ఇందుకు సంబంధించిన మొత్తం 13 పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం మధ్యాహ్నం 2 గంటల సమయంలో జడ్జీల ఛాంబర్‌లో విచారణ జరపనుంది. రివ్యూ పిటిషన్లపై విచారణ నుంచి తనను మినహాయించాలంటూ గతేడాది జూలైలో ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కోరిన అనంతరం ఈ ధర్మాసనం ఏర్పాటైంది. అదేవిధంగా, సమీక్ష పిటిషన్లపై ఓపెన్ కోర్టులో విచారణ జరపాలన్న వినతిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రివ్యూ పిటిషన్లపై విచారణను జడ్జీల చాంబర్‌లోనే చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది.





ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సతీసమేతంగా మంగళవారం కర్ణాటక రాష్ట్రం ధర్మశాలలో శ్రీ మంజునాథ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయ వాయిద్య బృందంతో ఆయన ఇలా మమేకమయ్యారు.

భారత్‌పోల్‌తో నేరగాళ్ల భరతం పట్టొచ్చు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ: కొత్తగా తీసుకువచ్చిన మూడు నేర చట్టాలు, భారత్‌పోల్ వంటి సాంకేతికపరమైన వనరులతో విదేశాల్లో దాగున్న నేరగాళ్లను అత్యంత సులువుగా దర్యాప్తు విభాగాలు తిరిగి తీసుకురాగలవని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. సీబీఐ అభివృద్ధి చేసిన కొత్త పోర్టల్ 'భారత్‌పోల్'ను మంత్రి మంగళవారం ప్రారంభించారు. దీని సాయంతో మన నిఘా విభాగాలు ఇంటర్‌పోల్ సంబంధిత అంశాలపై చురుగ్గా సమన్వయం చేసుకునే అవకాశం లభించనుందన్నారు. కొత్త నేర చట్టాల్లో మోదీ ప్రభుత్వం చేర్చిన 'ట్రయల్ ఇన్ ఆబ్సెన్షియా' నిబంధన వల్ల కోర్టు ఉత్తర్వులతో నేరగాడి పరోక్షంలోనూ నిష్పక్షపాతంగా న్యాయ ప్రక్రియను కొనసాగించవచ్చని అమిత్ షా వివరించారు. ఈ నిబంధనతో ఇక్కడ నేరాలకు పాల్పడి విదేశాల్లో దాక్కున్న నేరగాళ్లను తిరిగి తీసుకువచ్చే ప్రక్రియ సులభతరం అవుతుందని వెల్లడించారు. భారత్‌పోల్ ద్వారా కేంద్ర, రాష్ట్రాల నిఘా విభాగాలు ఉమ్మడి పోర్టల్ కిందికి వస్తాయన్నారు. ఇంటర్‌పోల్ జారీ చేసే అన్ని రకాల నోటీసులను క్రమబద్ధీకరించనున్నామన్నారు.

19 ఏళ్ల కిందటి హత్య కేసును ఛేదించిన ఏఐ

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్.. కేరళలో ఓ అసాధారణ కేసును ఛేదించింది. 19 ఏళ్ల కిందటి కేసులో నిందితులు దొరికేలా చేసింది. తల్లి, ఇద్దరు కవలలను చంపిన ఇద్దరు మాజీ సైనికులను పట్టించింది. 2006 ఫిబ్రవరి 10న కొల్లాంలోని అంచల్‌లో శాంతమ్మ అనే వ్యక్తి కూతురు రజని, ఆమె 17 రోజుల కవలలు రక్తపు మడుగులో పడి ఉన్నారు. తల్లి చెప్పిన వివరాల మేరకు నిందితులను దివిల్ కుమార్, రాజేశ్ అయి ఉంటారని పోలీసులు భావించారు. కానీ.. వారి ఆచూకీ లభించకపోవడంతో కేసు సద్దుమణిగింది. పందొమ్మిదేళ్ల తర్వాత జనవరి 4న పుదుచ్చేరిలో ఇంటీరియర్ డిజైనింగ్ పనులు చేస్తున్న ఇద్దరినీ సీబీఐ అరెస్టు చేసింది. పేర్లు మార్చుకుని విష్ణుగా ఉంటున్న దివిల్ కుమార్‌ను, ప్రవీణ్‌కుమార్‌గా చలామణీ అవుతున్న రాజేశ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానం, పాతకాలపు పట్టుదల మేళవింపు వీరిద్దరినీ కనిపెట్టడంలో వారికి సహాయపడింది. ఇంతకీ ఎలా పట్టుకున్నారంటే.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను డిజిటల్ విశ్లేషణ చేసే టెక్నికల్ ఇంటెలిజెన్స్ విభాగం నిందితులను గుర్తించడానికి కృత్రిమ మేధస్సును ఉపయోగించింది. 19 ఏళ్ల తర్వాత వారు ఎలా ఉంటారో చూడటానికి నిందితుల పాత ఫొటోలను ఉపయోగించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి హెయిర్ స్టైల్లో మార్పులు చేసి చూశారు. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రపంచం నలుమూలల నుంచి అనేక ఫొటోలు వీరికి సరిపోలాయి. అయితే నిందితుల్లో ఒకరి ఏఐ ఇమేజ్‌కు ఫేస్‌బుక్‌లో షేర్ చేసిన ఓ పెళ్లి ఫొటోకు 90 శాతం మ్యాచ్ అయింది. మరింత లోతుగా దర్యాప్తు చేయగా పుదుచ్చేరిలో రాజేశ్ దొరికాడు. ఆయన ద్వారా మరో నిందితుడు దివిల్‌ను పట్టుకున్నారు. ఈ కేసు సీబీఐ వద్ద ఉండటంతో.. సీబీఐ చెన్నై యూనిట్‌ను అప్రమత్తం చేశారు. మొత్తానికి సీబీఐ వారిద్దరినీ అరెస్టు చేసింది. ఇంతకాలం పెండింగ్‌లో ఉన్న కేసును పరిష్కరించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించడం అసాధారణమని కేరళ ఏడీజీపీ (లా అండ్ ఆర్డర్) మనోజ్ అబ్రహం అన్నారు. హత్య అనంతరం ఇద్దరూ ఆర్మీకి ఎంపికయ్యారు. ఇద్దరూ పంజాబ్‌లోని పఠాన్‌కోట్ సైనిక స్థావరంలో విధులు నిర్వహించారు. ఆ తరువాత ఇద్దరూ టీచర్లనే వివాహం చేసుకున్నారు.


- సాక్షి, నేషనల్ డెస్క్

బౌద్ధమతం ఒక సామాజిక ఉద్యమం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ



పురుషార్థాలు

హిందూ సమాజ వ్యవస్థలో ప్రతి వ్యక్తికీ పురుషార్థాలు మార్గదర్శక సూత్రాలుగా వ్యవహరిస్తాయి. పురుషార్థాలు 4. అవి..

ధర్మం, అర్థం, కామం, మోక్షం.

1. ధర్మం

హిందూ జీవనంలో ధర్మం అనే భావానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ధర్మం అనే పదం సంస్కృతంలోని 'ధృ' అనే ధాతువు నుంచి వచ్చింది. 'ధృ' అంటే కలిపి ఉంచు, నిలబెట్టు అని అర్థం. ధర్మం మానవుడి ప్రవర్తనను క్రమబద్ధం చేస్తుంది. సమాజానికి ఏది ఆమోద యోగ్యమో, దానికి అనుగుణంగా వ్యక్తి జీవించాలి. నీతి, నిజాయతీ, నైతిక ప్రవర్తన గురించి ధర్మం చెబుతుంది. 'ధర్మం' అనే పదాన్ని అనేక సందర్భాల్లో అనేక అర్థాల్లో వాడారు.

ఐతరేయ బ్రాహ్మణం: విశ్వానికంతటికీ మూలం ధర్మం. ప్రజలు మార్గదర్శకత్వం కోసం ధర్మం గురించి బాగా తెలిసిన వ్యక్తి వద్దకు వెళతారు. ధర్మం వల్ల దుష్టత్వాన్ని పారద్రోలవచ్చు. ప్రతిదీ ధర్మం మీదే ఆధారపడి ఉంది. అందువల్ల ధర్మం అత్యుత్తమ సుగుణం.

మహాభారతం: ప్రజల్లో శక్తి, ప్రభావం కలగడానికి ధర్మాన్ని వివరించారు. ధర్మం అహింసతో కూడింది, దృఢమైంది. అది ప్రపంచాన్ని నిలబెడుతుంది. సృష్టిలోని ఏ జీవికీ హాని చేయకుండా ఉండేది కచ్చితంగా ధర్మం.

వైశేషిక సూత్రాలు: భౌతిక లాభం, ఆధ్యాత్మిక సుగుణం దేని నుంచి కలుగుతాయో అదే ధర్మం.

మహానారాయణోపనిషత్తు: జగత్ అంతటికీ మూలం ధర్మం. ధర్మాన్ని శ్రద్ధగా పాటించేవారిని ప్రజలు ఆశ్రయిస్తారు. ధర్మం ద్వారా పాపాలను పోగొట్టుకుంటారు. ధర్మం అత్యంత సుగుణం. 'సు' అంటే మంచి అని అర్థం. గుణం అంటే లక్షణం అని అర్థం.

జైమిని ప్రకారం: వేదాలు సూచించే, ఆశించే ఫలితం లేదా ఆశయమే ధర్మం.

మనుస్మృతి ప్రకారం: పక్షపాత బుద్ధితో కాకుండా, నీతి నిజాయతీలతో రాగద్వేషాలను వీడి మనసా, వాచా, కర్మణా జీవించే పవిత్ర జీవన విధానమే ధర్మం. ప్రతి వస్తువుకు గమనించదగ్గ నైసర్గిక ధర్మం ఉంటుంది.

- మానవుడు ఆచరించాల్సిన ధర్మాలను గురించి యాజ్ఞవల్క్యుడు తొమ్మిది ధర్మ సుగుణాలను వివరించాడు. అవి..
  అహింస, నిర్మలత్వం, నీతి,
  పరిశుభ్రత, ఇంద్రియ నిగ్రహం,
  దానం, ఆత్మనిగ్రహం, ప్రేమ, సహనం
- ఈ తొమ్మిది ధర్మగుణాల్లో మొదటి ఆరు ధర్మ గుణాలు సమాజ మనుగడకు,మిగతా మూడు ధర్మాలు వ్యక్తి సత్ప్రవర్తనకు తోడ్పడతాయి.

ధర్మం లక్షణాలను కింది విధంగా గ్రహించవచ్చు.

1. ప్రజల శ్రేయస్సు కోసం ధర్మం ఉంది.
2. ఇతరులకు హాని చేయరాదు అనే భావం ఇందులో ఉంది.
3. ధర్మం వ్యక్తి నడవడిక నియమాలను, జీవన విధానాన్ని సూచిస్తుంది.
4. ధర్మం ఆనందానికి మూలం
5. ఏకీకృతం చేయడానికి ధర్మం ఉపకరిస్తుంది.
6. ధర్మం కర్తవ్యాన్ని సూచిస్తుంది.
7. ధర్మం సామాజిక విలువలకు, సాంస్కృతిక ప్రమాణాలకు ప్రతీకగా ఉంటుంది.

- హిందూ సామాజిక వ్యవస్థలో ధర్మం అత్యంత ఉన్నతమైంది, ఉత్కృష్టమైంది.

2. అర్థం

దీన్నే సంపద, ఐశ్వర్యం అంటారు. సంపద వల్ల శారీరక సుఖం కలుగుతుంది. అంటే వ్యక్తి అవసరాలను తీర్చడానికి అర్థం ఉపయోగపడుతుంది. కౌటిల్యుడి 'అర్థశాస్త్రం' అర్థం విలువను వివరించింది. ధనాన్ని అక్రమ మార్గాల ద్వారా సంపాదించరాదు. అర్థం ఎక్కువ చలామణిలో ఉండటంవల్ల వ్యక్తులు, సమాజం అభివృద్ధి జరుగుతుంది.

3. కామం

కామం అంటే కోరిక. ఇంద్రియ వాంఛలను తృప్తి పరచుకోవడం కామం. గృహస్థాశ్రమంలో వ్యక్తికి కామం సహజం. కామం కేవలం శారీరక వాంఛలకు మాత్రమే పరిమితం కాదు. నృత్యం, సంగీతం, నటన కళారూపాలు మొదలైన వాటిలో కూడా కోరిక ఉంది. కామం వివాహానికి, సంతాన ప్రాప్తికి మూలం. ధర్మంతో కూడిన కామం అంగీకార యోగ్యం. కాబట్టి ప్రతి వ్యక్తీ కామాన్ని క్రమబద్ధం చేసుకోవాలి. ద్విజులలో సంతానోత్పత్తికి మాత్రమే కామాన్ని ఉద్దేశించారు. ధర్మం, అర్థం, కామాలను త్రి వర్గాలు అని పిలుస్తారు. పురుషార్థాలలో కామానికి తక్కువ ప్రాధాన్యమిచ్చి ధర్మానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

4. మోక్షం

ప్రతి హిందువు తుది లక్ష్యం మోక్ష సాధన. మోక్షం అంటే 'ఆత్మను పరమాత్మలో మిళితం చేయడం'. మోక్షసాధన అంటే ప్రతి వ్యక్తి ఆత్మ సాక్షాత్కారం లేదా అంతరంగిక ఆధ్యాత్మికతను సాధించడం. ధర్మ, అర్థ, కామ పరిపూర్ణత ఇందులో ఉంటుంది. కర్మం, జ్ఞానం, భక్తి అనే మూడు మార్గాల ద్వారా మోక్షం లభిస్తుంది. భగవద్గీతలో మోక్షాన్ని పరాగతిగా వర్ణించారు.

బౌద్ధమతం

గౌతమబుద్ధుడు రుమిందై గ్రామ సమీపంలోని లుంబినివనంలో జన్మించాడు. అతడి తండ్రి కపిలవస్తు పాలకుడైన శుద్ధోదనుడు, తల్లి మహామాయ. గౌతమబుద్ధుడి అసలు పేరు సిద్ధార్థుడు. గౌతమబుద్ధుడు పుట్టిన ఏడు రోజులకే అతడి తల్లి మహామాయ మరణించింది. సవతితల్లి మహాప్రజాపతి గౌతమి పెంచడంతో అతడికి గౌతముడిగా పేరొచ్చింది. బుద్ధుణ్ని పెంచిన 'గౌతమి ప్రజాపతి' బౌద్ధమతంలో తొలి సన్యాసిని. బుద్ధుడి భార్య యశోధర, కుమారుడు రాహులుడు.

బుద్ధుడు తన 29వ ఏట ఒక వృద్ధుణ్ని, ఒక వ్యాధిగ్రస్తుణ్ని, ఒక సన్యాసిని, ఒక శవాన్ని చూశాడు. వీటిని చూసిన బుద్ధుడు కలత చెంది ఇల్లు వదిలి జ్ఞానాన్వేషణకు బయల్దేరాడు. సంరక్షకుడైన చెన్న సహాయంతో 'కంతక' అనే గుర్రం మీద బుద్ధుడు బయల్దేరాడు. దీన్నే మహాభినిష్క్రమణ అంటారు. జ్ఞానాన్వేషణలో భాగంగా బుద్ధుడు రెండేళ్లపాటు వైశాలిలో అలారకలామ వద్ద ధ్యాన విధానాన్ని నేర్చుకున్నాడు. రాజగృహంలో ఉద్రక(ఉద్దక) వద్ద కొన్ని రోజులు శిష్యరికం చేశాడు. గురువుల వద్ద తనకు కావాల్సిన సమాధానం లభించలేదు. దీంతో ముక్తి కోసం 15రోజులు ఉపవాసం ఉన్నాడు. గౌతముడు స్పృహ కోల్పోయిన దశలో సుజాత అనే స్త్రీ అతడి ప్రాణాలను కాపాడింది.

గౌతమ బుద్ధుడు బుద్ధగయ వద్ద బోధివృక్షం కింద 49 రోజులు ధ్యానం చేశాడు. ఇక్కడే జ్ఞానోదయం(మహాసంబోధి) పొంది బుద్ధుడయ్యాడు (బుద్ధుడు అంటే తథాగతుడు-నిజాలను తెలుసుకున్నవాడు అని అర్థం). తర్వాత కఠోర ఆహార నియమాలు, సాధనలు చేయకూడదని అన్నీ మధ్యస్థంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. అందుకే బుద్ధుడు ప్రవచించిన మార్గాన్ని మధ్యే మార్గం అంటారు. మధ్యేమార్గం అంటే మనిషి పూర్తిగా సన్యాసిగా కాకుండా, పూర్తిగా భౌతిక కాంక్షలతో కాకుండా స్వీయ నిగ్రహశక్తితో జీవితాన్ని గడపటం. ఈ మార్గాన్ని అనుసరించిన ఏ వ్యక్తయినా అతడి సామాజిక నేపథ్యంతో నిమిత్తం లేకుండా ముక్తి పొందుతాడు.

ఉదా:ఐశ్వర్యానికి, పేదరికానికి మధ్య జీవించడం.

బుద్ధుడు సిద్ధాంతాలను ప్రబోధించలేదు. కానీ ఆధ్యాత్మిక వికాసానికి ఒక హేతువాద మార్గాన్ని సూచించాడు. అందుకే బుద్ధుణ్ని అజ్ఞేయవాది(Agnostic) అని పిలవవచ్చు. బుద్ధుడు సత్యదూరాలైన వేదాలను తిరస్కరించాడు. జంతు బలులను ఖండించి, క్లిష్ట సంస్కారాలను ఎదిరించాడు. హిందూ మతంలోని అసమానత్వం, కొన్ని మత ఛాందస భావాలను ముఖ్యంగా కులవ్యవస్థను, బ్రాహ్మణాధిక్యతను ప్రశ్నించాడు. అందువల్ల బౌద్ధమతాన్ని మత ఉద్యమంగా కాకుండా ఒక సామాజిక ఉద్యమంగా చూడాలని కొందరి భావన. అందుకే బౌద్ధమతాన్ని రియాక్షనరీ రిలీజియస్ అని పిలుస్తారు.

బుద్ధుడు సారనాథ్‌లోని జింకలవనంలో కొండిన్య, అశ్వజిత్, బద్రుక, మహానామ, కశ్యప /ఉపాలి అనే అయిదుగురు శిష్యులకు జ్ఞానబోధ చేశాడు. దీన్నే ధర్మచక్రపరివర్తనం అంటారు. బౌద్ధమత పుట్టుకగా 'సారనాథ్'ను పేర్కొంటారు.

బుద్ధుడి శిష్యులకు బోధించిన సారాన్ని పంచశీల అంటారు.

పంచశీల సూత్రాలు..

- అసత్య (అసత్యం పలకరాదు)
- అసతేయ (దొంగతనం చేయరాదు)
- అపరిగ్రహ (ఆస్తిని కూడబెట్టరాదు)
- మత్తుమందులు సేవించరాదు
- వ్యభిచారం చేయరాదు

బుద్ధుడి బోధనలు

1. ఆర్యసత్యాలు
2. అష్టాంగ మార్గం
3. ప్రతిత్య సముత్పాదన (కార్యకారణ సిద్ధాంతం)
4. మధ్యేమార్గం

నిగ్రహశక్తిని కోల్పోయినవారు మానసికంగా బలహీనులయ్యే అవకాశముంది. కాబట్టి నిగ్రహాన్ని నిలబెట్టుకోవడానికి ఆర్యసూత్రాలు (లేదా) ఆర్యసత్యాలు, అష్టాంగ మార్గాన్ని పాటించాలని బుద్ధుడు చెప్పాడు.

బుద్ధుడి ఆర్యసత్యాలు

1. ప్రపంచం మొత్తం దుఃఖమయం
2. కోరికలే దుఃఖాలకు కారణాలు
3. దుఃఖ నిర్మూలనకు కోర్కెలను జయించాలి
4. దుఃఖ నిర్మూలనకు ఏకైక మార్గం అష్టాంగ మార్గం

బుద్ధుడి అష్టాంగ మార్గం:

1. సమ్యక్ ఆలోచన
2. సమ్యక్ వాక్కు
3. సమ్యక్ క్రియ
4. సమ్యక్ జీవనం
5. సమ్యక్ కృషి
6. సమ్యక్ నిశ్చయం
7. సమ్యక్ విశ్వాసం
8. సమ్యక్ దృష్టి

ప్రతిత్య సముత్పాదన: దీన్నే కార్యకారణ సిద్ధాంతం అంటారు. ఇది బుద్ధుడి తత్వం. అంటే కర్మల వల్లే జీవుడు బంధ విముక్తుడు అవుతాడు.

బౌద్ధ సమావేశాలు: బౌద్ధ సమావేశాలనే బౌద్ధ సంగీతులు అంటారు. వినయ, సుత్త, అభిదమ్మ పీటికలను త్రిపీటకాలంటారు.

బౌద్ధ సంగీతులు

బౌద్ధ సంగీతి	కాలం	నగరం	రాజు	అధ్యక్షుడు	కారణం	ప్రాధాన్యం
మొదటి సంగీతి	క్రీ.పూ.483 (బుద్ధుడు మరణించిన వెంటనే)	రాజగృహం	అజాతశత్రువు	మహాకశ్యప	బుద్ధుడి బోధనలను గ్రంథస్తం చేయడానికి	ఆనందుడు 'వినయ', ఉపాలి 'సుత్త' అనే పీటికల (నియమావళి గ్రంథాలు)ను సంకలనం చేశారు.
రెండో సంగీతి	క్రీ.పూ.383	వైశాలి	కాలాశోకుడు	సభాకమి	బౌద్ధమతంలో విభేదాలను పరిష్కరించడానికి	బౌద్ధమతం థేరవాదులు(మార్పు కోరనివారు), మహాసాంఘికులు(మార్పు కోరేవారు)గా చీలిపోయింది.
మూడో సంగీతి	క్రీ.పూ.250	పాటలీ పుత్రం	అశోకుడు	మొగలిపుత్రతిస్స	బౌద్ధమతానికి సంబంధించిన అనేక విషయాలను చర్చించడానికి	అభిదమ్మ పీటికను సంకలనం చేశారు.
నాలుగో సంగీతి	క్రీ.శ. 1వ శతాబ్దం	కుందలవనం కశ్మీర్	కనిష్కుడు	వసుమిత్రుడు	18 శాఖల మధ్య ఐక్యత సాధించడానికి	బౌద్ధమతం మహాయాన, హీనాయాన శాఖలుగా చీలిపోయింది.

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్-సీడీఆర్ఐ, లక్నోలో 18 సైంటిస్ట్ పోస్టులు

లక్నో(ఉత్తరప్రదేశ్)లోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్-ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆధ్వర్యంలోని సెంట్రల్ డ్రగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీడీఆర్ఐ).. సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 18.
- **అర్హత:** నోటిఫికేషన్ ప్రకారం అభ్యర్థులు తప్పనిసరిగా సంబంధిత రంగాల్లో అర్హత, పరిశోధనా అనుభవాన్ని కలిగి ఉండాలి.
- **వయసు:** అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితి 07.02.2025 నాటికి 32 ఏళ్లు ఉండాలి. రిజర్వేషన్ ఉండే అభ్యర్థులకు వయో సడలింపు ఉంటుంది.
- **వేతనం:** రూ.67,700 నుంచి రూ.1,27,766.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:**06.01.2025
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 17.02.2025.
- **వెబ్‌సైట్:** https://cdri.res.in

జేఎన్ఏఆర్‌డీడీసీ, నాగ్‌పూర్‌లో వివిధ ఉద్యోగాలు

నాగ్‌పూర్(మహారాష్ట్ర)లోని జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్(జేఎన్ఏఆర్‌డీడీసీ).. రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- **పోస్టుల వివరాలు:** సెక్షన్ ఆఫీసర్-01, సైంటిఫిక్ అసిస్టెంట్2-02, సైంటిఫిక్ అసిస్టెంట్1-01, ల్యాబ్ అసిస్టెంట్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో ఇంటర్, డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు సెక్షన్ ఆఫీసర్‌కు రూ.44,900 నుంచి రూ.1,42,400, సైంటిఫిక్ అసిస్టెంట్2 పోస్టుకు రూ.29,200 నుంచి రూ.92,300, సైంటిఫిక్ అసిస్టెంట్1 పోస్టుకు రూ.25,500 నుంచి రూ.58,500, ల్యాబ్ అసిస్టెంట్ పోస్టుకు రూ.19,900 నుంచి రూ.63,200.
- **వయసు:** సెక్షన్ ఆఫీసర్‌కు 35 ఏళ్లు, సైంటిఫిక్ అసిస్టెంట్2కు 30 ఏళ్లు, సైంటిఫిక్ అసిస్టెంట్ 1కు 25 ఏళ్లు, ల్యాబ్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** నోటిఫికేషన్ వెలువడిన 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- **నోటిఫికేషన్ వెలువడిన తేది:** 28.12.2024.
- **వెబ్‌సైట్:** https://jnarddc.gov.in

రక్తపోటును నియంత్రించే హార్మోన్?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

అంతస్రావక గ్రంథులు

1. ఎడ్రినల్ (అధివృక్క) గ్రంథులు

మానవుడిలో ఒక జత ఎడ్రినల్ గ్రంథులు మూత్ర పిండాల పైభాగంలో ఉంటాయి. అధివృక్క గ్రంథిలో రెండు భాగాలుంటాయి. 1.వల్కలం.. అధివృక్క గ్రంథి వెలుపలి భాగం. 2. దవ్వ.. లోపలి భాగం.

అధివృక్క వల్కల హార్మోన్లు: దీని నుంచి విడుదలయ్యే హార్మోన్లను కార్టికాయిడ్లు అంటారు. ఇవి మూడు రకాలు.

ఎ) కార్టిసాల్ బి) అల్డోస్టిరాన్
సి) లైంగిక కార్టికాయిడ్లు

కార్టిసాల్

ఈ హార్మోన్ పిండి పదార్థాల జీవక్రియలో పాల్గొంటుంది. ఉపవాస(అత్యవసర) పరిస్థితుల్లో గ్లూకోజ్‌ను సంశ్లేషించి రక్తంలోకి విడుదల చేస్తుంది. కాబట్టి కార్టిసాల్‌ను ప్రాణరక్షక హార్మోన్ అంటారు. ఇది ఒక ఒత్తిడి పోరాట హార్మోన్‌గా కూడా పనిచేస్తుంది. కార్టిసాల్ అధికస్రావం వల్ల కుషింగ్స్ వ్యాధి (బఫెల్లో నెక్) వస్తుంది.

- **లక్షణాలు:** ముఖం, అవయవాలు, వీపు ప్రాంతంలో కొవ్వు పేరుకుపోతుంది.
  వీపుపై మూపురం (బఫెల్లో హంప్) వేలాడుతూ ఉంటుంది.
  కార్టిసాల్ తక్కువైతే అడిసన్స్ వ్యాధి వస్తుంది.
  లక్షణాలు: చర్మంపై కంచు వర్ణపు మచ్చలు, బరువు కోల్పోవడం, కండరాల బలహీనత.

అల్డోస్టిరాన్

ఇది దేహంలో నీరు, లవణాల తుల్యతను క్రమపరుస్తుంది. మూత్రం నుంచి సోడియం (Na^+) పునఃశోషణను పెంచుతుంది. అదే సమయంలో పొటాషియం (K^+), ఫాస్ఫేట్ అయాన్లను మూత్రంలోకి ప్రవింపజేయడంలో తోడ్పడుతుంది. శరీరంలో పొటాషియం అయాన్ల గాఢత పెరగడం ప్రమాదకరం. కాబట్టి అధివృక్క ఆల్డోస్టిరాన్ లోపిస్తే మానవుడు మరణిస్తాడు.

లైంగిక కార్టికాయిడ్లు

ఇవి ఒక రకమైన లైంగిక హార్మోన్లు(ఆండ్రోజన్స్). ఇవి స్త్రీ, పురుషుల్లో లైంగిక హార్మోన్లకు అనుబంధంగా పనిచేస్తాయి.

ఈ హార్మోన్ల అధిక స్రావం వల్ల స్త్రీ , పురుషుల్లో వ్యాధులు వస్తాయి. అవి..

- **విరిలిజం:** స్త్రీలకు అవాంఛిత రోమాలు (గడ్డాలు, మీసాలు) రావడం, పురుష గొంతు.
- **హిర్సుటిజం:** స్త్రీలకు ఛాతీపైన, శరీరంపైన రోమాలు రావడం.
- **గైనకోమాస్టియా:** ఇది పురుషులకు వచ్చే వ్యాధి. పురుషులకు రొమ్ములు ఏర్పడటం.

అధివృక్క దవ్వ

అధివృక్క దవ్వ రెండు రకాల హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది.

ఎ) ఎడ్రినలిన్ (ఎపినెఫ్రిన్)
బి) నార్ ఎడ్రినలిన్ (నార్ ఎపినెఫ్రిన్)

ఇవి ఒత్తిడి, అత్యవసర పరిస్థితులకు అనుక్రియగా ఉత్పత్తి అవుతాయి. కాబట్టి వీటిని అత్యవసర హార్మోన్లు (ఎమర్జెన్సీ హార్మోన్లు), పోరాట లేదా పలాయన హార్మోన్లు, 3F హార్మోన్ (Fight -Flight - Fright) , 4S హార్మోన్ (Sugar Metabolism, Salt retainning, Sex hormones, Source of Energy), బీపీ హార్మోన్ లేదా రక్తపోటుకు కారణమైన హార్మోన్ అని పిలుస్తారు.

ఈ హార్మోన్ల వల్ల భయం, కోపం వంటి భావోద్వేగాలకు లోనైనప్పుడు వెంట్రుకలు నిక్కబొడుచుకోవడం, చెమటపట్టడంతో పాటు హృదయస్పందన, శ్వాసక్రియ రేటు పెరుగుతాయి.

ఎడ్రినలిన్

హృదయ స్పందన రేటును పెంచి గుండెపోటుకు (బీపీ) కారణమవుతుంది.

నార్ ఎడ్రినలిన్

ఈ హార్మోన్ రక్త పీడనాన్ని తగ్గిస్తుంది (నియంత్రిస్తుంది)

గమనిక: లోనోట్రోప్స్ రక్తపోటును తగ్గించడానికి వాడే ఔషధం.

2. బీజకోశాలు

బీజకోశాలు రెండు రకాలు..

1) పురుష బీజకోశాలు (ముష్కాలు)
2) స్త్రీ బీజ కోశాలు

ముష్కాలు / పురుష బీజకోశాలు

ముష్కాలు పురుష ప్రత్యుత్పత్తి అంగాలు. ఒక జత ముష్కాలు శరీరం వెలుపల ముష్క గోణుల్లో ఉంటాయి.

- **ముష్కాల ప్రధాన విధి:** శుక్రకణోత్పత్తి, హార్మోన్ విడుదల. ముష్కాల్లోని లిడిగ్ కణాల నుంచి టెస్టోస్టిరాన్ (ఆండ్రోజెన్) అనే లైంగిక హార్మోన్ విడుదలవుతుంది.
- **టెస్టోస్టిరాన్ విధి:** కండరాల అభివృద్ధి,ముఖం, బాహుమూలాల్లో రోమాలు ఏర్పడటం, పురుష కంఠధ్వని(గొంతు మారడం). ఈ లక్షణాలను ద్వితీయ లైంగిక లక్షణాలు అంటారు.

స్త్రీ బీజకోశాలు

స్త్రీలలో ఒక జత స్త్రీ బీజకోశాలు ఉదర కుహరంలో ఉంటాయి. ప్రాథమికంగా ఇవి అండాలను ఉత్పత్తి చేస్తాయి. ఇవి ప్రతి రుతుచక్రంలోనూ ఒక అండాన్ని విడుదల చేస్తాయి. ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్‌లను విడుదల చేస్తాయి.

- **ఈస్ట్రోజన్:** ఈ హార్మోన్ స్త్రీలలో ద్వితీయ లైంగిక లక్షణాలను ప్రేరేపిస్తుంది.అంటే రుతుచక్ర ప్రారంభం, స్తనాభివృద్ధి, స్త్రీ కంఠస్వరం.
- **ప్రొజెస్టిరాన్:** దీన్ని ప్రెగ్నెన్సీ హార్మోన్, గర్భస్రావ నిరోధక హార్మోన్ అంటారు. ఈ హార్మోన్ పిండ ప్రతిస్థాపనకు తోడ్పడుతుంది. ఫలదీకరణ ద్వారా ఏర్పడిన పిండాన్ని గర్భాశయ గోడలకు అంటి పెట్టడంలో దోహదపడుతుంది. ఈ హార్మోన్ రుతుచక్రం ఆగిపోవడానికి, మళ్లీ ఫలదీకరణ జరగకుండా ఉండటానికి తోడ్పడుతుంది. కాబట్టి గర్భ నిరోధక మాత్రల్లో ప్రొజెస్టిరాన్‌ను ఉపయోగిస్తారు. ఈ హార్మోన్ జరాయువు ఏర్పడటానికి తోడ్పడుతుంది.
- **రిలాక్సిన్ హార్మోన్:** ఈ హార్మోన్‌ను ప్రసవ సమయంలో జరాయువు స్రవిస్తుంది. ఇది సుఖ ప్రసవానికి దోహదపడుతుంది.

3. థైమస్ గ్రంథి (బాలగ్రంథి)

ఈ గ్రంథి రెండు ఊపిరితిత్తుల మధ్య గుండెకు దగ్గరగా ఉంటుంది. ఇది తల్లిగర్భంలో ఉన్న పిండం (ఆరో వారం)లో ఏర్పడుతుంది. ఇది చిన్న పిల్లల్లో మాత్రమే ఉంటుంది. కౌమార దశలో అదృశ్యమవుతుంది. కాబట్టి దీన్ని బాలగ్రంథి, తాత్కాలిక గ్రంథి, తిరోగమన గ్రంథి,అంతరించిపోయే గ్రంథి అని పిలుస్తారు. ఈ గ్రంథి స్రవించే హార్మోన్ థైమోసిన్.

- **థైమోసిన్ విధి:** లింఫోసైట్ కణాల పరిపక్వతకు తోడ్పడుతుంది. ఫలితంగా ప్రతిరక్షకాలు (యాంటిబాడీలు)ఉత్పత్తి అవుతాయి. ఇవి వ్యాధి నిరోధకతను పెంపొందిస్తాయి.
  మాంసం దుకాణాల్లో జంతువుల థైమస్ గ్రంథిని స్వీట్ బ్రెడ్‌గా అమ్ముతారు.
- **ఎక్టో హార్మోన్లు:** కొన్ని వినాళ గ్రంథుల నుంచి బాహ్య వాతావరణంలోకి విడుదలయ్యే రసాయన పదార్థాలను ఎక్టో హార్మోన్లు లేదా ఫిరమోన్లు అంటారు. ఈ ఫిరమోన్లు కీటకాల్లో మాత్రమే ఉంటాయి.
- ఒక జాతి జీవుల నుంచి విడుదలయ్యే ఫిరమోన్లను అదే జాతికి చెందిన కీటకాలు మాత్రమే గుర్తిస్తాయి. దీంతో వాటి మధ్య ఆకర్షణ, కమ్యూనికేషన్స్ నెలకొంటాయి.
  ఉదా: కూలీ చీమ మార్గాన్ని ఇతర చీమలు ఫిరమోన్ల వల్లే అనుకరిస్తాయి.

4. పీనియల్ గ్రంథి

ఇది మానవుడి మెదడు ద్వారగోర్ధం పృష్ఠతలంలో ఉంటుంది. మెలటోనిన్ హార్మోన్‌ను స్రవిస్తుంది. ఇది శరీరంలోని 24 గంటల దిన పరివర్తన లేదా సర్కేడియన్ లయలను క్రమపరుస్తుంది. అంటే నిద్ర, మెలకువల వలయాన్ని నియంత్రిస్తుంది.

5. జఠరాంత్రనాళ హార్మోన్లు

జీర్ణాశయం, ఆంత్రమూలాల శ్లేష్మస్తరం హార్మోన్లను స్రవిస్తుంది. ఈ హార్మోన్లు జీర్ణ గ్రంథుల చర్యలను పరిరక్షిస్తాయి. ఇది నాలుగు రకాల పెప్టైడ్ హార్మోన్లను స్రవిస్తుంది. అవి...

- **గాస్ట్రిన్:** ఈ హార్మోన్‌ను జీర్ణాశయం స్రవిస్తుంది. ఇది జఠర గ్రంథులను ప్రభావితం చేసి హైడ్రోక్లోరిక్ ఆమ్లం, పెప్సినోజన్ విడుదలను ప్రేరేపిస్తుంది.
- **సెక్రిటిన్:** ఆంత్రమూలం నుంచి విడుదలయ్యే ఈ హార్మోన్ క్లోమ, పైత్య రసాల స్రావాన్ని ప్రేరేపిస్తుంది. మొదట కనుగొన్న హార్మోన్ సెక్రిటిన్
- **కోలిసిస్టోకైనిన్:** ఇది కూడా ఆంత్రమూలం నుంచి విడుదలవుతుంది. పిత్తాశయాన్ని సంకోచింపజేసి పైత్యరసాన్ని ఆంత్రమూలంలోకి విడుదల చేయిస్తుంది.
- **పాంక్రియోజైమిన్:** దీన్ని ఆంత్రమూలం స్రవిస్తుంది. ఈ హార్మోన్ క్లోమాన్ని ఉత్తేజపర్చి క్లోమరసం విడుదలకు దోహదపడుతుంది.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. రక్తపోటును నియంత్రించే హార్మోన్?
   1) థైరాక్సిన్ 2) ఇన్సులిన్
   3) ఎడ్రినలిన్ 4) పిట్యూటరీ గ్రంథి
2. ఇన్సులిన్, ఈస్ట్రోజన్ అనేవి ?
   1) బ్యాక్టీరియాలు 2) ఫంగస్‌లు
   3) క్రిములు 4) హార్మోన్లు
3. అధిక ఆవేశాన్ని కలిగించే గ్రంథి ఏది?
   1) పిట్యూటరీ గ్రంథి 2) ఎడ్రినల్ గ్రంథి
   3) థైరాయిడ్ గ్రంథి 4) సెలైవరీ గ్రంథి
4. మానవ దేహంలో అధివృక్క గ్రంథి వేటిపై ఉంటుంది?
   1) చిన్నప్రేగు 2) గుండె
   3) ఊపిరితిత్తులు 4) మూత్ర పిండాలు
5. తమ జాతి జీవులపై ప్రభావం చూపించేవి, జీవి శరీరం నుంచి బాహ్యంగా విడుదలయ్యే సమ్మేళనాన్ని ఏ విధంగా పిలుస్తారు?
   1) సబ్‌హార్మోన్లు 2) న్యూరోహార్మోన్లు
   3) ఫిరమోన్లు 4) న్యూరోట్రాన్స్ మీటర్
6. స్త్రీ జీవుల్లో ద్వితీయ లైంగిక లక్షణాల అభివృద్ధిని నియంత్రించేది?
   1) ఈస్ట్రోజన్ 2) ఆక్సిటోసిన్
   3) టెస్టోస్టిరాన్ 4) ప్రొజెస్టిరాన్
7. శిశువుల్లో మాత్రమే ఉండి కౌమార దశలో అంతరించే గ్రంథి?
   1) థైరాయిడ్ గ్రంథి 2) థైమస్ గ్రంథి
   3) పీనియల్ గ్రంథి 4) పీయూష గ్రంథి
8. గర్భ నిరోధక మాత్రల్లో ఉండే హార్మోన్?
   1) ఈస్ట్రోజెన్ 2) ప్రొజెస్టిరాన్
   3) ఆక్సిటోసిన్ 4) ప్రొలాక్టిన్
9. పిత్తాశయాన్ని సంకోచింపజేసి పైత్యరసాన్ని స్రవింపజేసే హార్మోన్?
   1) సెక్రిటిన్ 2) ఇన్సులిన్
   3) కోలిసిస్టోకైనిన్ 4) ఎడ్రినలిన్
10. లైంగిక కార్టికాయిడ్ల అధికస్రావం వల్ల వచ్చే వ్యాధి?
    1) విరిలిజం 2) హిర్సుటిజం
    3) గైనకోమాస్టియా
    4) పైవన్నీ

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 4; 5) 3; 6) 1; 7) 2; 8) 2; 9) 3; 10) 4.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
బుధవారం । 8-1-2025

విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉన్న దేశాలేవి?

వ్యవసాయం

ప్రముఖ ఆర్థిక భౌగోళిక శాస్త్రజ్ఞుడు విట్లిసీ కింద సూచించిన వ్యవసాయ వ్యవస్థలను గుర్తించాడు.

- సాంద్ర జీవనాధార వ్యవసాయం
- విస్తార వాణిజ్య వ్యవసాయం
- మిశ్రమ వ్యవసాయం
- వాణిజ్య పండ్ల తోటల సాగు
- మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్
- ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్
- వాణిజ్య పాడి మండలం
- వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్)
- పోడు వ్యవసాయం
- సంచార పశు పోషణ

సాంద్ర జీవనాధార వ్యవసాయం

ఆయనరేఖా, ఉప ఆయనరేఖా ప్రాంతాలకు చెందిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో జీవనాధార సాంద్ర వ్యవసాయం అమల్లో ఉంది. ఇండియా, చైనా, బ్రెజిల్, థాయ్‌లాండ్, మెక్సికో, ఈజిప్టు లాంటి వ్యవసాయ ప్రధాన దేశాల్లోని వ్యవసాయ వ్యవస్థలు ఈ కోవకు చెందినవి. సాంద్ర వ్యవసాయంలో పంటల తీవ్రత అధికం. పెద్ద మొత్తాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందులు, సేద్యపు నీటిని వాడతారు. వ్యవసాయ భూకమతాల సగటు పరిమాణం చాలా తక్కువ. జనాభాలో అధిక శాతం ప్రత్యక్షంగా వ్యవసాయంపైనే ఆధారపడతారు. కాబట్టి వ్యవసాయ భూమిపై ఒత్తిడి అధికం. ప్రధానంగా ఆహార పంటలను పండిస్తారు. జనాభా, జనసాంద్రతలు అధికంగా ఉండటం వల్ల వ్యవసాయ ఉత్పత్తులను పూర్తిగా దేశీయంగానే వినియోగిస్తారు. మిగులు లేకపోవడంతో ఎగుమతులు అత్యల్పం. వ్యవసాయంలో శ్రామిక శక్తిని అధికంగా వినియోగిస్తారు. సగటు వ్యవసాయ భూమికి దిగుబడులు అధికంగా ఉన్నప్పటికీ, తలసరి దిగుబడులు కనిష్ఠంగా ఉంటాయి. వ్యవసాయ జనాభా ప్రధానంగా సన్న, చిన్నకారు రైతుల రూపంలో ఉంటుంది. ఈ వ్యవసాయ మండలంలో రైతుల ఆదాయాలు స్వల్పంగా ఉంటాయి. రైతులు తమ గృహ అవసరాల ఆధారంగా పంటలను ఎంచుకుంటారు.

విస్తార వాణిజ్య వ్యవసాయం

ఐరోపా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అర్జెంటీనాల్లో విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉంది. వ్యవసాయంపై ఆధారపడే శ్రామిక జనాభా శాతం చాలా తక్కువ. వ్యవసాయంలో యాంత్రీకరణ స్థాయి అధికం. వ్యవసాయ భూకమతాలు చాలా పెద్దవి. ఉదాహరణకు యూఎస్ఏలో సగటు



భూకమతాల పరిమాణం 1000-1400 హెక్టార్లు. పంటల తీవ్రత సాంద్ర వ్యవసాయ మండలంతో పోలిస్తే తక్కువగా ఉంటుంది.

ప్రపంచ మార్కెట్లను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మండలంలో పంటలు పండిస్తారు. జనాభా, జనసాంద్రత తక్కువగా ఉండటం వల్ల స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం తక్కువ. మిగులు వ్యవసాయ ఉత్పత్తుల వల్ల పెద్ద మొత్తాల్లో ఎగుమతి చేస్తారు. విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉండే యూఎస్ఏ, కెనడా, రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా దేశాలు ప్రపంచంలో ప్రధాన వ్యవసాయ ఎగుమతిదారులు. ఈ మండలాన్ని ప్రపంచ ధాన్యాగారంగా అభివర్ణిస్తారు. ఈ తరహా వ్యవసాయం విస్తారంగా పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకొని ఉంది.

మిశ్రమ వ్యవసాయం

పంటలతోపాటు పశుపోషణ కోసం కూడా వ్యవసాయ భూమిపై ఆధారపడటాన్ని మిశ్రమ వ్యవసాయంగా వ్యవహరిస్తారు. ఈ తరహా వ్యవసాయంలో పంటల నుంచి వచ్చిన రొట్టను, వ్యవసాయ ఉత్పత్తులను పశుగ్రాసంగా వాడతారు. పశువుల మేతకోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లు ఉండవు. అయితే జీవనాధార వ్యవసాయంలా కాకుండా, ఈ మండలంలో వ్యవసాయ పంటలు, పశుపోషణ వాణిజ్య తరహాలో జరుగుతుంది. పశ్చిమ, మధ్య ఐరోపాల్లో వ్యవసాయం ఈ కోవకు చెందింది. ఈ మండలంలో సగటు వ్యవసాయ భూకమతాల పరిమాణం మధ్యస్థంగా (100-200 హెక్టార్లు) ఉంటుంది.

వాణిజ్య పండ్ల తోటల సాగు

మధ్యధరా శీతోష్ణస్థితి ప్రాంతాలు పండ్ల తోటల సాగుకు అనుకూలం. కవోష్ణ వాతావరణం వల్ల ముఖ్యంగా సిట్రస్ జాతికి చెందిన పండ్ల తోటలు ఇక్కడ సాగవుతాయి. మధ్యధరా తీరంలోని ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, గ్రీస్, మొరాకో, అల్జీరియా, ట్యునీషియా ప్రాంతాలు, దక్షిణాఫ్రికాలోని కేప్ ప్రాంతం, యూఎస్ఏలోని కాలిఫోర్నియా తీరం, మధ్య చిలీ, ఇజ్రాయెల్ తీర ప్రాంతాలు ఈ వ్యవసాయ మండలం కిందకు వస్తాయి. ఈ ప్రాంతాల్లో బత్తాయి, నిమ్మ, ద్రాక్ష, నారింజ, దానిమ్మ లాంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను వాణిజ్య పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఇది పెట్టుబడితో కూడుకున్న వ్యవసాయం. పండ్ల రసాలు, జామ్‌లు, జెల్లీలు, సాస్‌లు, ఎండు పళ్లను ఈ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో ఎగుమతి చేస్తున్నారు. ద్రాక్ష సారాయి తయారీ కూడా పెద్ద పరిశ్రమగా రూపొందింది. ఫ్రాన్స్‌లోని రైన్ లోయ, ఇటలీలోని గెరొన్ బేసిన్ వీటికి ప్రసిద్ధి.

మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్

పారిశ్రామిక విప్లవం తర్వాత ఐరోపా, ఉత్తర అమెరికాల్లో విస్తృత నగరీకరణ జరిగింది. విస్తరిస్తున్న మెట్రోపాలిటన్ నగరాల్లో తాజా కూరగాయలు, పండ్లకు గిరాకీ బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో వాయవ్య ఐరోపా, ఉత్తర అమెరికాల్లోని పెద్ద పెద్ద నగరాల సమీపంలో పండ్లు, కూరగాయల సాగు వాణిజ్య పద్ధతిలో ప్రారంభమైంది. రోజూ ఉదయాన్నే ఈ వ్యవసాయ ప్రాంతాల నుంచి నగరాలకు భారీ ట్రక్కుల ద్వారా తాజా పండ్లు, కూరగాయల రవాణా జరుగుతుంది. అందువల్ల దీన్ని ట్రక్ ఫార్మింగ్ (మార్కెట్ గార్డెనింగ్) అని పిలుస్తారు. ఆగ్నేయ ఆస్ట్రేలియాలోని నగర జనాభాకు కావాల్సిన తాజా పండ్లు, కూరగాయలను టాస్మానియా దీవి నుంచి బాస్ జలసంధి ద్వారా మర పడవలపై

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

సరఫరా చేస్తారు. అందువల్ల టాస్మానియా దీవిని 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా వ్యవహరిస్తారు.

ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్

ఎస్టేట్ ఫార్మింగ్ పద్ధతుల్లో ఉద్యానవన తోటల పెంపకాన్ని వలస పాలనా కాలంలో వలస రాజ్యాలు ప్రారంభించాయి. ఉష్ణమండల ఆయన రేఖా, ఉప ఆయనరేఖా ప్రాంతాల్లోని దేశాల్లో వలస పాలకులు కాఫీ, తేయాకు, రబ్బరు, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి, చెరకు, అరటి పంటలను ఎస్టేట్‌ల రూపంలో సాగు చేయడం ప్రారంభించారు. ఈ రకమైన సాగులో వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా నడిపిస్తారు. ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టే యాజమాన్యం కేవలం విధాన నిర్ణయాలను మాత్రమే తీసుకుంటుంది. సాగు నిర్వహణ కోసం సుశిక్షితులైన, సాంకేతిక అర్హతలు ఉన్న వారిని 'మేనేజర్లు'గా వేతన ప్రాతిపదికన నియమిస్తారు. శ్రామికులను దినసరి లేదా రోజువారీ కూలీ ప్రాతిపదికన వినియోగిస్తారు. లాభాలను ఆశించి ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. ఇప్పటికీ ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు కన్పిస్తాయి.

దేశం	ఎస్టేట్లు	పెట్టుబడి పెట్టిన దేశం
శ్రీలంక	తేయాకు	బ్రిటన్
మలేషియా	రబ్బరు	బ్రిటన్
ఇండోనేషియా	రబ్బరు, చెరకు	డచ్
దక్షిణాఫ్రికా	చెరకు	డచ్, బ్రిటన్
బ్రెజిల్	కాఫీ	పోర్చుగల్
ఫిలిప్పీన్స్	కొబ్బరి	యూఎస్ఏ
కరేబియన్ దీవులు	చెరకు, అరటి	యూఎస్ఏ
పశ్చిమ ఆఫ్రికా	కొకురా	ఫ్రాన్స్

వాణిజ్య పాడి మండలం

వాయవ్య ఐరోపాలోని సమశీతోష్ణ వాతావరణంలో పచ్చిక బయళ్లు విస్తారంగా పెరుగుతాయి. ఈ పరిస్థితులు పశుపోషణకు అనుకూలం, జెర్సీ, ఆరిషైర్, స్విస్‌బ్రౌన్, ఆబర్డన్, హార్ట్‌ఫోర్డ్, ఫ్లెమిష్ లాంటి మేలి రకం పాడి పశువుల జాతులకు ఈ ప్రాంతాలు నిలయాలు. పెద్ద మొత్తాల్లో పెట్టుబడులు పెట్టి ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్ని వాడుతూ పాడి పశువులను పెంచుతారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లను నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలోని యూకే, డెన్మార్క్, బెల్జియం, నెదర్లాండ్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, నెదర్లాండ్ దేశాల నుంచి పెద్ద మొత్తాల్లో పాడి వస్తువులు ఉత్తర అమెరికా, యూరప్‌లోని ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. డెన్మార్క్‌ను Butter House of Europe గా అభివర్ణిస్తారు. కొపెన్‌హెగెన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజూ విమానాల ద్వారా వెన్నను ప్రపంచం నలుమూలలకు ఎగుమతి చేస్తారు.

వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్)

పశ్చిమ యూఎస్ఏలోని రాకీ పర్వత ప్రాంతం, అర్జెంటీనా, ఉరుగ్వే, పరాగ్వే దేశాలు రాంచింగ్ (Ranching) మండలం కిందకు వస్తాయి. ఈ మండలంలో మాంసం ఉత్పత్తి కోసం పశువులను పెంచుతారు. పశుపోషణ కోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లను నిర్వహిస్తారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా మొక్కజొన్నను పండిస్తారు. బాగా లావెక్కిన పశువులను యాంత్రిక వధ శాలల్లో సంహరించి, మాంసాన్ని యంత్రాల సహాయంతో శుద్ధి చేసి ప్యాక్ చేస్తారు. మాంసం శుద్ధి, ప్యాకింగ్ ఒక పెద్ద పరిశ్రమగా అభివృద్ధి చెందింది. అర్జెంటీనా, ఉరుగ్వే, పరాగ్వేల నుంచి శుద్ధి చేసిన మాంసాన్ని యూఎస్ఏకు ఎగుమతి చేస్తారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో కూడా రాంచింగ్ అమల్లో ఉంది.

సంచార పశు పోషణ

దట్టమైన అటవీ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల నుంచి కొన్ని ఆదిమ తెగల సమాజాల్లో ఇప్పటికీ సంచార పశుపోషణ, సంచార వ్యవసాయం అమల్లో ఉంది. ఈశాన్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని 'జూమింగ్'గా పిలుస్తారు. మధ్య భారతదేశంలో 'బేవార్' అని, కేరళలో 'పానమ్' అని పిలుస్తున్నారు. సంచార వ్యవసాయం బ్రెజిల్ (రోకా), మలేషియా (లడాంగ్)లలో కూడా అమల్లో ఉంది.

మాదిరి ప్రశ్నలు

1. వ్యవసాయ జనాభా ప్రధానంగా సన్న, చిన్నకారు రైతుల రూపంలో ఉండే వ్యవసాయ విధానం ఏది?
1) సాంద్ర జీవనాధార వ్యవసాయం
2) విస్తార వాణిజ్య వ్యవసాయం
3) మిశ్రమ వ్యవసాయం
4) పైవేవీ కాదు
2. Butter House of Europe గా పేరొందిన దేశం ఏది?
1) ఆస్ట్రేలియా 2) చిలీ
3) దక్షిణాఫ్రికా 4) డెన్మార్క్
3. పండ్ల తోటల సాగుకు అనువైన శీతోష్ణస్థితి ఉన్న ప్రాంతం ఏది?
1) వాయవ్య ఐరోపా
2) పశ్చిమ ఆఫ్రికా
3) మధ్యధరా ప్రాంతం
4) తూర్పు ఐరోపా
4. 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా పేరొందిన ప్రాంతం ఏది?
1) టాస్మానియా 2) న్యూసౌత్‌వేల్స్
3) క్వీన్స్‌లాండ్ 4) విక్టోరియా
5. మధ్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని ఏమని పిలుస్తారు?
1) జూమింగ్ 2) పానమ్
3) బేవార్ 4) ఏదీకాదు
6. కింద సూచించిన పంటల్లో చల్లటి వాతావరణంలో పండించే పంట ఏది?
1) కొబ్బరి 2) రబ్బరు
3) తేయాకు 4) చెరకు
7. దేశంలో వాణిజ్య పద్ధతుల్లో అత్యధికంగా పూలను ఎగుమతి చేస్తోన్న రాష్ట్రం ఏది?
1) కేరళ 2) తమిళనాడు
3) తెలంగాణ 4) కర్ణాటక
8. కింది వాటిలో రాంచింగ్ మండలంలో ఉన్న దేశం ఏది?
1) ఉరుగ్వే 2) కెనడా
3) లాత్వియా 4) శ్రీలంక
9. ఏ దేశాన్ని ఆదర్శంగా తీసుకొని భారత్‌లో సహకార రంగంలో పాడి సహకార సంఘాలను స్థాపించారు?
1) బ్రెజిల్ 2) నెదర్లాండ్స్
3) ఇజ్రాయెల్ 4) డెన్మార్క్

సమాధానాలు

1) 1 2) 4 3) 3 4) 1 5) 3
6) 3 7) 4 8) 1 9) 4

Which file is responsible to start MS-Word?

MS - WORD

1. Which is not a font style?
1) Bold 2) Superscript
3) Italic 4) Regular
5) None of above
2. What is gutter margin?
1) Margin that is added to right margin when printing
2) Margin that is added to the left margin when printing
3) Margin that is added to the outside of the page when printing
4) Margin that is added to the binding side of page when printing
5) None
3. Landscape is?
1) A font style 2) Paper Size
3) Page Layout
4) Page Orientation
5) None
4. Typeface option will come under which menu?
1) Edit 2) View 3) Format
4) Tools 5) None of above
5. Background color on a document is not visible in?
1) Web layout view
2) Print Preview
3) Reading View
4) Print Layout view 5) None
6. What is a portion of a document in which you set certain page formatting options?
1) Page Setup 2) Section
3) Page 4) Document
5) None of above
7. Which of the following is not available on the Ruler of MS Word screen?
1) Tab stop box 2) Left Indent
3) Right Indent 4) Center Indent
5) None of above
8. Gutter position can be set in following positions
1) Left & Right 2) Left & Top
3) Left & Bottom
4) Left Only 5) None of above
9. What is the Short cut key for line break?
1) CTRL + Enter
2) Alt + Enter 3) Shift + Enter
4) Space + Enter
5) None of above
10. By pressing F12, which of following will happen?
1) Save As dialog box will open
2) Save dialog box will open
3) Open dialog box will open
4) Close dialog box will open
5) None of above
11. Which key will open an Open dialogue box?
1) F12 2) Alt + F12
3) Ctrl + F12 4) Shift + F12
5) None of above
12. How will MS Word will respond in repeated word ?
1) A Green wavy line under the repeated word
2) A Red wavy line under the repeated word
3) A Blue wavy line under the repeated word
4) A pink wavy lines under the repeated word
5) None of above
13. What is the use of "All Caps" feature in MS - Word?
1) It changes all selected text into Capital Letter
2) It adds captions for selected Image
3) It shows all the image captions
4) It changes some text into Capital Letter
5) None of above
14. Which file is responsible to start MS Word?
1) Winword.exe 2) Win.exe
3) Word.exe 4) Wordwin.exe
5) None of above
15. To keep track of different editions of a document which feature we will use?
1) Editions 2) versions
3) Tracks 4) Traces
5) None of above
16. Which is not a type of margin?
1) Top 2) Left 3) Right
4) Center5) None of above
17. What will be the use of Ctrl + J?
1) Insert Image
2) Insert Hyperlink
3) Align Justify
4) Search file 5) None of above
18. What shortcut will we use to align center?
1) Ctrl + A 2) Ctrl + E



3) Ctrl + D 4) Ctrl + B
5) None of above
19. Which shortcut will we use to make text Italic?
1) Ctrl + U 2) Ctrl + T
3) Ctrl + I 4) Ctrl + P
5) None of above
20. How to use Format Painter multiple times?
1) By Click on Lock Format Painter Icon
2) Format Painter cannot be use multiple times
3) By Double Click on the Format Painter Icon
4) By Double Click on the Format Painter Icon
5) None of above
21. What is place to the left of horizontal scroll bar?
1) Indicators 2) Split buttons
3) Tab stop buttons
4) View buttons
5) None of above
22. Where can you find the horizontal split bar on MS-Word screen?
1) On the top of vertical scroll bar
2) On the bottom of vertical scroll bar
3) On the left of horizontal scroll bar
4) On the right of horizontal scroll bar Comment on this question
5) None of above
23. Tabs stop position cannot be the following alignment?
1) Decimal Alignment
2) Center Alignment
3) Bar Alignment
4) Justify Alignment
5) None of above
24. What is the use of bookmarks?
1) To correct the spellings.

BANK EXAMS

COMPUTER AWARENESS

2) To jump to a specific location in the document
3) To ignore spelling mistakes
4) To save alignments as it is
5) None of above
25. Which feature is used to replace straight quotes with smart quotes as you type?
1) Auto Correct as you type
2) Auto Change as you type
3) Auto Ignore as you type
4) Auto Format as you type
5) None of above
26. Ctrl + D is short cut used for?
1) Open Dialogue Box
2) Font Dialogue Box
3) Save as Dialogue Box
4) Save Dialogue Box
5) None of above
27. Ctrl + G is shortcut for?
1) Open Find and Replace Dialog box with activating Goto Tab
2) Open Find and Replace Dialog box with activating Find Tab
3) Open Find and Replace Dialog box with activating Replace Tab
4) Open Goto Dialog box
5) None of above Comment on this question
28. Ctrl + H is short cut for?
1) Open Insert Dialog box activating Insert Hyper Link Tab
2) Open Find and Replace Dialog box with activating Go to Tab
3) Open Find and Replace Dialog box with activating Find Tab
4) Open Find and Replace Dialog box with activating Replace Tab
5) None of above
29. What can be searched by find?
1) Format 2) Characters
3) Symbol 4) All of above
5) None of above
30. On which page the header or the footer is printed by default?
1) On first page
2) on last page
3) on alternate page
4) Every page 5) None of above
31. Which of these toolbars allows changing of Fonts and their sizes?
1) Standard 2) Formatting
3) Options 4) Review
5) None of above
32. To spell check which function key you will press?
1) F5 2) F6 3) F7
4) F8 5) None of above
33. How to insert a sound file in word document?
1) From insert -> sound menu option
2) From insert -> object menu option
3) From insert -> subject menu option
4) From insert -> file menu option
5) None of above
34. How many maximum number of columns can be inserted in the word document?
1) 45 2) 50 3) 55
4) 65 5) None of above
35. What is smallest and largest available font on formatting toolbar?
1) Smallest 8 and Largest 70
2) Smallest 5 and Largest 72
3) Smallest 8 and Largest 72
4) Smallest 5 and Largest 70
5) None of above
36. Why drop cap is used in document?
1) To get all first character capital
2) To get all first character small
3) To begin a paragraph with a large dropped initial capital letter
4) To begin a paragraph with a large dropped initial small letter
5) None of above
37. What is Macro?
1) Small add-on programs that are installed afterwards if you need them
2) Type of high level programming language
3) Type of low level programming language
4) Small programs created in MS-Word to automate repetitive tasks by using VBA
5) None of above
38. Which among following can be a vertical separation between columns?
1) Margin 2) Header
3) Orientation 4) Gutter
5) None of above
39. To change the typeface of a document, we will choose following menu option:
1) Edit 2) View 3) Tools
4) Format 5) None of above
40. To auto fit the width of column:
1) Double click the left border of column
2) Double click the right border of column
3) Double click the column header
4) None of above
5) All the above
41. What is the default font size of a new Word document based on Normal template?
1) 8pt 2)10pt 3) 12pt
4)14pt 5) None of above
42. Which of following line spacing is invalid?
1) Single 2) Double
3) Triple 4) Multiple
5) None of above
43. Format painter tool can be found in?
1) Options toolbar
2) Standard toolbar
3) Formatting toolbar
4) Drawing toolbar 5) None
44. Which among following is correct extension of word files?
1) xls 2) doc 3) ppt
4) dcw 5) None of above
45. You can jump to the next column by?
1) Press Alt + Down-arrow
2) Clicking with your mouse on the next column
3) Both of above
4) None of above
5) Press Alt + 5 arrow

Key

1) 2; 2) 4; 3) 4; 4) 3; 5) 2;
6) 2; 7) 4; 8) 2; 9) 3; 10) 1;
11) 3; 12) 2; 13) 1; 14) 1; 15) 2;
16) 4; 17) 3; 18) 2; 19) 3; 20) 3;
21) 4; 22) 1; 23) 4; 24) 2; 25) 4;
26) 2; 27) 1; 28) 4 ; 29) 4; 30) 4;
31) 2; 32) 3; 33) 2; 34) 1; 35) 3;
36) 3; 37) 4; 38) 1; 39) 4; 40) 2;
41) 3; 42) 3; 43) 2; 44) 2; 45) 3.